కదనంలోనూ, కథనంలోనూ మేమే...

తెలంగాణ మహిళా సాహిత్య సమీక్ష
రచయిత్రుల ఉద్యమ, రచనానుభవాలు

తెలంగాణ సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్డు, హైదరాబాద్

కదనంలోనూ,
కథనంలోనూ మేమే....

ప్రధాన సంపాదకులు

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్

డా. సి. నారాయణ రెడ్డి

అధ్యక్షులు, తెలంగాణ సారస్వత పరిషత్తు

సంపాదకులు

డా. జె.చెన్నయ్య

ప్రధాన కార్యదర్శి, తెలంగాణ సారస్వత పరిషత్తు

తెలంగాణ సారస్వత పరిషత్తు

తిలక్‌రోడ్, హైదరాబాద్-500001.

ఫోన్ నెం.: 040-24753724

KADANAMLONOO,
KATHANAMLONOO MEME....

ప్రథమ ముద్రణ : జూన్ 2017

పుటల సంఖ్య : 208

ప్రతులు : 1000

మూల్యం : 150/-

డిటిపి : బి.గోపాల్‌రెడ్డి

ప్రతులకు:
తెలంగాణ సారస్వత పరిషత్తు
తిలక్‌రోడ్, హైదరాబాద్
ఫోన్: +91-40-24753724

ముద్రణ:
సాయిలిఖిత ప్రింటర్స్
ఖైరతాబాద్, హైదరాబాద్
040-65545979

తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ వారి ఆర్థిక సహాయంతో ప్రచురితం

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత
డాక్టర్ సి. నారాయణరెడ్డి ఎక్స్ ఎం.పి.
ఎం.ఎ., పిహెచ్.డి., డి.లిట్.
అధ్యక్షులు
తెలంగాణ సారస్వత పరిషత్తు
తిలక్ రోడ్,
హైదరాబాదు-500001.
ఫోన్ : (ఆ) 24753724

Jnanpith Awardee
Dr. C. Narayana Reddy Ex.M.P.
M.A.,Ph.D., D.Litt.
PRESIDENT
Telangana Saraswatha Parishath
Tilak Road,
Hyderabad - 500 001.
Phone : (Off.) 24753724

అవతారిక

తెలంగాణలోని ప్రజలందరు దశాబ్దాల పాటు అకుంఠిత దీక్షతో నిర్వహించిన చారిత్రక ఉద్యమ ఫలితంగా చిరకాల స్వప్నం సాకారమై 2014 జూన్ 2 వ తేదీన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించింది. తెలుగు భాషా సాహిత్య కళా సంస్కృతుల వికాసాభ్యుదయాల కోసం ఏడు దశాబ్దాలకు పైగా కృషి చేస్తున్న మాతృసంస్థ ఈ పరిషత్తు. రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల సంఘటిత స్వరంతో గళం కలిపి పరిషత్తు సర్వసభ్యమండలి 'ఆంధ్ర సారస్వత పరిషత్తు' పేరును ఏకగ్రీవ తీర్మానం ద్వారా 'తెలంగాణ సారస్వత పరిషత్తు' గా మార్పు చేసింది. శ్రీ సురవరం ప్రతాపరెడ్డి, శ్రీ మాడపాటి హనుమంతరావు, శ్రీ కాళోజి నారాయణరావు, డా. బూర్గుల రామకృష్ణారావు, శ్రీ లోకనంది శంకర నారాయణ రావు, శ్రీ గడియారం రామకృష్ణశర్మ వంటి సాహితీమూర్తుల ప్రేరణతో పరిషత్తు 1943 మే 26 న రూపుదిద్దుకుని ఈ రోజు తెలంగాణలో అగ్రేసర సాహితీ సంస్థగా విశిష్టస్థానం వహించింది. మాన్యమిత్రులు డా॥దేవులపల్లి రామానుజరావు గారు యావజ్జీవం పరిషత్తు అభివృద్ధికి శ్రమించినారు. పరిషత్తు బహుముఖీన కార్యక్రమాలు చేపట్టి దక్షతతో నిర్వహిస్తూ అందరి ప్రశంసలందుకుంటున్నది. పరిషత్తు ప్రాథమిక, ప్రవేశ, విశారద తెలుగు పరీక్షలు జరపడంతో పాటు, తెలుగు పండిత శిక్షణ కళాశాలను, ప్రాచ్య కళాశాలను నిర్వహిస్తున్నది. పరిషత్తు ఏర్పాటు చేసే సాహితీ సభలు, సమావేశాలు, ప్రసంగాలు, సదస్సులు, ఉత్సవాలు, చర్చాగోష్ఠులు, పరిణతవాణి ప్రసంగాలు, ప్రసంగాత్మక ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు మొదలైనవి తెలంగాణ వైశిష్ట్యానికి అద్దం పడుతున్నవి. పరిషత్తు ప్రచురించే గ్రంథాలను సాహితీలోకం అభిమానించి స్వాగతిస్తున్నది. ఇంతవరకు దాదాపు 300 గ్రంథాలను వెలవరించింది.

తెలంగాణ ప్రత్యేకతలోని వివిధ పార్శ్వాలను ఆవిష్కరించే సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. నిపుణుల ప్రసంగ వ్యాసాలను "వ్యాసగుళుచ్ఛం" పేరుతో పరిషత్తు రెండు భాగాలు వెలువరించింది. "తెలంగాణలో తెలుగు సాహిత్య వికాసం" పై సదస్సు వంటి కార్యక్రమాలను పరిషత్తు ఏర్పాటు

చేసింది. తెలంగాణ వైభవోన్నతికి దర్పణంగా భాసించే 15 గ్రంథాలను ఇటీవలి కాలంలో ప్రచురించింది.

తెలంగాణను సర్వతోముఖంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం, సంస్థలు, ప్రజలు ఉద్యమస్ఫూర్తితో కృషి చేయడం ప్రశంసనీయం. బంగారు తెలంగాణ నిర్మాణంలో తన వంతు పాత్రలో భాగంగా పరిషత్తు విశిష్ట కార్యక్రమాలకు రూపకల్పన చేసి నిర్వహిస్తున్నది. వాటిలో కొన్ని : తెలంగాణ మాండలిక పదాలు – ప్రయోగ వైశిష్ట్యం; ప్రాచీన తెలంగాణ కవుల సాహితీ సేవ; తెలంగాణ చిత్రకళ – శిల్పకళల వైభవం; తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాల పై సదస్సు; తెలంగాణ కవయిత్రుల – కథయిత్రుల రాష్ట్ర స్థాయి సమ్మేళనం.

ప్రత్యేక కార్యక్రమ పరంపరలో భాగంగా పరిషత్తు 2015 డిసెంబరు 11,12 తేదీలలో 'తెలంగాణ ఉద్యమం లో రచయిత్రుల పాత్ర' అనే అంశం పైన రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించింది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన నలభై మందికి పైగా రచయిత్రులు పాల్గొన్నారు. 31 ప్రసంగ వ్యాసాలను ఈ గ్రంథరూపంలో ప్రచురిస్తున్నాం. దీనిలో రెండు భాగాలున్నాయి. మొదటి భాగంలో వివిధ రంగాలలో తెలంగాణ మహిళలు సాధించిన విజయాల చిత్రణ, జరిపిన పరిశోధనల ఫలితాలు, ఉద్యమ నేపథ్యం, పాట ఆయుధంగా మారిన వైనం మొదలైన విషయాలను ఆయా రచయిత్రులు పరిణత భావకతతో ప్రామాణికంగా ఆవిష్కరించినారు. రెండవ భాగంలో ఉద్యమంలో ప్రత్యక్షంగా క్రియాశీలతతో పాల్గొన్న రచయిత్రుల అనుభవాలు – జ్ఞాపకాలను, వాటితో పాటు వ్యాసాలు, గీతాలు, కవితలు, ప్రసంగాల రూపంలో ఉద్యమానికి చైతన్యస్ఫూర్తిని సంతరింపజేసిన విధానాన్ని తెలియజేస్తుంది. ఈ సంకలనంలోని వ్యాసాలన్నింటిలో భావోద్వేగం, నిశిత పరిశీలన, ఉద్యమ నిబద్ధత, సమగ్ర విషయావగాహన, ప్రబోధధోరణి ప్రస్ఫుటమవుతాయి.

తెలంగాణ ఆవిర్భావంలో ప్రగతిపథ గమనంలో విశిష్ట భూమిక వున్న రచయిత్రుల వ్యాస సంకలనాన్ని 'కదనంలోనూ, కథనంలోనూ మేమే' అనే పేరుతో పరిషత్తు సహర్షంగా ప్రచురిస్తున్నది.

ఈ గ్రంథం అందరి మన్ననలందుకోగలదని విశ్వసిస్తున్నాను.

(డా.సి.నారాయణ రెడ్డి)
అధ్యక్షులు
తెలంగాణ సారస్వత పరిషత్తు

హైదరాబాదు,
తేది : 07-06-2017.

డా॥ జె. చెన్నయ్య
ప్రధాన కార్యదర్శి
తెలంగాణ సారస్వత పరిషత్తు

తిలక్ రోడ్,
హైదరాబాదు-500001.
ఫోన్ : 040-24753724

ప్రవేశిక

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన తర్వాత వివిధ అంశాల పై పరిషత్తు ప్రత్యేక సదస్సులను నిర్వహిస్తున్నది. ప్రత్యేక ప్రచురణలను వెలువరిస్తున్నది. లోగడ తెలంగాణ సాహిత్య వికాసం అనే అంశం పై సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. పద్యకవిత, వచన కవిత, గేయ కవిత, కథ, నవల, నాటకం వంటి ప్రక్రియల్లో తొలినాళ్ళనుంచి ప్రత్యేకంగా తెలంగాణలో జరిగిన కృషిని సమీక్షిస్తూ వక్తలు ప్రసంగాలు చేశారు. ఈ సదస్సు పత్రాలతో ఒక ప్రచురణను తీసుకువచ్చాం. పరిషత్తులో డా.బెజవాడ గోపాలరెడ్డి, డా.కె.అంజిరెడ్డి, డా.పి.యశోదారెడ్డి, డా.దేవులపల్లి రామానుజరావు వంటి పెద్దల స్మృత్యర్థం సంస్మరణ ప్రసంగ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆ కార్యక్రమాల్లో వక్తలు చేసిన ప్రసంగాల పాఠాలను పుస్తక రూపంలో తీసుకువచ్చాం. వాటికి 'వ్యాసగుళుచ్ఛం' అని అధ్యక్షులు డా.సి.నారాయణ రెడ్డి గారు సముచిత నామకరణం చేశారు.

అటువంటి ప్రచురణల శ్రేణిలో ఇప్పుడు "కదనంలోనూ కథనంలోనూ మేమే" అనే గ్రంథాన్ని పాఠకులకు అందిస్తున్నాం. తెలంగాణ సాధనకోసం బహుముఖాలుగా ఉద్యమం సాగింది. రాజకీయోద్యమం, సాంస్కృతికోద్యమం ప్రధానంగా చెప్పుకోదగినవి. రెండూ జనాన్ని ఉద్యమంలో భాగస్వాములను చేయడంతో తెలంగాణ ఉద్యమం ప్రజా ఉద్యమంగా చరిత్రలో నిలిచిపోయింది. సాంస్కృతికోద్యమంలో మహిళల పాత్ర ప్రత్యేకంగా పేర్కొనదగింది. ఉద్యమ చరిత్రను గ్రంథస్థం చేసే క్రమంలో మహిళల కృషికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. అట్లా ప్రాధాన్యం ఇవ్వాలంటే ఆ సమాచారం అందుబాటులో వుండాలి. కాని ఇప్పటి వరకు లేదు. ఈ దృష్టితో తెలంగాణ సారస్వత పరిషత్తు 2015 డిసెంబర్ 11,12 తేదీల్లో 'తెలంగాణ ఉద్యమంలో రచయిత్రుల పాత్ర' అనే సదస్సు నిర్వహించింది. తెలంగాణ నుంచి అప్పటికి అంతమంది మహిళలను ఒక వేదిక మీదకు తెచ్చిన సంఘటనలు అరుదు. మూడు తరాల కవయిత్రులు, రచయిత్రులు, ఉద్యమ వీరనారీమణులు, ఉద్యమ గాయనీమణులను ఆహ్వానించడం జరిగింది. తెలంగాణ ఉద్యమంలో మహిళలు అంటే ఉద్యమంలో పాల్గొన్న వీరనారీమణులను, తెలంగాణ ఆత్మగౌరవ నినాదంతో, తెలంగాణకు అడ్డుపడుతున్న శక్తులపట్ల వ్యతిరేకతతో ఉద్యమంలో తోటి తెలంగాణ

ప్రజలను భాగస్వాములను చేసే దృష్టితో రచనలు చేసిన కవయిత్రులు, రచయిత్రులను ఈ వేదికపైకి తెచ్చాం. ప్రముఖ రచయిత్రి, తెలంగాణ సారస్వత పరిషత్తు ఉపాధ్యక్షులు డా. ముదిగంటి సుజాతా రెడ్డి సదస్సు నిర్వహణకు ఎంతో దోహదం చేశారు. వారికి కృతజ్ఞతలు తెలియజేయడం నా విధి. ఆ రెండు రోజుల పాటు తెలంగాణ ఆడబిడ్డలతో పరిషత్తు ప్రాంగణం కళకళలాడింది. ఉద్యమకారిణులుగా వారు చేసిన కృషిని తమ ప్రసంగాల్లో వివరించినారు. కవయిత్రులు, రచయిత్రులు తాము చేసిన రచనలను ప్రస్తావించి తరతరాల తెలంగాణ ప్రత్యేకంగా స్మరించుకునే రాష్ట్రసాధన ఉద్యమంలో తాము భాగస్వాములమైనందుకు గర్వంగా ఉందని అన్నారు. ఉద్యమకాలంలో కూడా వేదికలపై పురుషులు తమకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని కొంత నిరాశ చెందినవారూ ఉన్నారు. తెలంగాణలో సాహిత్య రంగంలోని వివిధ ప్రక్రియల్లో మహిళలు ఇప్పటి వరకూ చేసిన కృషి పై ఈ సదస్సులోనే పరిశోధకులు పత్ర సమర్పణలు కూడా చేశారు. ఈ అంశాలన్నిటినీ పుస్తక రూపంలో తెస్తే మహిళల కృషిని రికార్డు చేసినట్లవుతుందని భావించడం జరిగింది. ఫలితం ఈ పుస్తకాన్ని మీ ముందుకు తెస్తున్నం. 'కదనంలోనూ కథనంలోనూ మేమే!' అని దీనికి పేరు పెట్టాము. ఉద్యమంలోనూ, సాహిత్య ఉద్యమంలోనూ మేము పాల్గొన్నాం అని మన ఆడబిడ్డలు తమ అనుభవాలను మనకు చెబుతున్నారు. అందుకే ఈ పేరు సముచితంగా ఉంటుందని భావిస్తూ ఈ పుస్తకాన్ని ఆదరిస్తారని ఆశిస్తున్నాం.

తెలంగాణ సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న కార్యక్రమాలకు తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ సహకారం పూర్తిగా ఉంది. వారి సౌజన్యం వల్లే ఈ కార్యక్రమాలను నిర్విఘ్నంగా నిర్వహించగలుగుతున్నాం. వారికి మా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

సదస్సు పత్రాలను, ఉద్యమ అనుభవాలను సేకరించడానికి చాలా శ్రమ పడవలసి వచ్చింది. అందుకే ఆలస్యం కూడా జరిగింది. వ్యాసాల సేకరణ, డి.టి.పి, ప్రూఫ్ రీడింగ్ దశలు దాటి పుస్తక ముద్రణ పూర్తి కావడానికి ఎంతగానో తోడ్పడిన డా.ముదిగంటి సుజాతారెడ్డి, డా.అమృతలత, శ్రీ గోవిందరాజు రామకృష్ణారావు, శ్రీ బి.గోపాల్ రెడ్డి, శ్రీ యస్.యాదగిరి రావు గారలకు కృతజ్ఞతలు. పుస్తకాన్ని ముద్రించిన సాయిలిఖిత శ్రీ వై.వెంకటేశ్వర రావు గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

(డా.జె.చెన్నయ్య)
ప్రధాన కార్యదర్శి
తెలంగాణ సారస్వత పరిషత్తు

హైదరాబాదు,
తేది : 05-06-2017.

విషయ సూచిక

మొదటి భాగం
తెలంగాణ మహిళా సాహితి

రెండవ భాగం
ఉద్యమ, రచనానుభవాలు

మొదటి భాగం

తెలంగాణ మహిళా సాహితి

తెలంగాణ ఉద్యమ కథ



తాయమ్మ కరుణ

ఏ మాటకు ఆ మాటే చెప్పుకోవాలి. కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ ప్రజల చైతన్యానికి, పోరాట స్ఫూర్తి. అందుకే తెలంగాణకు జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడుతూనే ఉంది. నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడింది. స్వాతంత్ర్యం తర్వాత దక్కిన హైదరాబాద్ స్టేట్ ఆంధ్రలో విలీనమైంది మొదలు 2014లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని దక్కించుకునే వరకు అలుపెరుగక పోరాడారు ఇక్కడి ప్రజలు. ఈ కాలంలో ఎందరో అశువులు బాశారు.

ముఖ్యంగా నిజాం వ్యతిరేక ఉద్యమ కాలంలో కమ్యూనిస్టు పార్టీ ప్రజలను చైతన్యవంతులను చేసింది. ఆ తర్వాత దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా నక్సలైట్ ఉద్యమమూ ఉద్ధృతమైంది. నిరంతరం పోరాటంతో చైతన్యవంతులైన తెలంగాణ ప్రజలు సాహిత్యానికి అంతే దగ్గరయ్యారు. ఈ నేపథ్యంలో ప్రపంచ సాహిత్యాన్ని ముఖ్యంగా రష్యన్ సాహిత్యాన్ని చదివారు. ప్రత్యక్షంగా ఉద్యమ ప్రాంతంలో ఉన్నవారు. పోరాట గాథలను రచించారు. అట్లా తెలంగాణ రచయితల కథలు ప్రపంచ సాహిత్యానికి తీసిపోని విధంగా వచ్చాయి.

తెలుగులో మొదటి కథ ఏదీ? అంటే, మొన్నటి వరకు గురజాడ 'దిద్దుబాటు' ప్రచారమైంది. కానీ మొదటి కథ రాసింది రచయిత్రి అని, అదీ అచ్చమాంబ అని తర్వాత పరిశోధకులు వెలుగులోకి తెచ్చారు. అచ్చమాంబ మరుగున పడిపోవడానికి కారణం స్త్రీ కావడం కావచ్చు. మొదటి నుంచి తెలంగాణను వెనక్కు నెడుతున్న ఆంధ్ర రచయితల పెత్తనమూ కావచ్చు. ఏదీ ఏమైనా తెలంగాణ ఏర్పడ్డాక చూసుకుంటే తెలంగాణ కథను అచ్చమాంబ గురజాడ కంటే ఎనిమిదేండ్లకు ముందే 1902లో రాసిన 'ధన త్రయోదశి' మొట్టమొదటిది అని సగర్వంగా చెప్పుకోగలం. ఊహకు కూడా అందని రోజుల్లో అచ్చమాంబ స్త్రీ స్వాతంత్ర్యాన్ని కోరుతూ రచనలు చేశారు. అదీ తెలంగాణ బిడ్డల చైతన్యం.

ఈ వ్యాసం పరిధి – ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కాలం నుంచి వచ్చిన కథలకు సంబంధించినది.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమంపై కథల సంకలనాలు రానేలేదు. అమృతలత గారి ఆధ్వర్యంలో 'వెతలే కథలై' సంకలనం మాత్రం వెలువడింది. 'ప్రత్యేక తెలంగాణ' ను సమర్థిస్తూ తెలుగు రచయిత్రులు మాత్రమే రాసిన కథలు ఈ సంకలనంలో ఉన్నాయి. తెలంగాణ కథకు 'నమస్తే తెలంగాణ' దినపత్రిక ఆదివారం సంచిక 'బతుకమ్మ' లో తగిన స్థానం కల్పించింది. తెలంగాణ రచయిత/రచయిత్రుల కథలు వందలాదిగా ఇందులో ప్రచురితమయ్యాయి. ఇందులో వచ్చిన కథల్లో సగానికి సగం రచయిత్రుల కథలు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు.

భాష మీద, విద్యార్థి ఉద్యమం మీద, తెలంగాణ సంస్కృతి మీద, నీళ్లు, ఉద్యోగాలు, వలసలు.. తెలంగాణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల మీద కథలు వచ్చాయి. పేరున్న రచయిత్రులు మొదలు ఎందరో నూతన రచయిత్రులు కూడా ఈ సంకలనం ద్వారా పరిచయమయ్యారు. **ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన తర్వాత** కూడా తెలంగాణలోని పరిస్థితులను వివరిస్తూ కథలు వచ్చాయి, వస్తూనే ఉన్నాయి. వాటన్నింటిని ఇందులో వివరించలేను కానీ, అందులో కొన్ని..

గర్శకుర్తి శ్యామల 'ఉక్రోషం' కథ భాష మీదే సాగింది. తెలంగాణ భాషను, యాసను గేలిచేస్తూ ఆంధ్రా అబ్బాయి పిల్లాడిని గట్ల, గిట్ల, తోలుకపో.. అంటూ ఏడిపిస్తుంటాడు. అయినప్పటికీ ఓసారి... నీళ్లలో మునిగిపోతున్న ఆంధ్ర పిల్లాడిని తెలంగాణ అబ్బాయి రక్షిస్తాడు. తెలంగాణ మట్టి మనుషుల మానవత్వాని ఆంధ్రవారి కొంచెపు బుద్ధిని తెలిపే కథ. **సమతా రోష్ని 'అమ్మ'** కథలో కూడా తెలంగాణ భాష, యాసల మీద వివక్షను, చిన్నచూపును ప్రతిబింబించారు. **షహనాజ్ ఫాతిమా రాసిన 'ఇంకెప్పుడు' కథ** చిన్నదే అయినప్పటికీ గ్రామాల్లోని భూములను అగ్గువకు కొన్న ఆంధ్రవాళ్ళు, కార్పొరేట్ స్కూళ్లు పెట్టిన ఆంధ్రావాళ్లు, ఉన్నత ఉద్యోగాల్లో ఉన్న ఆంధ్రావాళ్లు.. వాళ్ల కింద పని చేసే తెలంగాణ వాళ్లు.. ఈ ఆధిపత్యం ఎప్పుడు పోతదని ప్రశ్నిస్తుంది. **కొల్లాపురం విమల 'సర్కారు తుమ్మలు' కథ...** తెలంగాణలోని ఎండిన చెరువులు, పొలాల్లో మొలిచిన సర్కారు తుమ్మలు, దొరకని పనులు, వలస బాట పట్టిన ప్రజలు, దేశంగాని దేశంలో వారు పడే అవస్థలను వివరించింది. **తిరునగరి దేవకీదేవి కథ 'మన వేలితో మన కంట్లోనే'..** బతకడానికి వచ్చిన నిరుపేద ఆంధ్ర వ్యక్తి కోటీశ్వరుడు కావడం, వడ్డీలకిచ్చి చౌకగా భూములు కొనడం,

క్రమంగా ఊరి మీద పెత్తనం చెలాయించడం, లొంగని వారిని బెదిరించడం, లేదంటే మూఢనమ్మకాలను అడ్డు పెట్టుకుని మన జనం చేతనే మనలను చంపించడం చేస్తుంటాడు. ఆంధ్రవాళ్ల కుటిలత్వాన్ని ఎత్తి చూపిందీ కథ. **నెల్లుట్ల రమాదేవి కథ 'చెల్లని చెక్కు'...** విద్యార్థుల ఉద్యమాన్ని అభాసుపాలు చేసేందుకు చేసే కుట్రలు, విద్యార్థి ఆత్మహత్య, దాన్ని ఉపయోగించుకునే ప్రజాప్రతినిధులు.. 5 లక్షల రూపాయల చెక్కును మృతుడి తల్లిదండ్రులకు ఎమ్మెల్యే ఇస్తాడు. దాన్ని తీసుకుని బ్యాంకుకుపోతే ఆ అకౌంటులో డబ్బుల్లేవని తెలుస్తది. ఆ చెక్కును ఎమ్మెల్యే మొఖాన కొట్టి పోతది తల్లి. ఉద్యమంలో బాగుపడ్డది పెద్దలే కానీ పేదలకు ఒరిగిందేమీ లేదని చెప్పిన కథ ఇది. **గోగు శ్యామల కథ 'ఎల్లమ్మ దస్కింది'..** ఆంధ్రోళ్లు తెలంగాణ ప్రాంతాలకు వచ్చి అగ్గువకు భూములను కొని, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న తీరును, వారిని ఎదిరించిన ఎల్లమ్మ, ఆఖరికి తన పిల్లలు వ్యవసాయం బంద్ చేస్తరేమో, భూమిని అమ్ముతరేమో అని దిగులుపడే స్త్రీ మనోవేదనను, భూమితో ఉన్న బంధాన్ని, దళిత స్త్రీ వ్యక్తిత్వాన్ని వివరించిన కథ. **అమృతలత కథ 'నేను సైతం'...** ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే నాగరికత అని తెలిపిన కథ. చిన్నపిల్లల వైపు నుంచి కథ నడిపి, దృశ్యాన్ని కళ్లకు కడతారు. **శారదా హనుమాండ్లు రాసిన 'పల్లె ఇల్లు ఖాళీ చేసింది' కథ..** మారిన పల్లెను తెలిపిన కథ. చిన్నతనంలో వీధిన వెళ్తుంటే విన్పించిన మగ్గాల చప్పుడు, నీటితో కళకళలాడిన వాగు, వాగుతో ఉన్న అనుబంధం, ఈనాడు ఎండిన వాగు, కరువైన ప్రేమల్ని వలపోస్తూ సాగిన కథ. **రత్నమాల రాసిన 'నీళ్లకోసం' కథ..** నల్లగొండ జిల్లాలోని మూసీ ఆనాడు నీళ్లతో నిండుకుండలా ఉండేది. ఈనాడు ఎండిపోయింది. దానికి గల కారణాలు, సాగర్ నీళ్లన్నీ బెజవాడకు తరలిపోవడం. పోరాటాలు చేసే నక్సలైట్లని చంపడం, అయినా తెగబడి పైపులకు బొక్కలు పెట్టి వాడుకుందామన్న జేఏసీ పిలుపు, జనం స్పందన వివరించారు.

ముదిగంటి సుజాతారెడ్డి కథ 'దీనికి అంతం లేదా?'... రాసింది వరకట్నం సమస్య గురించే కానీ ప్రధానంగా తెలంగాణలోని దొరల జీవితం చుట్టూ, నక్సలైట్ల చుట్టూ తిరిగింది. దొరల భూముల్లో నక్సలైట్లు ఎర్రజెండాలు పాతితే భయంతో పట్నం వస్తారు. వాళ్లలో తెలివైనవారు మొదట వ్యాపారంలోకి, ఆ తర్వాత రాజకీయాల్లోకి దిగుతారు. ఊరులోని పెత్తనం నుంచి శాసనసభల్లోకి అడుగుపెడతారు. వారసత్వంగా వచ్చిన భూమిని నక్సలైట్లు ఆక్రమించగా పట్నం వచ్చిన అమాయక దొర ఆస్తి కరిగేదాకా కూచుని తిని, తప్పనిసరై ఇల్లుగడవని స్థితిలో చిన్నచిన్న

వ్యాపారాలు చేస్తుంటారు. అట్లాంటి ఓ దొర తన బిడ్డను బాగా చదివించినా పెండ్లికి వరకట్న సమస్య ఎదురవుతుంది. కట్నం తీసుకోని మంచివాళ్లు ఉంటారని, అలాంటివారిని పెండ్లి చేసుకుంటానని, బాధ పడొద్దని తండ్రికి కూతురే ధైర్యం చెప్తుంది ఈ కథలో.

గీతాంజలి కథ 'పోలేపల్లి పీనుగను మాట్లాడుతన్నా..' ..సెజ్‌ల నేపథ్యంలో ఛిద్రమవుతున్న తెలంగాణప్రజల దుస్థితిని కళ్లకు కట్టినట్టు తెలిపిన కథ. గ్రామంలోని స్థలమంతా సెజ్‌లకు పోగా చనిపోయిన పీనుగను పూడ్చిపెట్టడానికి స్థలం లేని దైన్య స్థితిని, తెలంగాణ పల్లె జనం దుర్భర జీవితాలను పట్టి ఇచ్చిన కథ.

కాత్యాయని విద్మహే రాసిన 'విభజన రేఖలు' కథ.. ప్రాంతాల విభజన అవసరాన్ని – మనుషుల మధ్య విద్వేషంగా తప్ప చూపలేని, చెప్పలేని రాజకీయాల బోలు తనం ఉంది. ప్రాంతాల మధ్య పాలనాపరమైన విభజనేగానీ, వనరులపై స్థానికుల అధికారమే కానీ, మనషుల మధ్య సంబంధాలపైన నిషేధం కాదనీ తెలిపిన కథ.

స్వాతి శ్రీపాద రాసిన 'బతుకమ్మ' కథ.. ప్రత్యేక ఉద్యమాలతో ప్రభువులే బాగుపడుతున్నారు తప్ప, పేదలకు ఒరిగిందేమీ లేదని ఆత్మహత్యతో నిరసన తెలిపిన కథ. తొలి ఉద్యమంలో భర్తను, మలి ఉద్యమంలో కొడుకును (పెట్రోలు పోసుకుని ఆత్మహత్య చేసుకుంటాడు) పోగొట్టుకుంటుంది. బతుకమ్మ, నువ్వే బతుకు, అన్యాయపు అక్రమార్కుల కోసమే బతుకు, పదవుల కోసం ఇతరుల ప్రాణాలు పణంగా పెట్టే వారి కోసమే బతుకు, పిడికెడు జీవితం కోసం పరితపించే వారి కోసం కాదు.. అనుకుంటుంది. బతుకమ్మను చెరువులో విడవడానికి లోతులకంటా వెలుతుంది. (ఆత్మహత్య చేసుకుంటుంది).

తాయమ్మ కరుణ రాసిన 'చుక్కాని ' కథ.. తెలంగాణ సాధనకు పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని ఓ పక్క ఆత్మహత్యలు చేసుకుంటుంటే, తమ ముందు ఆ పని చేస్తే చూసేవాళ్లం కదా అనే ఆంధ్ర విద్యార్థుల కర్కశత్వాన్ని, తెలంగాణ బిడ్డలే అయినప్పటికీ అసలు ప్రత్యేక తెలంగాణను ఎందుకు కోరుతున్నారో తెలియక వద్దంటున్నవారు, ఎందుకు సమర్థించాలో అర్థం కాని వాళ్లకు అర్థం చేయించడం... ఉద్యమాన్ని పక్కదారి పట్టిస్తున్న ప్రజాప్రతినిధులు, నీరసించి పోతున్న విద్యార్థి లోకానికి.. ఉద్యమాన్ని మీ చేతుల్లోకి తీసుకుని నడపమని. ఉద్యమానికి యువతనే చుక్కాని అని తెలిపిన కథ.

బి.కళాగోపాల్ రాసిన'బాంచన్' కథ (ఆగస్టు 16, 2015 బతుకమ్మ).. బతకలేక దేశంగానీ దేశంలో తెలంగాణ బిడ్డలు పడుతున్న కష్టాలను తెలిపిన కథ. అప్పులు కట్టలేదని చాకలి అంకవ్వకు చెందిన నాలుగెకరాల పొలాన్ని దొర ఆక్రమించుకుంటాడు. పత్తి పంట సాగు చేసిన అంకవ్వ కొడుకు నారిగాడు అతివృష్టితో పంట తడిసి నష్టపోయి ఆత్యహత్య చేసుకుంటాడు. భార్య కూడా ఆత్మహత్య చేసుకుంటుంది. వారికి ముగ్గురు మొగపిల్లలు . వాళ్లు ఒకరి తర్వాత ఒకరు అరబ్ దేశానికి వెళ్తారు. చేయని హత్యానేరం కింద పెద్దోడు, వీసా రెన్యూవల్ కాలేదని నడిపోడు జైలుకు వెళతారు. సంపాదించిన డబ్బు అన్నల బెయిలు కోసం చేసే ప్రయత్నాలకే ఖర్చవుతుంది చిన్నోడికి. ఊరు రాలేక చిన్నోడు అక్కడే ఉండిపోతాడు. అంకవ్వ మంచం పడ్తది. ఆనాడు ఒకడే దొర. ఈనాడు ఎందరో దొరలు.

కోట్ల వనజాత రాసిన 'సముద్రం' కథ.. తెలంగాణ ప్రజల వలస జీవితం గురించి రాశారు. బొంబాయి వలస వెళ్లిన కుటుంబం. అక్కడా దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తూ భార్య చనిపోతే సముద్రంలోకి తోసేసిన మనసును మెలిపెట్టే, తెలంగాణ ప్రజల కష్టాల జీవితాన్ని కండ్లకు కడుతూ రాశారు.

వై. వసంత రాసిన 'చంద్రన్న' కథ.. తెలంగాణ యాసను అద్భుతంగా వాడారు కథలో. రైతుల దీనస్థితిని, ఆత్యహత్యలకు దారితీసిన పరిస్థితులు, సర్కారు నిర్లక్ష్యం గురించి వివరించిన కథ. పంట రాలేదని కరువొచ్చినా, అతివృష్టి వచ్చినా సాగు కష్టమని వదిలేసినోన్ని జూల్లే. పరీక్షల ఫెయిలయిన పరీక్షలు రాయరుగని అన్నటికీ సిద్ధపడి, ఇష్టపడి యుద్ధంలకు పొయ్యేటోని తీర్గ పొలంకు పోతడు రైతు. మట్టినే దేవతని నమ్ముకునేటోళ్ళున్నరు. గా మట్టిని మట్టేగదా అని అమ్ముకునేటోళ్లన్నరు. గా మట్టిని నమ్మిన చంద్రయ్యకు ఊరొదల చాతగాలే. పల్లె తల్లినిడ్వలేక పానం గుడ దీస్కుండు. చంద్రయ్య మట్టి మనిషి లెక్క కనిపించిండు. గా సావు కబురందుకున్న సూరీడు పడమట దిక్కుకు పయిమైతడు.

రావుల కిరణ్మయి రాసిన 'ఏరువాక' కథ.. చిన్ననాడెప్పుడో నిండిన చెరువు.. మల్లీ ఇప్పుడు నిండింది. తన కొడుకూ అమెరికా కూడా పొయిండు. అయితే చెరువు ఎండినప్పుడు చెరువు మధ్యలో ఉన్న గుట్టను పట్నం నుంచి వచ్చినవాళ్లు తవ్వుక పోయింర్రు. తనకు తల్లిగారిచ్చిన 20 ఎకరాలు గూడా చెరువు నీటిలో మునిగిపోయాయి. చెరువు ఎప్పుడు ఇట్లాగే ఇంత వైశాల్యంతో నిండి ఉండాలంటుంది సీమంతి తన తండ్రితో. చెరువు, శిఖం భూముల్లోకి రియల్ ఎస్టేట్ దందా రాకుండా చేసుకునే బాధ్యత ప్రజలందరిదీ అంటుందీ.

వాణిశ్రీ రాసిన జానపద కథ 'లచ్చుమ్మ చెరువు' ... చెరువులోకి నీరువచ్చే దారులను మళ్లించడంతో చెరువులు ఎండిపోవడం.. శిఖం భూములను ఆక్రమించి అధికారుల అండదండలతో భవంతులు కట్టడం.. చెరువులు కానరాకుండా పోవడం గురించి చెప్పారు.

నామని సుజనాదేవి రాసిన 'ఒక్కసారి పోయి రావాలి' కథ.. చెరువులను దత్తత తీసుకోవడం మీద, తెలంగాణ పల్లె వాతావరణం, బతుకమ్మ ఆడే విధానాన్ని, పాటలను చాలా వివరంగా రాశారీ కథలో. మన సంస్కృతీ సంప్రదాయాలను ముందు తరాల వారికి అందివ్వాలంటే ఊరును బతికించుకోవాలంటుంది. దీనికితోడు బతుకమ్మను విడిచేందుకుచెరువులో నీళ్లు లేక గోళాలల్లో వదులుతుండటం.. అది చూసిన కథానాయిక చిట్టి గుండె చెరువవుతుంది. ఇంటికొచ్చి ఏడుస్తుంది. కరువు పరిస్థితిని తండ్రి వివరిస్తాడు. చెరువును దత్తత తీసుకునేవాళ్లు లేరనడంతో చెరువును దత్తత తీసుకోవడానికి తనే ముందుకు వస్తుంది. పండుగకు అమ్మమ్మ వాళ్లింటికి పోతున్నామంటే.. అక్కడ టీవీ ఉంటదా, ఇంటర్నెట్ ఉంటదా అని అడిగిన పిల్లలు.. ఓనగుంటలు, గచ్చకాయలు, జిల్లాకోన, గోలీలాట, పచ్చీసు ఆటలు ఆడుతూ వాటి సంగతే మరిచిపోతారు.

తమ్మెర రాధిక రాసిన 'భూమి కోసం' కథ... తెలంగాణ యాస, జీవన విధానాన్ని పట్టి ఇచ్చిన కథ. భూమి కొందామని డబ్బులు కూడపెడ్తే ఆ భూమిని పార్టీ గద్దె కట్టడానికి కొనాలని పార్టీవాళ్లు నిర్ణయిస్తారు.

జూపాక సుభద్ర రాసిన 'రాయక్క మాన్యం' కథ.. మాదిగల మీద ఆధారపడి, గాడిదలను పెంచుతూ జీవించే డక్కలి స్త్రీ కథ. డక్కలి వాళ్లు మాదిగలు ఉన్న అన్ని ఊళ్లకు పోరు. తమకు ఏ ఊరిలో భాగం ఉందో ఆ ఊరికే పోతారు. అక్కడి పంచాయితీలు తెంపుతారు. హక్కుగా తమకు రావలసింది తీసుకుంటారు. కులం కథ చెప్తారు. తేడా వస్తే నిలేస్తారు. అలాంటి డక్కలి స్త్రీయే రాయక్క. ఆమె మాన్యాన్ని అనుభవిస్తూ ఆమెకు ఇవ్వాల్సిన గింజలు ఇవ్వని తగువును ఆమె ఎలా పరిష్కరించిందో కథలో వివరించారు. డక్కలి స్త్రీ మీద వచ్చిన మొదటి కథ.

చందు తులసి రాసిన 'పాలపిట్టల పాట' కథ.. బతుకమ్మకు దూరమైన దళిత స్త్రీల మనోవేదన. బతుకమ్మకు తంగెడుపూలకు విడదీయరాని అనుబంధం ఉంది. ఆ తంగెడుపూలు దళిత బిడ్డవి అని జానపద కథను తెలిపే కథ. పూలన్నీ ఏరుకొచ్చి తెచ్చి ఇచ్చిన దళితులను బతుకమ్మ యాంకల్లకు (దగ్గరికి) కూడా రానివ్వరు

దొరసానులు. దళితబిడ్డ బతుకమ్మకు బతుకమ్మ ఆడాలనే తీరని కోరిక. తాము తెచ్చిన పూలతో పేర్చిన బతుకమ్మను తనివితీరా హత్తుకోవాలనే కోరిక. అందుకే ఓసారి బతుకమ్మను ముట్టుకుంటుంది. దొరసాని చూసి బాగా కొడ్తది. అంతకు ముందు రోజు రాత్రి గౌరమ్మ దగ్గర బతుకమ్మలు ఆడతారు. అర్ధరాత్రి అందరూ పండుకున్నాక ఆ గౌరమ్మ దగ్గరికి పోయి తనను తానే బతుకమ్మగా భావించుకుని ఆడుకుంటుంది. పాలపిట్టలను తోడు రమ్మని, పాటకు గొంతు కలపమని (కోరస్ ఇమ్మని) పాడుతుంది. ఆట అయినంక బతుకమ్మను విడిచిపెడతారు కదా, తానే బతుకమ్మై లోతు నీళ్లలోకి వెళ్లిపోతుంది. ఆ తర్వాత వరుసగా మూడు దినాలు పెద్ద వాన. కాలం గడిచింది. మళ్లీ బతుకమ్మ పండుగొచ్చింది. ఇప్పుడు దళితబిడ్డ బతుకమ్మ లేదు. బతుకమ్మ భూమితల్లిని చేరిన చోట తంగేడు పూల చెట్టు. విషాదాంతం కానీ దళితులకు దూరమైన బతుకమ్మ గురించి, వారి తీరని కోరిక గురించి, కులవ్యవస్థ గురించి రాసిన కథ.

వాణీ దేవులపల్లి 'గురువయ్యసారు కానిగీ బడి', కూతురు జయశ్రీ 'మా సారు తబాదల', ముస్లిం కథలను రాసిన షాజహానా, 'ఎడారి గాయం' రాసిన ఐనంపూడి శ్రీలక్ష్మి, 'గంగ పొంగు' రాసిన గోపీ భాగ్యలక్ష్మి, 'నా తెలంగాణ' రాసిన ప్రొ. వి. శోభ, 'సోపతి' రాసిన అనిశెట్టి రజిత, 'చామంతి' రాసిన పోల్కంపల్లి శాంతాదేవి, 'సిబ్బి' రాసిన జ్వలిత, 'నా తావులకెల్లి లెవ్వ' రాసిన కిరణ్‌బాల, ఆయాచితం అరుణకుమారి, పద్దం అనసూయ, జి. అనసూయ, అడువాల సుజాత, తమ్మెర రాధిక, హిమజ, తుర్లపాటి లక్ష్మి, రావుల కిరణ్మయి, భండారు విజయ, శిలాలోలిత, చాడా లలితాదేవి, మారుబడి సుజాత, మరెందరో రచయిత్రులు రచనలు చేశారు.

***

తెలంగాణ మహిళా పరిశోధకులు



డా.వి.త్రివేణి

తెలంగాణ సాహిత్య సాంస్కృతిక పునరుజ్జీవన దశలో ఉంది. సాంకేతికంగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం జరిగే సాహిత్య సాంస్కృతిక పురోభివృద్ధిని పునరుజ్జీవన యుగంగా అభివర్ణించవచ్చు. నవ తెలంగాణ నిర్మాణానికి ఈ రెండు రంగాలు ఎంతో కీలకంగా నిలుస్తాయి. అదే బాటలో సాహిత్య విస్తృత అభివృద్ధికి తెలంగాణ కవులు, రచయితలు గణనీయంగా కృషి చేస్తున్నారు. అందులోనూ మహిళల పాత్ర ఎనలేనిది.

సృజన సాహిత్యం అనేది ఒక కవిగా, ఒక రచయితగా నిలబెడితే, ఆ సాహిత్యాన్ని విశ్లేషించే వారిని విమర్శకులుగా, పరిశోధకులుగా నిలబెడుతుంది. ఒక రచనలో ఉన్న వివిధాంశాలను, రచన తీరుతెన్నులను అనుశీలించడం సృజన సాహిత్యరచన కంటే కఠినమైంది.

వివిధ విశ్వవిద్యాలయాలలో పోతన పరిశోధనలను ఒకసారి పరిశీలిద్దాం. "పోతన భాగవత ఉపాఖ్యానాలలో రసపోషణ" మీద ఎం.వి.రాజ్యలక్ష్మి, "మహాభాగవతంలో నవవిధ భక్తి మార్గానుమాయులు" అనే అంశం మీద సి.శ్రీవిద్య, "మహాభాగవతంలో అలంకార సౌందర్యదర్శనాలు" మీద ఎన్.లలిత, "భాగవతం దశమ స్కంధంలో స్త్రీపాత్రలు" మీద పి.లీలావతమ్మ, "భాగవతంలో వేదుకలు" కె.అలకనంద, "భాగవతంలో కృష్ణతత్వం" మీద ఎస్.సుధ, "భాగవత కృష్ణుడు వ్యక్తిత్వచిత్రణ" మీద ఎ.సీతారత్నం వంటి వారు పరిశోధనలు చేశారు. కవిత్వ సాంద్రతను పెంపొందించే పరిశోధనలు మహిళల పరిశీలనల్లో జరగడం విశేషం.

తెలంగాణలో భక్తి ఉద్యమ చరిత్రలో నిలిచిపోయిన కవి పాల్కురికి సోమనాథుడు. నాడు సామాజిక సాంస్కృతిక నేపథ్యంలో పెనుమార్పులు చోటుచేసుకొన్నాయి. పాల్కురికి సోమనాథుడి వీరశైవ సిద్ధాంతం నాటి సామాజిక వర్గాలలో ఎంతో ప్రభావాన్ని కలిగించింది.

శివకవుల మీద, పాల్కురికి మీద, అతని రచనల మీద మహిళలు పరిశోధనలు చేశారు. "శివకవులు-సామాజిక పరిశీలన" అనే అంశం మీద కె.వి.ఎస్.పద్మావతి, "పాల్కురికి సోమన రచనల్లో స్త్రీ పాత్రలు" అనే అంశం మీద బి.పావని, "పండితారాధ్య చరిత్ర – జానపద సంస్కృతి" మీద జె.వెంకటకుమారి వంటి వారు పరిశోధనలు చేశారు. స్త్రీలకు అత్యంత చేరువలో ఉన్న సాహిత్యం కాబట్టి మహిళా పరిశోధకులు పాల్కురికి కవిత్వంలో జానపద సంస్కృతికి సంబంధించిన అంశాలను పరిశోధనకు ఎంచుకోవడం ముదావహం.

అనంతర కవులైన కొరవి గోపరాజు మీద, ధర్మపురి శేషప్ప మీద మహిళలు పరిశోధనలు చేశారు. తెలంగాణలో ప్రసిద్ధ పండిత వంశానికి చెందిన కొరవి గోపరాజు "సింహాసన ద్వాత్రింశిక – మహిళా జన జీవితం" అంటూ అంశాన్ని ఎన్నుకొని పరిశోధన చేసినవారు జె.కనకదుర్గ. తెలంగాణ సంప్రదాయంలో ధర్మపురి శేషప్ప కంట్రిబ్యూషన్ (యోగదానం) అధికమే. అతని దేశవాళీ జావళీలు తెలంగాణ శతక పాఠకుల నోళ్ళల్లో సజీవంగా ముద్రింపబడ్డాయి. "శేషప్ప కృతులు" ఐ.రాజ్యలక్ష్మి, "శేషప్ప త్రిశతి" జి.శ్రీలత అంశాలుగా ఎన్నుకొని పరిశోధనలు చేస్తున్నారు.

ఇంకా తెలంగాణలో వెలసిన ప్రాచీన కవిత్వం మీద, కవుల మీద ఇప్పుడు ఎక్కువగా పరిశోధనలు జరుగుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం మహిళలు సైతం ఇటువంటి సాహిత్య పరిశోధనలు చేయడానికి ముందుకొస్తున్నారు. మన చరిత్రను మనం తవ్వుకొనే నేపథ్యంలో 17,18 వ శతాబ్దాలలో అజ్ఞాతంగా ఉన్న కవుల గురించి, వారి కావ్యాల గురించి పరిశోధన చేస్తున్నట్లుగా వివిధ విశ్వవిద్యాలయాలలోని ప్రస్తుత పరిశోధకులను గమనిస్తే తెలుస్తుంది. రామదాసు ప్రాంతం తెలంగాణ. భద్రాచలాన్నే భక్తిధామంగా ఎంచుకొని అనేక కీర్తనలు రచించారు. "రామదాసు సాహిత్యం – రసపోషణ" మీద టి.వి.నాగరంజని, "రామదాసుకీర్తనలు" మీద జి.విద్యాధరి పరిశోధనలు చేశారు.

ఆధునిక తెలుగు సాహిత్యంలో పేరెన్నిక గలవారు దాశరథి కృష్ణమాచార్యులు. నాడు నిజాం గుండెల్లో గుబులు పుట్టించిన వీరి కవిత్వం మీద పరిశోధనలు అనేకం వచ్చాయి.

"దాశరథి కవిత్వం – సవిమర్శక పరిశీలన" అనే అంశాన్ని సిహెచ్. హైమావతి, "దాశరథి కవిత్వం – సవిమర్శక పరిశీలన" అనే అంశాన్ని డి.విజయలక్ష్మి పరిశోధనకు ఎన్నుకొన్నారు. వేరు వేరు విశ్వవిద్యాలయాలలో

(కాకతీయ, ఉస్మానియా) వీరు పరిశోధనలు చేసినా, ఎన్నుకొన్న అంశం మాత్రం యాదృచ్ఛికంగా ఒకటే.

ఆధునిక కవిత్వం ఒరవడికి సినారె కవిత్వం ఒక దిక్సూచి. మానవత్వం, ప్రణయం, స్నేహం, అనురాగం, అనుబంధం, కుటుంబ సంబంధం, మధ్య తరగతి వ్యక్తుల జీవన చిత్రాలు, మానవ చైతన్య గీతికలు సినారె కలం నుంచి జాలువారాయి. సినారె కవిత్వంపై విశేష పరిశోధనలు జరిగాయి.

నాటి మహిళాలోకం సినారె కవిత్వాన్ని పఠనావలోకనం చేసుకున్నారు. అందుకే సినారె సాహిత్యంతో మహిళలకు పరిచయం ఎక్కువే. అందులోనూ సినారె సినీ గేయ రచయిత కూడా. సంగీత ప్రియులకు, పాటలంటే చెవి కోసుకొనే మహిళామణులకు సినారె తప్పక తెలిసి ఉంటారు.

1991 లో హైదరాబాదు విశ్వవిద్యాలయంలో సిహెచ్ కిరణ్మయి "ఆధునికేతిహాసంగా విశ్వంభర" అనేఅంశంపైన, అదే హైదరాబాదు విశ్వవిద్యాలయంలో 1993 లో జి.గీతావాణి "ప్రపంచపదులు – సామాజిక రాజకీయ సాహిత్య నేపథ్యం" అనే అంశంపైన, 1994 లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కె.జ్యోత్స్నప్రభ "ఆరోహణ – ఒక పరిశీలన" అనే అంశంపైన, 1996 లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.పద్మజ "సినారె జలపాతం – ఒక పరిశీలన" అనే అంశం పైన, కాకతీయ విశ్వవిద్యాలయంలో 2001 లో ఎస్.ప్రభావతి "సినారె కవిత్వ దర్శనం – చారిత్రక కావ్యాలు, స్త్రీ పాత్రలు" అనే అంశంపైన, 2003 లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జి.వెంకటలక్ష్మి "సినారె దూరాలను దూసుకొచ్చి" అనే అంశం పైన, 2007 లో కాకతీయ విశ్వవిద్యాలయంలో కె.జ్యోత్స్నప్రభ "సినారె గేయ కవిత్వం వస్తుభావ నవ్యత" అనే అంశం పైన పరిశోధనలు చేశారు.

తెలంగాణ కవులలో మరొక ప్రసిద్ధ కవి డా॥ఎన్.గోపి. ఆయన కవిత్వంపై వివిధ విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు జరిగాయి.

సాహిత్యంలోనే గాక తెలంగాణలో ఆధ్యాత్మిక, తాత్విక, సామాజిక సాంస్కృతిక రంగాలలో విశేషకృషి చేసిన వారిపై కూడా మహిళా పరిశోధకులు పరిశోధనాంశాన్ని ఎంచుకోవడానికి ముందుకొచ్చారు. "పండిత గోపదేవ్ శాస్త్రి జీవితం – సాహిత్యం" అనే అంశం మీద శ్రీలత 2006 లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పరిశోధన చేశారు.

అదే విధంగా సామాజిక రంగంలో విశేషకృషి చేసిన టి.వి.నారాయణ మీద శైలజ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 2013 లో పరిశోధన చేశారు. వీరు

ఎంచుకున్న అంశం "టి.వి.నారాయణ సాహిత్యం - సమగ్ర పరిశీలన". టి.వి.నారాయణ భారతీయ సంస్కృతి - సంప్రదాయాలను తమ కావ్యాలలో సామాజిక ఉపన్యాసాలలో పెట్టి ధార్మికతను ప్రదర్శించారు.

పరిశోధకురాలు శైలజ టి.వి.నారాయణ సాహిత్యంలోని ఆధ్యాత్మిక, తాత్త్విక విశేషాంశాలను అవగతం చేసుకొని, వాటిని భాషాపరంగా పరిశీలించారు.

కొందరు తెలంగాణ మహిళా పరిశోధకులు దాశరథి రంగాచార్య సాహిత్యాన్ని అనుశీలించడంలో ముందుకొచ్చారు. తెలంగాణ ఉద్యమ నేపథ్యాన్ని, జన జీవన స్థితిగతులను, సంప్రదాయ రచనల నుంచి ఆధునిక, సామాజిక భావజాలవ్యాప్తికి చెందిన రచనలను ఎన్నింటినో రంగాచార్య రచించారు. వారి నవలను పరిశీలించగలిగారు.

"దాశరథి రంగాచార్య నవలా సాహిత్యం-జనపదం-ప్రత్యేక పరిశీలన" అనే అంశంపై డి.ఎం.ప్రేమావతి 1985 లో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో, "దాశరథి రంగాచార్య నవలలు-ఉద్యమ నేపథ్యం" అనే అంశంపై వి.శ్రీదేవి 1997 లో కాకతీయ విశ్వవిద్యాలయంలో, "దాశరథి రంగాచార్య రచనలు-జీవిత దృక్పథం" అనే అంశంపై వి.సావిత్రమ్మ 2004 లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పరిశోధనలు చేశారు.

కేశవరెడ్డి రచనల మీద కూడా మహిళలు పరిశోధనలు చేశారు. కేశవరెడ్డి రాయలసీమ ప్రాంతం అయినా; జీవనం, సాహిత్యం అంతా తెలంగాణయే. ఆయన రచనలు ప్రపంచవ్యాప్తంగాప్రసిద్ధి చెందాయి. ఆంగ్లంలోకి అనువదింపబడి పాశ్చాత్య పాఠకులను సైతం ఆకర్షించాయి. ప్రసిద్ధ ఆంగ్ల, ఫ్రెంచీ, జర్మనీ భాషల రచయితల రచనలతో ఎంతగానో ప్రభావితం చెంది, సార్వత్రిక భావజాలాన్ని తన రచనల్లో ప్రతిబింబించారు. 1991 లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి "కేశవరెడ్డి - అడవి ఉప్పొంగిన రాత్రి-రాజకీయ సాంఘిక విశ్లేషణ" అనే అంశంపై ఎస్.కాత్యాయని పరిశోధన చేసి పట్టా పొందారు.

బి.యస్.రాములు సాహిత్యం, రచనల మీద మహిళా పరిశోధకులు పరిశోధనలు చేశారు. ఎం.లలిత 2008 లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో "బి.యస్.రాములు బతుకుపోరు" నవల పరిశోధన, ఎన్.నిర్మలకుమారి 2010 లో "బి.ఎస్.రాములు కథలు: సామాజిక పరిణామాలు" అనే అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పరిశోధన చేశారు. బి.ఎస్.రాములు రచనల్లో విశ్వపరిణామాలు స్థానిక-ప్రాదేశిక జీవన అస్తిత్వ రూపురేఖలనుఏ విధంగా ప్రభావితం చేస్తాయో తెలుస్తుంది.

విమర్శారంగం మీద కూడా తెలంగాణ మహిళా పరిశోధకులు విస్తృత పరిశోధనలు చేశారు. విమర్శారంగం చాలా పటిష్ఠమైంది. భారతీయ సాహిత్యం అలంకార శాస్త్రాల మీద, సౌందర్యశాస్త్రం మీద సమీకృత దృష్టిని ఏర్పరుచుకొని వెలువడింది. శాస్త్రబద్ధమై పండితవశమైన విమర్శారంగం మహిళలకు ఒక నికష అని చెప్పవచ్చు. కాని "కోవెల సంపత్కుమారాచార్య వాఙ్మయసూచి" అనే అంశంపై వై.కాంతమ్మ 2000 సంవత్సరంలో హైదరాబాదు విశ్వవిద్యాలయంలో పరిశోధన చేశారు. సంపత్కుమారాచార్య సాహిత్యమంతా విమర్శా సిద్ధాంతాల పై ఆధారపడి ఉంటుంది. కావ్య సిద్ధాంతాలు, కావ్య నిర్మాణం, కావ్య శరీరం, కావ్యాత్మ, కావ్యరీతుల మీదనే గాక ఆధునిక విమర్శా సిద్ధాంతాలను కూడా పరిశోధకులు అనుశీలించాల్సి ఉంటుంది. వై.కాంతమ్మ పరిశోధన అమూల్యమైంది.

"ఇల్లిందల సరస్వతీదేవి జీవితం - పరిశీలన" అనే అంశంపై సి.హేమ 1993 లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో; "డా.పి.యశోదారెడ్డి కథలు-సమగ్ర పరిశీలన" అనే అంశం మీద ఎ.సుజాత 2007 లో కాకతీయ విశ్వవిద్యాలయంలో; "పోల్కంపల్లి శాంతాదేవి - నౌకా గమనం" అనే అంశం పై జి.రజిని 2007 లో కాకతీయ విశ్వవిద్యాలయంలో పరిశోధనలు చేశారు. మహిళా రచయితల రచనలు, వారి జీవనరేఖలను పరిశోధనకు ఎంచుకొని పరిశీలించడానికి మహిళా పరిశోధకులు మక్కువను ప్రదర్శించారు. పరిశోధనారంగంలో మహిళా రచయితల రచనలను సుస్థిరం చేశారు.

రచయితల రచనలనే గాక, తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వం మీద, తెలంగాణలో వెలసిన వివిధ సాహిత్య ప్రక్రియల మీద తెలంగాణ మహిళా పరిశోధకులు పరిశోధనలు చేశారు. 1990 లో కాకతీయ విశ్వవిద్యాలయంలో బి.ఎస్.కామేశ్వరి "తెలంగాణ పోరాట నాటకాలు" అనే అంశం మీద పరిశోధన చేశారు. 1992 లో హైదరాబాదు విశ్వవిద్యాలయంలో ఎం.ఉదయ "తెలుగు నవలల్లో తెలంగాణ జన జీవితం" అనే అంశం మీద, 2005 లో తెలుగు విశ్వవిద్యాలయంలో టి.దేవకీదేవి "తెలంగాణ విమోచనోద్యమ నవలలో స్త్రీ చైతన్యం" అనే అంశంపై, 2009 లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వింధ్యవాసిని "తెలంగాణ సాయుధ పోరాటం - బందూక్ నవల" అనే అంశం మీద పరిశోధనలు చేశారు. తెలంగాణ నాటక, నవలా సాహిత్యాల మీద మహిళలు చేసిన పరిశోధనలు ఇవి. తెలంగాణ పోరాటాన్ని, ఉద్యమాన్ని ప్రతిబింబించే రచనలు ఇవి. ఇవి స్త్రీలు చేసిన పరిశోధనలు కాబట్టి పోరాట స్త్రీల గురించి, స్త్రీల చైతన్యం గురించి, జన జీవితం గురించి విపులంగా విశ్లేషించారు.

ఇక తెలంగాణ కథానిక, కవిత్వం విషయానికి వస్తే; 2011 లో కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎ.విద్యాదేవి "ఉత్తర తెలంగాణ కథలు - సమగ్ర పరిశీలన" (1970–2000) అనే అంశం మీద, 2007 లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పి.అనురాధ "జూలూరు గౌరీశంకర్ ముండ్లకర్ర–ఒక పరిశీలన" అనే అంశం మీద పరిశోధన చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 2009 లో ఎం.గీతావాణి "తెలుగు వచన కవిత: తెలంగాణ ప్రాంతీయ స్పృహ" అనే అంశం మీద, 2011 లో హైదరాబాదు విశ్వవిద్యాలయంలో బి.స్వరూప "తెలంగాణ కవిత్వంలో ప్రాంతీయ చైతన్యం" అనే అంశం మీద పరిశోధన చేశారు. ముఖ్యంగా తెలంగాణ కథల మీద సమగ్ర పరిశీలన చేయడమే గాక ఒకే కథా సంపుటిని గ్రహించి పరిశోధనలు జరిగాయి. మహిళలకు కథా పఠనం ఎక్కువ. అంతేకాక మన భారతీయ సమాజంలో మాతృమూర్తులే తమ పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దే సంప్రదాయం ఉంది. అందుకే మహిళా పరిశోధకులు కథా సాహిత్యాన్ని పరిశోధనకు ఎంచుకోవడం స్వభావరీత్యా అనువైంది. అస్తిత్వ భావజాలం వ్యాప్తి వల్ల, సహజ ప్రాదేశిక ఉద్యమ లక్షణాల వల్ల ప్రాంతీయ స్పృహ, ప్రాంతీయ చైతన్య కాంతిరేఖల మీద పరిశోధనలు చేశారు.అత్యాధునిక కవిత్వంలో పొడ సూపిన సామాజిక–సాంస్కృతిక వైవిధ్య నిర్మాణాన్ని ప్రాంతీయతను పరిశీలించారు.

కొందరు తెలంగాణ మహిళా పరిశోధకులు భక్తి, ఆధ్యాత్మికతల మీద పరిశోధనలు చేశారు. అందులో1998 లో బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో "తెలంగాణ స్త్రీవాద నవలల్లో సాంఘికోద్యమం" అనే అంశం మీద, 2001 సం॥లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కె.లావణ్య "ఆర్య సమాజ సాహిత్యం - మహిళాభ్యుదయం" అనే అంశం మీద, 2005 లో తెలుగు విశ్వవిద్యాలయంలో షాజహానా "ముస్లింవాద కవిత్వం - వస్తురూప వైవిధ్యం" అనే అంశం మీద, 2000 లో కాకతీయ విశ్వవిద్యాలయంలో కె.రూత్‌మేరి "ఆధునిక తెలుగు సాహిత్యంపై క్రైస్తవ ప్రభావం" అనే అంశం మీద, 2008 లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో టి.శ్రీదేవి "తెలుగు వార పత్రికలు" అనే అంశం మీద, 2009 లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కె.సునీత "తెలుగులో స్వాతంత్ర్యానంతర భక్తి పత్రికలు" అనే అంశం మీద విస్తృతమైన పరిశోధనలు చేశారు. సామాజిక సేవలో ఆర్యసమాజం కృషి అనన్యసామాన్యమైంది.ధ్యానం, యోగ, ఆధ్యాత్మిక, భక్తి భావాలు ఆర్య సామాజికులను ఎంతగానో ప్రభావితం చేశాయి. సంస్కృతి సంకీర్తనకు ఆర్యసమాజం ఎంతగానో చేయూతనందించింది. తెలంగాణలో తన సేవను విస్తృతపరచడంలో

ఆర్యసమాజం సఫలీకృతం అయింది. పత్రికల మీద, భక్తి పత్రికల మీద కూడా మహిళా పరిశోధకులు పరిశోధనలు చేశారు. ఇంటి పనితోనే తీరిక లేని మహిళలు పత్రికలను చదివి విశ్లేషించడం, పరిశోధన చేయడం ముదావహం. వివిధ వాదాలను శీర్షికలుగా ఎంచుకొని పరిశోధనలు చేశారు. స్త్రీవాదం, ముస్లింవాదంలో తెలంగాణ మహిళా పరిశోధకులు పరిశోధన చేసి మౌలికంగా అస్తిత్వవాదాల్లో వచ్చిన పరిణామాలను గుర్తించారు. స్త్రీవాద, ముస్లింవాదాల్లో వచ్చిన చైతన్యం. జీవన పోరాటం, స్వేచ్ఛ, భావప్రకటన వంటి విషయాలను పరిశీలించారు. అందువల్ల క్రైస్తవమతం తెలుగు సాహిత్యంపై పాక్షిక ప్రభావాన్ని చూపింది. ఈ అంశాన్ని ఎన్నుకొని మన తెలంగాణ మహిళా పరిశోధకులు పరిశోధనలు చేశారు.

తెలంగాణ మహిళా పరిశోధకులు జానపద వాఙ్మయంలో కూడా పరిశోధనలు చేయడానికి మక్కువ చూపినట్లు తెలుస్తుంది. జానపద సాహిత్యంలో మౌఖికమైన గేయాలు, కథలేగాక లిఖిత సాహిత్యాన్నీ పరిశోధనలకు ఎంచుకున్నారు.

మొదటగా జానపద గేయాలను తెలంగాణ మహిళా పరిశోధకులు వివిధ విశ్వవిద్యాలయాలలో ఎటువంటి పరిశోధనాంశాలను ఎంచుకొని పరిశీలించారో గమనిద్దాం. కాకతీయ విశ్వవిద్యాలమంలో 1987 లో కె.రత్నమాల "జానపదుల భాగవతం పాటలు– ఒక పరిశీలన" అనే అంశం మీద, 1993 లో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో డి.రాజశ్రీ "రంగారెడ్డి జిల్లా జానపదగేయాలు – ఒక పరిశీలన" అనే అంశం మీద, 2003 లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బి.సుజాత "తెలంగాణ బతుకమ్మ పాటలు–పౌరాణిక, సామాజిక, సాంస్కృతిక, భాషా పరిశీలన" అనే అంశం మీద, "తెలుగు తాత్విక గేయాలు: సాంస్కృతిక దృక్పథం" అనే అంశం మీద ఉస్మానియా విశ్వవిద్యాలయులంలో కె.గీతాశ్రీ, అదే ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జి.తిరుపతమ్మ 2009 లో "మహబూబ్‌నగర్ జిల్లా జానపద వ్యావసాయిక గీతాలు" అనే అంశం మీద, 2010 లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎన్.కల్పన "నల్లగొండ జిల్లా ఉయ్యాల పాటలు – ఒక పరిశీలన" అనే అంశం మీద పరిశోధనలు చేశారు. 50 సంవత్సరాలకు పూర్వమే పరిశోధనారంగంలో మహిళలు విశేషంగా పాల్గొనడం ఆశ్చర్యం కలిగిస్తుంది. తెలంగాణ ప్రాంతం భౌగోళికంగా, చారిత్రకంగా ఎంతో వెనుకబడిన ప్రదేశం. ఇటువంటి పరిస్థితులలో కూడా మహిళా పరిశోధకులు తమ పరిశోధనా లక్ష్యాలను, తమ వ్యక్తిగత భావ స్వేచ్ఛను ప్రదర్శించగలిగారు. ప్రాంతీయ పరిశీలన, క్షేత్రస్థాయిలో గల విలువైన సమాచారాన్ని రికార్డు చేశారు. ఒక విధంగా పరిశోధన సాంస్కృతిక జానపద

విజ్ఞానానికి తోడ్పడటంలో వీరికృషి గణనీయంగా ఉంది. జానపద గేయాల పరిశీలనను ఎక్కువగా ఎంచుకోవడంలో మహిళా పరిశోధకుల అభిరుచి అభివ్యక్తమౌతుంది.

వి.శ్రీదేవి కాకతీయ విశ్వవిద్యాలయంలో 1991 లో "వరంగల్లు జిల్లా జానపద కథలు - సాంఘిక జీవనం" అనే అంశం మీద, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎం.సుబ్బలక్ష్మి 1994 లో "తెలుగు జానపద సాహిత్యం పౌరాణిక గేయ కథలు" అనే అంశం మీద, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎన్.పార్వతమ్మ 1995 లో "యక్షగానము -భాగవత కథలు" అనే అంశం మీద పరిశోధనలు చేశారు.

జానపద పరిశీలనలో మహిళా పరిశోధకులు గ్రామ చరిత్రలను, గ్రామ నామాలను, గ్రామ దేవతలను అంశాలుగా ఎన్నుకోవడం సాహసమే. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 1983 లోనే "నల్లగొండ జిల్లా గ్రామదేవతలు" అనే అంశం మీద ఎం.ఫిల్ పరిశోధనాంశాన్ని, అదే విధంగా 1989 లోనే ఉస్మానియా విశ్వవిద్యాలయంలో "జానపద వాఙ్మయంలో శక్త్యారాధన" మీద పిహెచ్.డి పరిశోధనాంశాన్ని ఎన్నుకొని పరిశీలించారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 1991 లో కె.వాణీకుమారి "కైఫీయత్తులు-చారిత్రక పౌరాణికాంశాలు" అంశం మీద, అదే ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి 1998 లో టి.విజయలక్ష్మి "ఖమ్మం జిల్లా గ్రామనామాలు" అనే అంశం మీద, 2000 లో ఎం.ఇందిరాదేవి "మహబూబ్‌నగర్ జిల్లా గ్రామ దేవతలు - ప్రత్యేకత" అనే అంశం మీద పరిశోధనలు చేశారు. పూర్తిగా క్షేత్రస్థాయిలో పరిశోధనలు చేయవలసిన అంశాలు ఇవి. మహిళలు అయివుండి వివిధ ప్రదేశాలు తిరిగి సమాచారాన్ని ప్రోగు చేసుకోవడం విశేషం. గ్రామనామాలు అనేవి ఆయా గ్రామ చరిత్రలపై ఆధారపడి ఉంటాయి. మహిళా పరిశోధకులు గ్రామ పెద్దలను కలిసి గ్రామానికి ఆ పేరు ఎలా వచ్చిందో విషయాన్ని సేకరించడం కష్టతరమైన పని. అటువంటి విషయాలలో, పరిశోధనల్లో విజయం సాధించారు మన మహిళా పరిశోధకులు.

దేవాలయ చరిత్రలు, విశేషాలు, తీర్థక్షేత్రాల స్థల పురాణాలు జానపద లిఖిత ఆధారాలు. జిల్లా వారిగా దేవాలయాలను, వాటి సాహిత్య సాంస్కృతిక అంశాలపై పరిశోధనలు చేసినవారు ఉన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 2006 లో కె. హేమలత "నల్లగొండ జిల్లా దేవాలయాలు - సాహిత్య సాంస్కృతిక

విశేషాలు" అనే అంశం మీద, 2007 లో పి.రాధికాదేవి "తెలుగు సాహిత్యం- శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి" అనే అంశంపై, 2011 లో ఎ.రాజమల్లమ్మ "పాలమూరు జిల్లా తీర్థక్షేత్రాల సాహిత్యం - సమగ్ర పరిశీలన" అంశం మీద పరిశోధనలు చేశారు. జానపదులకు భక్తి, ఆధ్యాత్మిక, తాత్విక చింతన ఎక్కువ. జానపద పరిశోధనాసక్తి కలిగిన మహిళా పరిశోధకులు దేవాలయ, దేవతామూర్తుల మహిమాన్విత గాథలను, వాటి సాంస్కృతిక నేపథ్యాలను గూర్చి పరిశీలించారు.

శాసనాలు పురాతన చారిత్రక ఆధారాలు. చరిత్రతో పాటు రాజకీయ, సాంస్కృతిక, సాంఘిక, కళారాధన వంటి విషయలెన్నింటినో సమగ్రంగా తెలుసుకోవడానికి అనువైనవి. ఉస్మానియా విశ్వవిద్యాలయలంలో 2004 లో బి.మనోహరి "ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు" అనే అంశం మీద, ఉస్మానియా విశ్వవిద్యాలయలంలో 2004 లోనే జి.ఇందిర "పాలమూరు జిల్లా శాసనాలు ఐతిహాసిక సాంస్కృతిక అధ్యయనం" అనే అంశం పై పరిశోధనలు చేశారు. తెలంగాణ పాలకులు, వారి పరిపాలనా విశేషాలు, విజయయాత్రలు వంటి విషయాలను మహిళా పరిశోధకులు సమగ్రంగా పరిశీలించారు.

గిరిజన సాహిత్యం మీద పరిశోధనలు జరిగాయి. ఎన్నో తరాల నుంచీ నాగరికత కు దూరంగా తమ నమ్మకాలకు ఆచార వ్యవహారాలకు కట్టుబడిన కొండాకోనల్లోని గిరిజన జీవన విధానం మీద, భాషా శైలి మీద ప్రత్యేక పరిశోధనలు చేయడంలో మహిళలు ఆసక్తి చూపారు. ఇందులో తెలుగు విశ్వవిద్యాయలం నుంచి 2005 లో ఎన్.వైజయంతి "ఖమ్మం జిల్లా గిరిజన సాహిత్యం స్త్రీ" అనే అంశం మీద, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి 2006 లో డి.సూర్యాధనంజయ్ "నల్లగొండ జిల్లా బంజారా సాహిత్యం- జీవన చిత్రణ" అనే అంశం మీద, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచే 2008 లో బి.స్వరూప "ఖమ్మం జిల్లా గిరిజన విజ్ఞానం" అనే అంశం మీద పరిశోధనలు చేశారు. జాతరల విషయానికి వస్తే కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి 2002 లో డి.అంజనీదేవి "సమ్మక్క సారలమ్మ జాతర - సాహిత్య సాంస్కృతిక అంశాలు" మీద పరిశోధనలు చేశారు. ఇటువంటి అంశాన్ని ఎన్నుకోవడానికి గిరిజన మహిళలే ఎక్కువ ఆసక్తిని చూపడం గమనించదగ్గ విషయం. సమ్మక్క - సారలమ్మ గిరిజన స్త్రీ జాతికి ఆదర్శప్రాయం. ధైర్య సాహసాలు ప్రదర్శించి వీరోచితమైన పోరాటం చేసిన వనితలుగా నిలిచిపోయారు. వారి జాతరకు సంబంధించిన పరిశోధన చేయడం తెలంగాణ ఆత్మగౌరవ సూచికగా భావించవచ్చు. గిరిజన సాహిత్యంలో ముఖ్యంగా బంజారాలకు సంబంధించిన గేయాలు, కథలు,

సామెతలు, దేవతలు, ఆచారాలను ఎక్కువగా పరిశోధనకు ఎంచుకున్నారు తెలంగాణ మహిళా పరిశోధకులు. బంజారాలు ఎక్కువగా తండాలలో జీవించడం, గ్రామాలకు-తండాలకు మధ్య పరిపాలనా సౌలభ్యం ఉండటం వల్ల వారి జీవనం జానపదులకు అత్యంత సుపరిచితం. సన్నిహితం కూడా.

పల్లెలు పట్టణాలుగా నగరీకరణం చెందుతున్న ఈ సమయంలో నగరాలలో జానపదుల జీవనశైలిని, అక్కడ వెలువడుతున్న జానపద సాహిత్యాన్ని పరిశీలించారు. తెలుగు విశ్వవిద్యాలయం నుంచి 1998 లో కె.విజయలక్ష్మి "జంట నగరాలలో జానపద స్త్రీ దేవతలు" అనే అంశం మీద, 2007 లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఐ.జ్యోత్స్నాదేవి "జానపద సాహిత్యం నగరీకరణ" అనే అంశం మీద పరిశోధనలు చేశారు.

తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం పూర్తిస్థాయిలో విశ్వవిద్యాలయాలు తెలంగాణ అంశానికే ప్రముఖమైన స్థానం అందిస్తున్నాయి. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో చేసే పరిశోధనలకే అవకాశం కల్పిస్తున్నాయి. పరిశోధనలు చేసే విద్యార్థి పరిశోధకులకు యుజిసి నుంచి మంచి స్కాలర్‌షిప్‌లు, పారితోషికాలు అందిస్తున్నారు. పరిశోధనావకాశంగా యుజిసినెట్/జెఆర్ఎఫ్/ఆర్‌జిఎన్ఎఫ్/ఎమ్ ఎ ఎన్ ఎఫ్/ నాన్ నెట్ స్కాలర్‌షిప్ అందుబాటులో ఉన్నాయి. హేతుబద్ధమైన పరిశోధనలు చేయడానికి విశ్వవిద్యాలయాలు సరియైన పరిస్థితులు కల్పించడానికి ప్రయత్నిస్తున్నాయి. యుజిసియే గాక వివిధ ఇతర పరిశోధనా సంస్థలు, ప్రభుత్వ - ప్రభుత్వేతర పరిశోధనా కేంద్రాలు తమ సహకారాన్ని అందిస్తున్నాయి. మహిళల ఉన్నత విద్యాశాతం గణనీయంగా పెరిగిన కారణంగా పరిశోధనా రంగంలో అడుగుపెట్టే మహిళల శాతం కూడా పెరిగింది. తెలంగాణ నవ నిర్మాణంలో ఇంతవరకు పరిశోధనలు చేసిన, ప్రస్తుతం పరిశోధనలు చేస్తున్న తెలంగాణ మహిళా పరిశోధకుల కృషి ఎక్కువగా ఉంది. తెలంగాణ సర్వతోముఖాభివృద్ధిని సాధించడంలో వివిధ పరిశోధనలే కీలక భూమిక వహిస్తాయనడంలో అతిశయోక్తి లేదు.

* * *

తెలంగాణ ఉద్యమం - కవయిత్రుల కవిత్వం



డా. కొండపల్లి నీహారిణి

తెలంగాణ అభ్యుదయభావాలగని. తెలంగాణ విప్లవ చైతన్యవీరులు పూసేతోట. తెలంగాణ పండువెన్నెల్లో నవ్వించే అమాయక చక్రవర్తి. ఈనేల మీదా గిరులూ, తరులూ ఇక్కడి ఈ అస్తిత్వాన్ని చూసి తలెత్తుకొని ధీటుగా నిలుచుంటవి. ఈనేల ఎంత విశిష్టమైందో ఇక్కడి మనుషులూ అంతే విశిష్టమైనవారు. తెలంగాణ విభిన్న భావసమ్మేళనాల జీవన సముదాయం.అందుకే ఇక్కడి చెట్టు, పుట్టా కవిత్వమై ఎలుగెత్తుతుంది. ఇక కవులకేం కొదువ ? కవయిత్రులకే కొదువని. సమరమే స్వరజతులై పాటనెత్తుకున్న నేపథ్యం. పోరాటాలు వెల్లువెత్తిన రథ సారథ్యం. పల్లె పల్లె పాటల ఊటలుగా, కవితల ఉప్పెనగా, జానపద కళారూప విన్యాసాలు సాహసాలుగా అయ్యి తెలంగాణ నేలపై చెలరేగినవి. ఇక కవిత్వ సంపదకేం తక్కువ? 1930 వ దశకం నుండిఅంతులేని దుఃఖాన్ని గుండెల్లో దాచుకునే జీవించింది. భూత భవిష్యత్ వర్తమానాల చిత్రపటం కళ్ళెదుట నిలిచి కవిత్వంగమొలిచి ప్రతి తెలంగాణవాది కంఠాన పాటల దండై మాటల మౌక్తికాలై ఎట్టి పరిస్థితులనైనా నిలదొక్కుకోవాలన్న స్ఫూర్తినిచ్చింది కవిత్వమే! పోరాటగీతాలనాలపించి ప్రత్యేక తెలంగాణ ఉద్యమకాలంలో గళాలెత్తడానికి స్ఫూర్తి ఆనాటి రైతాంగ పోరాటాలు, కార్మిక పోరాటాలు, కమ్యూనిస్టుల పోరాటాలు, రజాకార్ వ్యతిరేక ఉద్యమం మొత్తం తిరుగుబాటు చేయడం నేర్పిస్తే గ్రామగ్రామాన 'సంగం' ఏర్పడి బీదాబిక్కీ ముసలీముతక, స్త్రీలు, పురుషులు, పిల్లలు అంతా ఏకమై నిరంకుశత్వాన్ని ఎదిరించిన వైనం బహుశా ప్రపంచ పోరాటాలలో ఒక్క తెలంగాణనే ఉదాహరణగా నిలుస్తుంది కావచ్చు.

భారతదేశం మొత్తం స్వాతంత్ర్య పోరాటాలు చేస్తున్న తరుణంలో ఇక్కడ తెలంగాణలో నిజాం ప్రభువుపాలన ఉండేది. దేశ శత్రువులైన బ్రిటిష్‌వారితో రాజు ఒప్పందం కుదుర్చుకోవడం వలన బ్రిటిష్‌వారి దౌర్జన్యాలిక్కడ లేవు.కాని మరో తీరులో స్వతంత్రత లేని ఈనేల బ్రతుకు పోరాటాలబాట పట్టింది. గ్రామాల్లో

జమీందార్ల పాలన, జాగీర్దారీ, భూస్వామ్యావ్యవస్థ ఓవైపు, నిజాం నిరంకుశ పాలన ఓవైపు అసహాయస్థితిలో ప్రజలు అల్లాడిపోతున్నప్పుడు నాయకులంతా ఏకమై నడుంకట్టారు. వెట్టిచాకిరి నిర్మూలనకై, అధికపన్నుల నిర్మూలనకై ప్రజల స్వేచ్ఛా జీవితాలకై పోరాడారు. బ్రిటిష్ ఇండియాతో పోలిస్తే తెలంగాణ ఎంతో వెనకబడి ఉండేది. దాదాపు 200 ఏళ్ళ ఆసఫ్జాహి వంశపాలన వలన మతం ఓ పెద్ద గుదిబండై కూర్చుంది. ఫ్యూడల్ విధానాన్ని అనుసరించే రాజ్యపాలన, గ్రామపాలన ఉండేది. రాజభాష ఉర్దూను ప్రజలపై రుద్దడంతో స్థానికతకు నష్టం వాటిల్లింది. తెలుగు ప్రజలైన తెలంగాణ ప్రజలకు విద్య అనేది కరువైపోయింది. మాతృభాష పై మమకారం వీడలేక పరభాషపై ఆసక్తిని పెంచుకోలేక ప్రజలు ఎంతో సతమతమయ్యేవారు. ఈ క్రమంలో ఎన్నో సంస్థలు ఏర్పడ్డాయి, ఎందరో నాయకులు ముందుకు రావడం పోరాటాలు చేయడంతో జరుగుతున్న అన్యాయమేంటో ప్రజలు గుర్తించడం ప్రారంభించారు. ఆర్య సమాజం, ఆంధ్ర మహిళాసభ, జాతీయోద్యమాలు జరిగిన నేపథ్యంలో మినుకు మినుకుమంటూ ఎక్కడో ఓదగ్గర తెలుగు పత్రికలు రావడంతో పరిస్థితులు కొంత ఆశాజనకంగా ఉండేవి. ప్రజాచైతన్య వికాసానికి 'గోల్కొండ', 'తెనుగు', 'నీలగిరి', 'సుజాత' 'శోభ' వంటి పత్రికలు వెలువడినవి. కథలు, నవలలు, నాటికలు, గేయాలు, కవితలు ప్రజలను ఆలోచనాపరులను చేస్తుండేవి. క్రమంగా స్వాతంత్ర్య పోరాటాలు ముమ్మరమైన వేళ నాయకులు చేసిన పోరాటాలన్నీ ఒక్కొక్కటి ఒక్కో విధమైన మార్పును తీసుకొచ్చినవి. గ్రంథాలయోద్యమం ఈ వికాసదశకు ప్రాణవాయువుగా నిల్చింది. భారతదేశానికి స్వాతంత్ర్యం లభించింది గాని హైదరాబాద్ రాజధానిగా ఉన్న ఈ స్టేట్ మొత్తం ఇనుప పిడికిళ్ళలో బందీగానే ఉన్నది. అదిగో అప్పటి నుండే తెలంగాణ కోసం గళాలెత్తారు కవులు. కవిత్వం ఒకధార ! అది కవితాపిపాసను తీరుస్తుంది, చైతన్యాన్ని రగిలిస్తుంది. ఉద్యమాలకు కవిత్వానికీ అవినాభావ సంబంధమున్నది. ఇక కవిత్వంలో కవయిత్రులు ఎంతటి పాత్ర వహించారో గ్రహించాలంటే క్లుప్తంగా ఒక సాహితీ పరిశీలన చేయాల్సిందే.

రజాకార్ల దురాగతాలను ఖండిస్తూ, వారి పాశవిక దాడికి దద్దరిల్లిన భైరాన్‌పల్లి ఉదంతానికి కన్నీరు కారుస్తూ ఇట్లా 'నల్లగొండలో నాజీవృత్తుల' ప్రశ్నించినట్లే, "మన కొంపలార్పిన మన స్త్రీల చెరిచిన/ మన పిల్లలను చంపి మనల బంధించిన మానవాధములను, మండలాధీశులను/ మరచిపోకుండ గురుతుంచుకోవాలె/ కసి ఆరిపోకుండ బుసకొట్టుచుండాలె/ కాలంబురాగానె కాటేసితీరాలె" వంటి కవిత్వం ఉద్యమకారుల కసికి తోడైంది. 1948 సెప్టెంబర్‌లో తెలంగాణ తన స్వాతంత్ర్యాన్ని

సాధించుకోవడానికి ఉద్యమాలెంతో ముఖ్యమైనవయ్యాయి. కేంద్రం జోక్యం చేసుకోవడం, సైనికచర్య చేయడంతో నిజామైతే లొంగిపోయాడు కానీ కమ్యూనిస్టులను తిరుగుబాటుదారులను, అమాయక ప్రజలనెందరినో పొట్టన బెట్టుకొని, నిర్బంధ స్వేచ్ఛను ప్రకటించింది కేంద్రం. ప్రజాపీడన, ప్రజాదోపిడిగా మార్చే దొరలు, పెత్తందార్లు మరోరూపంలో విజృంభించి పాలనరంగం సిద్ధం చేసుకున్నారు. 1952 లో ఎన్నికలు జరగడం ఒక ప్రజాస్వామ్య పరిపాలనలో ముఖ్యభాగమే ఐనా సాధించుకున్న స్వాతంత్ర్యమెంత అని ప్రశ్నించుకుంటే, పరిశీలిస్తే నిజానిజాలు తేటతెల్లమైపోతాయి. గెలుపు ఓటములు ముఖ్యం కాదు. చాపక్రింద నీరులా ప్రవేశించిన ఆంధ్ర పెత్తందార్ల నుండి, వారికి కొమ్ముకాసిన జాతీయ నాయకుల నుండి తెలంగాణ తేరుకోలేకపోయింది. ఆ పాలనలోని పైపై మెరుగుల తెలుగుజాతి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కెంతటి ద్రోహం చేస్తుందో తెలుసుకోలేకపోయింది. ఏర్పడకుండా జరిగిన ఈ దోపిడిని కాలమే తెలియజేసింది. ఫలితంగా 1969 ప్రత్యేక తెలంగాణ పోరాటం తప్పనిసరైంది. ఒప్పందాలను నీరుగార్చి నీళ్లు, నిధులు కొల్లగొట్టిన రాజకీయాల్ని నిలదీసింది కవిత్వం. ఉద్యోగాలన్నీ దోచుకున్న వైనాన్ని నిలదీస్తూ ఉజ్వలమైన ఉద్యమాలు వచ్చాయి. భాషాప్రాతిపదిక రాష్ట్రంగా ఏర్పడిన రాష్ట్రాన్ని ఎట్లా విడగొడ్తామనీ, తెలుగు వారొక్కటేననీ మసి బూసి మారేడుకాయజేసిన ఆ సందర్భాలన్నీ ఖండిస్తూ కవిత్వం వెల్లువెత్తింది. ఎందరో కవులు తెలంగాణ కొరకు నడుంకట్టిన నాయకులకు తమ కలాల్ని ఆసరచేశారు. ఉద్యమగీతాలు ప్రజలనోళ్ళల్లో ఆడుతూ ఎర్రబావుటాలై, వజ్రాయుధాలై సమరగీతాలాలపించాయి.

ఎంతో గొప్ప రాజకీయ చరిత్ర ఉన్నా, ఎంతో గొప్ప సాహిత్యం ఉన్నా సంస్కృతీ సంప్రదాయాల నేపథ్యమున్నా ప్రాంతేతరుల చేతలతో తెలంగాణ వచ్చినట్టే వచ్చి చేజారిపోయింది. ప్రభుత్వ నిర్బంధ విధానాలను, కాలరాసే సంస్కృతినీ ఎదుర్కొంటూ భాషయాసకోసం తెలంగాణ తల్లి బిడ్డలై కవులంతా కవనమల్లారు. ఉద్యమసాహిత్యమంతా కూడా దిశానిర్దేశం చేస్తున్నప్పుడు సాహిత్యాభిమానమున్న ఆనాటి కవులను తలవని వారులేరు. ఏ విశ్వవిద్యాలయంలోనైనా, ఏ కళాశాలలోనైనా గొంతు సవరించిన విద్యార్థులు కవిత్వం ఎత్తకుండా మాట్లాడలేదు. ప్రఖ్యాతి చెందిన కవిత్వ పంక్తులను ఉటంకిస్తూ మాట్లాడడం, వ్రాయడంతో కోటి రతనాలవీణై గర్జించింది తెలంగాణ. ఇంతగా ప్రభావితం చేసిన 'కవిత్వం' తెలంగాణ ఆడపడుచులనూ, రచయిత్రుల్నీ కదిలించదా, తెలంగాణ భాష, యాస,! సంస్కృతి ఎట్లా ధ్వంసమైపోయిందో ఆలస్యంగానైనా గుర్తించి తెలంగాణలో అభ్యుదయ భావాలతో, విప్లవ భావాలతో, ప్రగతిశీల భావాలతో స్వేచ్ఛపై వ్రాస్తున్న కవయిత్రులంతా ముందుకొచ్చి పోరాటాల్లో పాల్గొన్నారు.

పూర్వ కవయిత్రులైన మొల్ల, రంగాజమ్మ, ముద్దుపళని, వెంగమాంబ నుండి మొదలుకొంటే బండారు అచ్చమాంబ, ఛాత్రాతి అక్కిమ్మనరసమ్మ, సరోజినీనాయుడు వంటి రచయిత్రులు, కవయిత్రులెందరినో ఉదాహరించవచ్చు. నిబిడాంధకారంలో ప్రజల ఆలోచనలున్నప్పుడు మెరుపుల నక్షత్రాలయ్యాయి కవితలు. సమాజపోకడ, జీవన మార్గంలో నిజనిజాలు తెలుసుకునే దిశలో లోకం నడుస్తుంది. నైతికతను విడనాడక, పితృస్వామ్యంలోనే ఉంటూనే తమ అస్తిత్వాన్ని కోల్పోవద్దని ఆకాక్షించే స్త్రీలు కొందరైతే, పితృస్వామ్యాన్ని ధిక్కరిస్తూ తనేంటో తెలిపే సత్యసంధతను నిరూపించుకోవాలని ఆలోచించే స్త్రీలు కొందరు. ఎవ్వరైనా నాలుగు మంచిమాటలు చెప్తే తమ జీవితాలకు అన్వయించుకునే సగటు స్త్రీజాతి పక్షాన కొందరు కవయిత్రులు కవిత్వం వ్రాశారు. లింగవివక్షను నిరసించడం, జాతి వివక్షను ఎదిరించడం కాలంతోపాటే నేర్చుకున్నది స్త్రీ ప్రపంచం. వివక్ష వివక్షే! ఈ నిజాన్ని గ్రహించడానికి కొంత సమయం పట్టింది. వివక్ష చూపడం దేశానికే చేటు అని గ్రహించడానికి పట్టినకాలం, తెలివి అంతా ప్రాంతీయ వివక్షనూ పసిగట్టగేలా ఎట్లా బీజమైందో స్త్రీవాదం వైపు మాట్లాడేందుకూ కవిత్వం బీజమైంది. ఒక విషయం తెలుసుకుంటే నాలుగురీతుల్లో ఆలోచించి అన్వయించుకునే స్థాయికి వచ్చి, సమాజం ముందుకెళ్తున్న రోజులు. స్త్రీవిద్య, సమానత్వం, ఆర్థిక స్వేచ్ఛ, రాజకీయ రంగప్రవేశం, శాస్త్రీయ విజ్ఞాన వేత్తలుగా ఎదగడం, సామాజికవేత్తలుగా ఎదగడం వంటివన్నీ స్త్రీలలో ఎంతో మార్పు తెచ్చింది. చైతన్యాన్ని రాపిడి చేసినవి, కులవివక్ష, మతకలహాల చిచ్చులేవో గ్రహించేస్థితికి తీసుకొచ్చినవి. ఆచారాల పేరిట జరిగే అజ్ఞాత విధ్వంసాలు అన్నీ తెలిసొచ్చాయి. ఈ క్రమంలోనే మైనారిటీ కవిత్వం, దళిత కవిత్వం ముందుకొచ్చాయి. పదాలు చురకత్తులుగా, భావాలు వెలుగు రేకలుగా కవితల్లో పొదిగారు కవయిత్రులు.

తెలంగాణ ఉద్యమానికి, సాహిత్య అస్తిత్వ సాహిత్య కవిత్వానికి దగ్గరిసంబంధమేర్పడింది. వాడుక భాషకు ప్రాధాన్యమివ్వడం, మాండలికాలను గుప్పించడం, సామాన్యులు, మాన్యులైపోవడం ఇందుకు ఉదాహరణ. ప్రపంచీకరణ విధానం గ్రామీణ వేష భాషలపై అమితంగా ప్రభావం చూపింది. సాధారణ జీవన విధానాన్ని కాలరాస్తున్న నేపథ్యాన్ని జొప్పిస్తూ కవిత్వీకరించడం అలవాటైంది. ఇక అభివ్యక్తిలో కూడ కొత్తదనాన్ని చూపడం, సమకాలీన విషయాలకు ప్రాధాన్యమివ్వడం వంటివి ఆ కవిత్వాల్లో దర్శిస్తాము. వస్తువైవిధ్యాన్ని ప్రదర్శించడం, పటిష్ఠంగా కవిత వ్రాయడం, సమయస్ఫూర్తిని ప్రదర్శించడం గమనిస్తున్నాం. దేశ, విదేశ

సంఘటనలకు తక్షణ స్పందన రావడం, రాజకీయ విషయాలను తడవుడమూ ఇవన్నీ గమనించగలము. ఒక కవిత్వమే కాదు కథానిక, కథ.నవల వంటి ఇతర ప్రక్రియలలోనూ ఈమార్పు వచ్చింది. కవిత్వంలో వచ్చిన అన్ని రూపాలు – నానీలు, హైకూలు, వ్యంజకాలు, వచన కవిత్వం అట్లా రావడం గమనిస్తాం.

ప్రతి ఉద్యమానికి కవిత్వం ఉప్పొంగుతూ సాగుతూనే ఉండడం ఈ మార్పులన్నింటివల్లే ! నక్సల్బరీ పోరాటాలు సృజించిన కవిత్వమంతా పీడిత తాడిత ప్రజాపక్షమే! స్త్రీవాద, మైనారిటీవాద కవిత్వం తమ పరిధిని పెంచుకున్నది. ఈ అన్ని అంశాల్లో అంతర్లీనంగా ఉన్నది తెలంగాణవాదమే, తెలంగాణ అస్తిత్వమే. ఇందుకు కవయిత్రులు వేరుకారు.

ఈ చివరిదశ తెలంగాణ ఉద్యమం యావత్ తెలంగాణను జాగృతపరిచింది. కాని, ఆనాటి కాకతీయగడ్డపై అరివీర భయంకరి, మహాసామ్రాజ్ఞి రాణి రుద్రమదేవి నడయాడిన స్ఫూర్తిని తమ సొంతం చేసుకున్న నేపథ్యం తెలంగాణ వీరనారీమణులది. రుద్రమదేవి మనవడు ప్రతాపరుద్ర మహారాజు యొక్క సామంతరాజును ఎదిరించిన అడవిబిడ్డలు సమ్మక్క సారక్కల ధైర్యాన్ని పుణికిపుచ్చుకున్న ధైర్యం ఇక్కడి స్త్రీ జాతిధైర్యం. భారతదేశంలో అత్యంత ప్రతాపాన్ని ప్రదర్శించిన ఝాన్సీలక్ష్మీబాయి వీరత్వాన్ని, యుద్ధానికి పురికొల్పి ఖడ్గతిక్కనను చిరంజీవిని చేసిన మల్లమ్మధీశక్తిని,నాయకురాలు నాగమ్మ బుద్ధిచాతుర్యాన్ని, స్వాతంత్ర్యపోరాటాల్లో ధైర్యసాహసాలు ప్రదర్శించిన మహిళామణుల విజ్ఞతను, సామాజిక చింతనతో ప్రజాపక్షం నిలిచిన సావిత్రీబాయిపులే ఆదర్శాన్ని తమదిగా భావించిన తెలంగాణ ఆడపడుచులు అన్ని పోరాటాల్లో తమదైన శైలిని ప్రదర్శించినవారే. నిజాం నిరంకుశపాలన నెదిరించిన సందర్భంలో స్త్రీలు తమ వంతు పోరాట సామర్థ్యాన్ని, తమదైనశైలిలో పురుషులకందివ్వడం వల్లనే ఆ ఉద్యమాలన్నీ చేయగలిగారు. కారంపొడేగాదు, కత్తులూ, తుపాకులూ ఈ సున్నితమైన చేతులు ధరించాయంటే అతిశయోక్తిగాదు.

రజాకార్ ఉద్యమంలో పోరాటం చేసిన స్త్రీమూర్తులెందరో తమ ప్రాణాలను పోగొట్టుకున్నారు. ఆ అమరుల త్యాగాన్ని స్ఫూర్తిగా తీసుకొని సంగెం లక్ష్మీబాయి, ఆరుట్ల కమలాదేవి, మల్లుస్వరాజ్యం, పెండ్యాల కౌసల్యాదేవి, కల్వకోటశకుంతల వంటి మహిళలెందరో పోరుబాటపట్టారు. తుపాకులు చేతబట్టి అడవులబట్టిన ఉద్యమకారులు ఆనాటి 'సంగం' నిర్మాతలు. వారి పోరాటనాయకత్వానికి ప్రాణతుల్యమైన ఆడవాళ్ళెందరో పేర్లు తెలియని వీరనారులు. గుట్టపైనా, అడవుల్లోనూ

ఈ నాయకులు రహస్యసమావేశాలు ఏర్పరిస్తే ఆయాదళ సభ్యులందరికీ భోజనసదుపాయాలందించింది ఈ అజ్ఞాత దేశభక్తురాళ్ళే ! కూరగాయలు, పాలుపెరుగు అమ్ముకునేవాళ్ళలా వెళ్ళి ఆహారాన్నందించిన ధైర్యవంతులు. అన్నం, జొన్నరొట్టెలు, సజ్జరొట్టెలు, సంకటి వంటి ఆహారాల్ని ఇచ్చొచ్చెటోళ్ళు. గ్రామాల్లోకి 'సంగం' వచ్చి మీటింగులుపెడ్తే అర్ధరాత్రి, అపరాత్రి అని చూడకుండా వాళ్ళకు బువ్వపెట్టడమేకాదు. దళనాయకుల్ని ఇండ్లల్లోని గుమ్ములక్రింద, గోలేలక్రింద గరిసెల్లల్లో, సామాన్ల దొంతర్లలోనే కాదు అవసరమైతే పక్కబట్టలల్ల కూడా దాచిపెట్టి నిజాం పోలీసుల కళ్ళు గప్పేవారు. ఇట్లా దళనాయకుల్ని , దళసభ్యుల్నీ రక్షిస్తూ ప్రత్యక్షంగానేకాదు పరోక్షంగా సంఘ రక్షకులైన తల్లులెందరో తెలంగాణలో ఉన్నారు. రజాకార్ల అకృత్యాలను వీరోచితంగా ఎదుర్కొన్నారు. విస్నూరుదొరను ఎదుర్కున్న చాకలి ఐలమ్మ తెగువ లోకానికెరుక. ఇదంతా స్త్రీశక్తిగాక మరేమిటి? ఉద్యమాల్లోకి పోకుండా నీరుగార్చే మాటలతో పొడిస్తే మన తెలంగాణ మనం సాధించుకోగలిగేవారిమా?

తెలంగాణ ఉద్యమంలో స్త్రీలంతా ఎట్లా పాల్గొన్నారో, తెలంగాణ కవిత్వంలోనూ కవయిత్రులు అట్లా పంచుకున్నారు. వారి ఆశయం, వారి ఆలోచన, వారి నమ్మకము అంతా కవిత్వమై ఉత్తేజపర్చింది. Beginning is not only a kind of action. It is also a frame అన్నట్లు తెలంగాణ రాష్ట్రం కోసం అహర్నిశలు కష్టపడిన ఉద్యమకారులొకవైపు రాజకీయ ప్రత్యామ్నాయమే తగిన విధానమని పోరాడిన రాజకీయనాయకులొకవైపు, వీళ్ళందరికి గట్టి ఊపునిచ్చిన కవిత్వగానాలొకవైపు. ఇవ్వన్నీ తెలంగాణ మలిదశ ఉద్యమం విజయం సాధించేలా చేశాయి. 1969-71 లో జరిగిన తెలంగాణ ఉద్యమం, 1971-72 జై ఆంధ్ర ఉద్యమాలు ప్రజల ఆలోచనల్ని సానబెట్టినవి. ఎన్ని కుట్రలు కుతంత్రాలు జరిగినా, అడ్డపుల్లలు, తెడ్డు దేరాలు చేసినా ఆగలేదు. తాడిదన్నేవాడుంటే తలదన్నే వాడుంటాడని రుజువు అయ్యింది. ఎన్నెన్నో పోరాటాల ఫలితంగా 2014 జూన్ 2 న మన కలసాకారమై తెలంగాణ రాష్ట్రమేర్పడింది. ఇక్కడి సామాజిక ఆర్థిక, రాజకీయ నేపథ్యాన్ని పురస్కరించుకొని కవిత్వంలో కవయిత్రుల కృషిని విశ్లేషించుకున్నటైతే 1) తెలంగాణ కవయిత్రలు కవిత్వ భాష, యాస 2)తెలంగాణ కవయిత్రుల ఉద్యమ స్ఫూర్తి - కవిత్వం అని విశ్లేషించుకోవాలి. ఎంతోమంది కవయిత్రులు వ్రాసినా కొన్ని ముఖ్యమైన పంక్తులను ఉదాహరించుకుంటూ సాగే ఈ విశ్లేషణంతా తెలంగాణ కవయిత్రుల స్వభావానికి సమగ్ర రూపచిత్రాన్ని చూపినట్లు భావించాలి.

1. తెలంగాణ కవయిత్రుల కవిత్వ భాష, యాస :- తెలంగాణ భాష అంటూ ప్రత్యేకమైన భాషలేదు. కాని చెప్పనలవికాని ఒక ప్రత్యేకత ఉన్న భాష తెలంగాణ తెలుగు భాషది. వైవిధ్యంలో ఏకత్వం సాధించడమే మన సంపత్తి. ఇందుకు తెలంగాణ ఒక గొప్ప ఉదాహరణ. ఇప్పుడున్న పది జిల్లాలలోని ప్రజలయాసలో విభిన్నమైనశైలి ఉంటుంది. అందులోనూ తెలంగాణలోని హైదరాబాద్‌లో భాష మరీ మహత్తరమైనది. ఉర్దూ, తెలుగు సమ్మిళత భాష, ఇంగ్లీషు విద్య ప్రభావం, హిందీ ముక్తాయింపులు, పల్లె పదాల సొగసులు, నుడికారపు సొగసులు, సంస్కృత భాష గాంభీర్యం ఇవన్నీ కలిస్తేనే తెలంగాణ కవిత్వమైంది.

"కొసాకర్న దింపుడుగల్లం ఆశెసుత దిగజారిపాయె
పునాసప్పంటల్ల నోటికందకపోయె, కాని కాలమొచ్చి
కొరకాసుతోని కాల్చిపుండ్లనద్దనీకి పసరాకు జాడసుత
కానరాకపాయె, ఆరుగాలం పబ్బతి బట్టినసేతానం
గంజినీల్లన్న కుతికెదించకబాయె
సాలెనుకసాలు కరువెనుక, కరువు పన్గడలన్నీ మూలకుబడ్డయ్
గొడ్లు గొర్రెన్లు 'కబెల్లకు' తోలుడేనాయె
ఉప్పిఉపాసం ఉండబెట్టలేక బీడువడ్డ చేను చెన్నలిడిసి
ఉచ్చనీఛప్పనులు ఎంకులాడుకుంట ఊళ్ళుబట్టి బత్క బోవడేనాయె.
ఉసురు ముగురు బెట్టి ఉప్పసం లేని బతుకయ్యే" అంటూ అనిశెట్టి 'ఉసురు' కవితలో వ్రాసిందంతా తెలంగాణ యాసలోనే ! వలసలభాషే కరువుకాటకాలను కళ్ళముందించింది. పంటల్లో ఒక పంట పునాసపంట. అది వర్షాధార పంట. వర్షాల్లేక పోవడంతో పంటనోటికందని కాలమొచ్చిందన్న బాధ కొరకాసుబాధలా ఉందన్న భావం. కొరకాసు అంటే కొర్రాయి, కాల్చిన కట్టె. సేతానం అంటే సేద్యం. కుతికె అంటే గొంతు; కబెల్లకు అంటే గొడ్లనుకోసే వ్యాపారకేంద్రం. ఉప్పసం అంటే ఊరట. ఆరుగాలం, పబ్బతి, ఉప్పసం, బత్కబోవుడు వంటి పదాలన్నీ తెలంగాణ ప్రజల వాడుకపదాలు. ఈ యాస తెలంగాణ మననం భాషను తెలుపుతుంది.ప్రత్యేకమైన పదజాలమిది. పాదులుతొవ్వి, నారుబోసి, నీరుబెట్టి పెంచిన యాసగాదు. అట్లా దానంతటదే మొలిచే పచ్చదనమంతటిదీయాస. అందుకే దీన్నే తెలంగాణ భాష అనడం పరిపాటయ్యింది, అలవాటయ్యింది. అంత సహజసిద్ధంగా జాలువారే సహజభాష.

సూరేపల్లి సుజాత "లారీలు తూటాలు తెలంగాణని ఆపలేవు" అనే కవితలో "మానీళ్ళు మీరు తోల్కపోతుంటే/ అంతా మావోల్లే అని మర్యాదగా/ ఊర్కొని మట్టి పని చేసుకునేటందుకు/ మూటముల్లె సర్దుకొని ముంబాయి, దుబై పోయినము నీళ్ళులేక" అంటూ తెలంగాణ నీళ్ళు, ఆస్తులు, ఉద్యోగాలూ దోపిడైపోయిన ఆవేదనను వెళ్ళగక్కుతూ వలసలపాలెందుకైనమో చెప్తాంది. రాష్ట్రసాధన ఎందుకు తప్పనిసరైందో ఇంతకన్నా ఎట్లా చెప్తాం? ఈ 'తోల్కపోతుంటు' అనే పదం ఆంధ్రవారి మధ్య వివాస్పదమైన సందర్భాలూ ఉన్నాయి. మనుషుల్ని తీసుకొనిపోతారు, జంతువుల్ని తోలుకబోతారు అని పిడివాదన. "తోడు తీసుకొని పోవడం" అనేదే క్రమంగా తోల్కబోవుడయ్యింది. క,చ,ట,త,పలైన పరుషాక్షరాల వాడుక కన్నా గ,జ,డ,ద,బ,లైన సరళాక్షరాల ఉపయోగమే తెలంగాణ పల్లెపదాల్లో, వాడుక పదాల్లో గమనిస్తాం. ఇట్లా ఇక్కడి వాడుక భాషను ఈసడించిన వారు అభాసుపాలైన సందర్భాలకు స్పందించిన కవిత్వమిది. 'పోవడం' 'వెళ్ళడం' ఈ రెండు పదాలు కొన్ని అగాధాలను సృష్టించిన మాట వాస్తవం. అందుకే ఒక భాషాపోరాటం జరిపినట్లే అయ్యింది తెలంగాణ వారికి. ఇది ముమ్మాటికీ నిజం.

గోగుశ్యామల 'కాలజ్ఞానం'లో "యాభై ఏండ్ల సమైక్యపాలనల అందినకాడికి మింగింద్రు/భూములను మింగింద్రు/ కొలువులను మింగింద్రు" అంటూ నిజాన్ని నిర్భయంగా చెప్పింది. 'పాలనల' అనే ఈపదం ఇక్కడ 'పాలనలో' అనే పదానికి రూపం. తెలంగాణ పదజాలంలో హ్రస్వాక్షరాలు (పొట్టి అక్షరాలు, ఏకమాత్ర ఉచ్చారణ అక్షరాలు) వాడడం ఎక్కువగా ఉంటుంది. అదే ఈ 'పాలనల' అనేపదం అని చెప్పవచ్చు. అట్లే, 'అందినకాడికి' అనే పదం "అందినదగ్గరికి, అందినవి అందినట్లు" అనే వాడుకకు బదులు వాడింది. ఇదీ ఇక్కడి భాష. ఇకపోతే 'మింగింద్రు' అనే ఈ క్రియాపదం 'మింగినారు' అనే పదానికి బదులుగా వాడబడింది. ఇది చాలా చాలా - సర్వసాధారణమైన ముచ్చట. అట్లే ముఖ్యమైన ముచ్చట. పల్లెవాసులలో బొండుమల్లెలు రాలినంతగ- పలుకుల్లో, చేతల్లో అట్లా ఒదిగిపోయే యాస. వచ్చింద్రు, పొయింద్రు, చేసింద్రు వంటి పదాలిటువంటి క్రియారూప వాడుక పదాలు. శారదాహనుమాండ్లు అనే కవయిత్రి రాసిన 'ఎర్రగాజులు' కవితలో "బగ్గతిన్న బలుపు/ ఎండిన డొక్కలపై మేడకట్టుకున్నది" అనడంలో 'బగ్గ' అంటే 'బాగ' అనీ 'బలుపు' అంటే మదంతో కూడిన బలం అనే అర్థంలో తీసుకొన్నవి, ద్విత్వాక్షరమైన 'గ' ఒక విధమైన అందాన్ని ఇస్తూ 'బా' అక్షరంలోని సత్తువను చూపించుకుంటుంది. ఇక్కడ తెలంగాణ పోరాటానికి కావలసిన సత్తువను అట్లా

వ్యంగ్యంలో ఇరికించింది కవయిత్రి. కొండపల్లి నీహారిణి తన 'గోముఖవ్యాఘ్రాలు' అనే కవితలో "అడిగడిగి గొంతు పూడ్కపోయిన మోటబావైంది./ అయినా నోట్లోకెల్లి ఒక్క మాట రాల్తలేదు" అంటూ తెలంగాణ విషయంపై అప్పుడు పెదవివిప్పని అధినేత్రిని గురించి "నోట్లకెల్లి" అనంటే 'నోటిలోనుండి' అని వాడకుండా వాడుకభాషకు పట్టం కట్టింది. 'ఏది నాతెలంగాణ' ? అంటూ వ్రాసిన తమ్మెరరాధిక కవితలో "న్యాలతల్లి చింపుల బోరాలను కప్పుకుంది./ చిన్న పోరగాల్ల కడుపులు నింపలేక/ సన్న మెతుకుబువ్వ ఎన్నాల్లయిందో తిని మా అవ్వ" అనడంలో ఎన్నో బాధలు భరించిందీ భూమాత అన్న భావం పొడ సూపుతుంది. 'మట్టి నా ఆలాపన' కవితా సంకలనం ప్రచురించిన తన కవిత 'గోరుకొయ్యలు' లో "సుక్కపొడిశినప్పుడు పాశిపనిజేస్కుని శెల్కలకు పోవుడే ఎర్క / పొద్దు పొడిచి బారెడెక్కినంక బెడ్డు కాఫీ అట/ మేమెందుకు నోసుకున్నం." అంటుంది. అలవాట్లు కూడా ఒక్కొక్కరికి ఒక్కో రీతిగా ఉంటాయి. పాదరసంలా పాకిన సినీసంస్కృతి ఎక్కడినుండి వచ్చిందో ఓసారి గుర్తుచేస్తుంది కవిత. శెల్క, ఎర్క వంటి పదగుంఫనచాతుర్యం ఇక్కడ గమనించవచ్చు. ఈయాస తెలంగాణ యాస, అస్తిత్వాన్ని చాటుతుంది.

2) తెలంగాణ కవయిత్రుల ఉద్యమస్ఫూర్తి కవిత్వం :- దాదాపు 2000 సంవత్సరాల నుండి రాజకీయ అంతర్గత కలహాలు ప్రారంభమై పాలకుల వివక్ష క్రమంగా ప్రజలూ గ్రహించేస్థాయికి చేరుకున్నది. ఈ తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష ఒక్కసారిగా పుట్టింది కాదు. కృష్ణ గోదావరి నదుల నీళ్ళు తెలంగాణకు అందకుండా చేయడం, పాఠ్యాంశాల్లో తెలంగాణ చరిత్రను గాని, సాహిత్యాన్ని గాని పెట్టకపోవడం, రాష్ట్ర , కేంద్ర నిధులు సరినిష్పత్తిలో పంపిణీ చేయకపోవడం వంటివెన్నో మేధావులనే కాదు, సామాన్యులనీ కలచివేసినవి. ఇందుకు మీడియా, సోషల్ మీడియా ప్రచారం బాగా దోహదం చేసింది. రాజకీయ నాయకులలో మార్పును తీసుకొచ్చింది. తెలంగాణ అస్తిత్వాన్ని తెలుపుతూ కవితలు రాయడం పరిపాటైంది. 'ఉసురు', 'పొక్కిలి' మత్తడి కవితా సంకలనాల్ని 2002లోనే ప్రచురించడం ఇందుకు గొప్ప ఉదాహరణ. 'ఊపిరి' తల్లిపాలరుణం అనే కవితా సంకలనంలో 'ధిక్కారమై జీవించాలి' అనే శీర్షికలో వ్రాసిన కవితలో అనిశెట్టి రజిత –

"తెలంగాణ గడ్డమీది గడ్డిపోచైనా

ధిక్కార ఆయుధమే, నిరసన పతాకమే"... అంటూనే

మనం గడ్డి ,చిలుకలం, గట్టెనుక గజ్జెల మోతలం

తొవ్వ పువ్వులం నర భాస్కరులం

తెలంగాణ పాటపాడే ధూంధాం కోయిల్లం' అంటూ ధిక్కార స్వరాన్ని వినిపించిన కోయిలైంది. అనిశెట్టి రజిత గాత్రం, మనసు తెలంగాణవశమై వేదికలెక్కినప్పుడు "తెలంగాణ తల్లిని బతికిద్దాం, బతుకమ్మ జాతరలల్ల బతుకు తెలంగాణను ఆవిష్కరిద్దాం", అంటుంది. తెలంగాణ తొలి ఉద్యమం వలె మలి ఉద్యమం కూడా ఎక్కడ నీరుగారి పోతుందోనని యువత ఆగమాగం అయిపోతున్న సందర్భంలో 'అగ్రతలుపుల అల్లాట' అనే కవితలో కొండపల్లి నీహారిణి తెలంగాణ గుండెతలుపులు తెరిచింది. "సోదరా నీకింత గుండెగుబులు?/ గతం గుర్తొచ్చిందా ? అణచిన పోరాటాల పోలికేకలు గుర్తొస్తున్నాయా? / పదవులకో పచ్చనోటుకో అమ్ముడుపోయిన నాటి రాజకీయ విషచ్ఛాయలు నిన్ను ఇంకా వేటాడుతున్నాయా?" అంటూ గత నీలినీడల కతల్ని గుర్తుచేస్తూనే, "అట్లింక జరుగదు గాక జరుగదు/ పది జిల్లాల ప్రజమేల్కొని పోరుబాటకై పిడికిలెత్తింది" అంటూ తొలి ఉద్యమాల్లో ఫెయిల్యూర్స్‌ని, తప్పిదాలనీ ఇక జరగనివ్వదీ తెలంగాణ నవతరం అన్న నమ్మకాన్ని కలగజేస్తూ, ఉస్మానియా, కాకతీయ యూనివర్శిటీ విద్యార్థుల పరంగా ఆలోచన రేకెత్తించి, నమ్మకం కలిగించేలా "తెలంగాణ తల్లి సుభాషిణియై సుమధుర భాషణలు అందిస్తుంది" అని ఆశాభావాన్ని వ్యక్తపరిచింది. కవులు నమ్మకాన్ని పెంచాలి, సాధించుకునే స్ఫూర్తిని పెంచాలి. అందుకు కావల్సిన సరంజామానూ అందించాలి. అప్పుడే కవిత్వ ప్రయోజనం నెరవేరుతుంది. కుక్క తోక పట్టుకొని గోదావరినీదలేరు గదా! ఒక్కొక్క మెట్టును ఎక్కుతూ, సమస్యల్ని అధిగమిస్తూ విజయకేతనం ఎగురవేయాలి. అందుకొక రాజకీయ ఆలంబన కావాలి. అందుకే "జై తెలంగాణ జైజై తెలంగాణ అంటూ గులాబీ గుబాళింపులు/ మలయజ శీతలాలై మదిని తాకుతుంటే" అంటూ ముందుచూపును ప్రదర్శించింది. ఒక రాజకీయ విజయాన్ని సాధించిన తర్వాతగానీ సామాజిక న్యాయంకోసం అడుగులు వేయవచ్చన్నది స్పష్టపరిచింది. తెలంగాణ రావడం లేదని ప్రాణత్యాగం చేస్తున్న యువతకు ధైర్యాన్నిస్తూ ఎన్.అరుణ 'మాతృఘోష' అనే కవితలో "నిరాశకన్నా నిండు అమాసనయం/ తరువాత ఉదయమన్నా ఉంటుంది". అంటారు. "నువ్వే లేనప్పుడు/ నీ భవిష్యత్తు కాంతులు వ్యాపించనప్పుడు/ అన్నీ వృథా!" అని ఒక జాగ్రత్తను చెప్పారు. అప్పుడు శ్రీకాంతచారి, వేణుగోపాలరెడ్డిల ఆత్మత్యాగం తెలంగాణ మొత్తాన్ని కదిలించివేసిందని నెల్లుట్ల రమాదేవి 'తెలంగాణ ఋతువులు' అనే కవితలో "మీ

ఉద్యమ ప్రాంగణంలో/ ఒక నమ్మకపు మొక్కనైనా నాటలేని సిగ్గుతో తలవంచుకుని చెప్తున్నాం / ఇకపై ఒక్క కంటిరెప్పపైనా స్వప్నం కరిగిపోను వీల్లేదు" అని ఏ ఇంటిదీపమూ ఆరిపోకూడదన్న భావంతో "మృత్యుదారిని వీడి/ కొత్త బాటను చేరి విజయాల వేటలో సాగిపోండి" అంటుంది రమ. ఇంతని చేప్పలేని ఈ ఆపద రేపటినాడు కొంతైనా పోయి, మేలు జరగాలంటే 'నువ్వు' అనేవాడివి ఉండితీరాలని చెప్పడం గమనిస్తాం. కొలిపాక శోభారాణి 'ధీశక్తి' అనే కవితలో "పాలకుర్తి కోడలమ్మ ! చిట్యాల అయిలమ్మ" ను గురించి వ్రాసిన కవిత పోరుదారి కఠినమైందైనా వీరులు నిలబడ్తారన్న భావంతో వ్రాస్తూనే 'ఆనవాలు' అనే కవితలో "మనకు పోరాటాల కొత్తకాదు/ చరిత్రనిండా బలిదానాలనెత్తుటి మరకలే" అంటూనే "తెలంగాణ తల్లికి కడుపుకోత పెట్టద/ బత్కలేక వచ్చిండన్న అపవాదు చాటింపు చేయద్దు....బిడ్డా!" అని ప్రాణాలు తీసుకోవద్దని సూచిస్తూ తన ఆవేదనను తెల్పింది. కొమర్రాజు రామలక్ష్మి "తెలంగాణ బిడ్డలారా ! ఆవేశపూరిత నిర్ణయాలొద్దు / మానవ సంబంధాలతో / మనుగడ సాగించాలి" అంటూ ఖచ్చితంగా చెప్పి, మంచి సలహానూ ఇచ్చింది.

డా॥ముదిగంటి సుజాతారెడ్డి "చరిత్ర పుట్టింది ఇక్కడే" అనే కవితలో "ఇదే తెలంగాణ" అని ప్రారంభించి ఎన్నో విశేషాలను వ్రాశారు. ఇక్కడి కవులను, రాజులనూ, జానపదులనూ స్పృశిస్తూ "విప్లవాలకు గళాలు విప్పిన వీరభూమి ఇదే/" అని, చివరి పంక్తుల్లో "సిరులెన్నింటికోమాగాణం" అని ఆశావాదాన్ని కలగజేస్తూ శాతవాహనుల నుండి మొదలుకొంటే విప్లవవీరులు గళాలిప్పిన వరకు గల తెలంగాణ వైశిష్ట్యాన్ని వర్ణించారు. కవయిత్రుల కవిత్వాన్ని విశ్లేషించేటప్పుడు సీమాంధ్రుల ఆధిపత్యధోరణిని నిరసించడం ఒకటి, ఆత్మహత్యల పైన స్పందించడం రెండు, ఉద్యమకవిత్వంలో పరిణామక్రమంలో ఆశాజనక లక్షణంతో వ్రాయడం మూడు, విజయం సాధించిన తెలంగాణను వ్యక్తపరిచిన తీరును నాల్గవదిగా అభివర్ణించవచ్చు. ఇట్లా సమగ్రంగా తెలంగాణ ఉద్యమంలో కవయిత్రుల పాత్రను వివరించవచ్చు.

బతుకమ్మ :- రాజ్యాంగాన్ని వ్రాసిన అంబేద్కర్ ఆశయాలకనుగుణంగా రాజకీయ నేపథ్యం గసాగాలనీ బలమైన కాంక్ష ప్రతి ఒక్కరిలో మెదులుతూనే ఉంటుంది. స్త్రీవాదధోరణి, దళితవాద కవిత్వం, మైనారిటీ పక్షాన కవితలు అన్నీ కూడా ఉద్యమదిశకు ఆలోచించేలా వచ్చినవి. మనదేశంలోని చాలా రాష్ట్రాల్లో రాష్ట్రీయ ఉత్సవాలను చేయడం గమనిస్తుంటాం. అట్లాగే తెలంగాణ ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే 'బోనాలు' చాలా ముఖ్యమైన పండుగ. తర్వాత చేప్పేది 'బతుకమ్మ' పండుగ. మేడారం సమ్మక్క సారక్క జాతర మరీ ప్రత్యేకమైనది. ఇవ్వన్నీ

తెలంగాణ అస్తిత్వాన్ని ప్రకటించేవి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్నప్పుడు గుర్తింపుకు నోచుకోని పండుగ బతుకమ్మ పండుగ. ఈ ముఖ్యమైన మూడు పండుగలూ స్త్రీలకు సంబంధించినవే ! బోనాలు ఎత్తేదీ స్త్రీలే, బతుకమ్మ ఆడేదీ స్త్రీలే, సమ్మక్క సారలమ్మలు స్త్రీలే. దీన్నిబట్టి విశ్లేషిస్తే తెలంగాణ వారు స్త్రీని గౌరవభావంతో చూస్తారనీ, 'ఆడబిడ్డ' అంటే దైవంతో సమానంగా భావిస్తారనీ ప్రతీతి. ఇంతటి గొప్ప సంస్కృతిని ఇన్నేళ్ళు పట్టించుకోలేదని గుర్తించి రాజకీయంగా కూడా గొప్పగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించి బ్రతుకమ్మను 'రాష్ట్రపండుగ' గా గుర్తించింది. దాదాపు 2002 ఆ ప్రాంతం నుండి 2014 వరకు బతుకమ్మను ఎక్కువగా కవిత్వీకరించని కవులుగానీ, కవయిత్రులుగానీ లేరంటే అతిశయోక్తిగాదు.

బతుకమ్మ పూలపండుగ. స్త్రీలపండుగ. కాని కుటుంబం యావత్తూ ఇందులో అత్యంత ఉల్లాస ఉత్సాహాలతో పాల్గొంటుంది. ఇదీ ప్రత్యేకత. కౌటుంబిక విలువలు కాపాడుకోవడం అందరిబాధ్యత. బతుకమ్మను పేర్చే పూలన్నీ గడ్డిపూలు, పూజకు నోచుకోని పూలు. ఎన్నెన్నో కథలతో

సాగే బతుకమ్మ ఆడవాళ్ళందరి హృదయాల నిండుగా చేరుకున్నది. రామాయణ, భారత, భాగవత కథలైనా, గంగా గౌరీ సంవాదమైనా, శివరాత్రి కథలైనా అన్నీ పల్లెపడుచుల మౌఖిక సాహిత్యంలోనుండి జాలువారినవే. ప్రకృతి అంతా పరవశించే ఈ పండుగ ప్రకృతి పండుగ. ప్రకృతే స్త్రీ ! పూలు, పళ్ళు, చెట్లు, మట్టి, నీరు ఒకదానితో ఒకటి ఆరాధనతో, భక్తితో పోటీపడి పూజించుకునే పండుగ. ఏ లిఖిత రూపంలేని ఈ మౌఖిక సాహిత్యమంతా పాటలుగా తరతరాలుగా అమ్మమ్మలు, నాయనమ్మలు, అమ్మ, అత్త, అక్క, చెల్లెళ్ళనుండి అట్లా వారసత్వ సంపదగా వచ్చి చేరింది. ఈ పాటలలో స్త్రీ పురుష జీవనమంతా ఉండడం ఆశ్చర్యం కలిగిస్తుంది. బతుకమ్మలు పూలతో పేర్చి మధ్యలో పీఠంపై పెట్టి చుట్టు తిరుగుతూ చేసే పండుగ. కోలాటం, చప్పట్లు, ఇద్దరు చేతుల కలయిక విన్యాసాలు, వంగుతూ లేస్తూ వలయాకారంలో తిరుగుతూ ఆడడం వంటి ఆటలన్నీ ఆనందాన్ని కలిగించేవే. ఈ బతుకమ్మ ముఖ్యంగా 'తంగేడు' పువ్వుతో పేర్చడం తర్వాత వివిధ పూలతో అలంకరించడం గమనిస్తాం. అందుకే తంగేడు బంగరువర్ణం తెలంగాణ కవయిత్రుల పసిడి పలుకులకు తోడై కవిత్వమై బతుకమ్మను కొలిచినది. 'ఇద్దరక్క చెల్లెండ్లు ఉయ్యాలో / ఒక్కూరికిచ్చింద్రు.... ఒక్కడేమాయన్న ఉయ్యాలో / ఒచ్చెన్న బోడాయె ఉయ్యాలో' అనే ఈ పాటను ఉదాహరిస్తే అన్న, చెల్లె, అక్క, అమ్మ, నాయన, అత్తమామ, బావ, మరుదులూ ఉన్న కుటుంబం ఉంటుంది. అజ్ఞాతకర్తృత్వం.

కథంతా అమ్మాయి చుట్టు తిరుగుతుంది. ఇంతేకాదు పుట్టినప్పటినుండి పెరిగి పెద్దై, పెళ్ళైయ్యాక అత్తగారింటికి వెళ్ళాల్సిన బిడ్డకు కన్నతల్లి ఎన్నో సుద్దులు చేప్పేపాట కూడా ప్రత్యేకమైన పాట. ఇట్లాంటివన్నీ వింటూ, పాడుతూ, తెలుసుకుంటూ ఆడిపాడి పెరిగిన తెలంగాణ ఆడబిడ్డలు చాలా వరకు ఉయ్యాలో, వలలో, చందమామ, కోల్, రామా అనే, మకుటాలతో ఉన్న పాటల్లోని భావాలను పాడి ఆదర్శంగా జీవించే అలవాటును తమది చేసుకుంటారు. విచిత్రమేమంటే ఈ బతుకమ్మ పాటలద్వారా ఆనాడు రజాకార్ వ్యతిరేక ఉద్యమ సందర్భంలో తెలివినీ, జాగ్రత్తనీ, ధైర్యాన్ని నూరిపోసే విధంగా ఉద్యమకారిణులు ప్రయత్నించారు. ఉదాహరణకు మల్లు స్వరాజ్యం గారు ప్రత్యక్షసాక్ష్యం. ఈనాటికీ స్వరాజ్యంగారు ఆనాటి పాటలు పాడి వినిపిస్తుండడం గమనిస్తాం. గ్రామాల్లో దొరలపెత్తందారీ విధానాన్ని నిరసించడమైనా, పోకిరీలనుండి తమను తాము కాపాడుకునే ఉపాయాలనైనా ఆమె పాడి వినిపించడం గమనిస్తాం. సందర్భోచితంగా, కాలానుగుణంగా సమకాలీన చరిత్రను తమ పాటలుగా మల్చి బతుకమ్మ పాటలుగా చేర్చిన ఉదాహరణలు ఉన్నాయి. “చిత్తూ చిత్తూలబొమ్మ శివునీ ముద్దుల గుమ్మ” అనే పాటను స్ఫూర్తిగా చేసుకొని స్ఫూర్తి ఈ విధంగా మార్చి రాయడం గమనిస్తాం. “చదువులేమో వద్దంటే/ సావిత్రిబాయి పూలే/ పోరాడి చదువు చెప్పెనమ్మో ఆ రోజుల్లో” / అంటూ కీర్తి ప్రతిష్ఠలు సంపాదించి స్త్రీలనూ, పోరాటాల్లో పాల్గొన్న స్త్రీలనూ, రాజ్యాలేలిన రాణులనూ అక్షరీకరించారీశైలి పాటలో. “దేశ రాజధాని వలలో” అనే పాట వ్రాసిన ఉరిమిల్ల సునంద “దేశరాజధానిలోనా వలలో/ పుట్టింది చిన్నారి వలలో/ వైద్య వృత్తిలోన వలలో” అంటూ సాగిన ఈ పాటలో ఢిల్లీలో ఆడపిల్లపై జరిగిన అత్యాచారాన్ని నిరసిస్తూ వ్రాశారు. ఆడపిల్లను పుట్టనిద్దాం, బతకనిద్దాం, చదవనిద్దాం, ఎదగనిద్దాం అనే ఆశయాలతో బ్రతుకు అమ్మ అయిన బ్రతుకమ్మ పాటలు రచించిన కవయిత్రులెందరో తెలంగాణ గడ్డపై వెలుగులు నింపుతున్నారు. “ఆడపిల్లల మీద ఉయ్యాలో/ అత్యాచారాలొద్దు ఉయ్యాలో/ వరకట్నం ఇవ్వడం ఉయ్యాలో/ పెద్దనేరమమ్మ ఉయ్యాలో/ వరకట్నం అడగడం ఉయ్యాలో చెడ్డనేరమ్మా ఉయ్యాలో” అంటూనే “ఇల్లాలి చదువులు ఉయ్యాలో ఇంటికి వెలుగులు ఉయ్యాలో/ ఒక దీపాన్ని వెలగించి ఉయ్యాలో/ పదిదీపాలు వెలిగించు ఉయ్యాలో” అంటారు ప్రమీల అనే కవయిత్రి. “అమ్మనీ కడుపులో ఉయ్యాలో రూపుదిద్దుకుంటున్న ఉయ్యాలో/ ఆడపిల్లను నేను ఉయ్యాలో నిన్ను వేడుకుంటున్న ఉయ్యాలో/ ఈ కర్మభూమిలో ఉయ్యాలో/ ఎదగాలనుకుంటున్న ఉయ్యాలో” అంటూ “నూరేళ్ళు బతుకమ్మని దీవించమంటున్నా”

పండుగ వచ్చిన ఈ పాట చాలదా బతుకమ్మ ఒట్టి వేడుకతో జరుపుకునే పండుగే గాదు వేదనను పోగొట్టే ఉజ్వల ధీశక్తి గల పండుగ అని గట్టిగా చెప్పగలిగే తెలంగాణ పండుగ. కవయిత్రులే గాదు ఈ పాటలు పాడే స్త్రీలంతా తెలంగాణ కవయిత్రులేనని చెప్పేందుకు నిదర్శనం.

'తంగేడు వనం' అనే కవితా సంకలనంలోని కవితల్లో కవయిత్రులు బతుకమ్మపై అద్భుతమైన కవిత్వం వ్రాశారు. 'తలెత్తినపువ్వు' నెల్లుట్ల రమాదేవి "లాన్లల్ల పూసె నాజూకు పువ్వుగాదు/ చేన్లల్ల శెల్కలల్ల శెత్తలల్ల పూసెపువ్వు" అంటూ తంగేడు బతుకమ్మకెంత ముఖ్యమో, బ్రతుకుకూ అంతే ముఖ్యమన్నట్టు" ఇది సిగ్గుతోటి అవమానంతోటి వంగెడు పువ్వుగాదు/ గర్వంతోటి విశ్వాసంతోటి తలెత్తిన తంగేడుపువ్వు" అంటారు.

'మట్టి ఆకాశంలో తంగేడు సూర్యుడు' అంటూ ఐనంపూడి శ్రీలక్ష్మి వ్రాస్తూ "ఆత్మగౌరవాన్ని పులుముకున్న నవ్వు/ జీవన విలువలున్నరేవు/ వనగాథలను మూటకట్టుకున్న తావు" అంటూ తెలంగాణ జీవన అస్తిత్వాన్ని ప్రకటించారు. 'కంటి కరదీపం' అంటూ జ్వలిత బతుకమ్మకు ముఖ్యమైన ఈ పువ్వును "మసకబారె భూముల్ల/ సింగిడి అంగళ్ళ తిరుగాడు" పువ్వుగా అభివర్ణిస్తూ "విస్మరణ విద్రోహాల ఎదిరించిన రుద్రమణిదీపం/ రాతిచరితల్ల రచ్చకెక్కిన చాకలైలమ్మ/ రాచరికపు రంగునెదిరించిన సమ్మక్క సారక్క ఆనవాలు/ నవ తెలంగాణ రాష్ట్ర పుష్పం/ కంటి కరదీపం నా తంగేడుతల్లి" అంటూ చరిత్రను, సామాజికతనూ తంగేడుకు అన్వయించడం గమనిస్తాం. తెలంగాణ ఉద్యమంలో తంగేడు పువ్వుతో శోభిల్లే బతుకమ్మ ఒక ఆయుధమైంది. కవిత్వోద్యమమైంది. కవయిత్రులెందరో ఇందులో పాల్గొన్నారు. తెలంగాణ సాధనలో బతుకమ్మ పాత్ర పెద్దది. 'తిరగబడ్డ నా తెలంగాణ బిడ్డ' అనే కవితలో పోతనజ్యోతి "తరతరాల ఆర్తనాదాల్ని పోరుబాటలో/ సింహనాదమై ప్రతిధ్వనించావు/ త్రినేత్రుడి రుద్రనేత్రమై రుధిరత్వపు/ ప్రళయ సమర డమరుకం మ్రోగించావు" అంటూనే విజయఢంకా మోగించిన సందర్భంలో ఆనందాల బతుకమ్మ "ఆడపడుచుల ఆటలతో, ఆలపించేనీపాటలు/ వీనులకి విందమ్మ/ రమణీమణులతో నీ రంగురంగుల/ రంగస్థలి అందాల జాతరమ్మ/ సురభామినులే అవనికి దిగివచ్చి/ ఆడుతున్నట్లుండే అందాల కొలువమ్మ" అంటూ సంతోషాల హరివిల్లుతో పోల్చడం గమనిస్తాం.

తెలంగాణ ఉద్యమంలో మహిళలు తమ శక్తివంచన లేకుండా కృషి చేశారు. ఉద్యోగినులు, ఉపాధ్యాయినులు, గృహిణులు, మేధావులు అందరూ పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర సమితి (తెరాస) నుండి మొదలుకుంటే ఒకే లక్ష్యంతో ఏర్పడిన సంస్థలన్నింటిలో స్త్రీలున్నారు. ఆనాటి తెలంగాణ కథకు ప్రాణమిచ్చిన రచయిత్రి యశోదారెడ్డి నుండి మొదలుకుంటే నేటి సుజాతారెడ్డి వరకు తెలంగాణను బింబప్రతిబింబంగా చూపిన వారున్నారు. డా॥ అమృతలత, విమలక్క, సంధ్యక్క, రత్నమాలక్క, కె.విమల, కె.సత్యలక్ష్మి, గీతాంజలి వంటి వారెందరో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. కవయిత్రులు, వారి శీర్షికలు, కవితా సంకలనాలు అన్నీ చర్చించాల్సినవే.

కవితా సంకలనాలు :- తెలంగాణ పోరాటం ఉద్ధృతమైన సందర్భంలో ఎన్నో విధాల గొప్ప ప్రయత్నాలు చేశారు నాయకులు, కార్యకర్తలు. ఏ పేరును పెట్టుకున్నా, ఏ సంఘం ఏర్పడినా, ఏ సభ పెట్టినా కేంద్రబిందువు వంటి ఉద్దేశ్యం 'తెలంగాణ రాష్ట్రం ఏర్పడడం' అంతే ! కవాతులు, కవి సమ్మేళనాలు అన్నీ రాష్ట్ర సాధనకొరకే. ఆ క్రమంలో విద్యావేత్తలు, కవులు, కవయిత్రులు ఏకమై సంకలనాలను ప్రచురించారు. వ్యాస సంకలనాలు, కవితా సంకలనాలు, పత్రికా సంపాదకీయాల సంకలనాలు, ఉపన్యాసాల సారాంశ సంకలనాలు అన్నీ అచ్చు రూపంలోకి వచ్చినవి. పది జిల్లాల కవులు, కవయిత్రుల కవితా సంకలనాలు వెలువడ్డాయి. కవయిత్రుల కవితలున్న సంకలనాలుగా వచ్చిన వాటిల్లో – 1.పొక్కిలి, 2. మత్తడి, 3. మునుం 4. జాగోజగావో 5.జిగర్ 6. ఉసురు, 7. ములాఖత్, 8. తెలంగాణ కవిత, 9. కరీంనగర్ కవిత, 10. ఊపిరి, 11. దిమ్మిస 12. గాయాలే గేయాలై 13. తెలంగాణ ఉరుములు మెరుపులు – వంటివెన్నో సంకలనాలు వెలువడినవి. ఇవే కాకుండా కళా గోపాల్, కొలిపాక శోభారాణి వంటి కవయిత్రులూ తమ స్వంత కవితలను కవితా సంపుటులను ప్రచురించుకున్నారు. కొన్ని దీర్ఘ కవితలూ ఉన్నవి. ఉదాహరణకు అనిశెట్టి రజిత 'ఓలచ్చవ్వ' దీర్ఘకవిత, ఆనుగ్రలు కవితా సంపుటి చెప్పవచ్చు. ఈ విధంగా ఒక యుద్ధ ప్రకటన చేసినట్లే కవితాలోకం స్పందించింది. ఇవ్వన్నీ కూడా సాహితీవేత్తలు మనస్ఫూర్తిగానే స్వీకరించారు, ఆలోచించారు. చాలా మంది తెలుగు కవులు, కవయిత్రులు తెలంగాణ ఉద్యమాలకు తమ మద్దతును పత్రికాముఖంగా కూడా తెలియజేశారు. ఇదీ తెలంగాణ కవితా సంకలనాల విజయంగా అభివర్ణించవచ్చు. ఈ కవిత్వం ఆనాడు యావత్ ఆంధ్రప్రదేశ్‌ను ఆలోచింపజేసింది. స్వార్థ రాజకీయ నాయకుల ఎత్తుగడలేగాని సామాన్య ప్రజల చిత్తమేమాత్రం గాదని ప్రపంచానికి తెలిసేలా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవింపజేయడానికి కవిత్వం తన శాయశక్తులా కృషి చేసింది.

కవితల శీర్షికలు :– కవిత్వానికి శీర్షిక చాలా వరకు పతాకగా నిలుస్తుంది. కవిభావం క్షణంలో చిన్ని మాటతో తెలిసే అవకాశం ఉంటుంది. తెలంగాణ కవయిత్రులు తమ కవితా శీర్షికల ద్వారా తెలంగాణను, నైజాన్ని పట్టించినవి ఎన్నో ఉన్నాయి. మచ్చుకు కొన్ని పరిశీలిస్తే – జరభద్రం, జర ఇనుబిడ్డా, జై తెలంగాణ, తెలంగాణ ఆత్మఘోష, నా సేమంతి పొద్దులకు సెనార్తులు, పసరుమందు, తెలంగాణ ఆత్మఘోష, గన్‌పార్క్‌లో, పదిజిల్లాల పసిడిఖిల్లా, మేడారం జాతర, జజ్జనకరి, అగ్నిధార తెలంగాణ, ధృతరాష్ట్ర కౌగిలొద్దు, రిచ్చపిట్టలు, సోయినుంచి ఎరుకకు, హైదరాబాద్ నా మతం, అస్సోయి దులాతో ఆడే నా రోజెన్నడో, తీరొక్కపువ్వు, ఖేల్‌ఖతమ్ దుకుణంబంద్, గోముఖవ్యాఘ్రాలు వంటి ఎన్నో అద్భుతమైన ఆలోచనాత్మకమైన కవితా శీర్షికలతో తెలంగాణ అస్తిత్వం ప్రకటించిన కవయిత్రులెందరో స్థానికతను నిలబెట్టుకున్నారు.

కవయిత్రులు :– తెలంగాణ కవయిత్రులు చాలా మంది ఉన్నారు. లబ్ధప్రతిష్ఠులైన కవయిత్రులు తెలంగాణ ఉద్యమ సందర్భంలో వారి వారి బలమైన గళాల్ని వినిపించిన వారున్నారు. కొత్తగా కలాలు సంధించి, కవయిత్రులయ్యే శక్తినందించింది ఈ మలిదశ ఉద్యమం. అటువంటి కవయిత్రులు ఉన్నారు. స్థూలంగా తెలంగాణ కవయిత్రుల పేర్లు ఒకచోట ఏరి, కూర్చుకుంటే జూపాక సుభద్ర, అనిశెట్టి రజిత, గోగుశ్యామల, జ్వలిత, సూరేపల్లి సుజాత, షాజహానా, లావణ్య, అడువాల సుజాత, ఇష్రత్ సుల్తానా, అనుమాండ్ల రమాదేవి, గరిశకుర్తి శ్యామల, కురిమిండ్ల సృజన, నెల్లుట్ల రమాదేవి. చిందు సునీత, శారదాహనుమాండ్లు, నాగలక్ష్మి, ఐనంపూడి శ్రీలక్ష్మి, తుర్లపాటి లక్ష్మి, వనజ, హిమజ, శిరీషారాణి, నాంపల్లి సుజాత, వి.రమాదేవి, దాసోజు లలిత, లక్కరాజు రమాదేవి, కొల్లాపురం విమల, ముక్త, స్ఫూర్తి, ప్రమీల, తోటనిర్మల, ఉరిమిళ్ళ సునంద, అనిత, కందాళ శోభారాణి, కొలిపాక శోభారాణి, కరిమిళ్ళ లావణ్య, కొమర్రాజు రామలక్ష్మి, కిరణ్‌బాల, ఎన్. అరుణ, డా॥ తిరునగరి దేవకీదేవి, తాయమ్మ కరుణ, గడ్డం పద్మాగౌడ్, సుచరిత, చల్లపల్లి స్వరూపరాణి, తమ్మెర రాధిక, జలజ, భండారు విజయ, యం.రత్నమాల, వి.త్రివేణి, దేవులపల్లి వాణి, బండ సరోజన, గోపి భాగ్యలక్ష్మి, సొన్నాయిల కృష్ణవేణి, పల్లేరు కవిత, కళాగోపాల్, కిరణ్‌బాల, శిలాలోలిత, సబ్బని శారద, మేరి, షహనాజ్ ఫాతిమా, సుజాతపట్వారి, జ్యోతిరాణి, విజయకిషన్‌రెడ్డి, షంషాద్‌బేగం, శాంతిప్రబోధ, తెన్నేటిసుధ, స్వాతీ శ్రీపాద, సుజాత ముదిరాజ్, సస్యశ్రీ, రాజీవ, చాడలలితాదేవి, మేరీకుమారి మాదిగ, బండి ఉష. బందారి సుజాత, డా॥అర్.కమల,

డి.రమాదేవి, నామని సుజనాదేవి, మిర్యాల లలిత, పులి జమున, జూపూడి జిగీష, కె.ఎ.ఎల్. సత్యవతి, డా॥ భారతి, పి.పద్మ, రేణుక అయోల, కాత్యాయని విద్మహే, ముదిగంటి సుజాతారెడ్డి, కొండపల్లి నీహారిణి వంటి కవయిత్రులంతా తమ కవితలను సమకాలీన సమస్యల ప్రతిరూపాలుగా వ్రాశారు. ఇది మంచి పరిణామం. కేవలం రెండు మూడేళ్ళలో అంటే తెలంగాణ పోరాటాలు ఉద్ధృతమైనప్పుడు కొందరు, తెలంగాణ సాధించిన సంబరాల్లో సంతోషంతో పాల్గొన్న కవయిత్రులు కొందరు సాహిత్య ప్రపంచంలో అడుగుబెట్టారు. ముఖ్యంగా 'బతుకమ్మ' పాటలు కవిత్వంగా వ్రాసిన కవయిత్రులు తెలంగాణను ప్రతిబింబించారు.

తెలంగాణ ఉద్యమంలో కవయిత్రులు :– ఎప్పుడు ఎక్కడ బంద్‌కు పిలునిచ్చినా ఆయా గ్రామాల్లోనూ, ఆయా పట్టణాల్లోను కూడళ్ళన్నీ పిడికిళ్ళెత్తినవి. అమ్మలు, అక్కలు, చెల్లెళ్ళందరూ చేత జెండాలు బట్టుకొని ఉండేవారు. ముందువరుసలో నిలబడిన స్త్రీలంతా పేర్లు బయటికిరాని 'మహిళామణు' లేగదా ! ఆనాటి దినపత్రికలు. టి.వి దృశ్యాలే ఇందుకు సాక్ష్యం. బడికెళ్ళే పిల్లల చేతుల్లో ప్లకార్డులు జెండాలతో నిరసన తెల్పనిచ్చిన తల్లులేకదా ఈ స్త్రీలంతా ! సకలజనుల సమ్మె నుండి మిలీనియం మార్చ్ వరకు ప్రతి పురుషుడి ఆలోచనల వెనుక ఒక స్త్రీ ఉండి తీరింది ! అది ఏ పాత్రలోనైనా ! ఇది ముమ్మటికీ నిజం. బతుకమ్మ, బోనాలు లేని ఉద్యమాలు లేవంటే లేవనవచ్చు. ఇంటిపని, వంటపని పూర్తి చేసుకుంటూ వీధుల్లోకి విధిగా వచ్చారు. వార్తా పత్రికల్లోని వార్తలను చదవలేకపోయే స్త్రీలు కూడా టి.విల్లో ఉద్యమధాటిని చూసి, బేరీజువేసుకుంటూ రోడ్డెక్కి 'వంటావార్పు' చేసిందెవరు స్త్రీలే . రైల్‌రోకో, రాస్తారోకో వంటి అన్ని తీర్ల ఉద్యమాల్లోనూ బహుముఖీనమైన పాత్ర వహించిన స్త్రీలోకాన్ని చూసి కవితాలోకమూ మరింత స్పందించింది. అమరుల తల్లిదండ్రులకు అండగా నిల్చిన స్త్రీ కన్నీళ్ళు ఇళ్ళల్లో టి.వి. దృశ్యాలు చూసే ఇంటి మగవాళ్ళ హృదయాల్ని చలింపజేసే మాటలు మాట్లాడిన ఆ విషయాలన్నీ అప్పుడే తెరమరుగైపోతే ఎట్లా? తప్పుడు కామెంట్స్ చేస్తూ తప్పుదారి పట్టిస్తున్న విద్రోహులనూ, ఇంటిదొంగలనూ ధైర్యంగా నిలదీసిన స్త్రీలెందరో కవయిత్రుల హృదయాల్ని ద్రవింపజేశారు. అదిగో అప్పుడే హైదరాబాద్ ఒక పెద్ద ఆటంకమైనదన్న కుతంత్రాలను కనిపెట్టాల్సి వచ్చింది. షాజహానా మైనార్టీ కవిత్వాన్ని బలంగా వినిపిస్తూనే ఉద్యమాల్లో పాల్గొన్నారు. 'మేరా హైదరాబాద్' కవితలో "నాఆత్మ ఈషహర్ చుట్టు పిట్టలా

గిరికీలుగొడ్తుంది/ మీలాంటి లక్షల కృతఘ్నుల్ని ఒడిలో మోస్తున్న నా హైదరాబాద్ అల్లావుద్దీన్ అద్భుతదీపం" అంటూ నిర్మోహమాటంగా ఎదుర్కొంది. స్త్రీవాద ధోరణిలో కవిత్వం వ్రాసే శిలాలోలిత 'హైదరాబాద్ నా మతం' అంటూ వ్రాస్తూ "బోనాల్లో మైసమ్మ బొట్టు లాంటిది. ఏకత్వపు హైదరాబాద్ నా మతం" అని అంటారు. ఇక్కడి సంస్కృతిలో నుదుటి తిలకంగా హైదరాబాద్‌ను ఊహించారు. ఇట్లా ఎందరో కవయిత్రులు 'హైదరాబాద్' పై వ్రాసి, గుండెకాయవంటి ఈభాగ్యనగరం తెలంగాణ పరమయ్యేలా కవిత్వం వ్రాశారు.

"పోరు బుట్టే పోరాటం బుట్టేను/ పోరునుండి వీరవనితలు పుట్టేను/ తెలంగాణలో రణంబుట్టెను/ పది జిల్లాల్లో యుద్ధం బుట్టేను" అంటూ మేరీకుమారి మాదిగ చక్కని ఒక పాటను వ్రాసింది. పాట, గేయం ఉద్యమం మీద గొప్ప ప్రభావం చూపిందనడానికి ఇంతకంటే ఉదాహరణ ఏముంటుంది ?

శ్రీమతి ఇష్రత్ సుల్తానా – 'నిజం తెలుసుకో', ఎ.శిరీషారాణి – ' నా బంగారు కొడుకా, నిర్మల హృదయ 'నమ్మిరాతమ్మి తెలంగాణ వస్తది', దానక్క ఉదయభాను 'పగిలిన స్వప్నంలో పొదిగిన యుద్ధం', ఆమెదే 'బుద్ధుడి ప్రవచనం', అపరాజిత 'తెలంగాణ నిడిసిఎల్లిపో–, కాత్యాయినీ విద్మహే 'ఒక విశ్వవిద్యాలయం', హిమజ–'అమ్మ ఇల్లు', జ్వలిత – 'సరిహద్దు ప్రయాణం', గరిశకుర్తి శ్యామల 'సంవత్సరాది', సదాశ్రీ 'సకలజనుల సమ్మెసవాల్', కొండపల్లి నీహారిణి 'సూత్రధారులు, పాత్రధారులు', సుజాత సూరేపల్లి 'విగ్రహాల విధ్వంసం', జూపాక సుభద్ర – 'కోతకుబోవద్దు కోసైన నిలబడాలే', డా॥లావణ్య 'ఆశీర్వదించు తల్లి', జయధనుంజయ పెళ్ళూరి 'ఉసురు ఊరికేపోవాలా ?', అనుమాండ్ల రమాదేవి – 'ఉద్యమాల పోరలారా', స్నేహశ్రీ కొండపాక 'ఓపికతో సాధిద్దాం', అపరాజిత – 'కాల్చుకోకు', ఎ.నాగలక్ష్మి – జైతెలంగాణ, అనిశెట్టి రజిత 'ప్రాణహితవై ప్రవహించు', దాసోజులలిత 'బుసికూసాలు', లక్కరాజుదేవి 'భగ్నమైన బతుకుచక్రం' కె.విమల – 'నల్లమల్లదారిలో', తిరునగరి దేవకీదేవి – 'తెగించి కొట్లాడుడే', మల్లీశ్వరి – 'ఒకటి రెండు కావడమే నేటి సైన్స్', లక్కరాజు నిర్మల 'మాయమైన ముద్దబంతి పువ్వు', కొల్లాపురం విమల – 'ఈరోజు', అనిశెట్టి – 'తల్లికుండ', యం.రత్నమాల – 'లలితపాట', బండ సరోజన – 'నాఊరు', రమాదేవి నెల్లుట్ల – 'కొత్త కాంతి ఎప్పుడో', గోపి భాగ్యలక్ష్మి – 'ఈ బాటసారి', గడ్డం పద్మాగౌడ్ – 'గన్‌పార్క్'లో' జలజ – 'పది జిల్లాల పసిడిఖిల్లా', నాంపల్లి సుజాత – 'హుస్నాబాద్ అంగడి', భండారు విజయ – 'సర్వాయి పాపన్న',

కొమర్రాజు రామలక్ష్మి – 'అగ్నిధార తెలంగాణ' వంటి కవితా శీర్షికలతో కవిత్వ ఉద్యమంలో పాల్గొన్నారు తెలంగాణ కవయిత్రులు.

కవిత్వంలో శిల్పం బావుండాలి, సాంద్రతతో సాగాలి, క్లుప్తత, స్పష్టత అందాన్నిస్తుంది వంటి ఏ సిద్ధాంతాలు కవి వ్రాయాలనుకునే సందర్భ భావశుద్ధికి సాటిరావు అని తెలంగాణ ఉద్యమ కవిత్వం ఋజువు చేసింది. అందరు చేప్పేది ఒక్కటేకాని వైవిధ్యం – భాష వైవిధ్యం, వస్తు వైవిధ్యం అని చూసుకుంటే చిట్ట చివరికి తేలేది రాష్ట్రసాధన ! ఇదే ఓ పెద్ద మంత్రదండం. నెల్లుట్ల రమాదేవి అన్నట్లు "మా అమ్మకు మేమిద్దరం కవల పిల్లలం/ ముమ్మూర్తులా మాది ఒకటేరూపు/ అమ్మకెందుకో తమ్ముడిపై ప్రత్యేక చూపు" అంటారు. కేంద్రం, సోనియా – ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నాలుగురీతుల్లో, నలభై తీరుల్లో, నాలుగు వందల కవితల్లో కనిపించొచ్చు. భండారు విజయ అన్నట్లు "అక్షరం ! ఆయుధమై నిరీక్షిస్తోంది/ ద్రోహులను సమూలంగా దునుమటానికి". ఇది ఇంతకన్నా ఇంకేం కావాలి. – ప్రాంతాల మధ్య అసమానతల్ని ప్రజాస్వామ్యం తొలగించడానికి గొప్ప ఆయుధం అక్షరం. వ్యూహాలు, ఎత్తుగడలు అణగద్రొక్కబడిన గుండె గాయాలకు ఆరని మంటను రేపాయి. సరిహద్దులేని ప్రేమను పొందిన తెలంగాణ దిక్సూచి కాళోజీ కవితా పంక్తులు ఆ గాయాలకు లేపనం పూశాయి. అదే సమయస్ఫూర్తిని, అదే ధిక్కారాన్ని అంది పుచ్చుకొని కవయిత్రులు ముందుకు దూకారు. పాల్కురికి, పోతన, కాళోజీల ధిక్కారభావం నూరేళ్ళ సాహిత్య చరిత్రకు దారులు వేసింది.

పలు గాయాల మన తెలంగాణ ఇప్పుడు నవ రాష్ట్రమైన సందర్భంలో ఈ గడ్డపై జన్మించి, తోచినంత సాహిత్యసేవ, అనంతమైన జీవద్భాష ప్రయోగాలు చేస్తూ రాస్తున్న కవయిత్రులందరూ అభినందనీయులే ! మన సంస్కృతీ సంప్రదాయాలను ఈసడించడాన్ని ఖండిస్తూ, మన యాసను కించపరచడాన్ని ఖండిస్తూ వ్రాసిన కవిత్వ చాతుర్యమంతా ఇప్పుడు స్వరాష్ట్రం సిద్ధించింది కాబట్టి మన ప్రాంత అభివృద్ధికి, సగటుజీవి పక్షాన నిల్చుని కవిత్వం రాయాలి. అప్పుడే సాధించుకున్న తెలంగాణ కల సాకారమౌతుంది. అమ్మ ప్రేమ 'ఇంత' అని చెప్పలేనట్లు తెలంగాణ కవయిత్రులు ఇందరున్నారు, వీరి కవిత్వమింత ఉంది అని చెప్పలేం. పిల్లలను కని పెంచిన తల్లి కష్టం ఎంతటిదో, ఆరాటం ఎంతటిదో తెలిసిన స్త్రీ శక్తికి ఏదీసాటిరాదని తెలిసిన కవయిత్రులంతా తెలంగాణ సౌభ్రాతృత్వ, సౌశీల్య, సంతోష సుఖ శాంతుల కోసం నిరంతరం కలాలతో సిద్ధంగా ఉంటూ ఉద్యమించాలి.

***

తెలంగాణ ఉద్యమంలో రచయిత్రుల ప్రచురణలు



అనిశెట్టి రజిత

1990వ దశకం నుండి మళ్ళీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ కాంక్ష తెలంగాణ ప్రాంతీయ సాహిత్యం, సంస్కృతి, వలసాధిపత్యం, భాష, అస్తిత్వ కాంక్ష, ఆత్మవిశ్వాస ప్రకటన వెరసి తెలంగాణ పట్ల ప్రేమతో కూడిన సాహిత్య ఉద్యమ సోయి మొదలయ్యింది.

1995 నాటికి మరింతగా బలపడిన అస్తిత్వ సోయి 2002 నాటికి కవుల, రచయితల వ్యక్తిగత రచనలూ, అనేక మంది రచనలతో కూడిన సంపుటాలు, సంకలనాలూ ప్రచురించడం ఊపందుకున్నది.

ఇంతకాలం తెలంగాణ జీవిత చిత్తరువుగా "పొక్కిలి" ఆనాటి నిజమైన నేటినిజంగా పొక్కిలైన తెలంగాణ బతుకు వాకిళ్లను తడుపుతూ బహుముఖంగా తెలంగాణ కయిత "మత్తడి" బడ్డది (పొక్కిలి, మత్తడి కవితా సంకలనాలు).

తెలంగాణ భాషలో మాట్లాడడానికి సిగ్గుపడ్డ, భయపడ్డవాళ్ళంతా అచ్చంగా తమ భాషలో మాట్లాడడం, రాయడం మొదలయ్యింది. మనల్ని గట్ల గిట్ల గాడ గీడ అని వెక్కిరించినోళ్లు గప్‌చుప్ అయ్యిండ్లు.

అప్పటిదాకా వలసాధిపత్యం పీఠాల కింద నలిగి నజ్జయి విస్మృతిలో ఉన్న తెంగాణ కవులూ, రచయితలంతా పుట్టల నుండి చీమలు బయటికొచ్చినట్లుగా వచ్చి తమ 'గాయాలను గేయాలు'గా తమ కతలను వెతలుగా ఎలుగెత్తి చెప్పడం, పాడటం అనివార్యమయ్యింది.. ఒక దిక్కు తెలంగాణ కవిత్వం, మరో దిక్కు తెలంగాణవాద కవిత్వం ఉద్యమ జెండాలూపి "జులూస్"లు తీస్తూ "గాయి గాయి" అయిన మనుషులు "తొవ్వ"లు బట్టిన్రు.. "వల్లుబండ" మీద "ముద్దెర్లు" ఏసిన్లు.. ముంగిల్లల్ల.. పొలాల్ల "మునుం" బట్టిన్రు. తమ "జిగర్"ను సగర్వంగా ఆవిష్కరించుకున్నరు.

తమ భాషా ప్రేమకు చిహ్నంగా అనుగ్రలు, ఎలిగడి, వల్లుబండ, తొవ్వ, మంకమ్మతోట లేబరడ్డా, పాతాళ గరిగె, మోటబొక్కెన, మట్టిపాటలు, కొర్కాసు, తెలంగాణ జంగ్, అగ్ర తలుపులు, ముద్దెర, ఉసురు, జిగర్, జిగిరి, పొక్కిలి, మత్తడి, ముంగిలి, మునుం, జులూస్, వొయినం, కైతున్కల దండెం లాంటి పేర్లను తమ పుస్తకాలకు పెట్టుకున్నరు.

ఇంతవరకు తెలంగాణ అంశాలతో అరకొరగా పరిశోధనలు చేపట్టిన విశ్వవిద్యాలయాల్లో ఉద్యమ ప్రభావంతో తెలంగాణ కవులూ, వైతాళికులూ, తెలంగాణ సాహిత్యకారులపై పరిశోధనలు మొదలయినయి.. బతుకమ్మ పాటల సేకరణా, రచనా ఉద్యమ స్థాయిని అందుకున్నది. ప్రత్యేక సోయితో కవులూ, కళాకారులూ కైగట్టి ఆటలాడి, పాటలు పాడి ధూంధాంలై దండ్లు కట్టిన్లు. తెలంగాణ పేగు సంబంధం ఉన్న కవిత్వం వాగులై పారి చెరువులై నిండింది.

1999-2000 దశకంలో భువనగిరికి చెందిన బెల్లి లలిత తెలంగాణ కోసం గళమెత్తి

బలిదానమైన తొలి ప్రజా కళాకారిణి. దశాబ్దాల తరబడి కనబడకుండా, వినబడకుండా, స్తబ్దంగా నిర్లిప్తంగా ఉన్న ప్రాంతీయ సాహిత్య కుత్తికలు కుతికెల అడ్డు తొలగించుకొని గొంతులు సవరించుకొని సాహిత్య ఉద్యమ మైదానానికి చేరిన్లు. తమ చారిత్రక కర్తవ్యాన్ని గెర్తెరిగి ప్రవర్తించిన్రు. ఉద్యమాల చరిత్రలో మునుపెన్నడూ లేనంత ప్రజా ఉద్యమ సాహిత్య ప్రచురణ జరిగింది. అచ్చయిన పొత్తాలు అమ్ములపొదిలో నుండి తీసి దూసే బాణాల్లా సాహిత్య పోరాటరూపం సంతరించుకున్నది... మూలనబడ్డ వ్యవహారిక భాషను దుమ్ము దులిపి తేటగా, అందంగా పేర్చడం చేసిన్లు.

*** *** ***

రచయిత్రులూ, కవయిత్రులూ, కళాకారులూ ఎవరికీ, దేనికీ తీసిపోని విధంగా తెలంగాణ సోయితో రచనలు చేసి ప్రచురణలు చేపట్టి తెలంగాణ ఆకాంక్షతో పాటు, ఆత్మవిశ్వాసంతో తమ అస్తిత్వాన్ని ప్రకటించారు. పాటలు రాసారు, పాడారు, ధూంధాం ప్రదర్శనలిచ్చారు. కవితల పంట పండించారు. కథలూ, వ్యాసాలు, గేయాలూ, ఉపన్యాసాలు అన్నీ అందిపుచ్చుకున్నరు.

తెలంగాణ సాహిత్య ఉద్యమ కాలానికి సంబంధించి 2002వ సంవత్సరం కుంభవృష్టి కాలంగా గమనించవచ్చు. ఈ సంవత్సరంలోకవులూ, రచయితలూ సాహిత్య సంకలనాలు, ప్రచురణలు అత్యధికంగా చేసిన్రు.

తెలంగాణ గడ్డమీద నుండి గత 23 సంవత్సరాలుగా వెలువడుతున్న "భూమిక" స్త్రీవాద మాసపత్రిక 1998లో అనిశెట్టి రజిత, ఎ.ఉమామహేశ్వరిలు సమన్వయకర్తలుగా "భూమిక" తెలంగాణ ప్రత్యేక సంచికను వెలువరించింది.

తెలంగాణ భాషలో కథా రచనకు పేరొందిన డా॥పాకాల యశోదారెడ్డి 1995 అనంతరం "ఎచ్చమ్మ ముచ్చట్లు" కథా సంపుటి ప్రచురించారు. డా॥ ముదిగంటి సుజాతారెడ్డి "తొలితరం తెలంగాణ కథలు"రెండు సంకలనాలు తీసుకొచ్చారు (2002 & 2005). తనను తాను తెలుసుకున్న తెలంగాణ తీరుగా రచయిత్రులు నిర్లిప్తత, నిర్లక్ష్యం నిద్ర నుండి మేల్కొని చిక్కని రచనలు ప్రవహింపజేసారు. ఈ నేల పరిమళానికి చిక్కని ఆనవాళ్ళుగా నిలిచిన్లు.

డా॥ముదిగంటి సుజాతారెడ్డి సంపాదకత్వంలో "తెలంగాణ తొలితరం కథలు" సంకలనం తెలంగాణ కథా సాహిత్య చరిత్ర నిర్మాణానికి సాటిలేని దోహదం చేస్తూ సాహిత్యోద్యమంలో ప్రథమ ప్రయత్నంగా నిలిచింది. ఇది తెలంగాణ రచయిత్రి సృజనాత్మకతకు నిదర్శనం. ఈ నేల సౌందర్యానికి తొలి రూపాలను వెలికి తీసిన మన సాహిత్య చరిత్రగా ఇది నమోదు కాబడింది.

ఈ సంకలనం ప్రచురించడానికి అందుకు తగిన పరిశోధన చేయడానికి కారణం "తెలంగాణలో నిజాం పాలనలో ఉన్న తెలుగువాళ్ళు తమ భాషా సాహిత్య సంస్కృతులను మరిచిపోయి పరభాషా సాహిత్య సంస్కృతులను సొంతం చేసుకోవాల్సిన పరిస్థితులేర్పడినాయి.మాతృభాష మాట్లాటడమేనేరంగా మారింది." ఒకవైపు "భారతదేశమంతటా భాషా సాహిత్యాలు, కళలు పునర్వికాస దశలో ఉండగా, తెలంగాణ ప్రజలకు అదంతా ఏమీ తెలియని పరిస్థితులు" అని తెలంగాణ తొలితరం కథలు – నేపథ్యం గురించి రాసిన పుటల్లో ఆమె పేర్కొన్నారు. 208 పేజీల ఈ సంకలనంలో 35 కథల్ని ప్రచురించారు. (1912 నుండి 1936 వరకు) 2005వ సంవత్సరంలో ఈ సంకలనానికి కొనసాగింపుగా "తొలినాటి కథలు" అనే కథా సంకలనం సుజాతారెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్‌ల సంపాదకత్వంలో ప్రచురించారు. "తెలంగాణ తన చరిత్రను తాను తవ్వుకుంటున్న ఈ తరుణంలో తెలంగాణ కథా సాహిత్యాన్నీ, తెలంగాణ కథకులను సాహిత్యలోకానికి పరిచయం చేయాలనే" దృక్పథంతో తొలినాటి కథలను వెలుగులోకి తీసుకొచ్చామని అంటరు.

అంతే కాదు, వివక్షకూ, విస్మృతికీ, నిర్లక్ష్యానికీ గురైన తెలంగాణ సాహిత్యం ఉమ్మడి తెలుగు సాహిత్య చరిత్రలో సముచిత స్థానం లేకపోవడాన్ని పూరించడానికీ–

పక్షపాత ధోరణిలో పాక్షిక సత్యాలతో రాసిన పాఠ్యపుస్తకాల ప్రచురణను ఎదుర్కోడానికీ, చరిత్ర హీనత్వంలోకి నెట్టబడిన తెలంగాణను చరిత్ర నిర్మాణానికి పూనుకునేట్టు చేయడం కోసం తీవ్ర కృషి అవసరం. ఈ చారిత్రక అవసరం కోసం జరిగిందే ఈ ప్రచురణ అని సంగిశెట్టి శ్రీనివాస్ అభిప్రాయం.

ఈ సంకలనంలో 1910 నుండి 1956 వరకు ముందు చేసిన కథా రచనలతో 46 కథలను పొందుపరిచిన్రు.

ముద్దెర : 2005లో "ముద్దెర" తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వవాద సాహిత్య విమర్శ వ్యాసాలు సుజాతారెడ్డి సంపాదకత్వంలో రోహణమ్ పబ్లికేషన్స్ ద్వారా ప్రచురించారు. 14 వ్యాసాలున్న ఆ సంకలనంలో సుజాతారెడ్డి గారివే 5 వ్యాసాలున్నాయి.

"1990 నుంచి తెలంగాణలో కొత్త తరం ప్రారంభం కావడం నుంచి 21 వ శతాబ్దానికి పూర్వరంగాన్ని సిద్ధం చేసిన వేగవంతమైన మార్పులు – ఈ పరిమాణాలకు మేల్కొన్న జాతులు, ప్రజలు తమ భాషా సంస్కృతులను, ఉనికిని, అస్తిత్వాన్ని కాపాడుకోవాలనే తాపత్రయంతో పూనుకోవడం, ఉపేక్షకు గురైన ప్రాంతాల్లోని భాషా సాహిత్యాల్లో జరిగే రచనా వ్యాసంగాలను, ప్రక్రియలను, అభివ్యక్తులను పట్టించుకోవడం చేస్తున్నారు. ఆధిపత్య సమస్య ముందుకు రావడంతో తమపై దోపిడీ, వివక్ష, అధిపత్యాలకు స్పందించి అభివ్యక్తీకరించడం ప్రారంభించారు. తాము కోల్పోయిన వాటిపట్ల బాధను సాహిత్యంలో వ్యక్తీకరించడం. అది ఒక పద్ధతిలో ఉద్ధృతంగా, నిర్దిష్ట భావజాలంతో వెలువడడం. ఆ భావధారే 'అస్తిత్వవాదం' గా పిలువబడుతున్నది. ఒక నిర్దిష్టమైన సమగ్రంగా ఉన్న భావజాలంతో వెల్లువలా వస్తున్నది" అంటూ ఈ పుస్తకంలో తెలంగాణ సాహిత్య విమర్శలోని తోవలు, అస్తిత్వవాదం ఏ సామాజిక, చారిత్రక భూమిక లోంచి పుట్టింది, దాని లక్షణాలు వివరించబడ్డాయి.

సీనియర్ జర్నలిస్ట్, మార్క్సిస్ట్ రచయిత్రి యం. రత్నమాల 2013లో నూతన ప్రచురణల ద్వారా తెలంగాణ రాష్ట్ర ఉద్యమంపై 96 పేజీల వ్యాసాల సంపుటి ప్రచురించారు. ఈ పుస్తకంలో "ప్రజలు –ప్రజా సంఘాలు – పార్టీలు – ఐక్య సంఘటన" అనే అంశాలపై పలు విశ్లేషణాత్మక వ్యాసాలు రాసిన్రు.

నడుస్తున్న ఉద్యమంతో అడుగులేసిన రత్నమాల ఉద్యమ సమయంలో నిర్దిష్టత, హేతుబద్ధత లేని రాజకీయ పరిణామాలూ, కలిసి ఉందామని బలంగా

ప్రతిపాదించేవాళ్ళు కలిసి ఉండటానికి ఏ రాజకీయార్థిక భౌతిక భౌగోళిక కారణాలు చెప్పకుండా దాటేయడాన్ని 2009లో చిదంబరం ప్రకటన, తద్వారా రాజీనామాల డ్రామాలతో ఎంత రెచ్చగొట్టినా ప్రజలపై వారి పాచిక పారకపోవడాన్ని ప్రస్తావించారు.

2008లో "తెలంగాణ రాష్ట్రం – మహిళ, ఆదివాసీ, దళిత, బహుజన మైనారిటీ అస్తిత్వాలు" పుస్తకం ప్రచురించి దానికి కొనసాగింపుగా మళ్ళీ ఈ గ్రంథాన్ని ప్రచురించారు. తెలంగాణ రాష్ట్ర సాధన, రాష్ట్ర విభజన ఉద్యమాలపై తన ఆలోచనలనూ, పరిశీలననూ సంకలనం చేసారు.

"తెలంగాణ వస్తుందా, ఉద్యమం ఎట్లా నడుస్తున్నదని" అడుగుతూ 2010లో శాశ్వత నిద్రలోకి పోయిన తన బాపునూ, రోడ్లమీదకి రాగానే ఇవే మాటల్ని అడిగే ప్రజల్లోన చూసుకున్న రత్నమాల తన బాపు యాదిలో ఈ తెలంగాణ పుస్తకాన్ని తీసుకొచ్చిన్రు.

గాయలే..గేయాలై..! : 2010 మలిదశ తెలంగాణ ఉద్యమం ఊపందుకున్న సమయంలో రచయిత్రులు అమృతలత, రాజీవ, జ్వలితల సంపాదకత్వంలో తెలంగాణ నుండి కవయిత్రుల కవితా సంకలనం వెలువడింది. ఈ సంకలనంలో 60 మంది కవయిత్రుల కవితలున్నాయి. చాలా కవితలు తెలంగాణ అంశంతో ఉండటం విశేషం.

"యుద్ధం చేయడానికి ఆయుధాలు మాత్రమే సరిపోవు. ఆయుధాలు పట్టినవాళ్ళందరూ.. యుద్ధాలు చేయరు! నిన్నటి అవమానమే.. నేటి పోరాటానికి పునాది! తమ మనుగడకై చేస్తున్న పోరాటంలో స్వాభిమానానికి తగిలిన గాయలే గేయాలై ఈ పుస్తక రూపంలో మీ ముందు నిలిచాయి" అన్నరు సంపాదకులు.

వెతలే..కథలై..! : 2011లో నలుగురు రచయిత్రులు అమృతలత, అనిశెట్టి రజిత, కిరణ్‌బాల, తుర్లపాటి లక్ష్మిల సంపాదకత్వంలో "వెతలే కథలై!" 56 మంది రచయిత్రుల కథలతో ప్రచురింపబడింది. ఈ సంకలనంలో తెలంగాణ తొలితరం రచయిత్రులు భండారు అచ్చమాంబ, నందగిరి ఇందిరాదేవి, పాకాల యశోదారెడ్డి, మాదిరెడ్డి సులోచన, బొమ్మ హేమాదేవిలకు నివాళిగా వారి కథలను కూడా చేర్చడం విశేషం.

"పదవుల్లో, కొలువుల్లో, నిధుల కేటాయింపుల్లో ఒకటేమిటి, సమస్తం వివక్షతకు గురైంది.గురైతాంది తెలంగాణ! 'అడగంది అమ్మైనా అన్నం పెట్టదు' అంటరు! నిజానికి అడగక ముందే..పిలిచి అన్నం పెట్టేదే కదా అమ్మ! కానీ ఇక్కడ.. 'ఆకలేస్తోంది

మొర్రో' అంటూ ఎలుగెత్తి అరిచినా.. మెతుకువిదల్చని కపట ప్రేమ మన పాలకులది! తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోరుకునే నాలుగు కోట్ల గుండెల ఆరాటం, పోరాటమే ఈ కథల దొంతర! దగాపడ్డ తెలంగాణ బతుకుల 'వెతలే కథలై!' ఇప్పుడు మీ చేతుల్లోకి అంటూ ఈ సంకలనం 'తెలంగాణ' చేతుల్లోకి వచ్చింది.

ఊపిరి : 2011లో "ఊపిరి" తల్లిపాల రుణం కవితా సంకలనం "వరంగల్లు రచయితల ఐక్యవేదిక" ప్రచురించింది. దీని సంపాదకులు అనిశెట్టి రజిత, పొట్లపల్లి శ్రీనివాసరావు.

ఈ "ఊపిరి" ఉద్యమకాలంలో ప్రాణత్యాగాలు చేస్తున్న యువకులకు తల్లిపాల రుణం తీర్చుకోవడం ప్రాణాలు తీసుకొని కాదు, బతికి.. గెలిచి.. తెలంగాణ సాధించి అని సందేశం ఇస్తుంది. – విజ్ఞప్తులు చేస్తుంది. మన ప్రాంతీయ ఆకాంక్షను సాకారం చేసుకునేందుకు "ఊపిరి" నిలుపుకొని.. ఉగ్గబట్టి ఉద్యమ సాధనకు పూనుకోవాలనీ.. సాధించిన తెలంగాణకు సారథ్యం వహించాలనీ పిలుపునిస్తుంది. ఉద్రేకం, నిరాశ నిస్పృహలతో ప్రాణత్యాగాలుచేస్తూ అమరులవుతున్న ఉద్యమకారులను వేడుకుంటుంది.. తల్లుల గర్భశోకాలతో తల్లడిల్లుతున్న తెలంగాణ పక్షాన ఆత్మాహుతులు ఆపాలనీ, అవి పరిష్కారం ఏ మాత్రం కావని తెలియజెప్తుంది.. నడుస్తున్న తెలంగాణ చరిత్రను నెత్తురూ కన్నీళ్ళతో తడపొద్దని తొలిపొద్దులా ఉద్యమించాలని కోరుతుంది.

ఉద్యమంలో ఊపిర్లొదలడం కాదు, ఉద్యమానికే ఊపిర్లూదుతూ సాగాలని విజ్ఞప్తి చేస్తుంది ఈ 145 కవితల సంకలనం

జిగర్ : 2013లో తెలంగాణ విశిష్టతలతో కూడిన 125 మంది కవుల కవితలతో రుద్రమ ప్రచురణలు (A Warangal Women Literary Collective) ద్వారా 'జిగర్' అనే కవితా సంకలనం ప్రచురణ జరిగింది. దీనికి రచయిత్రులు అనిశెట్టి రజిత, భండారు విజయ, కొమర్రాజు రామలక్ష్మి, కరిమిళ్ళ లావణ్య, గడ్డం పద్మాగౌడ్‌లు సంపాదకులుగా పుస్తక ప్రచురణ గావించిన్రు.

తొలి తరం కవులు, ఉద్యమకారులూ, రచయితలూ కేవలం కొన్ని అంశాలకే పరిమితమై తమలోని భావోద్విగ్నతలు పెల్లుబుకగా రాసిన, రాస్తున్న సాహిత్యం కాకుండా సమస్త తెలంగాణ ప్రాంతీయ స్పృహతో మన ఉద్యమకారులూ, విప్లవకారులూ, అమరులూ, ప్రాచీన చిహ్నాలూ, ప్రదేశాలూ, చరిత్ర నిర్మాణాలూ, ఊర్లూ, దర్శనీయ స్థలాలూ, ప్రాచీన కట్టడాలూ, కళలూ, సంస్కృతీ, వైతాళికులూ, నదులూ, గుట్టలూ, జలపాతాలూ లాంటి ఎన్నో వైశిష్ట్యాలను ప్రస్తావించడం ఈ సంకలనం ప్రత్యేకత.

"స్వాతంత్ర్యపు పోరుబాటలో/ గాయాల నెత్తుటి ఊటలూరుతున్న

ఉద్యమాల ఉక్కుకోటలో బతుకమ్మ బతుకుపాట తెలంగాణ

స్పష్టమైన తెలుగు మాట నీదమ్మా / తరగని చరిత్ర వారసత్వం నీదమ్మా"

అంటుంది ఈ సంకలనంలో సంపాదక వర్గం. అందుకే 'జిగర్' సంకలనం, 'మర్సియా' వేదనా సాహిత్యాన్ని కూడా నింపుకున్నది.. 'జిగర్' తెలంగాణోళ్ళ 'జిగిరి' అయ్యింది.

***   ***   ***

2012లో "వొయినం" కథా రచయిత్రి జాజుల గౌరి జీవన పరిశీలన నుండి వెలువడిన తెలంగాణ నవల – ఒక కుల అస్తిత్వానికి చెందిన జాతి జనుల జీవనమే అయినా ఆ జాతి కులం ప్రజల నిత్యవాడుక భాషలో అంటే అచ్చమైన తెలంగాణ భాషలో జీవం పోసుకున్నది "వొయినం" నవల..

వ్యావసాయిక సమాజాల గురించీ, కుటుంబ సంబంధాల గురించి ప్రపంచ భాషల్లో అనేక కథలూ, నవలలూ వచ్చాయి. అదే కోవలో ఈ "వొయినం" నవల వచ్చిందంటారు రచయిత బి.ఎస్.రాములు. అంతే కాదు "వొయినం" ఒక దృశ్యకావ్యం అని కూడా అభివర్ణించిన్రు.

"జానపదుల నిత్య జీవితం వివరంగా అనేక కోణాల్లో హృద్యంగా చిత్రించబడింది. సమాజంలోని కోట్లాది పేద ప్రజల జీవితాన్ని ప్రతిఫలిస్తుంది."

ఈ నవలలో పేద మహిళల జీవితం, పరిణామాలు, సంస్కృతి, తెలంగాణ భాష, తెలుగు సాహిత్యంలో అస్తిత్వ చైతన్యంతో చిత్రించబడ్డాయి. తెలంగాణ ప్రజలు రాష్ట్ర రాజధాని పరిసరాల్లో నగర జీవితం కాకుండా, గ్రామీణ, వ్యవసాయ జీవితం ఎలా జీవిస్తూ వచ్చారో ఈ నవల సాహిత్య రూపంలో సజీవ పాత్రలతో, యథార్థ సంఘటనలతో ఆక్షరీకరించింది.

1970–80ల మధ్య సికింద్రాబాద్ ప్రాంతంలో నగర జీవితంలో గ్రామీణ జీవితం కొనసాగడం ఈ నవలా విశేషం.

కాత్యాయని విద్మహే 2013లో "ప్రాంతీయ చైతన్యం తెలంగాణ సాహిత్యం" అనే వ్యాసాల సంపుటిని పాలపిట్ట బుక్స్ వారి ప్రచురణగా వేసారు. 304 పేజీల 23 వ్యాసాల ఈ గ్రంథం తెలంగాణ సామాజిక జీవితాన్ని ఆవిష్కరించటానికి అవసరమైన దృష్టి కోణాలను సమన్వయం చేస్తూ తెలంగాణ సాహిత్యాన్ని విశ్లేషించింది.

"స్త్రీవాద, ప్రాంతీయవాద అస్తిత్వ చైతన్యాల అవగాహనతో రచయిత్రి చేసిన తెలంగాణ సాహిత్య సాంస్కృతిక అధ్యయనమిది. ప్రధానంగా తెలంగాణ ప్రాంతీయ జీవితాన్ని ప్రతిఫలించిన సాహిత్య వ్యాసాలివి. కొన్ని తెలంగాణ అస్తిత్వవాదం రూపొందడానికి ముందు రాసినవైతే, కొన్ని వర్గవాద, స్త్రీవాద దృష్టి కోణంలో రాసినవి. అనేక అస్తిత్వాల కలయికతో వివిధ అస్తిత్వాల చైతన్యంతో రాసినవీ వ్యాసాలు. కోట్లాది మంది ప్రజల ఆకాంక్ష ఒక్కటి అయినప్పుడు ఆ భావన ఒక అస్తిత్వం అవుతుంది. ఆ విధంగా తెలంగాణ సాధన ఆకాంక్ష ఒక అస్తిత్వం అవుతుంది. సామాజిక ఉద్యమాల పట్ల గౌరవం, ఉదారత కలిగి ఉన్న కాత్యాయని ఆయా వాదాలను చిత్తశుద్ధితో స్వీకరించి, శాస్త్రీయతతో అనుసంధానించడం, విమర్శలో తనదైన వ్యక్తిత్వానికి నిదర్శనం.

"తెలంగాణ అస్తిత్వ చైతన్య నిర్మాణానికి, పరిశోధకులకు, పది జిల్లాల సాహిత్య చరిత్రల మీద జరగవలసిన కృషి" వైపు మనల్ని మళ్లించే బలమైన నిర్దేశకత్వాన్ని ఈ సంపుటి మనకందిస్తది.

తెలంగాణ ఉద్యమ వెలుగులు ప్రసరించిన మరో రంగం పరిశోధనా విభాగం. అప్పటిదాకా విశ్వవిద్యాలయాల్లో డిగ్రీల కోసం, సదస్సుల్లో పత్ర రచనల కోసం, సాహిత్య రంగంలో సాహిత్య వ్యాసాల కోసం తెలంగాణేతర రచయితల రచనలకు ప్రాధాన్యతనిచ్చిన తెలంగాణ పరిశోధకులూ, కవులూ, రచయితలూ – ఇప్పుడు తెలంగాణ వైతాళికులూ, రచయితల రచనల్ని తమ పరిశోధనలకు, పత్ర రచనలకూ సాధికారికంగా ఆత్మవిశ్వాసంతో ఎంచుకోవడం విస్తృతమయింది.

డా॥తిరునగరి దేవకీదేవి 1969 జై తెలంగాణ ఉద్యమ కార్యకర్త. 2008లో తన పరిశోధనా గ్రంథం "తెలంగాణ విమోచనోద్యమ నవలల్లో స్త్రీ చైతన్యం" ప్రచురించారు. సాహిత్యంలో తెలంగాణ స్త్రీలకు తగినంత ప్రాతినిధ్యం, ప్రాధాన్యత లేకపోవడం ఒక అంశం. కానీ జాతీయోద్యమంలో, తెలంగాణ పోరాటంలో స్త్రీలు తమ సత్తా చూపించారు అనేది వాస్తవం. ఆ స్త్రీల చైతన్యం గురించిన పరిశోధన చేయాల్సిన అవసరాన్ని గుర్తించి ఈ పరిశోధన చేసారు.

డా॥అడువాల సుజాత "పి.యశోదారెడ్డి కథలు – సమగ్ర పరిశీలన" అనే అంశంపై పరిశోధించి 2008లో 265 పేజీల గ్రంథంగా ప్రచురించారు. 2009లో "తెలంగాణ పోరాట నవలల్లో స్త్రీ" అనే అంశంపై 190 పేజీల గ్రంథాన్ని ప్రచురించిన్రు.

తెలంగాణ రైతాంగ పోరాట కాలానికి సంబంధించిన కథా వస్తువుతో వచ్చిన నవలలు మహీధర రామ్మోహనరావు 'ఓనమాలు/మృత్యువు నీడల్లో', బొల్లిముంత శివరామకృష్ణ, మృత్యుంజయులు, వట్టికోట ఆళ్వారుస్వామి 'ప్రజల మనిషి', 'గంగు'లను తన పరిశోధనకు ఎంచుకొని పట్టా తీసుకొని గ్రంథంగా ప్రచురించిన్రు.

డా॥వేలూరు శ్రీదేవి 1998లో "దాశంథి రంగాచార్య నవలలు -ఉద్యమ నేపథ్యం" అనే అంశాన్ని పరిశోధనకు ఎంచుకొని 2007లో దాన్ని గ్రంథంగా వెలువరించారు.కాకతీయ విశ్వవిద్యాలయంలో 2013లో నిర్వహించిన "తెలంగాణ వైతాళికుడు కాళోజి" సదస్సు పత్రాలను తన సంపాదకత్వంలో గ్రంథంగా ప్రచురించిన్రు. డా॥వి.త్రివేణి "ముదిగంటి సుజాతారెడ్డి రచనలు -సమగ్ర పరిశీలన" అనే అంశంపై డాక్టరేట్ పట్టా గ్రంథాన్ని 2012లో ప్రచురించిన్రు.

తెలంగాణ ఉద్యమస్ఫూర్తిలో భాగంగా బతుకమ్మ పాటల ప్రచురణ ఒక ప్రత్యేక అధ్యాయం. 2008లో తెలంగాణ సాహిత్య వేదిక కరీంనగర్‌జిల్లా వారు సబ్బని శారద రచించిన "తెలంగాణ బతుకమ్మ పాట" అనే 36 పేజీల పుస్తకాన్ని ప్రచురించారు. అందులో దశాబ్దాలుగా ప్రచారంలో ఉన్న పౌరాణిక, జానపద, కాల్పనిక సాహిత్యం వస్తువుగా కాకుండా వర్తమాన తెలంగాణ బాధను, కన్నీటి గాథ అక్షరబద్ధం చేసారు.. తెలంగాణ ప్రజలు ఆరాధించే సమస్త దేవతామూర్తులను వేడుకున్నారు. ఈ గ్రంథం క్యాసెట్‌గా కూడా వేసి తెలంగాణ వాకిళ్ళలో దీర్ఘమైన పాటగా మోగించిన్రు.

2014లో డా॥ అడువాల సుజాత 81 బతుకమ్మ పాటల సేకరణతో 99 పేజీల "బతుకమ్మ పాటలు" అనే గ్రంథాన్ని ప్రచురించారు. 2015లో కొమ్మాల సంధ్య తెలంగాణ కొండ గుర్తు అయిన 108 బతుకమ్మ పాటల సేకరణతో 124 పేజీల "పూల జాతర" అనే గ్రంథాన్ని ప్రచురించిన్రు.

*** *** ***

ఇవి కాకుండా తెలంగాణ భాషకు పట్టం కడ్తూ.. తెలంగాణ తల్లి, తెలంగాణ గ్రామాలు, తెలంగాణ పండుగలు - వ్రతాలు, తెలంగాణ సామాజిక జీవనం, తెలంగాణ ప్రాంత ప్రజల వ్యక్తిత్వాలు లాంటి ఎన్నో అంశాలను ప్రస్తుతిస్తూ, ప్రస్తావిస్తూ ప్రేమతో తడుముకుంటూ తెలంగాణ కవయిత్రులు, రచయిత్రులు తమ కవితా సంపుటాలలో, సంకలనాలలో రాసిన్రు.

1996 నుండి డా॥ఆర్.కమల పుస్తక ప్రచురణ చేస్తున్నారు. 1996 లో "తెలంగాణ వ్రత కథలు" దాదాపుగా ప్రతి ఆల్టర్నేట్ ఇయర్ ప్రచురిస్తున్నారు. "స్త్రీల పాటలు - జోలపాటలు - మేలుకొలుపులు" 2000లో సేకరించి ప్రచురించిన్రు. "స్త్రీల లాలిపాటలు". "పెళ్ళి పాటలు" సేకరించి 2001లో పుస్తకాలు ప్రచురించిన్రు.

"స్త్రీల పౌరాణిక గీతాలు", "మంగళ హారతులు, తత్వాలు" సేకరించి 2001లో ప్రచురించిన్రు.

"బొడ్డెమ్మ-బతుకమ్మ పాటలు" రాసి 2001,2002, 2004 లో ప్రచురణ చేసిన్రు.

"మంథెన చరిత్ర" పౌరాణికంగా, చారిత్రకంగా, రాజకీయంగా రాసి 2003 లో ప్రచురించిన్రు. "స్త్రీల పాటల్లో సీతారాములు" అనే పుస్తకాన్ని రచించి 2003లో ప్రచురించిన్రు.

ప్రజాకవి అమరత్వంచెందిన సంవత్సరం 2002లో "జులుం" ను ప్రతిఘటిస్తూ తానే ఒక ఉద్యమమై ధిక్కార స్వరంతో కల్లోలిత హృదయుడైన కాళోజీ స్మరణలో వెలువడిన అనిశెట్టి రజిత కవితా సంపుటి "ఉసురు" తెలంగాణ భాషలో తెలంగాణ ఘోషను వినిపించింది. తల్లికుండ, అమ్మో నల్లమొగుల్లేసిందే, దొర్సానీ ఓ దొర్సానీ, తల్లి సాపెన, రిచ్చపిట్టలు, అవ్వరాజ్జెం రావాల్నని, మావ్వబిడి, ఓ లచ్చువ్వ, పాములు మింగిన పాట, బాంబూసోడు, ఉసురు, కాళన్న, ధోకా జేసింద్రు! లాంటి కవితలతో తెలంగాణ కడుపుమంటనూ, కన్నీటి ఊటనూ అక్షరీకరించిన్రు.

2006లో జూపాక సుభద్ర, గోగు శ్యామల ల సంపాదకత్వంలో"నల్లరేగటి సాల్లల్ల" కథా సంపుటి వచ్చింది. జూపాక సుభద్ర 2008లో "కైతునకల దండెం" కవితా సంపుటి, 2009లో "అయ్యయ్యో దమ్మక్క" కవితా సంపుటి, 2013లో "చంద్రశ్రీ యాదిలో" సుభద్ర సంపాదకత్వంలో వ్యాసాల సంకలనం, 2014లో "రాయక్క మాన్యం" కథా సంపుటి ప్రచురణ జరిగింది. ఈ పుస్తకాలన్నింటిలో తెలంగాణ భాష, శ్రామిక జన జీవితం ప్రతిబింబించినై.

కొల్లాపురం విమల సంకలనకర్తగా 1996లో పాలమూరు ఫౌండేషన్ వారు పునర్ముద్రించిన "గడ్డిపూలు" పాలమూరు కథల గ్రంథం, అనంతరం 2006లో ముక్త ప్రచురణగా "నెమలీక - ఓ తెలంగాణ బడిపంతులు కథ" గ్రంథాన్ని, మళ్ళీ 2009లో సముద్ధరణగా ప్రచురించిన్రు.

2013లో 72 పుటలతో వచ్చిన డా॥బండ సరోజన "ఒక పూవు పూసింది" గేయ కవితా సంపుటిలో. నా తెలంగాణ, నాఊరు, బతుకమ్మ పండుగ, అమ్మ, శ్రుతి, బదరికాశ్రమం, జోహర్లు లాంటి తెలంగాణ కవితలుండగా 2012లో ప్రచురించిన 'ఎర్రమందారం' గేయ కవితా సంపుటి ముఖచిత్రం ఎర్రమందారంలో వెలసిన తెలంగాణ తల్లిది. 116 పుటల ఈ గేయ కవితా సంపుటిలోని 50 కవితల్లో అధిక శాతం తెలంగాణ ఉద్యమ, జీవనాంశాల కవితలు చోటుచేసుకున్నాయి. ఎర్రమందారం, మా నాన్న, నా బాల్యం గల్లంతైంది, బంగారు బతుకమ్మ, నా తెలుగు భాష, గల్లి గల్లి కదలిరండి, పాలమూరు పోరుబిడ్డ, మాకు తెలంగాణ కావాలే ! లాంటి కవితా రచనలున్నై...

చాడా లలితాదేవి 2010లో 'ఏ సిరాతో రాయాలి?' అనే గేయకవితా సంకలనం ప్రచురించారు. "మా ఆశ తెలంగాణ – మా ధ్యాస తెలంగాణ / మా శ్వాస తెలంగాణ – మా ఘోష తెలంగాణ / జై తెలంగాణ జైజై తెలంగాణ" అంటూ అమరుల నెత్తుటి ధారలతో తడిసిన ఈ నేలపై ఆశయ సాధనకూ కదిలిన జనవాహినిని ప్రస్తుతిస్తూ ప్రారంభమవుతుంది ఈ గేయ కవితా సంపుటి.

కొండపల్లి నీహారిణి 2011 లో ప్రచురించిన "అఱ్ఱ తలుపులు" కవితా సంపుటి పేరు తెలంగాణ భాషలో పెట్టడానికి కారణం తెలంగాణ ఉద్యమ ప్రభావమే. తన పుట్టిన గడ్డను "ఆదర్శాల గడ్డ" గా కీర్తిస్తూ రాసిన కాకతీయ గడ్డమీద కవితతో పాటుగా తన భాషను హృదయ ఘోషగా వినిపించిన కవిత ఆ గ్రంథంలో ఉంది.

2012లో ప్రచురించిన 'నిర్నిద్రగానం' కవితా సంపుటితో తెలంగాణ అంశాలైన 'విస్తృతి', 'వర్ణమాల వగరుస్తుందా', గోముఖ వ్యాఘ్రాలు, నవ్వులుగావద్దని, ఒక జన్మ నిలదీస్తుంది! లాంటి కవితలున్నై.

2014లో డా॥కె.బి. సంధ్యా విప్లవ్ "నా తెలంగాణ నేల గ్రహణం వీడిన వేళ" అనే సుదీర్ఘ కవితను ప్రచురించారు. "తెలంగాణ కోసం మనాది బట్టిన కోట్ల మంది తెలంగాణీయుల పక్షాన మార్పు కోరుతున్నాను, గుర్తుకొస్తే దుఃఖమొస్తది" అంటూ వికటించిన ప్రయోగం, జగన్నాథ రథం లేదు, గ్రహణం వీడిన వేళ, అంకురం అనే శీర్షికలతో 82 పేజీల గ్రంథాన్ని ప్రచురించిన్రు.

అరుణ కీర్తిపతాక 2007లో తెలంగాణ ఉద్యమ చైతన్య గీతాలు పుస్తకాన్ని, 2013లో పోరు పిడికిలి గేయ కవితల పుస్తకాన్ని ప్రచురించిన్రు.

*** ** ***

మార్చి, 2015 లో ప్రచురింపబడిన పాలమూరు వలస బతుకు చిత్రాలు (Migrating life Sketches of Palamuru) (The Land of Lakes) గీతాంజలి రాసిన పలు ప్రక్రియల తెలంగాణ సాహిత్య సంకలనం.

తెలంగాణలో పాలమూరు జిల్లాకు వలసలు పోయే జిల్లాగా గుర్తింపు ఉన్నది.. ఆ పాలమూరు జనజీవన భాషను తన కథలకు, నవలికకూ, నాటకానికీ యథాతథంగా పెట్టి సుదూరాల్లోని మట్టి దేశాల వలస ప్రయాణికులైన పాలమూరు వలస అనివార్యంగా విషాద గాథలను వినిపించిన్రు.

పాలమూరు జిల్లాలో అత్యధిక చెరువులు, దాదాపు ఏడు వేల దాకా ఉన్నా నిత్య దారిద్ర్యం, కరువులతో దూర ప్రాంతాలకు అనివార్యంగా వలసలు పోవలసిన దుర్గతి గురించిన ఆవేదన రచయిత్రిది.

ఆ సంకలనంలోని రెండు కవితలు 'కనిపించని గొడ్డలి మాయమైన చెట్టు', 'దుఃఖం ఒక విప్లవం!' క్రూరమైన వాస్తవిక పరిస్థితులను చిత్రించినవి. ఏడు కథలు, రెండు పెద్ద కథలు, ఒక నవలిక, ఒక నాటకం అన్నీఅచ్చమైన తెలంగాణ భాషలో నిజమైన జీవన వ్యథలను. సెజ్‌ల పేరిట జరిగే అభివృద్ధి కుట్రలను చిత్రించినవి.

నిజానికి ఈ సంకలనాన్ని చదవడానికి ధైర్యం కూడగట్టుకోవాలి. ఫ్రెంచ్ రచయిత ఫ్రాంజ్ కాఫ్కా అన్నట్లుగా "మనల్ని గుచ్చి గాయపరిచి, ఇబ్బంది పెట్టే రచనల్నే మనం చదవాలి. మనం చదువుతున్న పుస్తకం మన తలపై మొట్టి మేల్కొల్పని పక్షంలో అసలు చదవటం ఎందుకు? మంచి పుస్తకం ఒక దుస్సంఘటనలాగా మనల్ని ప్రభావితం చేయాలి. మనకన్నా మిన్నగా మనం ప్రేమించే ఆత్మీయుల మరణం లాగా మనల్ని తీవ్రంగా కలచివేయాలి. అందరికీ దూరంగా ఏకాంతంగా అరణ్యాలకు పారిపోవాలనిపించేలా ప్రేరేపించాలి. పుస్తకం మన లోపల గడ్డకట్టిన సముద్రాల్ని గొడ్డలిగా పగులగొట్టాలి". ఈ చలనాలన్నింటినీ "పాలమూరు వలస బతుకు చిత్రాలు" పుస్తకం మనలో కలిగిస్తుంది. అందుకే చదివేందుకు సాహసం కావాలె.

వి.వి.ముందుమాటలో అంటారు: "పాలమూరు వలస బతుకు చిత్రాలు – చదవడానికి మనం మళ్ళీ నైసర్గిక మానుష ప్రవృత్తిలోకి వెళ్ళిపోవాలె. మనుషులు కావాలె, స్త్రీలం కావాలి, పిల్లలం కావాలె, భూమి కావాలె, చెట్లు కావాలె, నీరు కావాలె అంటే ప్రకృతీ ప్రకృతిలో సహజ భాగమైన మనుషులం కావాలి".

కప్పేసిన నాగరికత పొరల్ని చించుకొని గీతాంజలి అట్లా వెళ్ళి ఈ కథలు రాసింది. ఒక విధంగా ఆమె పాలమూరు జిల్లాను దత్తత తీసుకున్నది.

“ఈ రచన ఒక ప్రవాహం.. దుర్భరమైన జీవన్మరణపోరాట దృశ్యకావ్యం. మనలో మనిషిని తట్టి లేపేవి ఈ కథలు, సెజ్‌ల ప్రభావం వల్ల కొన్ని ఊర్లు బొందలగడ్డలయినవనుకుంటే, అక్కడ చచ్చిపోయే వాళ్ళను బొందపెట్టడానికి బొందల గడ్డలు కూడా మాయమైన వాస్తవాలు. ఆరడుగుల నేల కూడా కరువై అడివిలో చెట్టుకు పీనుగల్ని ఉరివేసి వేళ్లాడదీసే దారుణ పరిస్థితి. పోలేపల్లిలో పీనుగల మాటలు వినడానికి గుండె దిటవు చేసుకునేంత బలవంతులమా అనిపిస్తది.

పాలమూరు వలస బతుకుల జీవన విధ్వంసం కథలుగా తెలుగు పాఠకులకు, తెలుగు సమాజానికీ ప్రత్యేకంగా తెలంగాణ సమాజానికీ మానవీయ కోణంలో అందించిన గీతాంజలికి సామాజిక సాహిత్య సోయితో ఒక కరచాలనం. ఓదార్పుగా ఆత్మీయ అలింగనం తప్ప ఏమియ్యగలం?

తెలంగాణ ఉద్యమ కాలంలో స్త్రీలు వేయి గడపలూ, పితృస్వామ్య అగ్నిగుండాలూ దాటి వీధుల్లోకొచ్చి కదం తొక్కి పాటలు పాడి, నినదించి, ఉద్యమంలో అసంఖ్యాకులుగా పాల్గొంటూనే తమ భావాలను, ఆలోచనలు,ఉద్విగ్నతలను, అనుభవాలను తమ రచనల్లోకెక్కించారు. పూనుకొని గ్రంథాలుగా ప్రచురించారు. సంపూర్ణ మానవిలుగా తమ వ్యక్తిత్వాలను చాటుకొని ఆత్మవిశ్వాసంతో అకుంఠిత దీక్షతో స్త్రీశక్తిని ప్రదర్శిస్తూ తమ చారిత్రక ఉద్యమ పాత్రను సాటిలేని పోరాట యోధులుగా ప్రదర్శించి వీరాంగనలయిన్రు.

***

పాటను ఆయుధంగా మార్చిన గాయనీమణులు



డా॥ కరిమిండ్ల లావణ్య

"తెలంగాణ రాష్ట్రంఏర్పడ్డాక చాల మార్పులు ఉంటాయి. ఒకటి ఆర్థిక పునర్నిర్మాణంలో బలహీన వర్గాల పాత్ర పెద్దగా ఉంటుంది. ముఖ్యంగా వ్యవసాయరంగం, గ్రామీణ ప్రాంతం దానికి అనుబంధంగా ఉన్న విద్య, వైద్య, సాంస్కృతిక రంగాల్లో సంస్కరణలు చేస్తే ఆటోమెటిక్‌గా ఈ కార్పొరేట్ కల్చర్ పోతుంది. పోవాలె గదా! కార్పొరేట్ కల్చర్ పోతే ఆటోమెటిక్‌గా ఈ వర్గాలకు ఆ ఎలిజిబిలిటి వస్తది. ఈ కార్పొరేట్ కల్చర్ ఉన్నంతకాలం వాల్లు పైకి రాలేరు. ఫస్ట్ ఎజెండా... నా లాంటి వాల్లది. ఏది ఏమైనా తెలంగాణ సెంట్రిక్‌గా డెవలప్‌మెంట్ ఉంటుంది"..... "తెలంగాణ డెవలప్‌మెంట్ గావాలె. డెవలప్‌మెంట్ ఫలితాలు సమాజానికి అందాలె. సామాజిక న్యాయం. నా కాన్సెప్ట్ అదే"...

(ప్రొఫెసర్ జయశంకర్ మాటలు 'వొడవనిముచ్చట నుంచి...)

ఈ మాటలను బలోపేతం చేస్తూ అనేక రాజకీయ, సాంస్కృతిక, భాషా ఉద్యమాలు తెలంగాణలో వచ్చాయి. అవి తెలంగాణలో బలమైన ప్రతీకలుగా నిలిచాయి. ప్రధాన భూమికనూ పోషించాయి. అందులో ప్రత్యేకంగా చెప్పుకోదగింది పాట. తెలంగాణ పాట ఆవిష్కరణకు ఒక ప్రత్యేకత ఉంది. అది మనిషి చుట్టూ తిరుగుతూ మనిషిలోని మానవత్వాన్ని తట్టి లేపుతుంది. మనకు అవసరమైన సంస్కారాన్ని, సంస్కృతిని, సంప్రదాయాలను, వ్యక్తిత్వాన్ని అన్నింటిని మించి ఆత్మగౌరవాన్ని నింపింది. 'తెలంగాణలోని పాట' ప్రధానాంశం కాబట్టి ఈ పాటలో ఆర్ద్రత, ఆరాటం, పోరాటం, ఆశయం, అభివృద్ధి, అస్తిత్వం, వెనుకబాటు తనం తదితర కోణాలు ఉన్నాయి.

ముఖ్యంగా ఆ ప్రాంత వైశిష్ట్యాన్ని తెలుపుతూ జాతి ఉనికిని కాపాడుకునే ప్రయత్నంలో స్థిరీకృతం పొందింది పాట. ప్రజల జీవనాడుల్లో ప్రసరించింది. తరతరాల ప్రజల నాల్కలమీద ఉన్న నుడికారాలు, పలుకుబడులు పాటల్లో వచ్చి

చేరాయి. ప్రతి పాటకు ఒక స్థిరమైన వాస్తవిక నేపథ్యం ఉండడం తెలంగాణ పాటల ప్రత్యేకత. అందుకే నేటి తెలంగాణ పాటల్లో "పరిమితి - సహజత్వం - ఆనందం" - ఈ మూడూ ఉన్నాయి. ఈ మూడింటిలో తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనం, ప్రాంత అస్తిత్వం వస్తువైంది.

తెలంగాణ ప్రజల అస్తిత్వ తండ్లాట ఈరోజుదికాదు. కుతుబ్‌షాహీల పాలననుంచే మొదలైంది. ఆనాడు తెలంగాణ సంస్కృతిని పునరుద్ధరించడంలో ప్రధాన పాత్ర పోషించిన హరికథ, ఒగ్గుకథ, భాగవత, తందానా కథల పాత్రలను విస్మరించలేం. తరువాతి కాలంలో సురభివారి ప్రభావంతో అనేక నాటక సమాజాలు, భజన మండలులు ఏర్పడి సాంస్కృతిక పునరుజ్జీవనాన్ని మరింత ముందుకు తీసుకెళ్ళాయి. చందాల కేశవదాసు, బుక్కయ్యశాస్త్రి ఈ ప్రాంత హరికథకులుగా, వట్టికొండ నాగేశ్వరరావు బుర్రకథకులుగా ప్రసిద్ధి. శ్రీ జగదీశ్వరి నాట్యమండలి, లక్ష్మీనృసింహ నాట్యమండలి, భానూదయ నాట్యమండలులు తెలంగాణలో చెప్పుకోదగ్గవి. నటరాజరామకృష్ణ, చిందు ఎల్లమ్మ పేరిణీ నృత్యం, ఒగ్గు సత్తెయ్య ఒగ్గు కథ తదితర కళాకారులు, రూపాలు ప్రజలకు తమ ఉనికిని తెలియజెప్పే ప్రయత్నం చేశాయి.

పాట విస్తరణ గురించి తెలియడం కోసమే ఇదంతా చెప్పడం. ఈ ప్రాంత ఔన్నత్యాన్ని ఆవిష్కరిస్తూ 1945 లో రావెళ్ళ వెంకటరామారావు రాసిన పాట తెలంగాణ జాతి, ప్రాంత విశేషాలను గురించి చెబుతుంది. "కదనాన శత్రువులకుత్తుకల నవలీల... నుత్తరించిన బలోన్మత్తులేలిన భూమి... వీరులకు కాణాచిరా! తెలంగాణ ధీరులకు మొగసాలరా !" ఇది స్వాతంత్ర్యపు తొలి దశకంలో ఆనాటి జాతీయ అభ్యుదయ సాహిత్య ఉద్యమాల నేపథ్యంతో రాయబడ్డది. వీరి మాదిరిగానే కాళోజీ నారాయణరావు, దాశరథి కృష్ణమాచార్య, సుద్దాల హనుమంతు, జనగామ రాజరాం, తిరునగరి రామాంజనేయులు, యాదగిరి తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనానికి ఊపిరి పోసినారు. నేటి మలితరం ఉద్యమానికి భూమికగా వీరి పాటలు పని చేసినాయి. మలితరం ఉద్యమానికి జన నాట్యమండలి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, చలో ధూం ధాం, జానపద జాతర, స్వరమాధురి కళానిలయం, మధుకళా బృందం, గద్దర్ బృందం వంటి కళా వేదికలు ఉద్యమాన్ని బలోపేతం చేశాయి. మొత్తం ఉద్యమానికే "పాట" మకుటాయమానంగా నిలిచింది. అందులో పాడిన గాయకులు, గాయనీమణులు ఎందరో ఉన్నారు. ఊరునుంచి మొదలైనపోరు మండలాలకు, జిల్లాలకు, రాష్ట్రానికి మొత్తం దేశానికి,

ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ఉన్న తెలంగాణ ప్రజలందరి దగ్గరికీ ఉద్యమ పాట విస్తరించింది. 1945,1948,1952,1969 ఉద్యమాలను ఆధారం చేసుకొని, 1990 నుంచి మొదలైన మలిదశ ఉద్యమంలో గాయకులతో పాటు గాయనీమణులు గజ్జెకట్టి, ఆడిపాడి ఉద్యమాన్ని బలోపేతం చేసినారు. ఉద్ధృతం చేసినారు. ఒక కళాబృందం ఏర్పడిదంటే అందులో తప్పనిసరిగా గాయనీమణులుండాల్సిందే. సినిమాల్లో పాడే గాయకులు సందర్భాన్ని ప్రయోజనాన్ని లెక్కలోకి తీసుకొని మాత్రమే పాడుతారు. కాని, మన తెలంగాణ గాయనీమణులు స్వచ్ఛందంగా, స్వేచ్ఛగా ఒక ఆశయంతో పాడినారు. జిమ్నాస్టిక్స్‌కు తర్ఫీదు పొందిన బృందం (ట్రూప్) ఉంటుంది. ఆ ట్రూప్ అలరిస్తే ఆలకిస్తాం, ఆనందిస్తాం. కాని, గాయకులు తర్ఫీదు అవసరం లేకుండానే అలవోకగా అప్పటికప్పుడే ఆడి, పాడి తెలంగాణ ప్రజల్లో ఉప్పెనవలె ఉద్యమ తలుపులు తెరిచినారు. అందులో గాయనీమణుల పాత్ర అద్వితీయం. ఒక ఆనందమాల గురించో, బండారు అచ్చమాంబ గురించో ఆసక్తిగా చదువుతాం. ఇంకా సమాచారం కావాలనీ వెతుక్కుంటాం. కాని, సమకాలీనంలో ఒక రాష్ట్రం ఏర్పడ్డానికి కుటుంబాలను కూడ పక్కకు పెట్టి, పాట కొరకే పాటుపడిన గాయనీమణులను చర్చించుకోవడం చాలా అవసరం.

కవి సమయం గురించి రాసినప్పుడు కందుకూరి రమేశ్‌బాబు ఇలా అంటాడు: "మిత్ర కవిత్వంలో చాలా కీలకమైన అంశం–బందీ. అవును, తాను రాసిన పాటల్లో "బందీ విముక్తి బంధనాలు తొలిగినప్పుడే" అన్న పాట గొప్ప ఆర్ద్రగీతం. ఇది ఒక రకంగా తన కవిత్వాన్ని అర్థం చేసుకోవడానికి, ఉద్యమం గురించి చెప్పడానికి, వలసాంధ్రపీడనలో బందీ అయిన తెలంగాణ గురించి చెప్పడానికీ గొప్ప ప్రతీక అవుతున్నది. ఆ పాటను విమలక్క గానం చేయడంలో తాను 'మిత్రపాట' పాడడం లేదు. తాను తన తెలంగాణ తల్లి దాస్య శృంఖలాలు తెగడం అన్న ఒకే అంశంతో గానం చేయడం లేదు. తన ఉద్యమ సహచరుని గురించే కాదు. జైలుకు వెళ్ళిన పౌరులందరి ప్రస్తావన ఉన్నది. ఒక సంస్కరణ ఆశయం ఉంది. అన్నింటిని మించి తెలంగాణ సాకారం అవుతున్న వేళ తనకు కలిగే ఆనందం ఉంది. "బంది విముక్తి బంధనాలు తొలగినప్పుడే... పొద్దూ పొడుపు గుండెల్లోనా పొడిచినప్పుడే" అని విమలక్క పాడుతుంటే ఇవన్నీ వినిపిస్తాయి. పాడుతుంటే గాయనిగా విమలక్క ఒక్కతే లేదు. ప్రతి ఒక్క తెలంగాణ మహిళ విమలలో ఉంది. నీళ్ళల్లో చేపలా జనంలో మమేకమై జనచేతనంగా ఎగిరిన వాళ్ళు బందీలైతే ఎలా ఉంటుందో చెప్పేపాట. తెలంగాణను ఖైదు చేసినపాట. అంతకన్నా ముఖ్యంగా తెలంగాణను బందిఖాన నుంచి విముక్తి చేయగల ఉద్యమపాట. మలి తెలంగాణ దశలో తెలంగాణ విముక్తిగీతంగా పరిణమించిందని చెప్పుకోవచ్చు.

"ఆశలన్నీ ఖైదు చేయబడ్డపుడు ఆలోచన బంధ విముక్తం అవుతుంది. నా ఒంటరితనాన్ని ఛేదిస్తూ ఒక స్వరం వెన్నంటి వస్తుంద" ని మిత్ర అంటాడు. ఆ స్వరం విమలక్కదే. మాట పాటగా రక్తి కట్టినపుడే పాటలోని నడత తెలుస్తుంది. మలి తెలంగాణ ఉద్యమంలో అంటే 1978-79 నుంచే తెలంగాణ వస్తువుగా మిత్ర రాసిన పాటలను అనేకం పాడింది విమలక్క. 1980 నాటికి "తెలంగాణ ఎంత సాహసమైంది" రాస్తే మొదట పాడింది విమలక్కే. ప్రజాకళల రంగస్థలం మీద పాటను, ప్రదర్శనను ఉన్నత దశకు తీసుకొని పోయిన మహిళల్లో మొదటి స్థానం విమలక్కదే. ఒకప్పుడు "మా భూమి" సంధ్య, బెల్లి లలిత ఉండె. కాని, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలుగా చాలా మంది గాయనీమణులను పరిచయం చేసింది విమలక్క. తెలంగాణ సంస్కృతి యాస, బాసలు స్పష్టంగా తెలియజెప్పేపాటలు అనేకం పాడి తెలంగాణలోని సకల జనులను సమీకృతం చేసిన మొదటి మహిళ విమలక్కే. గొంగడితో కూడిన ఆహార్యం వల్ల తెలంగాణలోని సాధారణ మహిళగా గుర్తింపు పొందింది. కాని, గొంతు విప్పితే కణకణ మండే నిప్పుతునకలు రాలాల్సిందే. విమలక్క పాటను ముక్తాయింపు తన పాటే కాని, ఏ డోలో, కోలాటమో, దరువో కాదు. ఛలో ధూం ధాంలో తెలంగాణ సంస్కృతి, అభివృద్ధి, జలవనరుల దోపిడి, భాషా అవహేళన, చరిత్ర, పౌరుషం, ఆవేశం, ఆశయం, నీళ్ళు, ఉద్యోగాలు, నిధులు, మొత్తంగా తెలంగాణ ప్రజలకు అవసరమైనవి. చేరువకానివన్నీ మలిదశ ఉద్యమంలో భాగంగా పాటకు వస్తువు అయ్యాయి. వీటిని ఆధారం చేసుకొని పాడుతూ తెలంగాణలోని ప్రతి ఊరు తిరిగింది విమలక్క. "పల్లె పల్లె తెలంగాణ పాలన నడపాలిరా," "దోపిడీకి ద్రోహాలకు తావొద్దురా".. "ఎములవాడ రాజన్న పబ్బతి పడదాముర్రా," 'ఛలో ధూంధాం'..'ఆడబిడ్డలం', 'తెలంగాణ గీతం',....'ఛలో విజయగీతి', "ఆడు దాం దప్పుల్ల", "తెలంగాణ తల్లి పయిలమా"..., "తెలంగాణ తల్లి కాళ్ళు కడగవస్తినే", "పాడరా పాడరా మనపాటా",.. "ముంబై గట్టున తెలుగు శిల్పులం.. మా ముంబాయియికి దత్తా పుత్రులం" "పల్లెపల్లెనా పల్లేర్లు మొలిసే పాలమూరులోనా", ఇట్లా మిత్రరాసిన ఏ పాటైనా ఉప్పెనలా పాడింది విమలక్క. పోరుపాటలు తెలంగాణ ఉద్యమంలో భాగమైన బతుకమ్మను స్తుతిస్తూ ఉద్యమ సందర్భాన్ని పాటలో చెబుతూ మిత్రపాట రాస్తే పాడింది విమలక్కే. నిమ్నవర్గాలకు, బహుజనులకు పాట చేరడం లేదని, "బహుజన బతుకమ్మ" పేరుతో బతుకమ్మల పాటల సీడీ ని తీసుకొచ్చారు.

మొత్తంగా విమలక్క పాటలో కనిపించిన కోణాలు అనేకం. అందులో....

1) భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన నిలవడం.
2) చరిత్రలో నిలిచిన వారిని ప్రస్తావిస్తూ ప్రజలను చైతన్యపరచడం.
3) సాంస్కృతిక నేపథ్యాన్ని ప్రజలు కోల్పోకూడదని గుర్తు చేయడం.
4) అమరవీరుల త్యాగాలను ప్రజలకు తెలియపరచడం.
5) సమకాలీనంగా జరుగుతున్న అన్యాయాలను ప్రతిఘటించడం.

ఎవరికీ భయపడకుండా, ఏ ఒత్తిళ్ళకు తలొగ్గకుండా పాట ద్వారా ప్రజలకు తగ్గరైన మొదటి వ్యక్తి నేటి తెలంగాణలో విమలక్కే. ఈ తరువాత కొంత అనుసరించినవారున్నారు. నేర్చుకున్నవారూ ఉన్నారు. ప్రజల పక్షాన తమ వంతు బాధ్యతగా నిలిచారు కాబట్టే, నేటి తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేక భాగస్వాములైనారు.

తెలంగాణ సాంస్కృతిక వైభవంలో ప్రత్యేకతను సంతరించుకున్న పండుగలు అనేకం. అందులో బతుకమ్మ, బోనాలు, సంక్రాంతి, దసరా, ఉగాది తదితరాలు. కాని ఆట పాటలతో కూడిన పండుగ బతుకమ్మ. అందుకనే బతుకమ్మలో తెలంగాణ ఉద్యమం భాగమైంది. మలి దశ ఉద్యమానికి ముందు బతుకమ్మ వైశిష్ట్యాన్ని, ఉన్నతిని ప్రస్తావిస్తూ పాటలుండేవి. కాని, నేడు కొత్తగా రాసిన పాటలు అంతకు ముందున్న బాణీల్లోనే పాడడం వల్ల పాట మాధుర్యం తగ్గలేదు. తెలంగాణ ప్రాంత అవసరాలేంటో తెలిసేలా చేసింది. అయితే, ఈ పాటలను ప్రపంచ వ్యాప్తంగా ఆడుతూ, పాడుతూ ప్రచారం చేసిన వాళ్లలో స్త్రీల పాత్ర అనన్యమైంది. బతుకమ్మ వల్ల కూడ చాలా మంది విద్యార్థులు, మహిళలు గాయనీమణులుగా మారిపోయారు. సకల జనుల సమ్మె, ఛలో ధూం..ధాం...జానపద జాతర, తెలంగాణ సాధనలో భాగంగా నిర్వహించిన ప్రతి కళా ప్రదర్శనలో ప్రతిచోట, గాయనీమణులు వారి ఆట, పాట ప్రదర్శించారు. ఎక్కడ సభ జరిగినా, ర్యాలీ జరిగినా, ఆందోళన జరిగినా బతుకమ్మలు నెత్తినెత్తుకుని దర్శనమిచ్చిన ప్రతి ఆడపడుచూ గాయనీమణెంది. ఒక్కరా ఇద్దరా నూటికి ఎనభై శాతం మంది బతుకమ్మ పాటలతో ఉద్యమపోరు చేసినారు. బతుకమ్మ పై పరిశోధన చేసిన డా॥ బండారు సుజాతశేఖర్ "చిత్తూ చిత్తూల బొమ్మ... శివుడీ ముద్దు గుమ్మ"... అనే కోలాటం పాటను వెలుగులోకి తీసుకొచ్చారు. ఆమె రాసినవి, పాడినవి జనం గొంతుల్లో ఉయ్యాలలై ఊరేగుతున్నాయి. డా॥సుజాత తనకు వాళ్ళమ్మ అనసూయమ్మ ద్వారా పాట అబ్బిందని అంటుంది. అంటే తెలంగాణలోని అమ్మలందరూ గాయనీమణులే.

చిన్నతనం నుండే పాటలు పాడడంలో తనకంటూ ప్రత్యేకతను చాటుకున్న తెలంగాణ ఉద్యమ గాయనీమణి మామిండ్ల పద్మావతి. ఒక్కటో, రెండో కాదు కొన్ని వందల పాటలు సభల్లో, వేదికపై పాడారు. ఆడారు. ఉద్యమగీతాలు, చైతన్య గీతాలు, జానపద గీతాలు, బతుకమ్మ పాటలను పాడడంలో ప్రత్యేకత కనబరుస్తుంది. "చిత్తూచిత్తుల బొమ్మ" పాట ఖండాంతరాల్లో మార్మోగిందంటే కారణం పద్మావతే. "వీరులారా వందనం... విద్యార్థి అమరులారా వందనం", - అంటూ అమరుల త్యాగం స్తుతించిన గొంతు పద్మావతిది.

"అవ్వోనివా నీవు అయ్యోనివా తెలంగాణోనికి తోటి పాలోనివా" అని గూడ అంజన్న రాసిన ఈ ఒక్కపాట చాలు తేలు విజయ గానానికి ఉన్న పదును తెలుసుకోవడానికి. ఇంతటి పదునైన గొంతు కలిగి ఉన్న తేలు విజయ చాలా బతుకమ్మ పాటలు కూడ పాడింది. "జమగూడి జాతరకెల్లి పోదాం తెలంగాణ/ ఉద్యమాల ఉరుసుకెల్లి పోదాం తెలంగాణ" "రామ రామ ఉయ్యాలో-రాఘువ రామ ఉయ్యాలో" పాటలు బతుకమ్మను, ఉద్యమాన్ని ఒకేసారి గుర్తు తెస్తాయి.

చిన్నతనం నుంచే పాటలు పాడే విజయ 1998 లో "నగారే మోగింది" అనే వీడియో ఆల్బమ్‌లో "తండాకుపోతాడు - గుడుంబ తాగుతాండు" అనే పాటతో తన పాటల ప్రస్థానాన్ని ప్రారంభించింది. ఆ వీడియోను రూపొందించింది. సుమంత్ కుమార్. విజయ భర్త. ధూం ధాం ఆరంభమైనాక ఉయ్యాల పాటలతో పాటు, ఉద్యమ పాటలు పాడింది. "బతుకమ్మ" సినిమాలో "ఊరికి ఉత్తరాన వలలో" అనే పాట పాడింది. కేవలం తెలుగులోనే కాక గోండి, హిందీ, కన్నడ, లంబాడి భాషల్లో పాటలు పాడింది. అనేక ఉద్యమ సందర్భాల్లో, టి.వి లోని మాట - ముచ్చటలో, తేలు విజయ పాటలు ఉద్యమానికి ఊపిరిపోశాయి.

"బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు తల్లివే ఉయ్యాలో". మా ఇంటి ముంగిట్లో ఉయ్యాలో". అంటూ యుట్యూబ్‌లో వినవచ్చే గొంతు స్వర్ణది. కరీంనగర్ జిల్లా ఎలబాకకు చెందిన స్వర్ణ చాలా ఉద్యమపాటలు పాడింది. శ్రీకాంతాచారి మరణానికి ముందు అనేక రకాల పాటలు పాడినా శ్రీకాంతాచారి మరణం తరువాత తెలంగాణ వచ్చేదాక ఉద్యమపాటలు తప్ప మరే పాటలు పాడలేదు. తెలంగాణ సమరనాదం, తెలంగాణ రగడా, ఉద్యమాల ఉస్మానియా పేర్లతో స్వయంగా పాటల సీడీలను రూపొందించింది. "ఊరూరా బతుకమ్మ కొలువు తీరిందో - కోవెలైయిందో, పూలన్నీ ఒక్కటై పున్నమైయిందో - వెన్నెలైయిందో". అంటూ ఉద్యమపాటల్లోనూ

బతుకమ్మను తలపోసింది. 'చెలకల్లో పూసిన పూలన్నీ ఒద్దికై, యా ఇండ్ల ముంగిట ముచ్చటాడెనో, తంగేడు, గునుగమ్మ జమ్లిగా నడిచొచ్చి మాతల్లి బతుకమ్మకు జన్మ నిచ్చెనో"– అంటూ పూల జాతరను తన పాటతో పరిచయం చేసింది స్వర్ణ.

స్వర్ణ అక్క జ్యోతి ప్రగతిశీల మహిళా సంఘంనేత. ఈమె అరుణోదయ కళాకారులతో కలిసి పాటలు పాడేది. జ్యోతితో పాటు స్వర్ణ కూడ కలిసి పాటలు పాడేది. జ్యోతి కూడ ఉద్యమపాటలెన్నో పాడింది. తెలంగాణ ఉద్యమంలో పాడిన పాటల్లో స్త్రీలు పాటలు పాడితే ఆ పాటల్లో తెలంగాణ చరిత్రలో చరితార్థులుగా మిగిలిపోయిన మహిళలల్లో చుట్టు ప్రక్కల రాజ్యాలపై కత్తి దూసిన రుద్రమదేవి, కాకతీయులపై కత్తులు దూసిన సమ్మక్క, తెలంగాణ సారక్క, తెలంగాణ అమ్మ తెలంగాణ/ అయిలమ్మ వంటి చాలా పాటలొచ్చాయి. వీటిని పాడిన గాయనీమణులున్నారు. చరిత్రలో ముఖ్యులైన స్త్రీలను, వారి కృత్యాలను ఉద్యమ సందర్భంలో ప్రజలకు తెలియజెప్పినారు. పాట మూలాలు బలంగా ఉన్నాయని నిరూపించినారు. వీర పోరాటంలో బలైన, నేలకొరిగిన ప్రతి తెలంగాణ బిడ్డ ప్రజల పాటలకు పల్లవులైనారు.

అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వారు వేసిన తెలంగాణ –ధూంధాం ఉద్యమ పాటల్లో భాగంగా అందె మంగ రాసిన పాట "తెలంగాణ పల్లె పల్లె కదులుతున్న దోరన్న కదులుతున్నదోరన్న". ఈ పాటలో తెలంగాణ రాష్ట్ర చిత్రపటం మన కళ్ళ ముందు కనిపిస్తుంది. నెహ్రూ మాటలనుంచి మొదలు విశ్వవిద్యాలయాల్లో జరిగిన పోరు, రాజకీయ ఎత్తుగడలన్నీ ఈ పాటలో ప్రస్ఫుటమయ్యాయి. "నాలుగు కోట్ల మంది ఒక్కటయినరోరన్న పిక్కటిల్లిరో" అంటూ తెలంగాణ ప్రజల ఆగ్రహం పరిపాలకులకు అర్థమయ్యేలా పాట రాసింది అందె మంగ.

అనిశెట్టి రజిత తెలంగాణలో ప్రముఖ కథా రచయిత్రి, కవయిత్రి. ఉద్యమ నేపథ్యమున్న కవిత్వమెంతో రాసింది. పాటలూ రాసింది. పాడింది. "ఓరుగల్లు పోరుగానం" పేరిట సీడి ని ప్రజల ముందుంచింది. "తల్లి తెలంగాణమా", "పాట పూచిన చెట్టురా/తెలంగాణ గట్టురా" తదితర పాటలను అనేక ఉద్యమ సందర్భ వేదికల్లో పాడింది. పోరుకు ప్రతీకగా నిలిచినవి అనిశెట్టి రజిత పాటలు.

అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వాళ్ళు వేసిన సీడీలు చాలా ఉన్నాయి. మిత్ర రాసిన ఉద్యమ పాటలను విమలక్కతో పాటు పాడిన ఇతర గాయనీమణులున్నారు. వసంత పాడిన "ఇన్నాళ్ళు లేని లొల్లి బుట్టె లొల్లి బుట్టె"

పుష్ప, నిర్మల, విమల పాడిన "ఎట్లెట్ల తెలంగాణ, ఎట్లెట్ల తెలంగాణ" ఉద్యమ సభల్లోనే కాదు తెలంగాణలోని ప్రతి హోటల్లో, బస్టాండులో, ప్రతి ఇంట్లో, ప్రతి నోట పాటలై నిలిచాయి.

ఉద్యమంలో పాడిన మరో ప్రముఖ గాయనీమణి రమాదేవి. తెలంగాణలోని పదునైన ఉద్యమ గొంతుకల్లో రమాదేవిది ఒకటి. ప్రముఖంగా వినిపించిన చాలా పాటలు పాడింది. "అవ్వల్ దర్జా, తెలంగాణ ధూంధాం, మాఊరు, అమ్మపాట, నాగేటి సాల్లల్ల" వంటి పాటల సిడిల్లోనూ పాడింది.

తేలు విజయ, దేశపతి శ్రీనివాస్, బండ వెంకన్న, పయిలం సంతోష్, శంకర్‌బాబు, వేముగంటి ప్రసాద్, వడ్లకొండ అనిల్‌కుమార్, ఆకునూరి దేవయ్యలతో కలిసి పాటలు పాడింది. "ఏడేడు దారుల్లో", ఉద్యమాల" "కరీంనగర్ గడ్డమీద", "తెలంగాణ పాట నేడు", "సినబోయినా వెందుకమ్మా" 'భాషల్ల భాషమ్మ", "ఎర్ర ఎర్రాని దారుల్లో", తెలంగాణ సిరులతల్లి", "పోరు సాగుతుంది", "రారో రాజన్న రణం జెయ్య", వీరుల్ని కన్నావే తల్లి" "జోహరులు" "చూడు తెలంగాణ", వంటి ఎన్నో పాటలు ప్రజల ఆలోచనలను తెలంగాణ రాష్ట్ర సాధన వైపు మళ్లించాయి. మిత్ర, కోదారిశ్రీ, గద్దర్, గోరటి వెంకన్న, గూడ అంజయ్య రాసిన పాటలను పుష్ప సంతోష్, విమలక్కలతో కలిసి పాడింది. "తాగబోతే నీళ్ళు లేక డప్పులు కొట్టి", "ఉండు పయిలంగుండు" తదితర పాటలను రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ధూం ధాంల్లో పాడింది పుష్ప. "తెలంగాణ", "రగులుతున్న తెలంగాణ", "బతుకమ్మ పాటలు", "తెలంగాణ కొలువు", "తల్లడిల్లుతున్న తెలంగాణ" సి.డిల్లోనూ పుష్ప గానం ద్వారా తెలంగాణ ప్రజలను ఉద్యమ బాట పట్టించింది.

'రగులుతున్న జ్వాల తెలంగాణ నేల' పేరిట వెలువడిన సి.డిల్లో నరేష్ పార్థు రాసిన పాటలు పొందుపరచబడ్డాయి. ఇందులోని పాటలైన అమరవీరులు, రక్తం యేరై పారిన, తెలంగాణ బ్రతుకులు తదితర పాటలను దివ్య గానం చేసింది. నిజామాబాదు జిల్లాలో జరిగిన సకల జనుల సమ్మెలోనూ, ధూం ధాంలోనూ దివ్య తన పాటకు పదును పెట్టింది.

దివ్యతో పాటు తెలంగాణ జిల్లాలన్నింటిలోనూ ఉద్యమపోరు చేసిన నిజామాబాదు జిల్లా గాయనీమణులున్నారు. ఇందూరు గాన కోకిలగా ప్రశంసలు పొందిన టేక్మాల్ విజయలక్ష్మి తెలంగాణ ఉద్యమంలో జిల్లావ్యాప్తంగా ఎన్నో వేదికలపై తన గానం వినిపించారు. మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, వరంగల్, హైదరాబాద్

తదితర జిల్లాల్లో పలుమార్లు నిర్వహించిన ధూంధాం కార్యక్రమాల్లో పాల్గొని తన గాన మాధుర్యంతో ప్రజలను చైతన్యపరిచారు. "అదిగో ఉదయం అదిగదిగో ఉదయం నిద్ర విడిచి ఓ మహిళ మేలుకో కదిలిరా..." అంటూ మహిళా చైతన్య గీతాలను ఆలపించారు. తెలంగాణలోని ధూంధాం కార్యక్రమాల్లో గద్దర్, రసమయి బాలకిషన్, గోరటి వెంకన్న, విమలక్కలతో గొంతు కలిపి మన్ననలందుకున్నారు. 1994 నుంచి అనేక ఆడియో సిడి లను వెలువరించినారు.

ఈమధ్యే తెలంగాణ రాష్ట్రావిర్భావ సంబురాల సందర్భంగా (జూన్ 2, 2016) నిజామాబాద్ జిల్లా నుంచి గంగకు రాష్ట్ర ప్రభుత్వం అవార్డు ఇచ్చింది. ఉద్యమకాలంలో తన పాట ద్వారా ప్రజలను పోరుబాటన నడిపించింది. గద్దర్, గోరటి వెంకన్న, గూడ అంజయ్య, అంబటి వెంకన్న, పయిలం సంతోష్, రసమయి బాలకిషన్ తదితరులతో కలిసి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పాట ద్వారా ప్రజలను చైతన్య దిశలో నడిపించింది. వీరితో పాటు సరిత, సవిత, మనోజ, లత, స్రవంతి, మీన, సింధూజ, లక్ష్మి, గంగాలక్ష్మి లు కూడ రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో, వివిధ సభల్లో, టి.ఎన్.జి.ఓ కార్యాలయం ముందు, సకలజనుల సమ్మె సందర్భంలో, అమరవీరుల స్థూపం దగ్గర, విశ్వవిద్యాలయాల్లో, అంబేద్కర్ భవన్‌లో తదితర ప్రదేశాల్లో ఉద్యమ గీతాలను పాడినారు. 'అయ్యోనివా నీవు', 'నాగేటి సాల్లల్ల', 'ఇస్తనని చెప్పుడేంది', 'తరగని సంపద ఉన్నా', 'జై తెలంగాణ జై తెలంగాణ', 'మీ త్యాగాల తెలంగాణ', 'రామరామ ఉయ్యాలో' తదితర పాటలను పాడి ప్రజా ఉద్యమానికి ఊపును తెచ్చినారు. పయిలం సంతోష్ రాసిన పాటలను పాడిన వారిలో విమలక్కతో పాటు నిర్మల, పుష్ప, మంగ, స్నేహ, రాణి, మనీష తదితరులు తెలంగాణ సాంస్కృతిక ఉద్యమంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సాధించడమేలక్ష్యంగా ఉద్యమించిన కళాకారులు. ఉద్యమాన్ని ముందుకు నడిపించిన పాటలో సందర్భాన్ని బట్టి అప్పటికప్పుడే పాటలల్లి పాడినవే ఎక్కువ.

పల్లె పల్లెనా నిత్యం అరుణోదయ పోరుగానం ఆలపించిన వారిలో అనిత, కవిత, సంగీత, సౌమ్య, అనుభాయి, శ్రావణి, సిరి, సౌజన్య, అనూష, వెన్నెల, యామిని, విశాల, మమత, మల్లికలు విమలక్కతో పాటు గళం కలిపినవారు. కళ కళ కోసం వాదు. కళ ప్రజల కోసమని గొంతెత్తి, చాటి చెప్పిన గాయనీమణులున్నారు. అందుకే అంబటి వెంకన్న ఇలా అంటాడు. "తెలంగాణ ధూంధాం లకు, బహిరంగ సభలకు, సమావేశాలకు వేలాదిగా, లక్షలాదిగా జనం తండోప తండాలుగా తరలి వచ్చి తెలంగాణ గోసను పాటద్వారా అవగతం చేసుకొని కన్నీళ్ళు పెట్టిన

సందర్భాలున్నాయి. కసితో కదనానికి కాలు దువ్విన సందర్భాలున్నాయ్. ప్రపంచంలోనే ఇంత సుదీర్ఘ కాలంగా, సజీవంగా కొనసాగిన ఉద్యమం ప్రత్యేక తెలంగాణ ఉద్యమం తప్ప మరొకటి లేదంటే అతిశయోక్తి కాదు".

వరంగల్లు రచయితల సంఘం వారు "తెలంగాణ మట్టి పాటలు" నల్లెల్ల రాజయ్య సంపాదకత్వంలో వెలువరించినారు. తెలంగాణ అమర వీరులందరికి అశ్రుసిక్త నయనాలతో అంకితమిచ్చిన ఈ పుస్తకంలో నామని సుజనాదేవి రాసిన తెలంగాణ పాట ఉంది. సుజనాదేవి గాయని కూడ. తెలంగాణ సంస్కృతిలో వచ్చిన మార్పుకు, వ్యవసాయ మార్పులకు ప్రతీకగా రాసిందీ పాట. ఉద్యమ సందర్భంలో అనేక చోట్ల పాడింది కూడ.

పాటల రచయితగా, గాయకురాలిగా ప్రజా ఉద్యమంలో పాలొన్న మహిళల్లో జలజ పాత్ర ప్రముఖమైంది. "అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య" తరపున జరిగిన ప్రతి కార్యక్రమంలో పాల్గొన్నది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వేణుగోపాల్‌రెడ్డి మరణం తరువాత ఉద్ధృతంగా వచ్చిన ఉద్యమంలో పాల్గొని తన ఉద్యమ బాణీ వినిపించింది. సులోచన, మేరీమాదిగ, రత్నమాలలతో కలిసి పాటలు పాడుతూ శవయాత్ర నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో సంఘటిత శక్తి ఏర్పడింది. ఇషాంత్‌రెడ్డి అమరుడైనప్పుడు ఒక లక్ష మందితో శవయాత్ర ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి గన్‌పార్కు వరకు సాగితే, అందులో పాట పాత్ర ప్రధానం. ఇబ్రహీంపట్నంలో విద్యార్థి చనిపోయినప్పుడు, తెలంగాణ ప్రకటన (డిసెంబర్ 9) సందర్భంగా రాత్రింబగళ్ళు పాటలు పాడి ప్రజా ఉద్యమాన్ని ముందుకు నడిపించింది."దీక్షలు, ప్రాణత్యాగం జరుగుతుంటే చూస్తున్నావా?" అని సోనియాగాంధీ మీద విమర్శనాత్మకంగా పాట రాసింది. ధనలక్ష్మి, రత్నమాల, మణి, పద్మ తదితరులతో కలిసి ఢిల్లీలోని జంతర్‌మంతర్ దగ్గర జర్నలిస్టులతో కలిసి పాటలు పాడింది. లగడపాటి దీక్ష సందర్భంగా తెలంగాణలో ఉవ్వెత్తున ఎగిసిన ఉద్యమంలో తెలంగాణ అంతటా పాటలు పాడి, ప్రజా సంఘాలన్నింటిని సంఘటితం చేసింది. గద్దర్, గూడ అంజయ్య, రసమయి బాలకిషన్ తదితరులతో కలిసి పాటలు పాడింది. అనేక సందర్భాల్లో పాటలు పాడుతూ పోలీసుస్టేషన్‌లో బందీ అయిన విమలక్క, తదితరులతో జలజ కూడ ఉంది. ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల ముందు, ఎలక్ట్రిసిటీ జాక్‌లో, నాగం జనార్దన్ రెడ్డి జాక్‌లో ఇలా ప్రతి సందర్భంలోనూ పాటలు పాడిన జలజ పాత్ర తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రధానమైంది. "సమాజానికి చేసిన సేవ ఎన్నడూ వృధాగా పోదని" రత్నమాల చెప్పిన సిద్ధాంతాన్ని నమ్మింది.

మధుర కళా బృందంతో కలిసి పాడిన మంజుల, ధనలక్ష్మి, రజిత, భార్గవి, మమత, (రాజక్కపేట) స్వప్న, చామంతి, శశిప్రియ, మమత (ప్రజ్ఞాపూర్) తదితరులు ఉద్యమం నడుస్తున్న కాలంలో అనేక వేదికలపై ఆడి, పాడి ప్రజల్లో చైతన్యం కలిగించినారు. సందర్భాన్ని బట్టి కొందరు వ్యక్తిగతం గాను, కళా బృందంతోనూ కలిసి పాడినారు. వీరిలో ధనలక్ష్మి, రజిత, మమతలు ఒకే భావజాలంతో కూడిన వారై తెలంగాణ ఉద్యమ వేదికలపై కాలికి గజ్జెకట్టి ఊరూరా తిరుగుతూ ఉద్యమానికి ఊపిరిలూదినారు. పాటలో కోరస్‌కు పరిమితమైన వారు కూడ ఉన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా నిర్వహించిన "రేలారెరేలా" కార్యక్రమంలో పాల్గొన్నారు. శశిప్రియ, మమత (ప్రజ్ఞాపూర్) లు గద్దర్ కళా బృందంతో కలిసి పాటలు పాడినారు.

బతుకమ్మ ఆడిన ప్రతిచోట, వంటా వార్పు చేసిన చోట, రైలురోకో సందర్భంగా తెలంగాణలో జరిగిన ధూం-ధాం వేదికలపై, పాఠశాలల్లో, మెదక్ జిల్లాలోని కళాశాలల్లో పాడి విద్యార్థుల్లోనూ, ప్రజల్లోనూ ఉద్యమ చైతన్యాన్ని కలిగించినారు. ఉయ్యాల పాటలు, "కొనసాగుతుంది బిడ్డా తెలంగాణ, ఇత్తరు తెలంగాణ-వస్తది రాష్ట్రం, అదిగదిగో తెలంగాణ (పోరు పాట), వీరులారా వందనం, బాల కార్మికులారా, అయ్యోడివా నీవు అవ్వోడివా, మత్తడి దుంకి అలుగు తున్నాకుని, చింతకాయ, జీడికాయ, చిగురు మామిడికాయ",... ఇలా చాలా పాటలు మధుర కళా బృందం, గద్దర్ బృందంతో కలిసి పాడినారు. మధుప్రియ, శ్వేత, శేఖర్ భార్య పరమేశ్వరి, సంధ్య, మధులత ఎలక్ట్రానిక్ మీడి

యా ద్వారా జరిగిన మాట-ముచ్చట, రేలారెరేలా, కార్యక్రమాల్లో పాల్గొని పాటలు పాడినవారు. వీరి నోట ప్రతి మాట పాటగా ప్రవహించింది - ప్రజానాడిని పట్టుకుంది.

ఉద్యమదశలో ప్రతి జిల్లాలోని పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయాల్లో చదివే విద్యార్థినులనుంచి పాట పాడగల సత్తా ఉందనుకున్న ప్రతి మహిళా గాయకురాలైంది. జన జాతరలోకి ఉద్యమ ప్రతీకగా వచ్చిన "బతుకమ్మ" కూడ మహిళే. తెలంగాణ సంస్కృతికిప్రాణం పోసిన బతుకమ్మ కూడ పోరులో భాగమైంది. ఉయ్యాలపాటలు ఉద్యమగీతాలైనాయి. ఉయ్యాల పాటల్లో ఇప్పటి వరకున్నది గత చరిత్ర. ఇప్పుడున్నది నేటి చరిత్రతో కూడిన ఉయ్యాల పాట. భవిష్యత్‌లోని వారికి, చరిత్రకు దిక్సూచి. ఉయ్యాల పాటలు పాడేది మహిళే కదా ! జన జాగృతికి ఉగ్రరూపాన్నందించే మహిళ ఉన్నంత వరకు మహిళతోనే పాట ఉంటుంది. పాటను పదిలంగా, నిలకడగా, ఉద్ధృతిగా మహిళే పాడుతుంది. భావితరాలకు ఆదర్శప్రాయమవుతుంది.

నిశ్శబ్దాన్ని బద్దలు కొడదాం



కె. విమల

మలిదశ ఉద్యమకాలంలో హైద్రాబాదు కేంద్రంగా పనిచేసిన ఉద్యమ కారిణులతోనే గాక అటు ఖమ్మం నుంచి ఇటు పాలమూరు వరకు ఉద్యమానికి పూర్తికాలం వెచ్చించిన స్త్రీలతో కలిసి పనిచేసిన అనుభవం నాకెన్నో విషయాలను బోధపర్చింది. "రిజర్వు శ్రామిక దళం" గా తప్పితే స్త్రీలకు ఉనికి లేదనే విషయం మరింత స్పష్టంగా అనుభవానికొచ్చింది. ఇటువంటి నేపథ్యంలో పెద్దలు డా.సి.నారాయణరెడ్డి గారు, డా.సుజాతారెడ్డి గార్లు పూనుకొని 'తెలంగాణ ఉద్యమంలో స్త్రీల పాత్ర' అనే విషయంపై సదస్సు రూపంలో పరిశోధనలను ప్రోత్సహించడం సంతోషించాల్సిన విషయం. ఇంతకాలం అకాడమీల్లో కాసింత చోటు కేటాయించి తెలంగాణ చరిత్ర సంస్కృతుల గురించిన చర్చను అంతర్గత వలసవాదులు మరుగు పరిచినట్లుగనే దేశవ్యాప్తంగా, ఆ మాటకొస్తే ప్రపంచవ్యాప్తంగా స్త్రీల చరిత్రా, జ్ఞానాలు పితృస్వామ్య వ్యవస్థలో విస్మరణకు గురైన విషయం తెలిసిందే. నవ తెలంగాణ అందుకు మినహాయింపవుతుందేమో నన్న ఆశలు ఈ సదస్సు కల్గిస్తున్నది.

భాష, చరిత్ర, సంస్కృతుల ప్రాధాన్యతలను, స్థాయీ భేదాలను నిర్ణయించే అధికారం, అవకాశం వున్న జాతులూ, శ్రేణులూ, దేశాలూ తమకు భిన్నంగా వున్న సంస్కృతులను అవహేళన చేయడం, వెనకబడిన వారుగా ముద్రవేసి వారిపై అధికారం చలాయించడం ప్రస్తుత ప్రపంచీకరణ నేపథ్యంలో సాధారణమైంది. వెనకబడిన ప్రాంతాలుగా అభివృద్ధి చెందిన దేశాల చేత ముద్రపడిన దేశాలు, జాతులు క్రమంగా తమ సాంస్కృతిక సామాజిక, ఆర్థిక సార్వభౌమత్వాన్ని తాకట్టు పెట్టే పరిస్థితులలోకి అనివార్యంగా నెట్టివేయబడుతున్న రాజకీయ సందర్భమిది. ఇలాంటి సందర్భంలో "స్థానికత" అనే తాత్విక పునాది పై మొదలైన తెలంగాణ మలిదశ ఉద్యమం ఎందరికో భవిష్యత్తుపై ఆశలు చిగురించేట్టు చేసింది. ఆధునికానంతర సాంస్కృతిక పునరుజ్జీవనానికి దారులు తెరిచింది. రకరకాల అణచివేతల్లో మగ్గిపోతున్న శ్రేణులకు ఉత్తేజాన్నిచ్చింది. సొంత రాష్ట్రం ఏర్పాటు చేసుకోవడం అంటే కేవలం పాలనా

సౌలభ్యం కోసం కొత్త యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకునే ప్రయత్నం కాదని నిర్ధారించింది. స్థానిక భాషా, సాంస్కృతిక, సామాజిక వైవిధ్యాలను గుర్తించి గౌరవించడమేగాక సమానావకాశాలను అందించే సామాజికావరణాన్ని సృష్టించుకోవడమనే అవగాహనతో సబ్బండ శ్రేణుల్లోనూ అణిచివేతకు గురౌతున్న స్త్రీలు తెలంగాణ విముక్తి తమ విముక్తికి దారులు వేస్తుందన్న నమ్మకంతో ఆటుపోట్లకు ఎదురొడ్డి ఉద్యమంలో ముందువరసన నిల్చింద్రు. ఇండ్లూ, వాకిండ్లు వొదిలి వీధుల్లోకి వచ్చింద్రు. కవయిత్రులుగా, రచయిత్రులుగా, కార్యకర్తలుగా, ఉద్యమకారిణులుగా, బిడ్డల్నే విరాళంగా ఇచ్చిన తల్లులుగా మలిదశ ఉద్యమంలో స్త్రీలు తెగించిపోరాడుదం తెలంగాణ వచ్చేదాక అంటూ ముందుకురికింద్రు). 'వంచితలు' గానే తప్ప 'పౌరులు'గా గుర్తింపునే కోల్పోయిన స్త్రీలు మార్పుకోసం భిన్న రంగాల్లో చైతన్యశక్తులుగా పనిచేసి ఉద్యమానికి ఊపిరిలూదింద్రు. సారలవ్వల వారసత్వం నుంచే గాక శతాబ్దాలుగా అవిచ్ఛిన్నంగా సాగిన స్థానిక స్త్రీల సాహిత్యోద్యమాల నుంచి కూడా చైతన్యం అందింది. ఐతే ఈరోజుల్లో అటువంటి సాహిత్యోద్యమాల గురించి ప్రస్తావన మాత్రంగానైనా లేని సాహిత్య చరిత్రలు ప్రామాణికంగా చలామణి అయ్యే దురదృష్టకర పరిస్థితుల్లో మనం ఉన్నం.

ఈ నేపథ్యంలో "తెలంగాణ ఉద్యమంలో రచయిత్రుల పాత్ర" లను లోతుగా తరచి చూస్తే ఎన్నో విషయాలు తెలుస్తై. అన్నిటి కంటే ముఖ్యంగా ఉద్యమాలు-రచయిత్రుల గురించి రాయడమంటే కేవలం సాహిత్య చరిత్రనే కాదు ఆయా సమాజాల చరిత్రనే తిరగరాయాల్సి వుంటుందని అర్థమౌతుంది. అటువంటి పనికి పూనుకోవడమంటే మాటలు కాదు. వ్యవస్థను గురించిన లోతైన అవగాహనతో పాటుగా చారిత్రక పరిణామాలనూ, స్థల,కాల,ప్రాంత ప్రత్యేకతలనూ; కులం, మతం, వర్గం,లింగం వంటి అస్తిత్వాకాంక్షల మూలాలను తరచి చూడాల్సి వుంటుంది. అదే సమయంలో భిన్న శ్రేణుల్లోని స్త్రీల జీవితాలను శాసించే పితృస్వామ్య వ్యవస్థ పుట్టుపూర్వోత్తరాలే కాదు, దాని ఆధునిక రూపాలనూ, అత్యాధునిక దురహంకారాలనూ అర్థం చేసుకోవాల్సి వుంటుంది. అన్నిటికి మించి స్త్రీల అనుభవాలను, ఆచరణలను పునర్మూల్యాంకనం చేయడమంటే వారికి చరిత్రలో కాసింత స్థలం కేటాయించడం కాదనీ; వినియోగదారీ సంస్కృతికి ప్రాణం పోస్తున్న పురుష రాజకీయాలను ధిక్కరించే ప్రత్యమ్నాయాలను వెతుక్కోవడమనే అవగాహనకు రావాల్సి వుంటుంది.

కానీ 'రచన' ఉద్యమాలకు తొలి అడుగు అని గ్రహించగలం. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే తమ తమ భావజాలాలననుసరించో లేదా తమ సంఘర్షణలకు

అప్పటికప్పటి ప్రతిస్పందన గానో సమష్టి కార్యాచరణలనెంచుకొని మార్పుకోసం బృందాలుగా ఏర్పడి పనిచేయడాన్ని "ఉద్యమం"గా నిర్వచించుకుంటే మార్పుదిశగా సాహిత్య కళారంగాల ద్వారా నిరంతరం కృషిచేసిన రచయిత్రులది 'వ్యక్తిగత ఉద్యమం' అని అర్థం చేసుకోగలం. పితృస్వామ్య వ్యవస్థగా యుగాలుగా స్థిరపడిన సామాజిక సందర్భంలో ఎలాంటి చేయూత లేకున్నా పరిస్థితులకు ఎదురీదుతూ సాహిత్య సృష్టి చేయడం లోనే రచయిత్రుల ఉద్యమ స్ఫూర్తి అర్థమౌతుంది. అటువంటి ఉత్యమ స్ఫూర్తే స్త్రీల సాహిత్యానికి ప్రాసంగికతను ఏర్పరుస్తుంది.ఆనాటి కవయిత్రులు మొదలుకొని ఈనాటి రచయిత్రుల వరకు పదం పాడి కలం పట్టి కవాతు చేసిన స్త్రీల వ్యక్తిగత చైతన్యం ఆ విధంగా చూస్తే ఏ ఉద్యమ కార్యాచరణకూ తీసిపోనిది. తరతరాలుగా సామాజిక చట్రాల్లో ఊపిరాడని స్థితిలోంచీ, తమవే అయిన అనుభవాల్లోంచీ, చుట్టూ వున్న జీవావరణంతో తమకున్న సంబంధాల ప్రతిఫలనాల్లోంచీ రచనకు పూనుకోవడం మూలంగా బౌద్ధిక భౌతికవాదులుగా, యథార్థవాదులుగా రచయిత్రులు కొనసాగే వైనం ఏ ప్రతిఘటనా పోరాటాలకూ తీసిపోనిది. అంతేకాదు, ప్రతి రచనా ఒక పోరాటంగా సాగాల్సిన ఈ క్రమంలో స్త్రీల సృజనాత్మకత ఎన్ని విధాలైన ప్రక్రియా వైవిధ్యాలకు తావిచ్చిందో తెలంగాణ ప్రాచీన కవయిత్రుల కృషిని చూస్తేగాని అర్థం కాదు.

ఏ జమీందార్ల ప్రాపకంలోనో, ఏ రాజుల మెప్పుకోసమో సాహిత్య సృజన చేసిన ఆనాటి పురుష రచయితలకు భిన్నంగా అధికార కేంద్రాలకు ఆవల మూలలకు తోసివేయబడిన సామాజిక ఆవరణల్లోంచి వందల ఏండ్ల క్రితమే తెలంగాణ స్త్రీల చైతన్యం జాగృతమైందనడానికి కవయిత్రి "నాచి" గొప్ప ఉదాహరణ. 7 వ శతాబ్దం లోనే తన ఆత్మకథను సంస్కృతంలో దృశ్యకావ్యంగా మలిచిన సృజనశీలి ఆమె. చిన్నతనంలోనే భర్తను కోల్పోయిన తన విధవా జీవితం గురించీ, తన సంఘర్షణల గురించీ 'నాచీ విజయం' అనే దృశ్యకావ్యంలో నిక్షిప్తం చేయడమే గాకుండా, స్త్రీలు విద్యకు అనర్హులు అన్న పితృస్వామ్య భావనను ఆచరణలో ధిక్కరించిన ధీర. ఆ తర్వాతి కాలంలో, తెలంగాణ వ్యాప్తంగా సాహిత్య సాళ్లను పరిచి, స్త్రీల మనోభావాలను ఎలాంటి అరమరికలు లేకుండా సూటిగా చెప్పిన కన్నడ కవయిత్రి అక్కమహాదేవి కావొచ్చు; తొలి తెలుగు కవయిత్రి కుప్పాంబిక కావొచ్చు; చరిత్ర ఆధారంగా కాల్పనిక కావ్యాన్ని రచించిన గంగాదేవి కావొచ్చు; సరళమైన భాషలో రామాయణం రాసి మాట్లాడే భాషకు కావ్యస్థానంకల్పించిన మొల్ల కావొచ్చు; గజల్లు రాసిన తొలి ఉర్దూ కవయిత్రి వాయత బక్షబేగం కావొచ్చు; కవయిత్రీ – కళాకారిణి, రాజకీయవేత్తా –

ఉస్మానియా యూనివర్శిటీకి భూమిని విరాళంగా ఇచ్చిన మహలఖాబాయి చందా కావొచ్చు. – భాషా సాహిత్య ప్రక్రియల్లో వారు చూపిన ప్రత్యేకతకు, స్వతంత్ర వ్యక్తిత్వాలను మలుచుకోవాలనే వారి స్వీయ చైతన్యమే మూలం. వారి రచనలకు చలనశీలతా, చదువరులను కొత్త ఆలోచనలవేపు మళ్లించింది కూడా వారి ఈ చైతన్యమే. ఐతే ఈ చైతన్యాన్ని నిక్షిప్తం చేసుకున్న రచనలు అన్నీ లభ్యం కాకపోవడం దురదృష్టం. 'నాచీ విజయం' లాంటి రచనలను పరిశోధించి వెలికితీసే పక్రియ ఈతరం పరిశోధకులు ఉద్యమ స్ఫూర్తితో చేపట్టాల్సే వుంది. అందుకు ఈ సదస్సు తొలి అడుగు కావాలి.

ఏ ఉద్యమమైనా దేనికది విడిగా ఉనికిలోకి రాదు. తెలంగాణ ఉద్యమం అని ప్రస్తుత సదస్సులో మనం చర్చించే ఉద్యమ దశకి పూర్వ ఉద్యమాలు ఆధునిక కాలంలో అవిచ్ఛిన్నంగా సాగినై. ఆయా ఉద్యమాల కార్యాచరణలు కావొచ్చు, భావజాలాలు కావచ్చు తర్వాతి ఉద్యమాలకు ఏదో విధంగా దోహదం చేసినవే. అట్లాగే మలిదశ ఉద్యమం గురించి మనం చర్చించడం అంటే తొలి దశల్లోని ఉద్యమాలను స్మరించడం కూడా. లేదా వాటి ప్రతిఫలనాలు ప్రస్తుత సందర్భంలోకి ఎలా తర్జుమా ఐనవో అర్థం చేసుకోవడం కూడా అనొచ్చు. ఈనేపథ్యం లోంచి గనుక విశ్లేషించాల్సి వస్తే 'ఉద్యమం' కాదు 'ఉద్యమాలు–రచయిత్రుల భాగస్వామ్యం' అనే కోణంలో అధ్యయనం చేయాల్సి వుంటుంది. ఉదాహరణకి ప్రస్తుతం మనం చర్చిస్తున్న మలిదశ తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలకూ, స్త్రీల కార్యాచరణలకు బీజాలు 1900 సంవత్సరం నాటికే ఏర్పడినై అనడానికి గ్రంథాలయోద్యమం గురించీ, ఆ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన అచ్చమాంబ గురించీ మాట్లాడుకోవాలి. ఆధునిక కాలంలో తొలి తెలుగు కథను రాసిన రచయిత్రిగానే గాక స్త్రీల అనుభవాల్లోంచి పురుష స్వభావాలను, పితృస్వామ్య భావజాలాన్ని తనదైన వ్యంగ్యంతో పురాణ కథను తిరగరాసిన సాహిత్య ప్రయోగశీలిగా కన్పిస్తుందామె. 'దశకుమార చరిత్ర' లోని ఓ చిన్న కథను ఆధునిక పాఠకులకు పరిచయం చేస్తూనే ముగింపులో తనదైన వ్యంగ్యపు చరుపుతో చదువరులను దిగ్గున లేచేలా చేసిన రచయిత్రి ఈమె. వ్యవస్థలో మారని స్త్రీల స్థానం గురించి ఆలోచించేలా చేసి పఠితల్లో కొత్త ఆలోచనలకు బీజం వేయడమే రచయిత్రిగా ఆమె వేసిన తొలి అడుగు. ఆ అడుగులే ఆమెను క్రమంగా 'చదివించే' ఉద్యమం వైపు, స్త్రీ విద్యవైపు నడిపించినై. గ్రంథాలయోద్యమానికి దారులు వేసినవి. చదువరులు లేకపోతే రచనలకు ఉనికే లేదు. అట్లా 'పాఠక జనులను' (Reading Public) తయారు చేయాల్సిన అవసరాన్ని గుర్తించి ముందుకు

వచ్చిన గ్రంథాలయోద్యమంలో స్త్రీ, పురుషులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఊరూరా 'పుస్తకాల బడులు' వెలిసినై. వ్యవస్థీకృత బడులకు భిన్నంగా ఆంక్షలు లేని స్వేచ్ఛాపూరిత వాతావరణంలో "చదవడం" వైపు జన సందోహాలను నడిపించిన ఈ గ్రంథాలయోద్యమం తర్వాతి 'ఆది హిందూ ఉద్యమానికి' బాసటగా నిల్చింది. కుల అంతరాల్లో నలిగిపోతున్న దళితుల ఆత్మగౌరవం కోసమే గాక అన్ని శ్రేణుల్లోనూ అణగారిపోతున్న స్త్రీల విముక్తికి 'విద్య' అవసరం అనే నినాదంతో దేశవ్యాప్తంగా మార్పుకు దోహదం చేసిన ఉద్యమం ఆదిహిందూ పరిషత్తు ద్వారా ఉద్ధృతమైంది. భాగ్యరెడ్డివర్మ వంటి దార్శనికుని పూనికతో మొదలైన ఈ ఉద్యమం పూనేలో "అఖిల భారత నిమ్నవర్గాల మహాసభ" ఏర్పాటుకు దారులు వేసింది. అంబేద్కర్ వంటి ప్రజాస్వామిక మేధావికి భవిష్యత్ కార్యాచరణను నిర్దేశించడంలో ప్రముఖ పాత్ర వహించిన ఆదిహిందూ ఉద్యమంలో ఎందరో స్త్రీలు స్వచ్ఛందంగా పనిచేసిన దాఖలాలున్నవి. ఆనాటి వారి ఆ ఉద్యమ చైతన్యమే తర్వాత కాలంలో నాయకత్వ స్థాయి అందుకున్న సుమిత్రాదేవి, సదాలక్ష్మి, ఈశ్వరీబాయి వంటి దళిత నేతలనే గాక జనానా స్త్రీలను సైతం 'పబ్లిక్ (ప్రజల్లోకి) వచ్చేట్లు చేసింది. 'స్త్రీ విద్యా వికాస సమితి' (Women's Association for Education & Social Advancement) వంటి స్త్రీల హక్కుల కోసం పనిచేసే స్త్రీల సంస్థలకు బీజాలు వేసింది. ఇంతకాలం మనం సామాజిక దురాచారాలను రూపుమాపాలనే నినాదంతో చొచ్చుకు వచ్చిన ఆర్యసమాజం, బ్రహ్మసమాజం వంటి సంస్థల ద్వారా సాగిన సంస్కరణ ఉద్యమాల చరిత్రనే వినివున్నం. ఇక్కట్ల నుంచి స్త్రీలనుద్ధరించే ఉద్దేశ్యంతో పురుషుల నాయకత్వంలో సాగిన సంస్కరణ ఉద్యమాలుగా వాటి గురించి మనకు తెలుసు. బాల్య వివాహాలు రద్దు, విధవా వివాహం వంటి సంస్కరణల కోసం పనిచేసిన వీరేశలింగం వంటి కోస్తాంధ్ర పంతుళ్ల గురించి చదివినం. కానీ, సంస్కరణోద్యమాల వెల్లువలో, జాతీయోద్యమ వేడిలో దేశమంతా తలమున్కలయితున్న కాలంలోనే స్త్రీల హక్కులను చర్చకు తెచ్చిన ఘనత హైద్రాబాదు స్త్రీలదేనన్న విషయం మన సమష్టి జ్ఞాపకాల్లోంచే తుడిచిపెట్టుకుపోయింది. ఐతే పురుషుల నాయకత్వంలో సాగిన సంస్కరణ ఉద్యమాల పరిమితులను అధిగమించి తెలంగాణ స్త్రీల సంఘటితశక్తి పబ్లిక్‌రంగంలో ఎలా ఇనుమడించిందో అర్థం కావాలంటే స్త్రీల విద్యాసామాజిక వికాస సమితి (W.S.E.S.A) చేపట్టిన కార్యక్రమాల గురించి అధ్యయనం చేయాల్సి వుంటుంది. అంతేకాదు, ఆయా బృందాల్లో క్రియాశీలకంగా పనిచేసిన స్త్రీల కార్యాచరణలను, రచనలను విశ్లేషించాల్సి వుంటుంది.

ఆదిహిందూ ఉద్యమం అఖిల భారత నిమ్నవర్గాల మహాసభ (W.S.E.S.A) కు దోహదపడినట్లుగనే 'స్త్రీ విద్యా సామాజిక వికాస సమితి' అఖిల భారత స్త్రీల మహాసభ (AIWC) ఏర్పాటుకు దారులు వేసిన విషయాన్ని తెల్సుకోవాల్సి వుంటుంది. కుటుంబ దోపిడి, వివక్షల నుంచి స్త్రీలకు రక్షణ కల్పించాలనే అవగాహనలతో ఆస్తి హక్కు; విడాకుల చట్టం – భరణం; వివాహ చట్టం; స్త్రీలు – పిల్లల అమ్మకాలు; శారదా బిల్లు, సమాన పౌరసత్వం వంటి చట్టాలను సాధించడంకోసం పనిచేసిన ఆనాటి స్త్రీల చైతన్యాన్ని అంచనా వేయాల్సి వుంటుంది. కానీ అటువంటి విశ్లేషణలు దాదాపు శూన్యం.

పురుష స్వామ్యం, వలసవాద ధోరణులు వంటబట్టిన 'అకడమిక్' రచనలతో పాటు స్త్రీవాదులు మధ్య తరగతి, అగ్రవర్ణ స్వభావం వల్ల తెలంగాణ స్త్రీల చరిత్రకు, వర్తమాన మహిళా ఉద్యమాలకు వాటిల్లిన నష్టం పూడ్చలేనిది. తెలంగాణ సమాజ వికాసంలో స్త్రీల భాగస్వామ్యానికి సంబంధించి అలాంటి పరిశోధనలే గనుక జరిగివుంటే 'దేశీయ స్త్రీవాద' మూలాల అవగాహన ఇప్పటి తరం వారికి అందివుండేది. ఆధునిక భారతదేశంలో స్త్రీలహక్కుల ఉద్యమాలకు బీజాలు హైద్రాబాదు/తెలంగాణలోనే పడినాయనే విషయం తెలిసివుంటే ఈ తరం తెలంగాణ స్త్రీలలో ఆత్మవిశ్వాసం ఇనుమడించి వుండేది. తెలంగాణలో స్త్రీవాదమే లేదన్న విపరీత స్త్రీవాద విశ్లేషణల వెనుక పనిచేసిన వలసవాద స్వభావం గురించిన చర్చ జరిగి వుండేది. అన్నిటికి మించి, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ రంగంలో పేట్రేగుతున్న వివక్షల మూలంగా ప్రసుత్తం దేశవ్యాప్తంగా పెచ్చరిల్లిన స్త్రీలపై 'హింస' కు అడ్డుకట్టలు పడివుండేవి. బ్రిటిష్ పాలిత ప్రాంతాల్లో స్త్రీల స్థితిగతుల్లో మార్పుకోసం పురుషుల నాయకత్వంలో సాగిన సంస్కరణ ఉద్యమాలకీ, స్త్రీల సమస్యలకోసం స్త్రీలే సంఘటితంగా పనిచేసిన తొలితరం తెలంగాణ ఉద్యమకారిణుల కార్యాచరణలకి వున్న ప్రత్యేకతలను అర్థం చేసుకునే అవకాశం ఉండేది. దీనిద్వారా ఈపాటికి సామాజిక శాస్త్రాల అధ్యయనానికి నూతన వొరవడి అలవడి వుండేది.

దేశవ్యాప్తంగా జాతీయవాదం ప్రబలుతున్న కాలంలో, రాచరిక వ్యవస్థలో చిక్కుకుపోయిన సందర్భమయినా తరాల సాంప్రదాయిక సంకెళ్లు అడ్డుపడుతున్నా ఆధునిక చేతనతో రాజ్యవ్యవస్థలో మార్పుల కోసం తెలంగాణ స్త్రీలు చూపిన చొరవను ఈ తరం ఇంకా అందుకోవాల్సే వుంది. 1928 నాటికే తెలంగాణ సంస్థానపల్లెల్లో ఏర్పడిన స్నేహలతా కవితా సంఘం వంటి సాహిత్య సంఘాల కృషిని తరచి చూడాల్సి వుంది. ఇప్పటికైనా సాహిత్య సామాజిక రంగాల్లో క్రియాశీలకంగా పనిచేసిన

స్నేహలతా కవితా సంఘం, ఆంధ్ర సోదరీ సమాజం, స్త్రీ విద్యా సామాజిక వికాససమితి, ఆంధ్ర మహిళ సభ, మహిళానవజీవన మండలి, కామ్రేడ్స్ అసోసియేషన్, ప్రగతిశీల రచయితల ఉద్యమం, ఆదిహిందూ ఉద్యమం వంటి బృందాల్లో స్త్రీలు తమ ఆకాంక్షల సాకారానికి కొనసాగించిన క్రమాన్ని మనం ఇప్పుడు డాక్యుమెంటు చేయాల్సిన అవసరం వుంది. అందువల్ల సమాజ పరిణామాలనే గాక ఉద్యమాల మధ్య సంబంధాలను అర్థం చేసుకోవచ్చు. ఉదాహరణకి తొలినాళ్లనుంచి మలిదశ తెలంగాణ ఉద్యమం వరకు స్త్రీల ఆచరణలను, రచయిత్రుల భాగస్వామ్యాలను గనుక పరికించి చూస్తే ఓ క్రమం కనిపిస్తుంది. రచనలనే ఉద్యమంగా మలుచుకున్న రచయిత్రులూ, ఉద్యమంలో భాగంగా రచనలు చేసిన రచయిత్రులు 1940 కి ముందూ తర్వాత కూడా కన్పిస్తరు. ఆధునికత చొచ్చుకు వస్తున్న తొలినాళ్లలో సాంస్కృతిక, రాజకీయ రంగాల మధ్య సంఘర్షణలను ఆకళింపు చేసుకున్న రచయిత్రులు రాజకీయ రంగంలో స్త్రీల హక్కులకోసం మొదట ఉద్యమింద్రు. సాంస్కృతిక ఉద్యమానికి దారులు వేసింద్రు. కానీ అదే ఉద్యమం రాజకీయ వ్యవస్థలకు దూరమైనప్పుడు మహిళా నవజీవన మండలి, ప్రగతిశీల రచయిత్రులూ, ఐలమ్మ వంటి ఉద్యమకారిణులు తమ అనుభవాల్లోంచి సైద్ధాంతిక భూమిక నిచ్చి రాజకీయ ఉద్యమాలుగా మలిచింద్రు. ఆపైన వలస రాజకీయాల్లో గల్లంతైన తెలంగాణ అస్తిత్వాన్ని తిరిగి నిలబెట్టే ప్రయత్నంలో 'విప్లవ' రాజకీయ ఉద్యమాలకు సాంస్కృతిక అణచివేతల రూపాలను విప్పి చెప్పింద్రు. ప్రజాకీయాలకు దారులు వేసింద్రు. భాషా సాంస్కృతిక వైవిధ్యాలకు తమ రచనల ద్వారా ప్రాణం పోసింద్రు. అస్తిత్వ పరిధులనధిగమించి స్త్రీల సమస్యల పరిష్కారాల కోసం రచయిత్రులు నిరంతరం కృషిచేసింద్రు. ఆనాటి నుంచీ ఉద్యమకారిణుల నిబద్ధతా, సాహసం, రచయిత్రుల నిరంతర కృషీ 2009 ఉద్యమానికి ప్రాణవాయువు నందించింది.

విశాలాంధ్ర ఏర్పాటుతో గల్లంతైన తెలంగాణ తనను తాను ఆవిష్కరించుకునేందుకు 60 నుంచి ఈనాటి వరకు పడిన యాతన గురించి మనకు తెలుసు. అందుకు మన అనుభవాలే ప్రత్యక్షసాక్ష్యం. ఇంటిపని, బైటిపని వంటి ద్వంద్వాల్లోంచి తమ అస్తిత్వాలను వెతుక్కునే క్రమంలో స్వతంత్రవ్యక్తులుగా స్త్రీలు (మనం) మారుతున్న, సంఘర్షిసున్న క్రమంలోనే అంతర్గత వలస అణచివేతలు, ప్రపంచీకరణ రాజకీయాల మధ్య తనను తాను ఆవిష్కరించుకునే క్రమంలో తెలంగాణ ప్రస్థానం సాగింది. తెలంగాణ ఆకాంక్షల ఆరాటాలకీ స్త్రీల పోరాటాలకీ వున్న ఈ

తాత్విక భూమిక స్త్రీల ఆకాంక్షల ప్రతిబింబంగా కన్పిస్తుంది. ఆత్మగౌరవం, స్వావలంబన, సాధికారత అన్న ఆలోచనలకు అస్తిత్వాల మధ్య వైవిధ్యాలను గౌరవించాలనే స్త్రీల దృక్కోణాలు మూలం. మరింత స్పష్టంగా చెప్పాలంటే తన అస్తిత్వాన్ని తాను గుర్తించడమంటే 'ఇతరుల' అస్తిత్వాన్ని గుర్తించడం కూడా. అంటే అస్తిత్వాల్లోని భిన్నత్వాలను గుర్తించడమే. అస్తిత్వం, భిన్నత్వం ఒకదాన్నొకటి పూరించుకునే సామాజిక సంభాషణ వంటిది. ఇటువంటి సామాజిక సందర్భం ఇతరులను గౌరవించే దృక్పథాలకు దారులు తెరుస్తుంది. అదే ప్రజాస్వామిక భావనకు మూలం. 'సామాజిక న్యాయం' ఇటువంటి సందర్భంలో ప్రజాస్వామిక రాజకీయాలకు తొలి అడుగవుతుంది. మలిదశ ఉద్యమం ఇటువంటి సామాజిక న్యాయ ఆక్షాంక్షలను, ప్రజాస్వామిక దృక్పథాలనుంచే, జెండర్ అవగాహనలనుంచే గ్రహించింది. తెలంగాణ సామాజిక, రాజకీయ చరిత్రను మలుపు తిప్పిన 1940-50 ల నాటి రైతాంగ స్త్రీల పోరాట కాలానికి ముందూ, తర్వాత ఉద్యమ అనుభవాలను గనుక బేరీజు వేసుకుంటే మలిదశ ఉద్యమానికి స్త్రీలు అందిచ్చిన తాత్విక భూమిక గురించి అర్థం చేసుకోవచ్చు. అందుకోసం మనం మన చరిత్రను లోతుగా అధ్యయనం చేయాల్సి వుంటుంది. ప్రజాస్వామ్య భావజాలాన్ని ధిక్కరించే చైతన్యాన్ని వడిసిపట్టుకున్న సాయుధ పోరాట కాలపు స్త్రీల చరిత్రకు సంబంధించిన పరిశోధనలు కొన్నైనా వున్నై. కానీ 1940 లకి ముందున్న స్త్రీల సాహిత్యోద్యమాల్ని గురించిన అధ్యయనం దాదాపు శూన్యం. అట్లాగే 50 నుంచి 90 ల వరకు తెలంగాణ స్త్రీల సామాజిక కార్యాచరణ గురించి గానీ, సృజనాత్మక రంగాల్లో వారి కృషి గురించి గానీ సమగ్ర చర్చలు జరగనే లేదు. ఈ లోటును భర్తీ చేయాల్సిన సమయమిదే.

స్త్రీల చరిత్రకు సంబంధించిన నిశ్శబ్దాన్ని బద్దలు కొట్టాల్సింది మనమే. తెలంగాణ చరిత్రలో ఖాళీలను పూరించాల్సిన బాధ్యత ఉద్యమకారిణులుగా రచయిత్రులుగా మనపైనే వుంది.

* * *

తెలంగాణ సాధనోద్యమం - స్త్రీల వ్యాసాలు



గోగు శ్యామల

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో స్త్రీ ప్రాతినిధ్యం ఇంటి నిర్మాణంలో బెండడి లాంటిదనే చెప్పాలి. అంతే కాక అంతకు ముందు తెలంగాణ చరిత్రని దశలవారిగా లేదా శ్రేణీకృత విధానంలో విభజించి పరిశీలించాల్సిన అవసరాన్ని గుర్తించగలిగితేనే కొంత వరకు మనకు చరిత్ర అవగతమవుతుంది. కొన్ని దశలకు సంబంధించిన చరిత్రను గమనించినట్లయితే ఇది అక్షరాల నిజమని తెలిసిపోతుంది. ఇందులో భాగంగానే తెలంగాణ ప్రజల పోరాటాలు, త్యాగాలు, రక్త తర్పణలు, ప్రాణత్యాగాలు ఎక్కువ జరిగి ఫలితాలు మాత్రం చాలా తక్కువ చేకూరాయని చెప్పక తప్పదు. ఎందుకంటే ప్రపంచ విప్లవ పోరాటాల చరిత్ర సరసన నిలబడిన తెలంగాణ సాయుధ పోరాట కాలం తర్వాత కూడా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రజలు ఉద్యమం చేయాల్సిన తప్పని పరిస్థితి వచ్చిందంటే తెలంగాణ స్థితిని అర్థం చేసుకోవడానికి కొత్త కోణాలు అవసరం అని భావించాలి. ఇందులో భాగంగానే శ్రేణీకృత దశలవారి చరిత్రను అధ్యయనం తప్పని సరి అని భావిస్తున్నాను.

శ్రేణీకృత విధానంలో చరిత్రను విభజిస్తే

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర పోరాట దశను ప్రత్యేకంగా పరిశీలించినట్లయితే తెలంగాణ ప్రాంతంలోని ప్రతి ఇంటిలో ఐదు తరాల వ్యక్తుల చరిత్ర మన కండ్ల ముందు సజీవ దృశ్యకావ్యంగా నిలుస్తుంది. మొదట ముత్తవ్వ స్వాతంత్ర్య ఉద్యమంలో పని చేస్తే, రెండవ దశగా ఆమె కొడుకు తెలంగాణ సాయుధ పోరాటంలో పనిచేసి వుంటాడు. మూడవ తరంగా ఈయన కూతురు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం 1969 సంవత్సరంలో జరిగిన ముల్కీ లేదా మలిదశ ఉద్యమంలో పాల్గొని వుంటుంది. నాలుగవ తరంగా ఈమె కొడుకు ఎమర్జెన్సీ తర్వాత ముందుకొచ్చిన భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో పాల్గొని ఉంటాడు. దీనిని మార్కిస్టు లెనినిస్టు పోరాటం అని

కూడ అంటారు. ఇక వర్తమాన ఐదో తరంగా ఈయన కూతురు తెలంగాణ మలిదశ ఉద్యమంగా ముందుకొచ్చి వినూతన పద్ధతిలో ఉద్యమించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్న రాష్ట్ర సాధన ఉద్యమంలో ఉంటుంది. ఆయా కాలాల్లో జరిగిన ఉద్యమాలన్నీ ఒకే విధంగా ఏకశిలా సాదృశ్యంగా ఉండవు అనేది సహజాతి సహజమైన అంశం. అయినప్పటికీ అన్నీ కాలాల ఉద్యమాలను ఒకే గాటిన కట్టి విశ్లేషించే ఒక పెడధోరణి నిరాటంకంగా కొనసాగుతున్నది. అన్ని కాలాల ఉద్యమాలను ఒకే మూసలో పెట్టి ఆలోచించే విధానం నుండి బయట పడాల్సిన అవసరం ఉన్నదనీ భావిస్తున్నాను. ఆయా కాలాల పోరాటాల ప్రత్యేకతలు వాటికవే ప్రత్యేకమైనవి. ఆ కాల విశిష్టత దానిదే అనే కోణంలో పరిశీలించాల్సి ఉన్నది.

ఈ నేపథ్యంలోనే మలిదశ ఉద్యమ లోతులను, విస్తృతిని పరిశీలించినట్లయితే, లోకల్ నుండి గ్లోబల్ వరకు పేరు గాంచింది. అంతే కాక అంతకు ముందే స్థిరపడిన వలసాంధ్ర ప్రధాన స్రవంతి రాజకీయ, ఆర్థిక వ్యవస్థలు ఇంతకు ముందెన్నడూ కని విని ఎరుగని రీతిలో ప్రత్యేక రాష్ట్రమనే సంక్లిష్టతకు గురయినాయి.

అయితే ఇక్కడ మనం ఒక ముఖ్యమైన అంశాన్ని గుర్తించాల్సి ఉంది. ఉద్యమం ఒక వైపు ఎంతో వుద్ధృతంగా, వైవిధ్యభరితంగా, ఉత్సాహంగా కొనసాగుతున్నదనే చెప్పాలి. ఉద్యమం గూర్చి రాసే వారు విశ్లేషణ చేయడం కంటే ఒక విధమైన సందిగ్ధతకి లోనయిన పరిస్థితి నెలకొన్నది. అదేమంటే సమైక్యాంధ్ర చౌకబారు పోకడలను చూసి కోపగించుకోవడం, చిరాకు పడడం లేదా ఉద్యమంలో విద్యార్థులు బలవన్మరణాలకు గురవుతుంటే కుంగిపోవడం అనేవి జరిగాయి. ఆ తర్వాతనే ఉద్యమాన్ని విశ్లేషించడమో, బేరీజు వేయడమో జరిగింది. ఈనేపథ్యంలో వచ్చిన రచనలు, వ్యాసాలు మూడు రకాలుగా రాయడం మనకు కనిపిస్తుంది. అది లోతైన విశ్లేషణతో రావడం ఒకటయితే, రెండు ఆ పరిస్థితులకు అనుకూలంగా ఉక్రోశంతోనో, కోపంతోనో, భావావేశంతోనో వలసాంధ్రులను ప్రశ్నిస్తున్నట్లు రాయడం, మూడు జరుగుతున్న ఉద్యమాన్ని పూర్తిగా బలపరుస్తు వెన్నుదన్నుగా నిలుస్తూ, చనిపోతున్న విద్యార్థులకు సంతాపం తెలుపుతూ వారి తల్లితండ్రులను ఓదారుస్తూ రాయడం కనబడుతుంది.

ఉద్యమంలో మీడియా పాత్ర

ఈ కాలంలో ఉద్యమం నడుస్తున్న తీరును మీడియా చూపించిన తీరును మూడు రకాలుగా చూడవచ్చు:

1. తెలంగాణ ఉద్యమం కోసం ప్రజలు ఉద్యమిస్తున్న తీరును, దృశ్యాలను అద్భుతంగా చిత్రిస్తూ చూపించడంవల్ల మద్దతును కూడగట్టడం ఆత్మ గౌరవం యొక్క విశిష్టతను తెలియజెప్పడం ఒక విధమైతే.

2. అసలు తెలంగాణ ఉద్యమమే న్యాయమైనది కాదని, అనవసరమైనదనీ, ఇది కేవలం శాంతి భద్రతల సమస్య అనీ, రాను రాను ఎక్కువ సందర్భాలలో తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను, తెలంగాణ భాషను సంస్కృతినీ కించపరుస్తూ ప్రసారాలు చేసేది. ఇంకో ముఖ్య విషయం ఏమంటే అసలు తెలంగాణ రాష్ట్ర సాధన ఎన్నటికీ జరగదు అనే ధోరణితోనే సమైక్యాంధ్ర మీడియా వార్తలను ప్రసారం చేయడం జరిగింది.

3. ఇంకొక స్థాయిలో ఉద్యమాన్ని మీడియా చిత్రించిన మరోవిధానాన్ని గమనిస్తే సమైక్యాంధ్ర ఉద్యమం ఒకటి తెలంగాణ సాధన ఉద్యమానికి పోటీగా నడుస్తున్నదనీ సమైక్యాంధ్ర ఉద్యమాన్ని చిత్రించారు. నిజానికి ఆ చిత్రించిన ఉద్యమంలో ప్రజల కంటే రాజకీయపార్టీల నాయకులే ఎక్కువగా ఉన్నారు. ఆ తర్వాత తర్వాత మాత్రం రాష్ట్ర సాధన చివరి అంకంలో ఆంధ్రాప్రజలు కూడా సమైక్య ఉద్యమంలో పాల్గొన్నారు.

ఈ రకంగా ఒక స్పష్టమైన విభజన మీడియాలో జరిగిన సందర్భాన్ని మనం ప్రత్యేకంగా గమనించాలి. అది తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి సంపూర్ణ మద్దతుగా నిలిచిన ఎలక్ట్రానిక్ చానళ్లు, వార్తా దిన పత్రికలు, వ్యతిరేకంగా నిలిచిన ఎలక్ట్రానిక్ చానళ్లు, వార్తా పత్రికలు అనీ స్పష్టంగా విభజించబడ్డాయి. ఆ రకంగా తెలుగు మాధ్యమం తెలంగాణ ఆంధ్రాగా నిలువునా చీలిపోయింది. ఆ మాటకొస్తే ఈ కాలంలో హైద్రాబాదు బంజారాహిల్స్‌లో నెలకొని ఉన్న ఎలక్ట్రానిక్ చానళ్లలో ఒక్కటి కూడా తెలంగాణకు చెందినవి లేవు. అన్నీ కూడా సమైక్యాంధ్రకే మద్దతుగా, తెలంగాణకు వ్యతిరేకంగా పని చేశాయని చెప్పడానికి సంకోచించాల్సిన అవసరం లేదేమో!

అట్లా తెలంగాణ రాష్ట్ర ప్రజా ఉద్యమం ఒక దశలో ప్రచార మాధ్యమంలేని దిక్కులేని ఆకాంక్షల ఉద్యమం అయిందా ? అనే అనుమానం రాక పోలేదు. ఈ పరిస్థితులనుండే ప్రస్తుతం ఉనికిలో ఉన్న అన్నీ చానళ్లల్లో రెండు మూడు చానళ్లు తెలంగాణ మద్దతు చానళ్లు రావడం కనిపిస్తుంది. ఇంకా ఉద్యమం పెరుగుతూ విస్తరిస్తున్న కొద్దీ మిగతా చానళ్లుకూడా తప్పని పరిస్థితుల్లో మద్దతునిస్తూ వచ్చాయి. అది ఒక తెలంగాణ ఒంటరి స్థితి నుండి మద్దతు కూడగట్టుకున్న మరో స్థితికి మారిన క్రమాన్ని చూడాల్సి ఉన్నది.

ఈ నేపథ్యంలో తెలంగాణ ఉద్యమంలో మహిళలు రాసిన సాహిత్యం అందులో కూడా వ్యాసాలు అనే ప్రక్రియను చూడడం ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంటుందని భావిస్తున్నాను. స్త్రీలు రాసిన ఉద్యమ సాహిత్యం, వ్యాసాలు,

చర్చలు మీడియాలో ప్రచురితం కావడం ఆనాడు ప్రశ్నార్థకమే అయింది. అయినప్పటికీ తెలంగాణ సాధన ఉద్యమ అవసరం తెలంగాణ స్త్రీ సాహిత్యాన్ని, వ్యాసాలను ప్రచురింపచేసిందనే చెప్పాలి. ఉద్యమంలో భాగంగానే వీరి రచనలు ఒకటి రెండు దినపత్రికల్లో, తెలంగాణ నుండి ప్రచురితమవుతున్న చిన్న పత్రికల్లో, ఎవరికి వారు వ్యక్తులుగా పుస్తకాలలోనూ, సమూహంగానూ, సంస్థలుగానూ ప్రచురించుకున్న సంకలనాల్లో మాత్రమే ఎక్కువగా ప్రచురితమైనాయని చెప్పాలి. వీటన్నింటిలో ప్రచురితమైనవి కూడా కొద్ది మంది స్త్రీల రచనలే, అయినప్పటికీ అవి ఎంతో చారిత్రక ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయని చెప్పాలి. ఎందుకంటే ఈ వ్యాసంలో పేర్కొన్న రచయిత్రులందరూ దాదాపు ఉద్యమంలో పాల్గొంటూ రచనలు చేశారు కాబట్టి. అందువల్లనే ఉద్యమంలోని, సాహిత్యంలోని వివిధ కొత్త కోణాలను వైవిధ్యతను ఈ రచయిత్రులు ముందుకు తీసుకురాగలిగినారు. అంతే గాక, ఇంతకు ముందు తెలంగాణలో ఎన్నో పోరాటాల అనుభవం తరువాత అంటే స్వాతంత్ర్యోద్యమం, తెలంగాణ సాయుధ పోరాటం, తెలంగాణ రాష్ట్ర సాధన తొలిదశ 1969 పోరాటం, సారా వ్యతిరేక పోరాటం ఆ తరువాత తెలంగాణ రాష్ట్ర సాధన మలిదశ పోరాట దశలో భాగంగా రాసిన రచనలుగా ఈ వ్యాసాలను చూడాల్సిన అవసరముందని భావిస్తున్నాను. ఇంకా చెప్పాలంటే తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని సహించలేని తనంతో కడుపు మండి వెళ్లగక్కిన మాటలివి, రాసిన వ్యాసాలివి. ఇందులో ప్రముఖంగా రాసిన వారిలో అఖిలేశ్వరి, గోగు శ్యామల, సూరేపల్లి సుజాత, జూపాక సుభద్ర, కనీజ్ ఫాతిమా, రత్నమాల, కె.సత్యలక్ష్మి, అనిశెట్టి రజిత, జ్వలిత, కె.విమల, ఆశాలత, వి.త్రివేణి, దేవేంద్ర, దుర్గ, నాగమణి, కల్లూరి కళావతి, బొంపల్లి కమ్మరి రేణుక తదితరులున్నారు.

రచయిత్రుల వ్యాసాలేమంటున్నవి ?

తెలంగాణ చరిత్ర, వర్తమానం, భవిష్యత్తు అంతా కూడా ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష అనేదే ప్రధానమయింది. అందులో కూడా వనరులు నీరు నిధులతో పాటు ఆత్మ గౌరవం అనే అంశాలతో తమ కుటుంబ జీవితాలు పెనవేసుకుపోయిన విధానాన్ని ఈ రచయిత్రులు తమదైన కోణంలో వివరించడం చూస్తాం.

ఇందులో భాగంగానే సూరేపల్లి సుజాత రాసిన విషయాలను చూద్దాం. 'ఇది బతుకు పోరాటం, వనరుల కోసం, భాష కోసం, సంస్కృతి కోసం చేస్తున్న పోరాటం. ఇది కేవలం భూభాగం కోసం జరుగుతున్న పోరాటం మాత్రమే కాదు.' అని వివరించింది.

ఈ క్రమంలోనే పోలవరానికి చెందిన ఆదివాసి స్త్రీ రమణమ్మ తమ వనరులు

తెలంగాణ సాధనతో పెనవేసుకున్న తీరును ఇట్లా చెపుతుంది. 'మేము తెలంగాణ ఉద్యమాన్ని పూర్తిగా బలపరుస్తున్నాం. ఎందుకంటే తెలంగాణ వస్తే పోలవరం ప్రాజెక్టు ఆగిపోతుంది. అంటే మా కోయజాతి బతకటానికి దారి ఉంటుంది. పోలవరం ప్రాజెక్టు కింది నిర్వాసితులయ్యే గ్రామాలు ఎక్కువ ఖమ్మం జిల్లాలోనే ఉన్నాయి కదా', అని ముక్కుసూటిగా చెపుతుంది.

తెలంగాణ సాధన పోరాటాన్ని సొంతం చేసుకున్న విధానాన్ని మహబూబ్‌నగర్ జిల్లా లోని చెంచు స్త్రీలు ఎంతో ఆసక్తికరంగా వివరించడం ఇక్కడ చూస్తాం. తమ జీవన విధానం అడవి వాకిలిగా, భూమి ఇల్లుగా తెలంగాణ రాష్ట్రం తమ భవిష్యత్తుగా పెనవేసుకుపోయిన విధానాన్ని చెపుతున్న తీరును ఇక్కడ చూద్దాం: 'అడవిలో నివసించే మా సంప్రదాయాలు మాకున్నాయి. మాకు అడవి, అడవి సరిహద్దు ఉంటుంది. ఈ అప్పాపూర్ ఉందంటే ఇందులో ప్రతి కుటుంబానికి ఇంత అడవి భాగం ఉంటుంది. వ్యవసాయ భూమి ఉన్నట్లు అందులో ఉండే ఫలసాయం కాని, వేట కాని ఎవరి భాగాల్లో వాళ్లే తీసుకుంటారు. పక్కవాళ్ల వాకిల్లలో రాలిన మామిడి పండ్లను, ఇప్ప పువ్వును కూడా ఇంకొకరు తీసుకోరు. అంతే కాక అటవీ చట్టం కింద ప్రభుత్వం మమ్ములను బయటకు పంపాలని చూస్తున్నది. బయటకు వెళ్లిపోతే కుటుంబానికి 10 లక్షల రూపాయలు ఇస్తామంటున్నది. కాని మేం ఒప్పుకోవడం లేదు. మా తాత ముత్తాతల నుండి బతుకుతున్న మా అడవి ఇదే. అడవి నుండి వెళ్లగొడతారేమోనని ఎప్పుడూ భయంతో బతుకుతున్నం. తెలంగాణ రాష్ట్రం వస్తే మాకు ఆ భయం ఉండదు కదా', అని వివరిస్తుంది. మా చెంచులను అడవిలోనుండి వెళ్లగొట్టని తెలంగాణ మాకు కావాలనీ చెంచు మహిళలు కోరుకుంటున్నారు:

'విశాలాంధ్రనే సమైకాంధ్రగా అవతరించిందా? అనుకుంటే తెలంగాణలో ఆంధ్రా విలీనమైన తరువాత అసలు ఏం జరిగిందో యం.రత్నమాల తన వ్యాసంలో ఇట్లా అంటుంది.

'తెలంగాణను (హైద్రాబాదు రాష్ట్రాన్ని) సీమాంధ్రతో విలీనం చేసినప్పటి నుండి విలువైన జలవనరుల తరలింపు. నాగార్జున సాగర్ ద్వారా కోస్తాంధ్రకు కృష్ణా జలాల తరలింపు, అదే విధంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో గోదావరి జల వనరులు తెలంగాణ జల వనరుల దోపిడికి పరాకాష్ఠ మాత్రమే కాదు తెలంగాణ జలవనరుల పరిస్థితి ప్రమాదకరంగా మారింద'ని అంటుంది.

దీనితో పాటు, భాషా విషయంలో విశాలాంధ్ర భావజాలం యొక్క ప్రతిఫలనాలు తెలంగాణలో ప్రతికూలతను ఎలా సంతరించుకున్న తీరును కె.విమల రాసిన వ్యాసంలో చూడవచ్చు. 'తెలుగు జాతి పేరున భాషా ఛాందసవాదాన్ని,

అప్రజాస్వామిక ధోరణులను ప్రజల మెదళ్లలోకి ఎక్కించడంలో కోస్తాంధ్ర పాలకవర్గాలు కొంత వరకు విజయం సాధించారనే చెప్పొచ్చు. దీని ఫలితమే, తరం నుంచి తరానికి ఎదిగిన విద్యావంతులైన కోస్తాంధ్రులలో తాము జాతి నిర్మాతలమనే భావనతో పాటు తాము అధికులమనీ, వెనకబడిన వారిని ఉద్ధరించే రక్షకులమనే 'సేవియర్ కాంప్లెక్స్' కనిపించడం. ఇదే తెలుగు మాట్లాడే జాతుల చరిత్రలో కన్పించే అతి పెద్ద విషాదం', అని ఆవేదన వ్యక్తం చేసింది. దీనితో పాటు అంతర్గత వలసవాదం ఎంతస్థాయిలో పాతుకుపోయిందో కూడా తన వ్యాసంలో చర్చిస్తుంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ప్రజలకు అవమానపు నలతగా మిగిలిన 'రేగడి విత్తులు' నవల ప్రస్తావన తీసుకోస్తుంది. అతి ప్రాచీనమైన వ్యవసాయ ఉత్పత్తి నాగరికతకు నిలయమైన పాలమూరుకు వ్యవసాయం నేర్పినమని చెప్పిన రచయిత్రికి అవార్డులు ప్రకటించే తానాలు లిబరల్ మేధావులుగా ప్రపంచస్థాయిలో రెండు జిల్లాల తెలుగును నెత్తికెత్తుకొని గ్లోబల్ పౌరులుగా చెలామణి కావడానికే తెలంగాణ తెలుగును తొక్కిన చరిత్రని తెలంగాణ ప్రజలు మరిచిపోగలరా? అనేది అప్పటికీ ఇప్పటికీ ఎప్పటికీ ప్రశ్నగానే మొలకెత్తుతున్నది.

భాషకు సంబంధించిన మరో అంశాన్ని కె.కళావతి ముందుకు తీసుకొస్తున్న తీరును చూద్దాం. 'ఇన్నాళ్లు అవమానాలు భరించిన తెలంగాణ భాష కూడా ఈ ఉద్యమంలో ఆత్మ గౌరవాన్ని సాధించుకుంది. తెలంగాణ యాస భాషకు ఇవ్వాల ఎనలేని గౌరవం వచ్చిందనీ' గుర్తు చేసింది. భాషను గూర్చి ఈ రచయితలు చెప్పిన అంశాలు మిగతా ముఖ్యమైన అంశాల చర్చకు దారి తీశాయనే చెప్పాలి. తెలంగాణ భాష రాజకీయాల్లో ఒక కీలక మలుపు జరిగిందనే గుర్తించాల్సిన అవసరమున్నది. 2009 సంవత్సరానికి ముందు తెలంగాణ భాషను, యాస ను మాట్లాడటానికి తెలంగాణ వారు ఇష్టపడేవారు కాదు. ముఖ్యంగా వీరిలో కూడా సాధారణ తెలంగాణ ప్రజలకంటే, ఉన్నత విద్య చదివిన వారు, ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడిన వారే ఇష్టపడే వారు కాదని చెప్పక తప్పదు. వచ్చి రాని ఆంధ్రా మాండలికంలోనే మాట్లాడడానికి అవస్థలు పడేవారు. దానినే ఒక సామాజిక గౌరవంగా భావించేవారు. దీనికి కారణం విద్యారంగంలో పాఠ్యపుస్తకాల్లో మొత్తంగా తెలంగాణ భాష లేకపోవడం వల్లనే తిప్పలు పడేవారని చెప్పాలి. ఈ నేపథ్యంలోనే నేడు జరిగిన మార్పును గమనిస్తే తెలంగాణ భాష యాసను మాట్లాడడమే ఒక సామాజిక గౌరవంగా భావిస్తున్నారనే చెప్పుకోవాలి. మరో ఆసక్తికరమైన విషయమేమంటే తెలుగు భాషను ఏలుతున్న సీమాంధ్ర సినిమా పరిశ్రమలో కొంతవరకు మారిన ఒరవడిని గమనించాలి. ఇంతకు ముందు తెలంగాణ భాష యాసను సినిమాల్లో విలన్‌కు, కమెడియన్‌కు ఉపయోగించి అవమానపరిచేవారు. ఇప్పుడు మాత్రం కథా నాయకుడికి,

నాయికకు ఉపయోగిస్తున్నారన్నది ఈ సందర్భంగా ప్రస్తావించుకోవాల్సిందే. ఈ మధ్యనే ఒకటి రెండు తెలుగు సినిమాలను కూడా చూశాం. కళావతి చెప్పినట్లు తెలంగాణ భాష కూడా ఆత్మగౌరవాన్ని సాధించుకుంది అన్నది వాస్తవమే.

మలి దశ ఉద్యమంలో వృత్తి కళారూపాలు తెలంగాణ ప్రజలకు ఆత్మగా, చేతుల్లో సాంస్కృతిక ఆయుధంగా పని చేశాయని చెప్పాలి. అయితే కత్తికి రెండంచుల పదును అన్నట్లుగా రాష్ట్ర సాధన కోసం తెలంగాణ ప్రజలు కళారూపాలను ఉపయోగించుకుంటున్న కాలానికి ముందే 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం', 'సమైకాంధ్ర', 'స్వర్ణాంధ్ర' భావజాలంలో మన కళారూపాలను ఉపయోగించుకున్నారు. అని చెప్తూతూ గోగు శ్యామల ఇట్లా వివరిస్తున్నది: 'యాభై యేండ్లుగా పాతుకుపోయిన విశాలాంధ్ర చేసిన లూట్ మార్‌ను ఎండగట్టడంలో గత పదేళ్లుగా ధూంధాం ధూం తడాకను ఎడతెరిపి లేకుండా చూపిస్తున్నది. ఇది తెలంగాణ సకల జనుల అనేక కళారూపాల సమ్మేళనం' అనేది సాంస్కృతిక పునరుజ్జీవనం యొక్క చారిత్రాత్మకతని, సహజ వనరులైన నీరు, నిధులు, విద్య, ఉద్యోగాలు, ఆత్మగౌరవం అన్నింటిని మించి స్వయం పాలనల సమ్మేళనంతో తెలంగాణ అస్తిత్వాన్ని వినూత్నంగా ఆవిష్కరించింది. ఇందులో భాగంగానే ఇంతవరకు తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనం అంటే యూరప్ బెంగాల్ ప్రాంతాలే మనకు గుర్తుకొస్తాయి. అయితే అక్కడ ఎంతమంది కవులు కళాకారులు పుట్టుకొచ్చారో మనకు తెలియదు కాని తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనం గత పదేళ్ల కవులను, కళాకారులను ప్రపంచం మీదకు తెచ్చింది. అంతేగాక 'మాదిమాకు కావాలె'. మా వనరులు, మాపాలన మాకు కావాలె అనే నేటివిటి అస్మితలో ఎజెండాను ఈ సాంస్కృతిక పునరుజ్జీవనం అపూర్వంగా ముందుకు తెచ్చింది' అని గోగు శ్యామల తన వ్యాసంలో చర్చిస్తుంది.

తెలంగాణ ఉద్యమం పొడువునా తొలి మలి ఉద్యమ దశల్లో సాంస్కృతిక అస్తిత్వంగా బతుకమ్మ, బోనాలు విశిష్ట స్థానాన్ని పొందాయి. నేటివిటీ అస్తిత్వంలోని మాతృవిలువల మూలాలను రాజకీయ సాంస్కృతిక అంశాలుగా ముందుకు తీసుకొచ్చాయి. ఇందులో కుల వర్గ వర్ణ పితృస్వామ్య అంతరాలను తేటతెల్లం చేస్తూ రేణుక కమ్మరి, ఆశాలతలు బతుకమ్మ సంబరాలను గూర్చి రాసిన వ్యాసాల్లో మరో ముఖ్యమైన అంశాలను వీరు లేవనెత్తారు. 'వేల సంవత్సరాలుగా ఈ దేశ గ్రామీణ సమాజం అంటరాని తనానికి గురవుతున్నది. నిచ్చెన మెట్ల కుల వ్యవస్థను తయారు చేసి గ్రామాలను ఊరు వాడలుగా చీల్చింది. వివిధ వివక్షతలకు, హత్యాకాండలకు, దోపిడి అసమానతలకు, అవమానాలకు గురవుతూ ఉన్నా దళితులు కూడా బతుకమ్మను జరుపుకోవాలని తెలంగాణ వాదులు ఎందుకు పిలుపునివ్వడం

లేదు? ఇందులో అగ్రకుల కోణం లేదా? తెలంగాణలోని యావన్మంది మహిళలు బడుగులతో సహా అందరూ మహిళలు బతుకమ్మ పండుగ జరుపుకున్నప్పుడే కులాల అంతరాలు తొలిగి అందరు మహిళలు బతుకమ్మ ఆడినప్పుడే ఈ పండుగను తెలంగాణ పండుగగా అభివర్ణించవచ్చు' అని కోరుకుంది. అదే గ్రామంలో మాలామాదిగ స్త్రీలు ఊరులోని దళితేతర స్త్రీలతో కలిసి పేర్చిన బతుకమ్మలను ఊరు కూడలిలో ఉంచి ఆడితే దళిత స్త్రీలపై 'మీరు అంటరాని వారు' 'మీరు మాతో కలిసి బతుకమ్మ ఆడడం కుదరదు' అని నియంత్రించడం అవమానించడం, 'మీరు బతుకమ్మను అమ్ముకున్నార' ని బుకాయించడం జరుగుతూ వుంది. మేమూ మనుషులమే అని దళితులు దళిత స్త్రీలు ప్రశ్నించిన దగ్గర వారిపై కర్కోటకమైన దాడులకు పాల్పడ్డ సంఘటనలున్నాయి,' అని వివరిస్తారు. నిజానికి దళిత మహిళలపై బతుకమ్మ ఆడుతున్న సందర్భంగా దాడులు జరిగిన గ్రామాలని, సంఘటన స్థలాలను ఒక కమీషన్ ఏర్పాటు చేసి సర్వే జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చి సభ్య సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది అనిపిస్తుంది. మరో రచయిత్రి రాసిన వ్యాసాన్ని పరిశీలిస్తే ఒక విషయాన్ని ఏ దాపరికం లేకుండా ఏ పూతలు పూయకుండా సూటిగా చేప్పే రివాజు ఆధునిక రచయిత్రిదా! అనిపించే విధంగా జూపాక సుభద్ర ఈ వ్యాసంలో రాయడం కనిపిస్తుంది. సమాజంలోని వివిధ వ్యవస్థలలోనైనా, రాజకీయ కార్యక్రమాల్లోనైనా ప్రాతినిధ్యం ముఖ్యమైన పాత్రను పోషిస్తుందని, అందులో అణగారిన కులాల ప్రాతినిధ్యం గైర్హాజరు చేయబడుతుందని చెప్పుతూ తెలంగాణ ఉద్యమంలో మామూలు స్థాయినుండి నాయకత్వస్థాయి వరకు కొనసాగుతున్న ప్రాతినిధ్యం గూర్చి, సూటిగా పదునైన గొంతుతో వ్యక్తీకరించడం గూర్చి ఇక్కడ చూస్తాం. 'ఆకాశంలో సగం సగం' అనడంఫాషనయ్యింది. ఇప్పుడు నడుస్తున్న తెలంగాణ ఉద్యమంలో నాయకత్వాలలో ఆధిపత్యకులాలున్నాయి. కనుక రేపటి తెలంగాణలో సామాజిక న్యాయాల వాటా తేల్చాల్సిన అవసరముంది. తెలంగాణలోని అణగారిన కులాలున్నా వారి సమస్యలున్నా ఉద్యమ నాయకత్వంలో ఉన్నాగాని 'ఆధిపత్యకులాలకు చెవుమీద పేను బార్త లేదు. సీమ కుట్టలేదు.' అట్ల ఉండడం కూడా పెద్ద రాజకీయమే. అనేక ఉద్యమాలకు నిలయం అయిన తెలంగాణలో ప్రతి ఉద్యమంలో నాయకత్వం వహించడానికే పుట్టినట్టు ఆధిపత్యకులాలవారు నాయకత్వ పీఠాలమీద కూర్చుంటారు. వారిమధ్యలో చర్చలు జరిగినా, నిర్ణయాలు జరిగినా అందులో మహిళలు ఉండరు. ఒకవేళ ఉంటే వారు ఆధిపత్యాకులాల ఆడవారు మాత్రమే ఉంటారు. అణగారిన మహిళలు ఉండరు అని స్పష్టంగా చెపుతుంది. ముస్లిం మహిళా అస్తిత్వ నేపథ్యంలో కనీజ్ ఫాతిమా తన వ్యాసంలో ఇలా వివరిస్తుంది. 'అన్ని ఆంధ్రా అధికార పార్టీలతో ముస్లింలు బాధలు పడి

విసిగిపోయారు. నేతలు మాత్రం అన్ని రకాలుగా బయటపడ్డారు తప్ప సామాన్య ముస్లింల జీవితంలో ఎలాంటి పురోగతి లేదు. తెలంగాణ ఉద్యమంలో కూడా రాజకీయనేతలు ఓట్లు అడగడానికి వచ్చినప్పుడు మన జ్ఞాపకశక్తిని కోల్పోకూడదు. వారిని ప్రశ్నించాలి. మేం కేవలం ఓటు బ్యాంకు మాత్రమే కాదనే సంగతి వాళ్లకు అర్థమయ్యేలా చెయ్యాలి' అని రాస్తూ అనేక ముఖ్యమైన విషయాలను తడిమింది.

ఈ నేపథ్యంలోనే మలి దశ ఉద్యమాన్ని దాని లోతులను, విస్తృతిని పరిశీలించినట్లయితే, రాష్ట్ర స్థాయిలోనూ, కేంద్రస్థాయిలోనూ, అంతర్జాతీయ స్థాయిలోనూ పేరు గాంచింది. అంతే కాక అంతకు ముందే స్థిరపడిన వలసాంధ్ర ప్రధాన స్రవంతిని రాజకీయ, ఆర్థిక వ్యవస్థలు ఇంతకు ముందెన్నడూ కని విని ఎరుగని రీతిలో ప్రత్యేక రాష్ట్రమనే సంక్లిష్టతకు గురయింది. ఈ పరిస్థితినే అనేక భిన్నమైన, వైవిధ్యమైన కోణాలతో డిమాండ్లు ఉనికిలోకి వచ్చాయి. ఈ డిమాండ్లు అన్నీ మరోరూపంలో బలమైన రాష్ట్ర ఆకాంక్షగా ముందుకొచ్చాయి. సరిగ్గా ఈ ఆకాంక్షలను ప్రతిబింబించే లేదా దృశ్యీకరించే ఉద్యమ అద్భుత రూపాలను చూశాం. వీటిని గూర్చి ఇంకొంత ప్రత్యేకంగా చెప్పాలంటే ఉద్యమంలో చోటుచేసుకున్న సంఘటనలు, పాత్రలు, దృశ్యాలు కొన్ని తమ జీవితంలో ఎన్నడూ కని విని ఎరుగని రీతిలో ఉన్నాయని తెలంగాణ ప్రజలు ముచ్చటించుకున్నారు. అంతే కాక ఎక్కడో భూమి పొరల్లో పాతుకుపోయిన తమ మూలాలను తల్లి వేరు ఒడిసి పట్టుకున్నట్లు సంబరపడ్డారు. ఆంధ్రా సమక్యవాదులు మాత్రం తట్టుకోలేక దిమ్మదిరిగి పోయారు.

పైన పేర్కొన్న అంశాలను నిశితంగా పరిశీలించినట్లయితే అనేక అస్తిత్వాల స్త్రీల దృక్కోణంలో, వర్తమాన అంశాలను ఈ రచయితలు రాయడం మనం చూస్తాం. ఆధుని కాలంలో అస్తిత్వాలు పదునుదేలడం అంటే ఏమిటో ఈ రచయితలు రాసిన రచనల్లో మనం చూస్తాం. ఆధునిక అస్తిత్వాల కోణంలో స్త్రీలు ఇంకా రాయాల్సిన అనివార్యతను పెంచాయి. ఇంకొంత వివరంగా చెప్పాలంటే, దళిత స్త్రీ తన దృక్కోణంలో, ఆదివాసీ స్త్రీ తన దృక్కోణంలో, ఉత్పత్తి కులాల, హస్తకళల స్త్రీలు తమ దృక్కోణంలో, ముస్లిం స్త్రీ తన దృక్కోణంలో, ఇతర స్త్రీలు తమ తమ దృక్కోణాలలో తెలంగాణ చరిత్రను, పునర్నిర్మాణం చేయాల్సిన పని ఇంకా చాలా ఉన్నదనీ గుర్తిస్తారని ఆశిస్తున్నాను.

***

రెండవ భాగం

ఉద్యమ, రచనానుభవాలు

సింహావలోకనం



డా॥ జి. అమృతలత

సరిగ్గా ఆరేళ్ళ క్రితం – ఇదే డిసెంబర్ నెలలో తొమ్మిదో తేదీన – అర్థరాత్రి – నాటి కేంద్ర హోం శాఖామాత్యుల ప్రకటన విని – 'మనకి తెలంగాణ వచ్చేస్తుందహో' అంటూ టపాకాయలు కాల్చుకుంటూ రాత్రంతా నిద్రపోకుండా సంబురాలు చేసుకుంటూ – ఎప్పుడో తెల్లవారు జామున నిద్రకు ఉపక్రమించారు తెలంగాణ ప్రజలు.

తీరా ఇరవై నాలుగు గంటలు గడవక ముందే సీమాంధ్ర నాయకులు కుతంత్రాలు పన్నడం, చిదంబరం మాటమార్చడం వెన్వెంటనే నాటకీయంగా జరిగిపోయాయి.

దొరికినట్టే దొరికి పాదరసంలా చేజారిపోయిన తమ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని తలచుకొని తెలంగాణ ప్రజల గుండెలు రగిలిపోయాయి.... రక్తం కుతకుతా ఉడికిపోయింది.

ఈ పార్టీ ఆ పార్టీ అనే తేడా లేకుండా – ఓ దశాబ్దం పాటు అన్ని రాజకీయ పార్టీలకూ తెలంగాణ ఓ 'యూజ్ అండ్ త్రో' అయిందనీ, ఈ పార్టీ తంతే ఆ పార్టీ కోర్టులో, ఆ పార్టీ తంతే ఈ పార్టీ కోర్టులో పడ్తూ... ఎడా పెడా దెబ్బలు తింటోన్న 'ఫుట్‌బాల్' అయిందన్న ఆగ్రహావేశాలు సర్వత్రా సకల జనుల్లో పెల్లుబికాయి.

అవును మరి... మనది ఒకటా రెండా ఆరు దశాబ్దాల ఉద్యమం! దేశంలో ఇంత సుదీర్ఘ కాలం సాగిన ప్రజా ఉద్యమం మరోటి లేదని బాధపడ్తూ – తొలిదశ, మలిదశ ఉద్యమాల్లో కొన్నివేలమంది విద్యార్థులు చేసుకున్న బలిదానాలు గుర్తుకొచ్చి ఆక్రోశం, ఉక్రోషం ముప్పిరిగొని – ఇక ఉదాసీనంగా ఉండడం చారిత్రక తప్పిదమన్న విషయాన్ని గ్రహించి– తమ కలాలకి పదును పెట్టారు రచయిత్రులు!

2010 మే నెలలో – కేవలం ఇరవై రోజుల వ్యవధిలో అరవైమంది కవయిత్రులు ఏకతాటిపైకి వచ్చి... రాజీవ, జ్వలిత, అమృతలత సంపాదకత్వంలో వెలువడిన 'గాయాలే... గేయాలై!' కవితా సంకలనంలో తమ మనోభావాలను ఆవిష్కరించారు.

అరాచకాలూ... అన్యాయాలు... అమెరికాలో జరిగినా, అండమాన్‌లో జరిగినా – ఇండియాలో జరిగినా... ఇరాక్‌లో జరిగినా – వాటిని ఖండించే విషయంలో కవులకి దేశ, భాష, మత, ప్రాంతీయ భేదాలుండవు!

సరిగ్గా ఈ దృక్కోణంతోనే... తెలంగాణా ప్రజల కష్టాలకు చలించి, జ్వలించి, ఆర్తితో స్పందించి – తమ సంఘీభావం తెలిపిన తెలంగాణేతర కవయిత్రుల రచనలకు సైతం ఆ పుస్తకంలో సమున్నత స్థానం కల్పించడం జరిగింది.

కవితా వస్తువు 'తెలంగాణే' అయినా... వివిధ కోణాల్లోంచి వస్తువును వీక్షించే నేర్పును ప్రదర్శిస్తూ... తమ ఆలోచనలను వ్యక్తీకరించిన వారిలో తిరునగరి దేవకీదేవి, యస్. అరుణ, జ్వలిత, రాజీవ, జూపాక సుభద్ర, గోగు శ్యామల, గీతాంజలి, వసంతాసుబ్రమణ్యం, కొండే పూడి నిర్మల, స్వాతి శ్రీపాద, అనిశెట్టి రజిత, హిమజ, నెల్లుట్ల రమాదేవి లాంటి లబ్ధ ప్రతిష్టులు కొందరైతే... అప్పుడప్పుడే కలం పట్టిన కవయిత్రులు మరి కొందరు!

అనంతరం కొన్ని నెలల పాటు – ఎందుకో తెలంగాణ ఉద్యమం చప్పబడింది. అది గమనించి – ఈ ఉద్య మానికి వాచ్ డాగ్‌లా ఉంటున్న ఉద్యమకారుల్ని మళ్లీ రీచార్జ్ చేసేందుకు రచయిత్రులు చేసిన రెండో ప్రయత్నమే – 2011 జూన్‌లో అమృతలత, అనిశెట్టి రజిత, తుర్లపాటి లక్ష్మి, కిరణ్‌బాల సంపాదకత్వంలో 'వెతలే... కథలై' కథా సంకలనం వెలువడింది.

అందులో యాభై ఆరు కథలున్నాయి. అన్నింటా తెలంగాణా జనజీవన సంస్కృతి, రాష్ట్ర ఆకాంక్ష, తెలంగాణ స్త్రీ బతుకు వెతలు చిత్రీకరించబడ్డాయి.

పేదరికం, కష్టాలూ కన్నీళ్ళూ, నిరుద్యోగం, నీటి సమస్య, ఒకటేమిటి... ఏ దిక్కు చూసినా... ఏదో ఓ సమస్య! అన్ని సమస్యలకీ పరిష్కారం... 'ప్రత్యేక తెలంగాణ' మాత్రమే అని తమ కథల ద్వారా సుస్పష్టం చేయగలిగారు రచయిత్రులు!

'మా భాషను అవమానిస్తే సహించం, మా ఆచార వ్యవహారాలను కించపరిస్తే ఒప్పుకోం, మా బతుకు లను అవహేళన చేస్తే ఖబర్దార్' అంటూ హెచ్చరించారు. తెలంగాణ జనజీవన సంస్కృతి లోని ఔన్నత్యాన్ని చాటి చెప్పారు!

తెలంగాణలో స్థిరపడి ఇక్కడి నేలను ప్రేమిస్తున్న వాళ్ళూ... ఇక్కడి జీవితాలనూ, భాషనూ హృదయానికి హత్తుకున్న వాళ్ళూ... జన్మతః వాళ్ళు ఆంధ్రా అయినా, తమిళులైనా, మరాఠీ అయినా వస్తు రీత్యా - ఆయా రచయిత్రుల కథలన్నీ తెలంగాణనూ, తెలంగాణ జీవితాన్నీ, తెలంగాణ భాషనూ, తెలంగాణ ఉద్యమాన్నీ స్పృశించడం విశేషం!

నిజం చెప్పాలంటే ఇది ప్రాంతీయం. కాని విశ్వజనీన సాహిత్యానికి ఈ కథా సంకలనం మంచి ఉదాహరణ అయింది.

అందులో - ముదిగంటి సుజాతారెడ్డి, పోల్కంపల్లి శాంతాదేవి, జూపాక సుభద్ర, కాత్యాయిని విద్మహే, యం. రత్నమాల, గోగు శ్యామల, గీతాంజలి, జ్వలిత, అనిశెట్టి రజిత, నెల్లుట్ల రమాదేవి లాంటి ప్రసిద్ధ రచయిత్రుల కథలతో పాటు వర్ధమాన రచయిత్రుల కథలు, అప్పుడే మొదటిసారిగా కలం చేతపట్టిన రచయిత్రుల కథలూ ఉన్నాయి... అయితే అన్ని రచనల్లోనూ తెలంగాణా ఆర్తి, అస్తిత్వవేదన తొణికిస లాడింది.

రెండు తలలు కలిసివున్న అవిభక్త కవలపిల్లల్లాంటిది ఆనాటి మన ఆంధ్రప్రదేశ్! చురుగ్గా, బలిష్టంగా వున్న ఆంధ్రా తల... ఆ మొత్తం శరీరాన్ని కంట్రోల్ చేస్తూ... తెలంగాణ తలని అరవై ఏళ్లపాటు తన అదుపాజ్ఞల్లో వుంచుకుంది! ఎంత గింజుకోచూసినా - తన అభీష్టానికి విరుద్ధంగా మొదటి తల చెప్పినట్టు వినే పరిస్థితి... ఆ రెండో తలకి ఏర్పడింది! చివరకు ఒక తల ఇటూ - రెండో తల అటూ లాగే పరిస్థితులెదురై - రెండింటి గమ్యాల్లో ప్రతిష్టంభన ఏర్పడి - వాటి అస్తిత్వాలకే ఎసరొచ్చింది!

సర్జన్ శాడిస్ట్ అయితే... చోద్యం చూస్తూ నించుంటాడు! నిపుణుడైతే... శస్త్ర చికిత్స ద్వారా - రెంటినీ సమర్థవంతంగా విడదీసి - రెంటికీ వేర్వేరు స్వేచ్ఛాయుత జీవితాల్ని ప్రసాదించినవాడవుతాడు!

సకల జనులనీ, విద్యార్థులనీ కూడగట్టుకొని ఓ దశాబ్దంపాటు ఉద్యమాన్ని సజీవంగా నడిపిన కేసీఆర్ ఆ అవిభక్త శిశువుల్ని ఆపరేషన్ టేబుల్‌దాకా తీసుకెళ్తే- సోనియాగాంధీగారు ఆ కవలలని విడదీసేందుకు సర్జన్ అవతారమెత్తారు.

ఆ ఆపరేషన్‌కి కావలసిన అనస్తీషియా ఇచ్చి సర్జన్‌కి సహకరించింది బీజేపీ అయితే - వెంటిలేటర్ మీదున్న అవిభక్త కవలలకి ఆక్సిజన్ అందించే గొట్టాలని లాగిపారేసేందుకు శతవిధాలా ప్రయ త్నించి, అభాసుపాలయింది వై.ఎస్.జగన్,

కిరణ్ కుమార్ రెడ్డి, చంద్ర బాబు నాయుడు, లగడపాటి, రాయపాటి, ఉండవల్లి తదితరులు!

ఏదేమైనా... మనం ఒకడుగు ముందుకేస్తే – 'తెలంగాణా రాష్ట్రం' చేతులు సాచి – నాలుగడుగులు మనకై నడిచొస్తుందని నాడు ఆకాంక్షించిన రచయిత్రు లకి – ఆ ప్రయత్నం మొదలెట్టిన మరో నాలుగేళ్ళకి ప్రత్యేకరాష్ట్ర కల సాకారమవడం... అందునా – ఆ చల్లని వార్త సరిగ్గా మా నిజామాబాద్ జిల్లా శ్రీ అపురూప వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ధ్వజారోహణ సమయంలో అందడం మాకో తీపి గుర్తు!

చివరగా నాదో విన్నపం –

తెలంగాణా ఉద్యమంలో కేవలం రాజకీయ నాయకులే కాదు ఎండా వానలకి తట్టుకుని, లాఠీదెబ్బలకి ఎదురొడ్డి నిలిచిన ఉద్యమ కారులూ, రచయితలూ, రచయిత్రులూ, వివిధ పార్టీల జే.ఏ.సీ నాయకులూ, ఎన్నో విద్యార్థి సంఘాల నాయకులూ, రోడ్లమీద మండుటెండల్లో వంటావార్పు కార్యక్రమాలను నిర్వహించిన గృహిణులూ ఒకరేమిటీ... వీరూ వారూ అని తేడా లేకుండా... సామాన్యజనం సైతం ప్రముఖపాత్ర వహించి తమ కలని సాకారం చేసుకున్నారు.

అయితే ఇక మనం సొంతంగా ఇల్లు కట్టుకున్నామని, ఇప్పుడిది మనిల్లేకదాని – నిశ్చింతగా కాలుమీద కాళ్లేసుకొని కూర్చుని – దాని మానాన దాన్ని వదిలేస్తే ఎక్కడి పరిస్థితులు అక్కడే వుంటాయి.

అందుకే మనింటిని మనం నిరంతరం శుభ్రం చేసుకునే పని నెత్తినెట్టుకోవాలి. ఇంటికి పగుళ్ళు రాకుండా చేసుకోవాలి. బీటలు వారకుండా – కుప్పకూలకుండా చూసుకోవాలి.

ఇంట్లో చెత్త పోగైతే – దాన్ని ఎలా ఏరి పారేస్తామో – కష్టపడి సాధించుకున్న రాష్ట్రాన్ని ఈనగాచి నక్కల పాల్జేయకుండా – అనుక్షణం అప్రమత్తంగా వుంటూ... సమాజాన్ని ఎజుకేట్ చేసే దిశలో మన కవయిత్రులు, రచయి త్రులు కృషిచేస్తే – తెలంగాణ రాష్ట్రం లాగే – 'బంగారు తెలంగాణా'కూడా – మనకై చేతులుసాచి నడిచి వస్తుంది!

'తెలంగాణ ఉద్యమంలో రచయిత్రుల పాత్ర' పేర రాష్ట్రస్థాయి సదస్సుని ఏర్పాటుచేసిన 'తెలంగాణ సారస్వత పరిషత్' అధ్యక్షులు, గౌరవనీయులు డా॥ సి.నారాయణరెడ్డిగారికీ, ప్రధాన కార్యదర్శి డా॥ జె. చెన్నయ్యగారికి మా రచయిత్రులందరి తరఫున ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

ఉద్యమ కార్యకర్తగా, కవయిత్రిగా నేను



ఇష్రత్ సుల్తానా

నేను విద్యార్థిగా1969లో జై తెలంగాణ ఉద్యమంలో పాల్గొని ఒక విద్యా సంవత్సరాన్ని నష్టపోయాను. ఆ ఉద్యమంలో ఒకరోజు అరెస్టు కూడ అయినాను. అప్పటి నుండి తెలంగాణ సాధన నా ఊపిరిగా మారింది. హైద్రాబాద్‌లో బి.ఇడి చేస్తున్న సందర్భంలో నేను హాస్టల్‌లో ఉండగా నా రూమ్‌మేట్స్ ఆంధ్రావాళ్లు ఉన్నారు. తెలంగాణ వారికి తెలుగు భాష సరిగా రాదని అంటే అనేక సందర్భాలలో వారి తెలుగు భాషా దోషాలను ఎత్తి చూపి ఒప్పించి మన భాష ఔన్నత్యాన్ని చాటి వాళ్ల నోర్లు మూయించాను. అప్పటి నుండి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్ష ఇంకా బలపడింది.

ఇక మలిదశ ఉద్యమంలో డిసెంబర్ 2009 నుండి జూన్ 1, 2014 వరకు ప్రతిరోజు ఉద్యమ కార్యక్రమాలలో పాల్గొన్నాను. అనేక పోరాటాలు చేయడమే కాకుండా కవితల ద్వారా, పాటల ద్వారా ప్రజలలో ఉద్యమ చైతన్యాన్ని, ఉద్యమ పటిమను పెంచినాను. 'లేవరా' అనే కవిత పాట రూపంలో వ్రాసి ఉద్యమంలో పాట రికార్డు చేసి పాడడం జరిగింది. ఆ పాట సభలలో ఉద్యమకారులు, కళాకారులు పాడినారు.

కొంత కాలం ఉద్యమించి రాష్ట్రం ఏర్పాటులో కాలాతీతం కావడంతో విద్యార్థులు, యువకులు నిరాశా నిస్పృహలతోఆత్మహత్యలు చేసుకోవడం మొదలైంది. దానితో నా మనసు ఆవేదనకు గురియై మనస్తాపంతో వ్రాసిన కవిత ఇది.

ఆత్మహత్య వద్దు - తెలంగాణ సాధన ముద్దు.

పోరాటంలో హీరో కావాలిరా
ఆత్మహత్యతో జీరో కావొద్దురా
జీవన పోరాటంతో లక్ష్యం సాధించరా

జీవిత ఆరాటంతో విజయభేరి మ్రోగించరా

చచ్చి సాధించేది- ఏదీ లేదురా

అది పిరికితనమనే చులకన చర్యరా

ఉద్యమమే ఊపిరిగా

తెలంగాణ సాధించరా

ఆత్మహత్య చేతకాని చర్యరా

ఆత్మహత్యకు సానుభూతి వద్దురా

కన్న కలలను కల్లలు చేయకురా

కన్నతల్లి కడుపుకోతను మిగల్చకురా

బ్రతుకు విలువైనదని తెలుసుకోరా

ఊపిరున్నంత వరకు సాధన సమరం సాగించరా

ప్రకృతిలో ప్రతిజీవి చేస్తుంది పోరాటం

తెలంగాణ సాధనకు కావాలి ఉద్యమ సారథ్యం

అందుకే మేలుకో

నిజం తెలుసుకో

ఆత్మహత్య వేస్టు

ఉద్యమాలు బెస్టు

కాలిపోకు, రాలిపోకు ఉద్యమమై వికసించు

యాచక స్థితినుండి శాసన స్థితికి ఎదుగుదామని విప్లవించు

బలిదానాలు మానండి,

ఆత్మస్థైర్యంతో పోరుబాటలో ప్రజ్వరిల్లండి

ఉద్యమమంటే శవాలుగా మారడం కాదురా

మరణమే ఉద్యమమైతే,

శాంతియుతంగా మనకు స్వరాజ్యం వచ్చేదా ?

అహింసా సహాయ నిరాకరణోద్యమాలతో స్వాతంత్ర్యం సిద్ధించేదా ?

బ్రతికి తెలంగాణ చూడాలి కనులారా
స్వేచ్ఛా వాయువులు పీల్చాలి మనసారా
నిరాశావాదాన్ని విడువాలిరా
ఆశావాదాన్ని నింపాలిరా
తెలంగాణ ఏలుదాం
మన బతుకు మనం బతుకుదాం.
అలుపెరగని , అహింసాత్మక శూరులుగా
వీర తెలంగాణ సాధకులుగా
భావి తరాలకు స్ఫూర్తిగా
చిరస్థాయిగా నిలవాలిరా.

ఇంకా మరెన్నో కవితలు, వ్యాసాలు, ప్రసంగాలు, రచనల ద్వారా ప్రజలలో ఉద్యమస్ఫూర్తి కలిగించినాను. మనం ఏ విధంగా ఆంధ్రుల పాలనలో మోసగించబడినామో, ఎన్ని విధాలుగా నష్టపోయామో తెలుపుతూ, ఉద్యమించి మన హక్కును సాధించుకొందాం. జరిగిన అన్యాయాన్ని తెలుసుకొని మేల్కొని మన తెలంగాణ రాష్ట్రం సాధిద్దాం, మన రాష్ట్రాన్ని మనం పాలించుకొందాం–అది మన హక్కు అని అనేక రచనల ద్వారా తెలిపినాను. "ఉద్యమంలో మహిళల పాత్ర" రచన ద్వారా మహిళలలో జాగృతిని కలుగజేసి ఉద్యమంలో భాగస్వాములయ్యేటట్లు చేసినాను.

గ్లోబల్ వార్మింగ్–విపత్తు: పర్యావరణ పరిరక్షణ; భూమాత రక్షణ–మనబాధ్యత, జయహో తెలంగాణ లాంటి మరికొన్ని రచనలు, వివిధ మ్యాగజిన్స్‌లో ప్రచురణలు. మనఊరు–మన చెరువు– దిన పత్రికలో ప్రచురణ "మానవ మనుగడకై గుట్టలను కాపాడుకుందాం" వ్యాసం పర్యావరణ పరిరక్షణ పత్రిక లో ప్రచురణ. వివిధ సందర్భాలలో బతుకమ్మ పండుగ,దసరా, ఉగాది పండగ కవి సమ్మేళనాలలో ముస్లిం అయి వుండి కూడ పాల్గొనడం జరిగింది. తెలంగాణ ఉత్సవాలలో, బతుకమ్మ ఉత్సవాల కవి సమ్మేళనంలో పాల్గొని మంత్రులచే సన్మానాలు పొందినాను. శ్రీ బోయినిపల్లి వేంకటరామారావు(స్వాతంత్ర్య సమరయోధుడు) "సారస్వత మిత్రమండలి" నిర్వహించిన ప్రతి కవి సమ్మేళనము, ప్రతి కార్యక్రమములో రచయిత్రిగా, కవయిత్రిగా పాల్గొన్నాను. తెలంగాణ ఆకాంక్షను తెలిపినాను.

2010 సంవత్సరంలో టిజెఎసి జిల్లా మహిళా కన్వీనర్‌గా ఎన్నికయి అనేక ఉద్యమ కార్యక్రమాలు చేపట్టినాను. HMTV వారు నిర్వహించిన **'దశ–దిశ'** కార్యక్రమంలో పాల్గొని తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని వివరించినాను.

తెలంగాణ రాష్ట్రం ప్రకటించిన వెంటనే V6 వారి ఆహ్వానం మేరకు ప్రసారంలో పాల్గొని తెలంగాణ పునర్నిర్మాణంలో చేయవలసిన పనులు, ముఖ్యంగా విద్యా, వైద్య, వ్యవసాయ రంగాలను వెంటనే అభివృద్ధి పరచవలసి ఉందని, ప్రత్యేకంగా మహిళా పోలీస్ స్టేషన్‌లను ఏర్పాటు చేసి మహిళలకు రక్షణ కల్పించాలని, మహిళలకు ప్రత్యేకంగా వైద్య కళాశాలలు కరీంనగర్‌లో నెలకొల్పాలని విజ్ఞప్తి చేయడం జరిగింది.

టి న్యూస్, ఎన్.డి.టి వి, వి6, ఈటివి ఉద్యమ సమయంలో ఒక ఉద్యమకారిణిగా అనేక సార్లు మాట్లాడడం జరిగింది.

కరీంనగర్‌లో తెలంగాణ సాధనకై జరిగే ప్రతి సమావేశంలో, తెలంగాణ ఆకాంక్షను తెలుపడం జరిగింది. నా ప్రసంగాల ద్వారా ప్రజలలో ఉద్యమస్ఫూర్తి కలిగించడం, ఆంధ్రుల పాలనలో, ఎ.పి ఏర్పడిన తర్వాత ఏ విధంగా మనం నష్టపోయాం, ఏ విధంగా మోసగించబడినామో వివరించడం జరిగింది.

టిజెఎసి జిల్లా కన్వీనర్‌గా పని చేసిన కాలంలో జూనియర్ బాలికల కళాశాల కరీంనగర్ విద్యార్థినులు, లెక్చరర్స్ తో భారీ ర్యాలీ ప్లకార్డ్స్ తో తీసినాను. విద్యార్థినులు వివిధ టి.వి లలో తమ నిరసనను తెలుపుతూ తెలంగాణ ఆవశ్యకతను తెలిపినారు. ఆ విద్యార్థినులలో 1000 మంది ముస్లిం విద్యార్థినులు ఉండగా వారు కూడ రోడ్డుపై బతుకమ్మ ఆడడమే కాదుటి.వి ప్రసారాలలో తమకు జరిగిన, జరుగుతున్న అన్యాయాలను వివరిస్తూ ధర్నాలను చేపట్టినారు.

జిల్లా కన్వీనర్‌గా మా సభ్యులతో ఇతర మహిళలతో అనేక రాస్తారోకోలు, మానవహారంగా ఏర్పడడం చేసాను. అన్ని వర్గాల వారు, అన్ని టిజెఎసి లు కలిసి 3 కి.మీ కవాతు నిర్వహించగా, అందులో పాల్గొన్నాను. రోడ్డుపై కూర్చొని బీడీలు చుట్టడం, వంటావార్పు, మహిళలందరూ బతుకమ్మ, కబడ్డీ ఆడడం ద్వారా నిరసనలను తెలిపినాము. తెలంగాణ చౌక్ (కరీంనగర్) లో దిష్టిబొమ్మలు దహనం చేయడం, అమరవీరుల స్తూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించడం, ధూం ధాంలో పాల్గొనడం, కాగడాల ప్రదర్శనలో పాల్గొనడం, గద్దర్ గారి కార్యక్రమాలతో పాటు అనేక సదస్సులు, రౌండ్ టేబుల్ సమావేశాలలో పాల్గొనడం, వివిధ టి.వి ల ద్వారా నిరసనలు తెలుపుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు వేగవంతం చేసి ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినాము.దాదాపు 50 నిరాహారదీక్షలలో పాల్గొన్నాను.

తెలంగాణ లోగో స్టిక్కర్లను వివిధ వాహనాలకు రోడ్డుపై ఆపి అతికించినాము.తెలంగాణ చౌక్‌లో తెలంగాణ జిల్లా జెఏసి కన్వీనర్లు, కో కన్వీనర్లు కలిసి జాతీయ జెండాతో పాటు తెలంగాణ జెండాను ఎగురవేసినాను జిల్లా కన్వీనర్‌గా.

ముస్లిం వర్గం వారికి తెలంగాణ రాష్ట్రం వస్తే తమకు నష్టం అని, తమను రాష్ట్రం నుండి వెళ్లగొడతారనే అపోహ ఉండేది. అది ఒక రాజకీయ పార్టీ కలిగించిన అపోహ. తెలంగాణ అనే పదం పలకడానికే భయపడేవారు. దానిని దూరం చేయడానికి దాదాపు వేయి మంది ముస్లిం మహిళలతో ఒక సమావేశం ఏర్పాటు చేసి, టిజెఏసి కన్వీనర్‌గా రాష్ట్ర కన్వీనర్ యమ్.రత్నమాల, కో కన్వీనర్ డా.సులోచన లతో పాటు జలజ, ఇంకా మరికొందరు రాష్ట్ర మెంబర్‌లను ఆహ్వానించి ముస్లిం మహిళలలో గల అనుమానాన్ని నివృత్తి చేసినాను. వారిలో చైతన్యాన్ని కలుగజేసి ఉద్యమాలలో పాల్గొనేటట్లు చేసినాను. జలజ పాటలు వారిలో స్ఫూర్తిని కలిగించినవి.

రాష్ట్రస్థాయి మహిళా సదస్సు హైద్రాబాద్‌లో జరుపగా రాష్ట్ర కో-కన్వీనర్‌గా కొంత మంది మహిళలతో పాల్గొని ఆ సదస్సులో "రాష్ట్ర సాధనకై మహిళల పాత్ర" గురించి, తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకత గురించి ప్రసంగించినాను.

తెలంగాణ ముస్లిం విద్యావంతుల వేదిక కార్యదర్శిగా ఎన్నికై, తెలంగాణ ఉద్యమంలో విద్యావంతుల వేదిక టూ వీలర్ ర్యాలీ తీయడం, అనేక నిరసనలను చేశాము. తెలంగాణ ఆకాంక్షను తెలుపుతూ అనేక ఉద్యమాలలో పాల్గొన్నాం. పునర్ నిర్మాణంలో భాగం పంచుకొంటున్నాం.

జనవరి 2010 లో తెలంగాణ ఎల్డర్స్ ఫోరం, కరీంనగర్ ఏర్పాటైంది. కన్వీనర్‌గా వి.భూపతి, కో-కన్వీనర్‌గా నేను ఎన్నికయి అప్పటి నుండి ఫోరం కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నాను. 1969 ఉద్యమకారులు, ప్రభుత్వ ఉద్యోగులు, అగ్రికల్చర్, పోస్టల్, లెక్చరర్స్, తదితర ఉద్యోగ సంఘాలు, సీనియర్ సిటిజన్స్, వాకర్స్ అసోషియేషన్‌లలో గల సభ్యులు ఫోరం కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఫోరం కరపత్రాలను ప్రచురించి అందజేసింది. అంతేకాక చర్చా గోష్ఠులు ఏర్పాటు చేసింది "తెలంగాణ ప్రాంతానికి వివిధ రంగాలలో జరిగిన అన్యాయాలను" వివరిస్తూ 22 పేజీల వినతి పత్రం శ్రీకృష్ణ కమిటీకి సమర్పించింది.

ఫోరం ఆధ్వర్యంలో టూ వీలర్ ర్యాలీ, కొవ్వొత్తుల ప్రదర్శనలు, నిరసన దీక్షలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించడంతో పాటు 2011 నుండి ప్రతినెల 1 వ తేదీన, తెలంగాణ చౌక్‌లో నిరసన ప్రదర్శన చేపట్టడం జరిగింది.

ఫోరం సభ్యులు హైదరాబాద్‌లో ఇందిరాపార్క్ వద్ద జరిగిన ధర్నాలలో, మిలియన్‌మార్చ్, సకల జనుల సమ్మె, సాగరహారం మొదలైన కార్యక్రమాలలో పాల్గొన్నారు.

తెలంగాణ ఎల్డర్స్ ఫోరం 2011 సంవత్సరం మే 1 వ తేదీన తెలంగాణ ప్రజా సంఘాల రాష్ట్రస్థాయి సదస్సును కరీంనగర్‌లో ఏర్పాటు చేసి రాష్ట్రంలోని ఉద్యమ సంస్థలకు స్ఫూర్తిని కలుగజేసింది. **"శ్రీ కృష్ణ కమిటీ తెలంగాణ వాస్తవాలు ఎంతవరకు గుర్తించింది"** అనే పుస్తకాన్ని ప్రచురించి ఉద్యమ సంస్థలకు అందించింది.

ఈ విధంగా 2009 నుండి జూన్ 2014 వరకు అనేక నిరసన కార్యక్రమాలలో పాల్గొని, హైద్రాబాద్ రాజధానిగా, పది జిల్లాలతో కూడిన తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది.

ఈ విధంగా ఎన్నెన్నో ఉద్యమ కార్యక్రమాలలో పాల్గొని చివరికి జూన్ 2, 2014 నాడు తెలంగాణ రాష్ట్రం సాధించుకొన్నందుకు చాలా సంతృప్తి, ఆనందం కలిగింది. మా తరం నష్టపోయినా, భావితరాలకు అన్యాయం జరగకూడదని చేసిన ఉద్యమం సఫలమైంది. తెలంగాణ పునర్నిర్మాణంలో భాగం పంచుకుంటూ మున్ముందు కూడ పునర్నిర్మాణానికై కృషి చేస్తాను.

ఇక రాజకీయ ఉద్యమం, సాహిత్యోద్యమంతో సాధించిన తెలంగాణ, ప్రజల ఆకాంక్ష మేరకు పాలన జరగాలి. దీనికై తెలంగాణలో రచయిత్రుల పాత్ర ఎంతో ముఖ్యమైనది. నష్టపోయిన ఆర్థిక, సామాజిక మార్పు జరగాలి. బంగారు తెలంగాణ ఏర్పాటు కావాలి. కవులు, రచయితలు సమాజ నిర్దేశకులు. వారు సమాజాన్ని లోతుగా అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది. అన్ని సామాజిక వర్గాలు అభివృద్ధి చెందితే ఆ సమాజము, ఆ రాష్ట్రము అభివృద్ధి చెందుతుంది. ఆ దిశగా రచనలు రావాలి. మహిళలు సాధికారతను సాధించాలి. మహిళల పట్ల గృహహింస, వివక్షత, అత్యాచారాలు సమసిపోవాలి. చట్టాలు సవరించాలి. మహిళలలో ఆత్మస్థైర్యాన్ని కలుగజేసి, వారి శక్తిని తెలియజేయాలి. పేదల అభివృద్ధి, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించే దిశగా పాలన జరగాలి. వైద్య, విద్య, వ్యవసాయ రంగాలలో అభివృద్ధి జరిగేలా మన పాలకులు శ్రద్ధ వహించాలి. సర్వతోముఖాభివృద్ధికోసం పాలన సాగాలి.

ఉద్యమాల ద్వారా సాధించిన మన తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చడానికి ఒక యజ్ఞంలా కృషి సాగాలి. దానికై రచయిత్రులు తమ రచనల ద్వారా, రాజకీయ నాయకులను, పాలకులను, సమాజాన్ని ఉత్తేజపరచాలి. బంగారు తెలంగాణను సాధించే ఆకాంక్షను వారిలో కలుగజేయాలి. అలాంటి రచనలు రావాలి. రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధి చెందాలి. అప్పుడే బంగారు తెలంగాణ రాష్ట్రం సాధ్యమవుతుంది. స్వచ్ఛమైన, ఆరోగ్యమైన బంగారు తెలంగాణ రాష్ట్రం సాధించాలని నా ప్రగాఢమైన ఆకాంక్ష.

జై తెలంగాణ.

తెలంగాణ సంస్కృతిపై నా రచనలు



డా॥ ఆర్. కమల

తెలంగాణ ఉద్యమం చూసిన నాకు, తెలంగాణ వస్తుందనే ఆకాంక్ష నాకు బలంగా ఉండేది. ఆ ఆశతోనే మా ప్రాంతంలోని వారు భక్తి శ్రద్ధలతో నోముకునే వ్రతాలను సేకరించి 'తెలంగాణ వ్రత కథలు' అనే పేరుతో 1996 లో పుస్తకం ప్రచురించాను. దానికి తెలంగాణ పది జిల్లాల నుంచి మంచి స్పందన వచ్చింది. పుస్తకావిష్కరణ చేసిన నాటి స్పీకర్ శ్రీపాదరావు, డా॥ ఎం.కులశేఖరరావు దీవిస్తూ, మన ప్రాంతపు సాహిత్యాన్ని ముఖ్యంగా మౌఖిక సాహిత్యాన్ని మరింత వెలుగులోకి తేవాలని సూచించారు. ఆ వ్రతకథలు ప్రతి సంవత్సరం శ్రావణమాసం వెయ్యి ప్రతులు ప్రచురించినా సరిపోవటం లేదు. కొత్తగా పెళ్ళైన వధువు తప్పక నోచుకునే నోములున్నవి కనుక, దేశ విదేశాలకు వెళ్ళేవారనేకులు వారితో తీసుకొని వెళ్ళేవారు.

2000 సంవత్సరంలో ముద్రించిన తెలంగాణ వ్రతకథలకు డా॥పి.యశోదారెడ్డి అభినందనలందిస్తూ, "డా॥కమల సంప్రదాయాన్ని జీర్ణించుకున్న వ్యక్తి .. ఈ వ్రతకథలను సేకరించి, ముద్రించి అందిస్తున్నారు. ఈ పేరు పెట్టడమే విలక్షణంగా ఉన్నది. సౌభాగ్య కారకాలు, ఐశ్వర్య సంపాదకాలు అంటూ భావించే ఈ వ్రతాలు స్త్రీలందరికి మరచిపోరాని చుట్టాలు. పొలిమేర భేదించిందంటే భాషలు, యాసలు భేదిస్తాయి. అట్లే రీతులు, రివాజులు భేదిస్తాయి. తెలంగాణ ప్రాంతంలో దొరికే పూలలో, పండ్లలో చేసే నైవేద్యాలలో పూజా విధానమున్నది. ఇది హర్షించతగ్గ విషయం. ఈ పుస్తకం దేశవిదేశాల్లోని తెలంగాణ బంధుమిత్రుల కొక కరదీపిక. వ్రతాలతో పాటు శ్రావణ మంగళవారం పాట, అల్లోనేరళ్ళో పాట కూర్చబడ్డాయి. అవే కాక 60 ఏళ్ళ క్రింద అమ్మమ్మ, నాన్నమ్మ నాలుకల మీద పాడి వినిపించిన లాలిపాటలు-జోలపాటలు, మంగళహారతులు సేకరించి, ప్రచురించటం అభినందనీయం" అని దీవించారు.

ఆ మాటలు, బంధుమిత్రులు ప్రోత్సహించిన తీరు నన్నాశ్చర్యపరిచింది. వ్రతాలెలా చేసుకోవాలో పూజా విధానంతో విపులంగా వివరించిన నా పుస్తకాలకు

మంచి ఆదరణ లభించింది. అదే ఉత్సాహంతో భాద్రపదమాసం లో ఆడపిల్లలాడుకునే బొడ్డెమ్మలు, బతుకమ్మలు నామమాత్రంగా మారుతుండడం గమనించాను. అనేక ప్రాంతాల్లో, దేశాల్లో అనేక జాతులు కొత్తగా సంస్కృతి నేర్చుకుంటూ, ప్రచారం చేసుకుంటున్న ఈ తరుణంలో అతి ప్రాచీనమైన బతుకమ్మ, బొడ్డెమ్మ కనుమరుగవటానికి వీలులేదనిపించింది.

వెంటనే మా ఊరికి వెళ్ళాను. 70 సంవత్సరాలు పై బడ్డ వారిని బొడ్డెమ్మ-బతుకమ్మ ప్రాముఖ్యత ఏమిటని అడిగాను. దేవీ భాగతంలో శిష్టులెలా అమ్మవారిననేక రకాల పూజించారో దానినే జానపదులెలా ఆరాధిస్తారో ఆరా తీసాను. పల్లె పల్లెలకు వెళ్ళి బతుకమ్మ పాటలు 2001 లో సేకరించాను. ఈ రోజుల్లో "బొడ్డెమ్మ-బతుకమ్మ" లెవరాడుతున్నారని ఎద్దేవా చేసారు. కాని నా మనసులో ఏ మూలలోనో తెలంగాణ తప్పక వస్తది. అప్పుడు మన పండుగలు-పబ్బాలు, పాటలు- మాటలు ఏవి అని వెతుక్కోవలసిన పని లేదనిపించింది. 2002 లో "బొడ్డెమ్మ-బతుకమ్మ" ప్రచురించాను. ఆ పండుగ గ్రామీణ ప్రాంతం నుండి. పట్టణాలకు పాకింది. దాదాపు 6000 ప్రతులు ప్రచురించాను. ట్యాంక్ బండంతా పంచిపెట్టాను. 2009 నుండి బతుకమ్మలూపందుకున్నాయి. తెలంగాణ ఉద్యమంలో శ్వాసగా నిలిచాయి. విదేశాల్లో బతుకమ్మలాడే స్థాయి కీరోజు ఎదిగాయి.

2010 లో తెలంగాణ ఉద్యమం గ్రామీణ ప్రాంతం నుండి రావాలని ఆకాంక్షించాను. ర్యాలీలో పాల్గొన్నాను. బతుకమ్మలు వాడవాడల్లో ఆడించాము. టెంట్‌లు వేసి నిరాహారదీక్షలు చేసి గ్రామీణ ప్రజలకు ఉద్యమ లక్షణాలు, ఎందుకు చేయాలో వివరించాను. మంథనిలోని గాంధీచౌక్‌లో స్టేజ్ వేయించి స్త్రీల చేత తెలంగాణ ఉద్యమాన్ని వివరించాను. తెలంగాణ రాకుంటే నేనుద్యోగం చేస్తూ, ఆంధ్రావాళ్ళు హైద్రాబాదుకు డెప్యూటేషన్ పై వచ్చారు. ఉన్నత విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయంలో ఆంధ్రా మినిష్టర్ల అండతో చేరారు. వారి సంపాదన మూడు పూవులు ఆరు కాయలైంది. ప్రతి చిన్న విషయానికి వారి కనుసన్నలలో చేతులు మారేది ప్రతి పనికి లంచం . ముందు టివి చానల్స్ లో వాళ్ళే, రేడియో స్టేషన్ లో వాళ్ళే. వాళ్ళే సినిమా సెన్సార్ బోర్డు మెంబర్లు, పుస్తక నిర్మాతలు, కళాశాలల నిండా కడప, కర్నూలు వాళ్ళే. అంతా అయోమయం. ఆశమాత్రం తెలంగాణ సాధిస్తామనే.

అయ్యో ముందు తరాలైనా మన ప్రాంతం ఉద్యోగాలు వారే చేయాలి. ఎవరి మోచేతి కింద బ్రతుకవద్దు. తప్పకుండా తెలంగాణ రావాలి. "రాయలసీమ రుచులని" రోడ్లమీద చూసిన మనసు కుత కుతలాడేది. తెలంగాణ రుచులు, అభిరుచులు రావాలి. మన యువత మనుగడ ముందు ముందు అందంగా సాగాలన్నదే నా తపన. దాని సాధనకే కాక శోధనకు కృషి చేస్తానని తెలియజేస్తూ తెలంగాణ సాహిత్య రచనలు దాదాపు 20 పుస్తకాలు రచించి ప్రచురించాను. ఆంధ్రా (విజయవాడ – ఏలూరు రోడ్ దుర్గా పబ్లికేషన్స్) పాటలను – మాటలను దొంగిలించి (సాహిత్య చౌర్యం) చేసి పుస్తకాలు ప్రచురించారు. ఎన్నిదోచినా, ఎంత రాసినా వాళ్ళ బుద్ధి పరాన్నబుక్కులే. – జై తెలంగాణ .

* * *

అమరులు చిరస్మరణీయులు



కిరణ్‌బాల

ఈ మట్టిలో పుట్టి, ఈ నేలపై పెరిగి ఈ గాలిని శ్వాసిస్తూ 'నేను తెలంగాణ –నాది తెలంగాణ' అని సగర్వంగా చెప్పుకునే భాగ్యం భగవంతుడు ప్రసాదించిన వరం.

కన్నతల్లి, పుట్టిన వూరు, మాతృభాష ఈ ముగ్గురు తల్లులని పెద్దలు చెపుతారు అందుకే ఈ తల్లుల్ని ప్రేమించాలి, గౌరవించాలి, రక్షించాలి, పోషించాలి. ఇది మన బంధం, మన బాధ్యత అయితే ఎన్నో ఏళ్ళుగా భాషాపరంగానైతేమి, ప్రాంతీయ పరంగానైతేమి తెలంగాణ అన్యాయాలకూ, అవమానాలకూ గురవుతూనే వుంది. తొలి, మలి పోరాటాల అనంతరం తెలంగాణ ఉద్యమం – మూడో దఫా 'తాడో పేడో తేల్చుకోవాలి' అన్నంత తీవ్రరూపం దాల్చింది. కేసిఆర్ గారి నిరాహారదీక్ష కేంద్రం తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించడం, మళ్ళీ దాన్ని వెనక్కి తీసుకోవటం – ఇవన్నీ తెలంగాణ ప్రజల్లోని ఉద్యమ స్ఫూర్తిని మరింత వ్యాపింపజేయటానికి దోహదం చేసాయి.

తెలంగాణ పోరాటంలో ప్రత్యేకంగా చెప్పుకోదగింది సకల జనుల సమ్మె ముఖ్యమైంది. కుల మత భేదాలు లేకుండా అన్ని వృత్తుల వాళ్ళు అందరు ఉద్యోగులు 'ఒకే మాట – ఒకటే బాట – ఒకటే తెలంగాణ' అన్న స్థిర చిత్తంతో ఎలాంటి త్యాగాలకైనా సంసిద్ధమే అన్న పట్టుదలతో ఐకమత్యంగా పోరాటం చేయటం – చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన ఘట్టం!. అవిద్య, అనాగరికత, మూఢ విశ్వాసాలు పాతుకుపోయిన మారుమూల పల్లెలో సైతం – 'తెలంగాణ' ఉద్యమం పట్ల ఒక అవగాహన, ప్రత్యేక రాష్ట్రం కావాలన్న ఆరాటం ఉవ్వెత్తున చెలరేగాయంటే – అది సాధారణమైన విషయం కాదు.

ఉపాధ్యాయవృత్తిలో వున్న నేను, ప్రవృత్తిరీత్యా విద్యా కార్యక్రమాల్లో పాల్గొనడం, మీటింగ్‌లలో స్వీయ కవితలు వినిపించటం జరిగింది.

డా॥అమృతలత, రాజీవ, జ్వలితల సంపాదకత్వంలో వెలువడ్డ తెలంగాణ కవయిత్రుల సంకలనం 'గాయాలె గేయాలై' కోసం నా కవిత్వ అందించటం జరిగింది. అటు తర్వాత డా॥అమృతలత గారి నాయకత్వంలో నెల్లుట్ల రమాదేవిని, నన్నూ సహ సంపాదకులుగా చేసుకుని వెలువరించిన 'వెతలే కథలై' కథా సంపుటిలోనూ నా కథకు స్థానం లభించింది. ఇవి నాకు దక్కిన సదవకాశాలుగా భావిస్తాను. అలాగే రచయిత ఎలిశెట్టి శంకర్ గారి సంపాదకత్వంలో వెలువడిన తెలంగాణ రచయితల కవితా సంకలనం 'ఒకటే మాట తెలంగాణ' లో 'ప్రతి శబ్దం నినాదమై' అనే నా కవిత ప్రచురింపబడింది.

'సకలజనుల సమ్మె కాలంలో... స్కూల్ - పిల్లలు-పాఠాలు-చదువు-ఉద్యోగం - జీతం... ఈ ఆలోచనలు పక్కనపెట్టి, సమ్మెలో పాల్గొనటం ఒక గొప్ప ఫీలింగ్. ఆర్మూర్ నగరం నడిబొడ్డున అంబేద్కర్ చౌరస్తాలో టెంట్ కింద అందరం ప్రతిరోజూ సమావేశమయ్యేవాళ్ళం. పలువురు ప్రముఖులు ఆ సందర్భంగా ఉద్వేగ భరితంగా ప్రసంగించేవాళ్ళు మాలో పోరాట పటిమ మరింత రగుల్కొనేది.

జానపద కళాకారులు అప్పటికప్పుడు కంజీర, డప్పు చప్పుళ్ళ మధ్య ఆ పాటల్ని ఆలపించేవారు. ఐక్యపోరాటంలో ఇంతటి శక్తి వుంటుందా ! అని అబ్బురపడ్డ రోజులవి. దాదాపు నలభై రెండు రోజులు దీక్షగా సాగిన ఉద్యమంలో అందరం కలిసినప్పుడు ఎంత ఉత్సాహంగా వుండేదో - ఒంటరిగా కూర్చుని యోచిస్తోంటే దిగులుగా వుండేది... ప్రత్యేక రాష్ట్రం దక్కదేమో అని!

తెలంగాణ ఉద్యమంలో నన్ను కలచివేసినవి ఆత్మహత్య సంఘటనలు శ్రీకాంతాచారి ఆత్మహత్య దిగ్భ్రాంతిని కలిగిస్తే - యాదిరెడ్డి మరణం నన్ను మరింత దుఃఖితురాల్ని చేసింది. ఆనాడు ఎక్కడలేని ఉద్వేగంలో 'యాదిల వుంటవుర యాదిరెడ్డి' అనే కవిత రాసాను. అలా ఎందరో అమాయకులు ప్రత్యేక రాష్ట్ర కాంక్షతో, రాదేమోనన్న ఆవేదన - ఆవేశంతో ఒకానొక బలహీన దుర్భర ఉద్వేగ క్షణాల్లో ఆత్మహత్యలు చేసుకోవటం తెలంగాణ తల్లికి ఎంతటి కడుపుకోత !

ఈనాడు ప్రత్యేక రాష్ట్రాన్ని పొంది స్వేచ్ఛగా బ్రతుకుతూ, 'బంగారు తెలంగాణ' కై బాటలు వేయాలనుకుంటున్న తరుణంలో ఆ అమరవీరులందరినీ స్మరిస్తూ - అనుదినం వందనాలు సమర్పించుకోవాలి కదా మనమందరం

జై తెలంగాణ !

జై జై తెలంగాణ !

నెత్తురోడుతున్నా జై తెలంగాణ అన్నా



బి.జలజ

నా పేరు బక్కన్నగారి జలజ. మా నాన్న పేరు బి.హన్మారెడ్డి, నా తల్లి సుశీల మాది నార్సింగి గ్రామం. మండలం చేగుంట, జిల్లా మెదక్, రాష్ట్రం తెలంగాణ. నా మెదక్ జిల్లాలో మంజీర, మానేరు ప్రవహిస్తున్నాయి. అయినా ఇక్కడి ప్రజలకు తాగు, సాగునీరు ఇవ్వకుండా హైదరాబాదుకు నీళ్ళు తరలించారు. మంజీర, సింగూరు నిర్మాణానికి 300 వందల గ్రామాలు నివాసం కోల్పోయినాయి. మంజీర డ్యాంలోని నీరు దాదాపు 178 కిలోమీటర్లు పారుతుంది. ఆ డ్యాం పరివాహక ప్రాంతంలో సాగునీరు ఇవ్వకుండా హైదరాబాదుకు తాగునీళ్ళ కోసం తరలించారు.

సింగూరు డ్యాంలో దాదాపు 30 టిఎంసిల నీటి నిల్వ సామర్థ్యం, 50 వేల ఎకరాలు పారేటివి. ఘనపురం, కొల్చారం, సంగారెడ్డి, పుల్‌కల్, అందోల్, అల్లాదుర్గం, రేగోడు, పాపన్నపేట, శంకరంపేట మండలాలలో ఎలాంటి నీటికొరత ఉండేది కాదు. కానీ హైదరాబాదుకు నీళ్ళు సరిపోతలేవని సింగూరు నీళ్ళు కూడా తరలించిండ్రు. ప్రకృతి సిద్ధంగా మా నీటిని మాకు తాగటానికి, సాగుకు ఇవ్వకుండా అన్యాయం చేసింట్రు.

పరిశ్రమలు

దాదాపు 6 వేల పెద్ద పరిశ్రమలు ఏర్పడ్డాయి. చిన్న పరిశ్రమలు మూతపడ్డాయి. మిగతా ఉన్నదాంట్లో దాదాపు 20% ఉద్యోగులు లేబరుగా మా ప్రాంతం వారు ఉన్నారు. మిగితా 80% మంది ఆంధ్రా, రాయలసీమ వాళ్లు ఆఫీసర్ల స్థాయిలో ఉన్నారు. ఉన్న లేబరు ఉద్యోగులలో అపనమ్మకం పెరిగింది. నిరుద్యోగం ప్రబలింది. పరిశ్రమల కోసం భూములు అన్యాక్రాంతం అయినాయి. జిన్నారం, పటాన్‌చెఱు, తూప్రాన్, ములుగు, సంగారెడ్డి, సదాశివపేట పంటభూముల్ని తక్కువ రేటుతో మోసకారితనంతో ఆక్రమించారు. ఇది ఆధికారికంగా జరిగిన మోసం. ఫ్యాక్టరీలతో మెదక్ భూములు విషరసాయనాలతో పంటలు పండకుండా అయినాయి. ఈ ఇలాంటి పరిస్థితుల నేపథ్యంతో తెలంగాణ ఉద్యమం సాగింది.

విద్యార్థి (ఎ.యూ., కె.యూ) ప్రజా ఉద్యమాల ఫలితంగా 09-12-2009 న కేంద్ర హోంమంత్రి అర్ధరాత్రి 12 గం.లకు తెలంగాణ ఇస్తామని ప్రకటన చేసింద్రు. వెంటనే ప్రకటన వెనక్కి తీసుకుంద్రు. ఈ కాంగ్రెసు ప్రభుత్వ మోసానికి నిరాశతో తెలంగాణ రాదేమోనని 2009 నుండి దాదాపు మా మెదక్ జిల్లాలో 58 మంది తెలంగాణ కోసం ఆత్మహత్యలు చేసుకున్నారు.

మా మెదక్ జిల్లాలో జరిగిన నీళ్ళ దోపిడీకి మెతుకు లేని జిల్లాగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నరు. వనరులు ఉన్నా తాగు, సాగునీళ్ళకు చాలా కష్టాలు ఎదురైనవి.

నా మెదకు జిల్లా దగా పడ్డది. నా కుటుంబం దగా పడ్డది. నా జీవితం దగా పడ్డది. నా ప్రాంతం దగా పడ్డది. నా దృష్టిలో కుటుంబం కన్నా, నా జీవితం కన్నా నా జన్మభూమి తెలంగాణకు జరిగిన మోసం పెద్దదిగా భావించాను. పెయ్యన్ని దెబ్బలై (చేయని నేరానికి) రోజూ ఆ నొప్పులతో బాధ ఎల్లదీస్తున్న. 17 సంవత్సరాలు ప్రజా ఉద్యమాలలో మోసపోతూ చావలేక, బతుకలేక అందరూ ఉన్నా అనాథగా బతుకీడుస్తున్న నా జీవితానికి తెలంగాణ ఉద్యమం, అమరుల త్యాగాలు నాకు బతకాలని, పోరాడాలని ఒక స్ఫూర్తిని ఇచ్చాయి.

2009 విద్యార్థుల చైతన్యం నిప్పురవ్వలై జ్వలిస్తున్న తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు తోడైంది. ఉస్మానియా లో విద్యార్థుల పోరాటం మిన్నంటింది. ఓ.యూ. విద్యార్థులు ఉద్యమాలు మొదలుచేసి, ధర్నాలు, దీక్షలు చేస్తూ పోరాటం మొదలుపెట్టిననుండి, నా జీవితంలో జరిగిన అన్యాయానికి పోరాడకపోయినా, నా తెలంగాణ కోసం పోరాడాలని ఆశ నాకు కలిగింది. పాటలు పాడుతూ, రాస్తూ, మాట్లాడుతూ, ఉపన్యాసాలు వింటూ ఓయులోనే ఉండేదాన్ని. అన్ని జిల్లాలు, గల్లీలు తిరిగి ఢిల్లీదాక పోయిన. నా తెలంగాణ లొల్లిపెట్టిన. తెలంగాణ ఉద్యమంలో భాగంగా తెలంగాణ సంస్కృతిని ఆటను, పాటను కొత్తతరానికి అందించాలని 25-05-2010 లో ఉచితంగా కళాదరణలేని పేదపిల్లలకు శిక్షణా తరగతులు పెట్టిన. ఆంధ్రా పరిపాలన, రాయలసీమ పరిపాలనతో వాళ్ల సంస్కృతి మనపై రుద్ది మన ఆట, పాటను, సంస్కృతిని అణిచివేసింద్రు. మన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసింద్రు. వాటిని రక్షించుకోవాలని నా ఆశయం. తెలంగాణ, రాయలసీమ, ఆంధ్ర కలిపి మా టీవి 'రేలారె రేలా' జానపద పాటల పోటీ నిర్వహించింది. ఈ పోటీలకు నా శిష్యురాలు కె. నీలాంబరి, (జాకోర గ్రామం, వర్ని మండలం,

నిజామాబాద్ జిల్లాకు చెందిన విద్యార్థిని) 11 సంవత్సరాల వయసులోనే పోటీలకు ఎన్నిక అయింది.

తెలంగాణ, ఆంధ్రా, రాయలసీమ కలిపి 3 టీంలు చేసింద్రు. టీం లీడర్‌గా నీలాంబరికి రాయలసీమకు చెందిన కావ్య అనే అమ్మాయి ఎన్నికయింది. కాని ఆమె టీంలో ఉన్న నీలాంబరి తెలంగాణ అమ్మాయి కావడం వల్ల మంచి గొంతు ఉన్నా కాని ఒక్క పాటకూడా నేర్చేది కాదు. నేను వాళ్లను ఓడగొట్టి తెలంగాణ జానపదాన్ని ఎలాగైనా ప్రపంచానికి చాటాలని చాలెంజిగా తీసుకున్నా. శ్రమజీవుల చమటల చుక్కలనుండి వచ్చే పల్లెటూరిలో శ్రమజీవులు కైగట్టి పాడే అర్థవంతమైన జీవితాన్ని నేర్పే 250 పాటలను సేకరించి ప్రతి పాట నీలాంబరికి దగ్గరుండి అర్థం చెప్పి నేర్పించేదాన్ని. నీలాంబరిని జడ్జీలుగా ఉన్న అశోక్ తేజన్న జానపద కోయిల అని పిలిసేవాడు. ప్రతిపాటని తాళం పోకుండా శ్రావ్యంగా, స్పష్టంగా పాడి టీంలీడర్ రాయలసీమ కావ్య అశ్చర్యపడేలా ఎక్కువ మార్కులు సాధించేది. వరంగల్‌లో జరిగిన ఫైనల్ పోటీలో లక్షలమంది ముందు పాట పాడింది. చివరికి నీలాంబరి పాటలతోనే టీం గెలిచింది. ఆంధ్రప్రదేశ్‌లోనే మొదటి బహుమతి పొందింది. ఈ గెలుపు వెనుక నా 8 నెలల కృషి వుంది. నా తెలంగాణ జానపదం గెలవద్దని నీలాంబరిని ఎన్ని ఇబ్బందులు పెట్టినా న్యాయం గెలిసింది. నా తెలంగాణ జానపదం పల్లె శ్రమజీవుల నుండి జాలువారే తీయని తెలంగాణ జానపదాన్ని, పాటలను ప్రపంచానికి చాటి, కొత్తతరానికి అందించాననే ఆనందం కలిగింది. నీలాంబరికి రూ.35 వేల బహుమానాన్ని అందజేశారు. ఖర్చులన్నీ నేను భరించి బహుమానం ఆ నీలంబరికే ఇచ్చాను. పేద ఆడపిల్లలను, ఆదరణ కరువైన వాళ్లనే, తండ్రిని, తల్లిని కోల్పోయినవారిని అందరిని ఒకచోట చేర్చి "అమ్మ" సాంస్కృతిక కళాసంస్థ అని పేరు పెట్టి నా సేవలు ఉచితంగా అందించాను. కొందరు ఆడపిల్లలకు ఉచితంగా చదువుకునే అవకాశం కల్పించాను. తెలంగాణ తల్లి సంకెళ్ళను తెంచడానికి తెలంగాణ ఆట, పాటలను వాళ్లకు నేర్పిస్తూ, ప్రజల కథలు ప్రజలకే అంకితం చేయాలని వాళ్లకు మంచి శిక్షణను ఇచ్చాను. తెలంగాణ ఉద్యమానికే వాళ్ల పాటనుఅంకితం చేసాను. ఓట్లకోసం, సీట్లకోసం, జెండాల కోసం, పార్టీల కోసం పాటను పాడను. నా తెలంగాణ పోరాటం ఎక్కడ ఉంటే అక్కడ నా గొంతు వినిపిస్తది. ఈ ఉద్యమంలో కళాకారిణిగా కాకుండా ఒక సైనికురాలిగా కూడా పనిచేసిన. ప్రజలు నన్ను ఆదరించి నన్ను సాదుకున్నరు. వాళ్లకు నేను రుణపడి ఉంటాను.

నా దినచర్యలో రోజూ తెలంగాణ ఉద్యమంలో భాగంగా ఓయూకి రావడం, వీరుల త్యాగాలు, పెద్దల ఉపన్యాసాలు తెలంగాణకు జరిగిన మోసం తెలుసుకోవడం, విద్యార్థులు ఇచ్చే కార్యక్రమాలను చేయడం కొనసాగించాను. ఛలో అసెంబ్లీకి 10-12-2009 లో విద్యార్థులు పిలుపునిస్తే లేడీస్ హాస్టల్‌లో విద్యార్థులను పోలీసులు బంధిస్తే కొందరు విద్యార్థినులకు నా ఇంట్లో ఆశ్రయం ఇచ్చాను. పోలీసులు విద్యార్థులపై లాఠీఛార్జీ చేసి కాలు, చేయి విరగ్గొడితే వాళ్లకు సేవలు చేసి మందులకు పైసలు లేకుంటే నేను పాట పాడి డబ్బులు అడిగి వాళ్ల వైద్యానికి, ఖర్చులకు ఇచ్చాను.

ఉస్మానియాలో మరువలేని సంఘటన జరిగినది. జనవరి 20వ తేదీ, 2010. ఆ రోజు మెదక్ జిల్లాలో తెలంగాణ మీటింగ్‌కు పోయిన. ఓయూలో వేణుగోపాల్‌రెడ్డి అనే విద్యార్థి తెలంగాణ కోసం ఆత్మహత్య చేసుకున్నడు. నేను ఓయూకి వచ్చేసరికి రాత్రి 9 గంటలు రోజూ ఉస్మానియాలో అడుగు పెట్టగానే అకాశాన్నంటే నినాదాలు వినిపిస్తాయి. ఆట, పాటలతో మారుమోగేది. ఉపన్యాసాలతో ఉగ్రూతలూగేది. ఉస్మానియా ఉద్యమ జాతరగా ఉండేది. రాత్రి, పగలు తేడా లేకుండా ఉండేది. కాని ఆ రోజు ఓయూ ఆర్ట్స్ కాలేజీ ముందు అడుగుపెట్టగానే నిశ్శబ్దంగా వుంది. అమరుడైన వీరున్ని తలుసుకొని రోదిస్తుంది. విద్యార్థుల గుండెలు చెరువైతున్నాయి. చెట్టుచేమలు నివ్వెరపోయినాయి. గాలి భారంగా వీస్తున్నది. వేణుగోపాల్‌రెడ్డి మృతదేహం వద్దకు చేరుకుని కన్నీరు మున్నీరైన తన కుటుంబం కోసం, తనకోసం చేసిన త్యాగం కాదు, విశాలమైన తెలంగాణ తల్లి సంకెళ్ళు తెంచడానికి చేసిన త్యాగం. చాలా గొప్పవాడు. ఆ వీరుని ఏమని తలవాలని నివాళులర్పించి "వీరులారా వందనం", "జోహారులు" అంటూ వారిని స్మరిస్తూ రాత్రంతా పాటలు పాడాను. అక్కడ కొద్దిమంది విద్యార్థులే ఉన్నారు. అదేరోజు మధ్యాహ్నం ఎం.ఎల్.ఏలు, ఎం.పి.లు వచ్చి శవంపై ప్రమాణం చేసి మీ ఆశయం కోసం పదవులు కూడా త్యాగం చేస్తాము అన్నవాళ్లు ఎవరూ లేరు. రాత్రి 2 గంటలకు వేణుగోపాల్ శవాన్ని ఎత్తుకుపోవడానికి పోలీసులు వస్తే విద్యార్థులతో కలిసి ప్రతిఘటించి రక్షించుకున్నాం. ఉదయం శవయాత్ర జరుగకూడదనే కుట్రతో వచ్చిన పోలీసుల ఎత్తుగడలను చిత్తుచేసినం. చలి వణికిస్తుంది. అక్కడక్కడ మంటలు వేసింద్రు. అమ్మాయిలు సైతం ఐలమ్మలయినారు. శవం చుట్టూ ద్విచక్ర వాహనాలు పెట్టి రక్షించుకున్నాం.

తేది 21-01-2010 ఉదయం 10 గంటలకు వేణుగోపాల్ శవయాత్ర మొదలయింది. శవయాత్ర ముందు నడుస్తున్నాను. 'వేణుగోపాల్‌కు జోహార్లు' అంటూ వారి ఆశయాలను సాధిస్తామని నినాదాలు చేస్తూ నడుస్తున్నాం. మా చుట్టూ వేలమంది పోలీసులు, శవయాత్ర లేడీస్ హాస్టల్ ముందుకు రాకముందే పోలీసులు లాఠీఛార్జీ చేసి రబ్బరు బుల్లెట్లతో ఫైరింగ్ మొదలుపెట్టారు. విద్యార్థులను బెదరగొట్టింఁడ్రు. వేణుగోపాల్‌ను లేడీస్ హాస్టల్‌కు ఎడమవైపు ఉన్న రోడ్డుగుండా మల్లించి వేగంగా వాహనం తీసుకపోతుండ్రు. లాఠీఛార్జీ, రబ్బరు బుల్లెట్లు కురిపిస్తున్నరు. నేను వాహనం వెనుక పరిగెత్తాను. ర్యాపిడాక్షన్ ఫోర్సు మేడమ్ భాగో భాగో అంటున్నారు. నాకు చాలా దూరం వాహనం ఎల్లిపోయింది. నేను చెట్లల్ల తల దాచుకుని చూస్తున్నాను. నేను, నాతో కొందరు విద్యార్థులు కలిసి క్వాటర్స్ దగ్గరకు చేరుకున్నాము. క్వాటర్లలో నివసించే వాల్లు భయంతో తలుపులు మూసుకున్నారు. ఎక్కడ మనుషులు కనబడితే అక్కడ ఫైరింగ్ చేస్తున్నారు. మమ్మల్ని చూసి ఫైర్ చేశారు. వెంటనే క్వాటర్ ముందు ఉన్న నీళ్ళ తొట్టి దగ్గర ఒంగితే బులెట్ తల పై నుండి పక్కకు పోయింది. అక్కడి నుండి మెల్లగా తప్పించుకొని ఆర్ట్స్ కాలేజ్ బస్టాండ్ దగ్గర చేరుకున్నం. అక్కడ కొందరు రాజకీయ నాయకులు మీడియాతో మాట్లాడుతున్నారు. ఓయు మొత్తం పోలీసు నిర్బంధంలో ఉంది. హాస్టళ్ళలోకి వెళ్ళి ఒక్కొక్కరిని బయటకు గుంజి, కొందరిని తలుపులు వేసి కొడుతున్నారు. అరుపులు, కేకలు వినిపిస్తున్నాయి. లేళ్ళమీద పులుల మంద పడ్డట్లు వుంది. విద్యార్థులు పడే ఇబ్బందులు చూస్తుంటే ఆవేశం వస్తుంది. ఎలాగైనా వాల్లను రక్షించాలని "పోలీస్ గో బ్యాక్" అంటూ నినాదాలు చేసాను. ముందుకు కదిలాను. 5 గురు విద్యార్థులు నాతో కలిసి వచ్చారు. పోలీసుల టెంటును కాలవెట్టింఁడ్రు. నేను పోలీసు అధికారులతో వాగ్వివాదానికి దిగాను. మా విద్యార్థి శవాన్ని ఎత్తుకపోతిరి. పోరగాండ్లను కొట్టి సంపవట్టిరి. మీరు ఇక్కడ ఎందుకు ఉన్నారు? వెంటనే ఇక్కడనుంచి పోండ్రి అని పోలీస్ గోబ్యాక్ అని గట్టిగా అరుస్తూ వాల్లను వెంబడించాను. కొద్దికొద్దిగా అందరు కలిసి వస్తున్నారు. విద్యార్థులు ఆవేశంతో పోలీసుచర్యలను ఎండగట్టారు.

పోలీసుల చర్యలకు చెల్లాచెదరైన అందరిని భయంతో దూరంగా నిలబడి చూసేవారిని 'వీ వాంట్ తెలంగాణ' అంటూ అరుస్తూ అందరిని పిలిచాను. ఫైరింగ్ నడుస్తుంది. చేతులు జోడించి 'గో బ్యాక్ పోలీస్' అని వాల్లకు ఎదురుగా వెళ్ళాను. మెల్లెమెల్లెగా పోలీసులను ఆర్ట్స్ కాలేజీ బస్టాండు ముందు నుండి పోలీస్ స్టేషన్ దగ్గరకు పంపించాము. కొందరు విద్యార్థులు వచ్చి అక్కా లేడిస్ హాస్టల్ దగ్గర్లో 20

మంది విద్యార్థులపై వందలమంది పోలీసులు లాఠీచార్జి చేస్తున్నారు అని చెప్పగానే అటువైపు నినాదాలు చేస్తూ అందరు రండి అని పిలిస్తే 50 మంది అయ్యారు. అక్కడ 20 మంది విద్యార్థులు (చేతుల్లో కట్టెలు) ఉన్నారు. వందలమంది పోలీసులు ఒకవైపు ఉన్నారు. యుద్ధ వాతావరణం ఉంది. పోలీసుల విచక్షణారహిత చర్యలకు విద్యార్థులు ఆత్మరక్షణకై కట్టెలు, రాళ్ళు పట్టుకొని పోలీసుల ఫైరింగ్ నుండి తప్పించుకోవాలని గట్టిగా కేకలు పెడుతున్నారు. మేము అందరం విద్యార్థుల దగ్గరకు పోయి తమ్ముళ్ళూ మీరు దయచేసి కట్టెలు, రాళ్ళు పడేయండి. మేమంతా మీ కోసం వచ్చాం. మేం ముందు ఉంటాము. మనం అవేశపడితే ఈ ఫైరింగులో మనం నష్టపోతాం. మీకు దండం పెడతాను. ఆర్ట్స్ కాలేజీ ముందు పోలీసులను వెనక్కు పంపించాము. శాంతియుతంగా గోబ్యాక్ చెప్పి వెళ్ళకొడదాము అన్న. కొందరు విద్యార్థులు గాయాలతో బాధపడుతూ “అక్కా మేం ఏం నేరం చేసినం, పోలీసుల దుర్మార్గం ఎందుకు, మేం సచ్చినా సరే అక్కా” అని ఆవేశంతో మాట్లాడుతున్నారు. మరికొందరు ఏడుస్తూ గాయాలై పడి ఉన్నరు. మరికొందరు “వేణుగోపాల్ శవం పాయే ఇంకేముంది ఎందుకు ఉన్నారు అని, మేము విధ్వంసాలు చేయడం లేదు కదా” అని వాళ్ళకు నచ్చచెప్పి 200 మందితో రోడ్డుపై కూర్చొని పోలీస్ గోబ్యాక్ అని నినదించాము. పాటలు పాడుతూ నినాదాలు చేసాం. పోలీసు అధికారులతో గొడవకు దిగాము. చాలా ఆవేశంగా నినాదాలు చేసాము.

అప్పుడే ఓయూ గేట్లను పోలీసు నిర్బంధాన్ని ఛేదించుకొని అడ్వకేట్ జెఎసి వాల్లు ద్విచక్ర వాహనాలతో మా దగ్గరకు వచ్చారు. నేను వాల్లతో ముందు అందరం పోలీసుల దాడులనుండి విద్యార్థులను రక్షించుకుందామని వారిని కోరాను. అడ్వకేట్స్ అందరు నా విన్నపాన్ని అంగీకరించారు. ఒకవైపు పోలీసులు, మరోవైపు విద్యార్థులు, అడ్వకేట్స్, ప్రజల మధ్యలో నేను, నా కాల్లు తొక్కిసలాటలో నలిగిపోతున్నాయి. గాయాలవుతున్నాయి. సంఖ్య పెరిగింది. ఆవేశం పెరిగింది. గట్టిగా పోలీస్ గో బ్యాక్ అని నినాదాలు చేస్తున్నాము. వీళ్ళ ఆవేశానికి పోలీసులు లాఠీచార్జి చేస్తారో ఏమోనని భయానికి నేను అందరిని చేతులతో చైన్‌లాగా గట్టిగా కట్టించి కంట్రోల్ చేస్తున్నాం. విద్యార్థుల సంఖ్య పెరిగింది. ఆవేశం కట్టలు తెగుతోంది. పోలీసుల దుర్మార్గాన్ని ఎండగడుతున్నారు. చావో రేవో తేల్చుకుందామని పరుగులు తీస్తున్నారు. పోలీసులు చాలా నిదానంగా వెనక్కి వెలుతున్నారు. ఎండలో ఉదయం 8 గంటలనుండి అరిసి అరిసి నోరు ఎండుకుపోయింది. గొంతులో మాట వస్తలేదు. సాయంత్రం 4 గంటలవరకు పోలీస్ స్టేషన్ దగ్గరకు పోలీసులను పంపించాము.

అడ్వకేట్స్, నేను, విద్యార్థులు కలిసి పోలీసు అధికారులతో మాట్లాడి ఓయులోకి పోలీసులను రానివ్వద్దని పోరాడాము. అడ్వకేట్స్ 'మీరు వెళ్ళి కార్యక్రమాలు చేసుకోండి. మేము కావలుంటాం' అన్నారు. అప్పుడు అందరం కలిసి వేయిమంది అయ్యాము. ఆర్ట్స్ కాలేజీ వేదిక దగ్గరకు వస్తున్నాము. కొందరు రాజకీయ నాయకులు ఊసరవెల్లిలా వస్తున్నారు. వాల్ల రాజకీయ లబ్ధికోసం విద్యార్థులను పావులుగా వాడుకుందామని చూస్తున్నారు. కొందరు ప్రజా సంఘాలవాల్లు ఓయులోకి వచ్చారు. అప్పుడు విద్యార్థులకు నేను చెప్పాను – ఆపదలో ఆదుకోని వీల్లు ఎవరు క్యాంపస్‌లో రావద్దని చెప్పండి అన్నాను. అందరు విద్యార్థులు కలిసి వాళ్లని నిలదీసారు. మమ్మల్ని రక్షించలేని మీరు, మీ ఉపాన్యాసాలు మాకవసరం లేదు. అందరు వెళ్లిపోండని నినదించారు. అందరిని వెనక్కి పంపించారు. కొందరు వాల్ల అనుచరులతో నాపై దాడికి దిగారు. నాకు విద్యార్థులు తోడుగా నిలిచి అక్క రాత్రి నుండి మా వెంటె ఉంది. జలజక్కకు ఏం జరిగిన మేం సహించం అని వాదించారు. వాల్లు తోక ముడుచుకున్నారు.

సాయంత్రం 5 గంటలకు ఇంటికి వెళ్ళాను. రాత్రంతా నిద్రకాసి ఉదయం 8 గంటల నుండి సాయంత్రం వరకు దెబ్బలు తింటూ, పాడుతూ, నినదిస్తూ ఆ ఆవేశం ఎలా వచ్చిందో నాకు తెలియదు. ఇంటికి రాగానే నిద్ర లేదు, నీరసం గాయాలతో కుప్పకూలాను. వేణుగోపాల్ ఆశయం నన్ను నడిపించింది. ఓయు ఉద్యమం నాకు ధైర్యాన్నిచ్చింది. విద్యార్థులను రక్షించాననే తపన తృప్తి నాకు మిగిలింది.

పోలీస్ గోబ్యాక్ అన్నందుకు నాపై పోలీసులు అటెమ్ట్ టు మర్డర్ కేసు (పోలీసులపై హత్యాయత్నం కేసు) పెట్టినారు. నేను అసలు భయపడలేదు. ఉద్యమంలో చావడానికైనా సిద్ధమయ్యాను. ఉస్మానియా పోరు నా జీవితంలో మర్చిపోలేనిది, నాకు జీవిత లక్ష్యాన్ని చూపించిన విప్లవ కెరటం ఈ నేల (ఓయూ గడ్డ).

తెలంగాణ మహిళా జెఎసిగా ఏర్పడి జైలులో ఉన్న విద్యార్థులను పరామర్శించినాము. (విమల.కె, శోభ. ఉమాదేవి, సులోచన, విజయ). గన్‌పార్కు దగ్గర అమరులకు క్యాండిల్ లైట్ వెలిగించి నివాళులు అర్పించి, పార్లమెంటులో తెలంగాణ బిల్లు పెట్టాలని డిమాండ్ చేసాము.

- 21-12-2009 రోజు లగడపాటి దొంగదీక్ష చేసి హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖాన చికిత్స కోసం వస్తే నిరసన తెలిపాము. గో బ్యాక్ లగడపాటి అని ధర్నా చేస్తే రత్నమాల, శోభ, ఉమాదేవి, మణి, కవిత, విమల కటికనేని అరెస్టు అయ్యాము. గోల్కొండ పోలీస్ స్టేషన్‌లో రాత్రి 9 గంటల వరకు ఉంచారు.

- 14-12-2010 కలింగ భవన్‌లో పొలిటికల్ జెఎసి సభకి సంఘీభావం తెలుపుతూ పాటలు పాడాను (మహిళా జెఎసిగా), మద్దతు ఇచ్చాము,
- 17-01-2010 పాపన్నపేటలో 10 వేల మందితో తెలంగాణ సభకి వెళ్ళి మాట - పాటలతో ప్రజలను చైతన్యం చేసాను. మెదక్ జిల్లా సిద్దిపేటలో ప్రత్యేక రాష్ట్రం కోసం తెలంగాణలో అన్ని రకాల కళాకారులతో కలిసి అమరుల స్తూపం నుండి 5 కి.మీ. 50 మంది కళాకారులతో కలిసి ర్యాలీగా వెళ్ళి 15 వేల మందితో సభను విజయవంతం చేసాము.
- మెదక్ జిల్లా చేగుంట మండలం నార్సింగి గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో 5 వేల మంది సభను ఉద్దేశించి ఆట, పాట, మాట నిర్వహించాను.
- 10-12-2010లో తెలంగాణ మహిళా జెఎసి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రక్రియ ఏర్పాటు చేయాలని బతుకమ్మ అడుతూ పాటలు పాడుతూ ర్యాలీ తీసాము.
- దుందిగల్, కుత్బుల్లాపూర్ మండల గ్రామాల్లో తెలంగాణ ధూ ధాంలో మల్లంపేట్, దూలపల్లిలో ప్రజలను పాటల ద్వారా చైతన్యపరిచే కార్యక్రమాలు నిర్వహించాము.
- 04-01-2010 ఉస్మానియా గర్జన రోజు వేదికపై ఆట-పాట నిర్వహించాను. 5 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు.
- 11-12-2010 నాడు ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విద్యార్థుల దీక్షకు సంఘీభావం చెపుతూ పాటలు పాడాను.
- 05-01-2010 నాడు కరీంనగర్ కమలాపూర్ సభలలో (5 వేలమంది) పాల్గొని పాటలు పాడాను.
- 10-10-2010 పేట్ బషీరాబాద్‌లో, కుత్బుల్లాపూర్‌లో పొలిటికల్ జెఎసి ఆధ్వర్యంలో 10 వేల మంది సభలో ఆట-పాట నిర్వహించాను. మంచి స్పందన లభించింది.
- పొలిటికల్ జెఎసి చైతన్య బస్సు యాత్రలో భాగంగా నల్గొండ, వరంగల్, కరీంనగర్ వెళ్ళాను.

రాత్రి, పగలు తేడా లేకుండా తెలంగాణ ఉద్యమంలో పనిచేసాను. ఒక సంఘటన నాకు బాగా గుర్తుంటది. ఓయూ విద్యార్థి 2010 లో ఉరి వేసుకొని తెలంగాణ కోసం ఆత్మహత్య చేసుకున్నాడు. సూసైడ్ నోట్‌లో "రాజకీయ నాయకులను

నమ్మవద్దు, పార్లమెంటులో తెలంగాణ బిల్లు పెట్టాలని, తన శవయాత్ర గన్‌పార్కు వరకు జరపాలని" రాసాడు. 09-09-2009 రాత్రి తెలంగాణ ఇస్తామని మాట మార్చిన దొంగ సర్కారును నమ్మకండి అని సాయికుమార్ అనే బి.టెక్ చదువుతున్న విద్యార్థి రాసినాడు. మధ్యాన్నం ఓయూనుండి సాయికుమార్ (నల్గొండ జిల్లా) శవాన్ని గాంధీ దవాఖానాకు తీసుకపోయింద్రు. మధ్యాన్నం 2 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు శవాన్ని పోస్టుమార్టం చేయకుండా శవాన్ని తీసుకపోవడానికి పోలీసులు కుట్రలు చేసింద్రు. రాత్రి తల్లి, తండ్రి 11 గంటలకు వచ్చినంక శవపంచనామా చేసింద్రు.

సాయికుమార్ శవయాత్ర జరగనీయకుండా చేసింద్రు. విద్యార్థులు, మేధావులు, నేను అందరం కలిసి కొట్లాడితే 108 లో శవాన్ని తీసుకపొమ్మని పోలీసులు చెప్పింద్రు. 108 వ్యానులో శవయాత్ర ఎలా చేయాలని కొట్లాడితే వ్యాను తెచ్చింద్రు. రాత్రి గాంధీ హాస్పటల్ నుండి శవయాత్ర మొదలయింది. విద్యారాణి గారు, ఓయూ బాలమణి, ఇంకా 5 గురు మహిళలు ఒక కారులో కూర్చొని శవయాత్రలో పాల్గొన్నారు. నేను, అశోక్ అనే కళాకారుడు, ఇంకా కొందరు కళాకారులం పాటలు పాడుతూ శవయాత్ర ముందు రాత్రి 12 గంటలకు నడుస్తున్నాము.ఒక మఫ్టీ పోలీసు వచ్చి "మేడం మీరు కారులో కూర్చొండి" అన్నారు. నేను నడుస్తాను. ఫర్వాలేదు అన్నాను. పోలీసుల ప్లాను అర్థమయింది. శవయాత్ర సాగనీయకుండా శవాన్ని(వ్యానును) డైవర్టు చేసి యాత్రను భంగం చేయాలని పన్నాగం. 20 నిమిషాలు నడవగానే మాపై లాఠీ జులిపించి సాయికుమార్ శవం ఉన్న వ్యానును తీసుకపోయింద్రు. మేము ఆ రాత్రి రోడ్డుపై పరిగెత్తి పరిగెత్తి ఇతరుల సహాయంతో గన్‌పార్కు చేరుకొని నివాళులు అర్పించి రాత్రి ఒంటరిగా 1 గంటకు ఇంటికి చేరాను. నేను ఇంటికి రామాంతపూర్ వచ్చేముందు నా బండి వెనుక కొందరు మగవాళ్లు బండ్లపై నన్ను వెంబడించారు. నేను ఒక్కదాన్నే, రోడ్డుమీద జనం లేరు. అర్ధరాత్రి నేను బండిని వేగంగా తీసుకొని గల్లీలో తిరిగి తిరిగి తప్పించుకొని ఇంటికి చేరాను. మహిళను, అర్ధరాత్రి, ఒంటరిని అయినా ధైర్యం మాత్రం తెలంగాణ ఉద్యమం నాకిచ్చింది. తెలంగాణ రావాలని ఆకాంక్ష నాలో బలంగా ఉంది.

పొలిటికల్ జెఎసి బస్సు-యాత్ర ముగించుకొని 3 రోజులకు ఇంటికి వచ్చాను. అప్పుడే నాకు ఫోన్ వచ్చింది. ఇబ్రహీంపట్నం నుండి తిరుమలేశ్ అనే విద్యార్థి (బి.టెక్) తెలంగాణ కోసం ప్రాణాలిచ్చాడట. శవయాత్ర చేయడానికి ఎవరూ లేరని తెలిసింది. నేను ఎర్రని ఎండలో (46 డిగ్రీలు) 35 కిలోమీటర్లు టూ వీలర్‌పై

డ్రైవింగ్ చేసి ఇబ్రహీంపట్నం చేరుకొని ప్రెస్‌తో మాట్లాడి శవయాత్రను విజయవంతం చేయమని ప్రజలకు పిలుపు ఇస్తూ పార్లమెంటులో తెలంగాణ బిల్లు పెట్టాలని విద్యార్థుల ఆశయాలని నెరవేర్చాలని కోరాను. శవయాత్రలో విద్యార్థుల త్యాగాలు స్మరిస్తూ, ప్రభుత్వ మొండివైఖరిని ఎండగడుతూ, విద్యార్థులు ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దని విజ్ఞప్తి చేసాను. పోరాడుతూ తెలంగాణ సాధించుకుందామని నినదిస్తూ 1000 మందితో నా ఆధ్వర్యంలో రాస్తారోకో చేసాము. నేను ఎవరో అక్కడి ప్రజలకు తెలియదు. కాని ప్రజలందరు తెలంగాణ కోసం స్పందించి ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేసారు. ఇంతమందిని జమకట్టి రాత్రి 10 గంటల వరకు అంత్యక్రియలు ముగించి ధైర్యంగా ఇంటికి చేరాను. ఈ సంఘటన నాకు తెలంగాణకు జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడేందుకు మరింత స్ఫూర్తినిచ్చింది.

తేది 17-05-2011 నాడు జర్నలిస్టులు 'ఛలో ఢిల్లీ' పిలుపునిస్తే నేను, రత్నమాల మే నెల ఢిల్లీ యాత్ర అంటే మండే ఎండలు సైతం అధిగమించి రెండు రోజులు నేను నా శిష్యురాలు ధనలక్ష్మి (మెదక్) కలిసి ఢిల్లీ వెళ్ళి జంతర్ మంతర్ దగ్గర ధర్నాలో పాల్గొని పాట పాడినాను.

సాయంత్రం ఢిల్లీలో జవహర్‌లాల్ యూనివర్సిటీలో విద్యార్థులు తెలంగాణకు మద్దతిస్తూ పెట్టిన సభలో గద్దరన్న నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నాను. సభను జయప్రదం చేసాము.

నేను స్వచ్ఛందంగా అనేక కార్యక్రమాలకు వెళుతూ ఉంటాను. అడ్వకేట్ జెఎసి మీటింగులకు, జలమండలి, విద్యుత్తుసౌధ, ఆర్టీసీ ధర్నా, పొలిటికల్ జెఎసి, ఇతర ప్రజా సంఘాల, జర్నలిస్టుల యాత్ర, రోజూ కార్యక్రమాలలో పాల్గొన్నాను. ఇది అప్పటి నా దినచర్య.

తెలంగాణ కోసం రాజీనామాలు చేసి ఎలక్షన్‌లో మనవాళ్లు గెలిస్తే దేవునికి ప్రాణమిస్తనని మొక్కి ఓయూలో ఆత్మహత్య చేసుకున్న ఇషాంత్‌రెడ్డి అంతిమయాత్ర ఓయూ నుండి మొదలైంది. లాఠీచార్జీలో దెబ్బలు పడి, నా చెప్పులు పోయినా, మండు ఎండలో ఓయూ నుండి గన్‌పార్క్ వరకు నినదిస్తూ, అమరులను స్మరిస్తూ పాటలు పాడుతూ నడిచాను. ఒక లక్షమంది స్వచ్ఛందంగా ఇషాంత్‌రెడ్డి అంతిమ యాత్రకు తరలి వచ్చారు. ఈ యాత్రను భగ్నం చేయడానికి (పోలీసులు) ఎన్ని ప్రయత్నాలు చేసినా కట్టుదిట్టంగా ప్రజలు యాత్రను విజయవంతం చేసారు. స్వచ్ఛందంగా బందు నిర్వహించారు. ఈ యాత్ర చరిత్రలో నిలిచిపోతుంది. నిస్వార్థంగా, శాంతియుతంగా, ప్రజాస్వామికంగా సాగే న్యాయమైన ప్రజా పోరాటాలు అంతిమంగా విజయాలు సాధిస్తాయనేది జగమెరిగిన సత్యం.

ఏది ఏమైనా నా జీవితాన్ని కోల్పోయిన. ఉద్యమాలలో 15 సంవత్సరాల క్రితం పని చేయడానికి వెళ్లినందుకు నేను పుట్టిన అగ్రకులం నన్ను వెలివేసింది. ఉద్యమాలలో నేను జీవితాన్ని కోల్పోయిన. ఒంటరి అయినా నా తెలంగాణ 55 సంవత్సరాల మోసం ముందు నాకు జరిగిన అన్యాయం చాలా చిన్నది అనుకొని ఉద్యమంలో పాల్గొన్న 69 లో దాదాపు 360 మంది, 2009 నుండి 600 మంది అమరులయ్యారు. అయితే నీరు, భూమి, ఉద్యోగాలు, వనరులు కోల్పోయిన రైతులు, ఉద్యోగులు, వృత్తులవారు, బతకపోయి బొంబాయిలో సచ్చినవాల్లు పరోక్షంగా వేలాదిమంది ఉంటారు. ఈ కుట్రలు, కుతంత్రాలు, స్వార్థ రాజకీయాల పుణ్యమాఅని ఈ నా తెలంగాణ ఎంతో మంది బిడ్డలని కోల్పోయింది. ఆడపిల్లలను సాదలేక అంగట్లో అమ్మేసిన వాళ్ళు, ఆడపిల్లలను సాదలేక కడుపులోనే సంపిన వాళ్ళు ఎందరో. తెలంగాణ తల్లుల గుండెకోత కన్నా నా గుండెకోత చిన్నదే కదా! తెలంగాణ తల్లి తన బిడ్డలను(ఆడ) పోగొట్టుకొని పడే బాధ గురించి పాట రాసిన. అందుకే నా శ్రమతో నేను బతుకుతూ నా తల్లి తెలంగాణ విముక్తికై పోరాడుతున్నా. అయితే దురదృష్టవశాత్తు మీటింగులల్ల ఆడవాల్లను మాట్లాడనియ్యరు. పాట పాడనియ్యరు. అక్కడ (ఆడవాల్ల) పోరాటాలను గుర్తించరు. అక్కడ పోరాడాలె. తెలంగాణ అస్తిత్వంకై పోరాడాలె. మహిళగా నా అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి పోరాడాలె. వేదికలమీద మాట్లాడడానికి, పాడడానికి పోరాడి సాధించుకుంటాను. నా జీవితమే పోరాటం, అందులో ఇదొక భాగం.

ఒక రోజు రాత్రి 12 గంటలకు ఓయూలో బాయిస్ హాస్టళ్లపై పోలీసులు కరెంటు తీసేసి లాఠీ చార్జి చేస్తూ ఫైరింగ్ చేస్తూ చిత్రహింసలు పెడుతుండ్రు. గర్ల్స్ హాస్టల్ పిల్లలు అది చూసి వారిని రక్షించాలని పోయింద్రు. ఆడపిల్లలని చూడకుండా వాల్లను పోలీసులు లాఠీలతో కొట్టినారు. ఫైరింగ్ చేసింద్రు. చెట్టుకొకరూ, పుట్టకొకరూ అయ్యింద్రు. ఆడపిల్లను బూతులు తిడుతూ తరిమి తరిమి కొట్టారు. అది నేను టీవీలో చూసి రాత్రి 2 గంటలకు ఓయూ గేటు దగ్గరకు వెళ్ళాను. నన్ను పోలీసులు ఐడి కార్డు కావాలని అడుగుతున్నారు. మా చెల్లెలుకు దెబ్బలు తగిలినాయి అని చెప్పాను. అయినా వింటలేరు. కొందరు విద్యార్థులు వచ్చి మా అక్క మా అక్క జలజ. పంపించండి అని గట్టిగా చెప్పింద్రు. అప్పుడూ వింటలేరు. నేను పోలీసులతో వాగ్వివాదానికి దిగాను. "రూల్స్ బాగా పాటిస్తున్నారు. మా విషయంలో, కాని మా ఆడపిల్లలని మగ పోలీసువాల్లు ఎందుకు కొట్టినారు, తిట్టినారు, స్పృహ కోల్పోయేటట్టు చేసింద్రు. ఆడ పోలీసులు చేసే పనిని మగవాల్లు ఎందుకు చేసింద్రు. అయినా మా పిల్లలు ఏం తప్పు చేయలేదు కదా. ఎందుకు కొట్టింద్రు?" అని గట్టిగ లొల్లిపెట్టిన. అప్పుడు నన్ను ఓయూ లోపలికి వెళ్ళనిచ్చారు. కరంటు తీసేసింద్రు. లేడీస్ హాస్టల్

ముందు 50 మంది ఆడపిల్లలు ఉన్నారు. మీడియాకు ఫోను చేసి పిలిపించాను. విద్యార్థులతో మాట్లాడించాను. దవాఖానాలో స్వప్న అనే అమ్మాయికి బుల్లెటు పడింది. చాలామంది స్పృహ కోల్పోయారు. రాత్రి స్వప్న దగ్గర ఉండిపోయాను. అందరిని పరామర్శించాను. వాళ్ల అవసరాలను తీర్చాను.

ఒక అర్ధరాత్రి ఓయూలో ఒక వరంగల్ విద్యార్థికి కాలువేలు, చెయ్యి (ఎడమ) విరిగింది. దవాఖానాకు పోయినం. చేయి విరిగి ఉంది. చికిత్స మొదలు పెట్టలేదు. ఎందుకంటే డబ్బులు దవాఖానకు కట్టలేదని. అప్పుడే ఆ విద్యార్థి తల్లిదండ్రులు ఫోన్ చేసిండ్రు. "బిడ్డా, టీవిలో చూస్తున్నా, అందరికీ దెబ్బలు తగిలినాయి. నీవు ఎట్ల వున్నవు కోడుకా" అన్నది తల్లి. అప్పుడు ఆ విద్యార్థి అమ్మ నేను బాగున్నా ఏదో పోలీసులు మమ్ములను బాధపెట్టవద్దని కట్టుకట్టుకుంటున్నాం. నీవు ఏమి బాధపడకు అని నచ్చచెప్పాడు. నా కండ్లలో నీళ్ళు తిరిగాయి. చేతులు విరిగి చేతంతా ఉబ్బింది. అవస్థ పడుతున్నా చేయంతా గుంజుతున్నా అది భరిస్తూ ఏ మాత్రం తన తల్లికి తెలువనీయకుండా బాధను గుండెలో దాచుకున్నాడే ఎంత సాహసం అని బాధపడ్డాను. ఆ విద్యార్థి వారం రోజులకు డిశ్చార్జి అయ్యిండు. తనకు దవాఖానలో సేవలు చేశాను. ఇంటికి ఆ విద్యార్థి వెళదామంటే డబ్బులు లేవు. కనీసం నా ఇంటికి ఒకసారి రా బాబు అని పిలిచాను. "లేదు మేడమ్ పోలీసులు బయటకు వెలితే అరెస్టు చేస్తున్నారు అన్నాడు. కాని ఎలాగైనా ఆ విద్యార్థిని ఇంటికి తేవాలని టూ వీలర్ తీసుకొని సాయంత్రం 7 గంటలకు ఓయూ వెళ్ళాను. ఆ విద్యార్థిని నా బండిపై ఎక్కించుకొని కొంచెం దూరం రాగానే నా బండి వెనుకా ముందు పోలీసులు వచ్చారు. "మేడం నేను చెప్పలేదా? మా ఫోన్లు ట్యాపింగ్ అవుతున్నాయి. అరెస్టు చేస్తారు. నా చదువు పాడవుతుంది" అన్నాడు. కాని నేను నా బండిని అక్కడ కొన్ని ఇండ్లు ఉన్న దగ్గర మళ్ళించాను. పోలీసులు వెళ్ళాక చిన్న చిన్న దారుల గుండా ఇంటికి వచ్చాము. భోజనం పెట్టాను. మేడం నా తల్లి చేతివంట తిన్నట్టుంది అన్నాడు. కొందరి సహాయంతో అతనికి ఇంటికి వెళ్ళడానికి వైద్యానికి డబ్బులు సహాయం చేసి ఓయూలో వొదిలి వచ్చాను.

నా పాటకు మాటకు నా పోరాటాలకు తెలంగాణ అంతా ప్రజలు చాలా ఆదరించారు. మహిళలు ఈ తెలంగాణ పోరాటంలో స్వచ్ఛందంగా తరలివచ్చింద్రు. తెలంగాణ సాధించడం కోసం ఎన్నో ప్రయాసలకు వోర్చింద్రు చివరికి నేను కూడా. నా పాట, ఆట తెలంగాణకు అంకితం చేస్తున్న. నా ఉద్యమ ప్రస్థానం సాగుతనే ఉంటుంది.

ఉద్యమంలో ఎదిగిన కవయిత్రిని నేను



జ్వలిత

భారతదేశానికి పట్టుగొమ్మలైన గ్రామాలు నా జీవిత దర్శినిలో ప్రథమ దృశ్యనాటకాలుగా నా భావాల అక్షరీకరణకు మూలాలు. మధురమైన బాల్య స్మృతులు ముఖ్యంగా ఊహ తెలిసినప్పటి నుండి పదహారేళ్ళ వయసు వరకు పచ్చటి పొలాలతో పాటు వెచ్చటి కన్నీళ్లను, అమ్మను చుట్టుకొని పడుకున్నా పక్కగుడిసెల్లో మూలుగులను పసిగట్టింది మనసు. తెల్లవారక ముందే చుక్క పొడవక ముందే బండ బూతులతో జీతగాళ్లను నిద్రలేపే వలసవాదుల కారుకూతల్లోని అహంకారాన్ని ఆలకించాయి చెవులు. తండా నాయకుడే వావి వరుసలు మరచి వారి యిళ్లలో పసిశరీరాలను ముసలి అవయవాలను సమానంగా కబళించడం గుర్తించింది మెదడు. చదువు లేని అమాయకపు రైతులను చేతబడుల పేరుతో భయపెట్టి, నాన్న చేతిలో అరకలను గుంజుకున్న ఊరిచివరి గుడిసె దాష్టీకం అర్థం చేసుకుంది. అమ్మ కూలికి పోవలసిన అవసరం, నాటుసారా లింగ భేదం లేకుండా కుటుంబాలను మింగడాన్ని 1970 వ సంవత్సరంలోనే అవలోకించింది. ఇలా మొదలయి ఇంకా కొన్ని బతుకు చిత్రాలు అంతర్ చేతనగా వుండి దాదాపు ఇరవై ఏళ్ళు డైరీల్లో మగ్గి 2006 లో ప్రచురణలకు నోచుకున్నాయి. కవితలుగా, కథలుగా అచ్చయినాయి.

1969 హన్మకొండ వెంకటరత్నమ్మ హాస్టల్లో చదువుతున్న అక్కచెల్లెళ్ళిద్దరిని చూడటానికి వచ్చిన మా నాన్నను ఖమ్మం జిల్లా భాషలోని ఆంధ్రయాస ప్రమాదంలో పడేసింది. నాటి ఉద్యమకారులు మా నాన్నను ఆంధ్రోడని గెదిమితె కాశిబుగ్గ దాకా పారిపోయి ప్రాణం దక్కించుకున్న వైనం, మమ్మల్ని యింట్లకు రానిస్తే తమను కూడా చంపుతారని బెదిరిపోయిన మా పెద్దమ్మ భయం, అన్నీ కలిపి మా చదువులను మళ్ళీ మా ఊరు పెద్దకిష్టాపురానికి తీసుకొచ్చాయి. ఖమ్మం జిల్లా గార్ల మండలం ముల్కనూరులో, తరువాత బయ్యారం మండలం గంధంపల్లిలో పదవ తరగతి వరకు సాగిన చదువు కాలంలో చూచిన, ఎదురయిన సంఘటనలన్నీ వలసవాదుల దురాగతాలను మనసులో ముద్రించాయి.

జీవితమంటే ఒక బాధ్యతగా మాత్రమే ఎందుకు మిగిలిందో అర్థం కాని వయసులో జరిగిన ఒక సంఘటన ఎప్పటికి మరచి పోలేనిది. తొమ్మిదినెలల కడుపుతో పొలంపనిలో అలసి బయ్యారం చెరువుకట్ట మీద కూసున్న కూలీని ఒక వలస రైతు కాలితో తంతే దొర్లుకొంటు పొలంల పడి చచ్చిపోయింది. ఆ తరువాత కొద్దిరోజులకే అడివిల అన్నలు ఆ రైతును బండి చక్రానికి భార్యా పిల్లల ముందే కాళ్ళు చేతులు నరికి చంపారు. ఇటువంటివి మరికొన్ని నా అక్షరాలకు మూలాలు.

నా మొదటి కవిత “సబ్బన్న జాతుల ఆడది” 2007లో ఆంధ్రజ్యోతి దినపత్రిక వివిధలో అచ్చయ్యింది. (అంతకు ముందు సంకలనాలలో వచ్చినా పత్రికలలో అచ్చయినది ఇదే మొదటిది). చేతివృత్తుల్లో మహిళల భాగస్వామ్యం, వృత్యంతర, కుటుంబ దోపిడి ఇందులోని కవితా వస్తువు. (కొలిమి కాడికి బొగ్గులు నేను తెస్తే । కొలిమి తిత్తి నా అక్క ఊదితే । కొలిమిల కర్రుకు అమ్మ సమ్మెటేస్తే । సందేల డబ్బులు అయ్య చేతుల బడ్డయి.)

భూమిక స్త్రీవాద పత్రికలో 2006లో కథల పోటిలో బహుమతి పొందిన కథ ‘మాయమవుతున్న మనసు’ నా మొదటి కథ.

‘బతుకమ్మ బతుకు’ అనే కవిత సుంకరి రమేష్ సంపాదకత్వం వహించిన తెలంగాణ కవిత 2007 లో ప్రచురించబడింది. ఖమ్మం జిల్లాలో పదిచోట్ల ఒకేసారి ఆవిష్కరించే బాధ్యత తీసుకున్నాను.

తెలంగాణ జీవిత చిత్రం ప్రతిబింబించే ‘నా పాలిట పరబ్రహ్మం’ వరంగల్ నుండి వెలువడిన ‘నాయిన’ సంపుటిలో అచ్చయింది.

‘మృత్యుగుండం ముదిగొండ’ నా మొదటి తెలంగాణ కవిత, 2007లో ఖమ్మం జిల్లా ముదిగొండలో భూపోరాటంలో పోలీసుల కాల్పుల్లో ఎనిమిది మంది అసువులు బాసిన బడుగుల గురించి రాసినది. (మృత్యువు క్రీనీడై। పోలీసు గుండయి గుండెలో దూరింది । పేరు వూరు తెలవని ధర్నా చావు దెబ్బ తీసింది । ముదిగొండ మృత్యుగుండమై విస్ఫోటించింది) కాలాన్ని జయిస్తూ ‘నేను’ అనేది నా మొదటి కవితా సంపుటి. అందులో – 81,82 పేజీలు ముదిగొండ కవిత. ఉపాధ్యాయ కీచకుల గురించిన కవిత ‘మన వంతు ఎంత’ (కా.జ.నేను 48 వ పేజీ.) రైతుల ఆత్మహత్యల గురించి కవిత ‘సంజీవని ఎవరు తేవాలి’ (కా.జ.నేను 50 వ పేజీ.) 2007 లో మక్కామసీదు బాంబు పేలుళ్ళ పై రాసింది ‘అరువుకు కన్నొకటి’ (కా.జ.నేను 8,9 పేజీలు)

నా రెండవ కవితల పుస్తకం "సుదీర్ఘ హత్య" 2008 లో డా.సి.నారాయణ రెడ్డి గారు ఆవిష్కరించారు. ఇందులో 88, 89 పేజీల్లో 'మీ చేతగాని మాటల్లా–మా చేతగాని తనం' అనే కవిత తెలంగాణలో పోలీసు ఉద్యోగాల ఎంపికలో ఉరుకురికి యిరసకపడ్డోల్ల కోసం రాసింది. 'రోగ గ్రస్త స్తన్యం' 103–104 వ పేజీ. 'తెగబడిన మాటల ఆడది' 40–42 వ పేజీ, 'నా పై ఒక మహిళ అత్యాచారం చేసింది' 50–52 వ పేజీ. 'నువ్వు గట్టెందుకు – నేను గిట్టెందుకు' 53–54 వ పేజీ. 'మనని మనం అమ్ముకుందాం రండి' 73–75 వ పేజీ. ఈ కవితలన్నీ తెలంగాణ నేపథ్యంలో రాసినవే.

2012 లో ప్రచురించిన 'అగ్ని లిపి' పూర్తిగా తెలంగాణ ఉద్యమ కవిత్వమే. దెంచనాల శ్రీనివాస్, నాళేశ్వరం శంకరం, సుంకిరెడ్డి నారాయణరెడ్డి గార్లు దీనికి ముందుమాట రాశారు. ఇందులో 29 కవితలున్నవి. 'చరిత్రకొక కొత్త కోక' అనే కవిత తెలంగాణ బ్లాక్ డే సందర్భంగా గన్‌పార్క్‌లో చదివింది. 'మంత్రసాని కావాలి' విద్యార్థుల బలిదానాలను ఆపవలసిన అవసరాన్ని గురించి రాసింది. 2010 లో నల్లగొండలో కవిసమ్మేళనంలో చదివింది.

శ్రీకృష్ణ కమిటీ తీరుపై రాసిన కవిత 'పులాస చేప'. కమిటీ ఎనిమిదవ చాప్టరుకు నిరసనగా రాసిన కవిత. 'ఓ విద్రోహి స్వగతం' 'రంగుల జ్ఞానం అద్దకం పని' తెలంగాణ ఉద్యమానికి మద్దతివ్వని విశ్వకవులు, పార్టీలు ఉద్యమాల గురించి మొసలి కన్నీళ్ళ పై రాసిన కవిత.

'గచ్చుపొదల చిచ్చు' నిజామాబాద్ కవితోత్సవంలో చదివింది. దాదాపు 200 వందల మంది కవులతో బాన్సువాడలో నిర్వహించబడింది ఈ సమ్మేళనం.

వలసవాదులకు సరిహద్దులు తెలిపే కవిత 'సరిహద్దు ప్రయాణం'. 'జిగర్' కవితా సంకలనం కోసం ఆత్మహత్యలను ఆపాలని రాసినది 'ఉద్యమం వనమై మొలిచిన చుక్కలు' కవిత.

'వికృత విరోధికి చుక్కల సమాధానం', 'మనిషి చెట్టు పాము', 'నువ్వు గట్టెందుకు నేను గిట్టెందుకు' మొదలయిన కవితలే కాక 'జాగో జగావో' కార్యక్రమం కోసం రాసిన కవిత 'విశాలత్వం మరీ విశాలమయింది' కవిత.

'మన కళ్ళను ఈత ముళ్లతో కుచ్చి' కవిత ఉద్యమాన్ని అవహేళన చేస్తున్న వారి కోసం. 'పునర్నవం', 'నిరర్థక కర్మ యోగం' వంటి కవితలున్నాయి.

'ఆత్మాన్వేషణ' నా కథా సంపుటి. ఇందులో 'శిబ్బి', 'ఊరిడిచిన ఉత్తరం', 'పడిగాపుల పండుగ', 'ఆత్మాన్వేషణ', 'కప్పల తక్కెడ' తెలంగాణ కథలే.

తెలంగాణలో కవయిత్రులే లేరు అన్న అపవాదుకు జవాబుగా అమృతలతగారి నాయకత్వంలో సంపాదకత్వం వహించిన 'గాయలే గేయాలై' కవితాసంపుటి తెలంగాణ మహిళల ఉద్యమ స్ఫూర్తికి ఉదాహరణ. ఇందులో ఒకరిద్దరు తెలంగాణేతర కవయిత్రుల కవితలున్నయని అపవాదు మోసింది.

2007 లో 'పరివ్యాప్త' అనే స్త్రీవాద కవితా సంకలనానికి సంపాదకత్వం వహించాను. 'నీలిమేఘాలు' తరువాత స్త్రీవాదం మీద జరిగిన ప్రయోగం యిది. ఇందులో 110 కవితలుండగా 60 మంది కవులు 50 మంది కవయిత్రులు మహిళా సమస్యల పట్ల ప్రచురితమయిన కవితలే అవి. ప్రముఖులు దానిని మౌనంగా పక్కకు పెట్టారు, స్త్రీవాదులు ముఖం తిప్పుకున్నారు. విమర్శకులు సమీక్షకులు తమ వంతు విస్మరణ పాటించారు.

HMTV 'దశదిశ' లో పాల్గొన్నాను, జోడేఘాట్ బహుజన కథ సదస్సులో పాల్గొన్నాను.

ఖమ్మంలో 'మునుం', 'అగ్నిలిపి' పరిచయ సభ నిర్వహించాము.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత కొన్ని వచన కవితలు, గేయాలు కొన్ని పత్రికలకు పంపలేదు, పంపినవి పత్రికలు వెయ్యలేదు. 'జాతరల మీద జాతరలొచ్చె', 'చెల్లీ ఓ నాగ మల్లీ', 'వద్దొద్దురన్నా' అనే మరి కొన్ని గేయాలు. 'చండాలిక రాజ్యం', 'విశ్వగీతిక' 'ఫినిక్స్ మొలక' వంటి మరి కొన్ని కవితలు.

తిరుపతిలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల ఆహ్వానాన్ని తిరస్కరించి తెలంగాణ ఆత్మగౌరవాన్ని చాటుకున్నాను.

సాహిత్య భాగస్వామ్యమే కాకుండా ఉద్యమంలో నేను ప్రత్యక్షంగా పాల్గొన్నాను.

2006 లో ప్రొఫెసర్ జయశంకర్ సమక్షంలో 'తెలంగాణ విద్యావంతుల వేదిక' ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షురాలిగా నియమించబడి అనేక కార్యక్రమాలు చెయ్యగలిగాను. 2008 లో 'తెలంగాణ విశ్వబ్రాహ్మణ సంఘం' స్థాపించి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కమిటీలు వేసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా, రాష్ట్ర మహిళాధ్యక్షురాలిగా తెలంగాణ ఉద్యమంలో విశ్వకర్మలందరిని పాల్గొనేలా చైతన్యం చేయగలిగాం. తెలంగాణ వచ్చిన తరువాత కూడా ఇది కొనసాగుతూనే వుంది.

ఉపాధ్యాయురాలిగా సకలజనుల సమ్మెలో , వివిధ ఉద్యమ కార్యక్రమాల్లో, ధర్నాల్లో, నిరాహార దీక్షల్లో పాల్గొన్నాను. నేను పని చేసే పాఠశాలలో, పట్టణంలో తెలంగాణ టీచర్‌గా పిలవబడడమే నా తెలంగాణ అస్తిత్వానికి లభించిన గొప్ప అదృష్టంగా భావిస్తాను.

'రుంజ' విశ్వకర్మ కవులు కళాకారుల వేదికకు రెండు సంవత్సరాలకు పైగా రాష్ట్ర అధ్యక్షురాలిగా అనేక సాహిత్య కార్యక్రమాలతో పాటు 'రుంజ' కవితా సంకలనం 2014 లో ప్రచురించాము. కొందరు తెలంగాణేతరుల స్వార్థం "రుంజ" ను అవిటిగా మార్చింది.

***

తొలి మలి దశల పోరాటం ఒక ఒడువని ముచ్చట



డా. తిరునగరి దేవకీదేవి

1969 నుండి ఉద్యమంలోనే ఉన్నాను. పద్దెనిమిదేండ్ల వయసు. విద్యార్థి నాయకురాలిగా వరంగల్ జిల్లా ప్రాంతం కలియ దిరిగినదాన్ని. ఉద్యమ కార్యక్రమాల్లో పాల్గొనాలంటే ఇల్లిల్లూ తిరిగి కార్యకర్తలను వెంటేసుకొని పోవాల్సి వచ్చేది. అంటే తొలిదశ ఉద్యమంలో చాలా చురుకుగా పాల్గొన్న సందర్భం. ఉద్యమ స్వరూపం, కార్యక్రమాల వివరణ ప్రస్తావించనుకాని కొన్ని సంఘటనలను మాత్రం గుర్తు తెచ్చుకోకతప్పదు సుమా.

ఉద్యమకాలానికి నేను ఏ విద్యాసంస్థకు సంబంధించిన విద్యార్థిని కాదు. P.U.C పాసై ఉండి ట్యూషన్లు చెప్తుండేదాన్ని. ఉద్యమ ప్రారంభకాలంలో ఆయా విద్యాసంస్థలకు చెందిన యూనియన్ విద్యార్థినులు నాయకురాండ్రుగా ఉద్యమంలో ముందున్నారు. కానీ కొద్దిరోజుల్లోనే వాళ్ళు తమ ఇండ్లకే పరిమితమైపోవడంతో ఉద్యమాన్ని చివరివరకు అంటి పెట్టుకొన్న నాయకురాలిని నేనే.

వరంగల్‌లో మెయిన్‌రోడ్స్‌కు తప్ప లోకల్ బస్సులు లేవు. వ్యక్తిగత వాహన సౌకర్యం లేదు. రెండుకాళ్ళే చక్రాలుగా సొంతం తిరిగిన సందర్భం. మీడియా పాత్ర కూడా అంతంతమాత్రమే.. అంటే నామ మాత్రమే.

కర్ఫ్యూలోనూ ర్యాలీ తీయడం? ఎంత ఆశ్యర్యం. 50,60 మంది విద్యార్థినులు, మహిళలు. పర్మిషన్ తర్వాత కర్ఫ్యూ విధించారు. అయినా పోలీసులు ర్యాలిని అడ్డుకోలేదు. అది వారి కట్టుబాటు. 369 మంది అమరులైంది Central Reserved Police. (C.R.P) వల్లనే. స్థానిక పోలీసులు కుట్రలు-కుతంత్రాలు చేయలేదు. అంటే స్థానికేతరులు ఎక్కువగా పోలీసు యంత్రాంగంలో లేరు. కానీ ఈ మలిదశ ఉద్యమంలో పాలనా యంత్రాంగం, పోలీసు యంత్రాంగం అంతా ఆంధ్రామయం. అడుగడుగున అడ్డంకులు, కుట్రలు, కుతంత్రాలు, దౌర్జన్యం, దాష్టీకం ఎన్నని చెప్పుకుందాం. కడుపు చించుకుంటే కాళ్లమీదే పడుతుంది.

మల్టీ పర్పస్‌లో మహిళా సదస్సు. జనవరి 1970. తేదీ గుర్తులేదు. ఈశ్వరీబాయి, సదాలక్ష్మిగార్లు ముఖ్య అతిథులు గ్రౌండంతా కిక్కిరిసిన జనం. ఆడా మగా అంతా ఉత్సాహంగా ఆ సభకు పద్దెనిమిదేళ్ళ దేవకీదేవి అధ్యక్షత వహించింది. ఈ దశ ఉద్యమంలో అరెస్టైన ప్రతిసారీ కోర్టుమెట్లెక్కాల్సి వచ్చేది. కేసు వాయిదాల కారణంగా కోర్టుచుట్టూ తిరగాల్సి వచ్చేది. ఆ సందర్భంగా జడ్జి వేసిన ప్రశ్నలకు జంకుగొంకు లేకుండా సమాధానం ఇవ్వడంతో జడ్జితోపాటు లాయర్లు కూడా ఆశ్చర్యపోయారు. ఒక సీనియర్ లాయర్ ఆ తర్వాత కాలంలో కలిసినప్పుడు 'లా' చేయాలంటూ సలహానిచ్చాడు. అధ్యాపకురాలిగా స్థిరపడటం వల్ల 'లా' చేయాలనే నా కోరిక కోరికగానే మిగిలిపోయింది. రిటైర్ అయిన తర్వాత 2014 లోగాని 'లా' చేయాలనే నా కల సాకారమయింది అరవై మూడేళ్ళ వయసులో.

ఆ ఉద్యమంలోనూ ఉద్యోగులందరూ పాలు పంచుకొన్నారు. జీతబత్తాలనూ లెక్కచేయలేదు. కానీ కుటుంబం గడపడానికి శనగగుగ్గిళ్ళమ్మిన వ్యక్తినీ నేను మరువలేను. ఉద్యమానికి ఉప్పందించినవారి స్పందన సహకారం ఎంతో అభినందనీయం.

విద్యార్థుల నుండి ఉద్యమం రాజకీయ నాయకుల చేతుల్లోకి పోయింది. చెన్నారెడ్డి గారు, ఉద్యమంలోకి రాజకీయ కారణాలచేత ప్రవేశించినప్పటికీ వాగ్ధాటితో ప్రజలను మంత్రముగ్ధులను చేసేవారు. ఆయన ఉపన్యాసానికై ఎంతసేపు వేచి ఉండాల్సి వచ్చినా విసుగు లేకుండానే కూర్చునేవారు. ఒకసారి కాజీపేటలో 8 గంటలకు రావలసిన ఆయన ఓ రెండు గంటలకు పైనే ఆలస్యంగా వచ్చారు. అయినా జనం కదలలేదు. అలాంటి సమావేశాలకు కూడా నేను ఎలాంటి అభ్యంతరాలు భేషజాలు లేకుండా పోయేదాన్ని. వేళ్ళమీద లెక్కపెట్టగలిగిన ఆడవాళ్ళలో నేనూ ఒకర్తిని. కొన్నిసార్లు ఒక్కదాన్నే కూడా.

ఉద్యమంలో సంగం సత్యనారాయణ గారిని గుర్తు చేసుకోకుండా ఉండలేను. ఆయన్నే ముచ్చెర్ల సత్యనారాయణ అనేవాళ్ళు. రాజకీయ నాయకునిగా వేదిక నెక్కినా కళాకారుడిలాగా అద్భుతంగా పాటలు పాడేవాడు. రాష్ట్ర ఆవిర్భావానంతరం 1969 ఉద్యమకారుల సభలో జ్ఞాపకశక్తినంతా కోల్పోయి కూడా పాటను అంతే కమ్మగా పాడారు. ఆయనకు పాట పట్ల ఉద్యమం పట్ల ఉన్న ఆత్మీయత అటువంటిది మరి.

ఉద్యమాన్ని ఆత్మీయం చేసుకొని ముందుకు నడిపించింది మేమైతే పేపర్లలో రాజకీయ నాయకుల కుటుంబసభ్యులు నాయకురాండ్రుగా కనబడేవారు. ఎప్పుడైనా ఇది షరా మమూలే కదా !

ఒకరోజు హన్మకొండ రాగన్న దర్వాజవద్ద జరిగిన రాస్తారోకో చాలా ఉద్రిక్తంగా మారి ఆడపిల్లలను ఈడ్చుకపోయి మగపోలీసులే జీపులో పడేస్తుండటంతో అమ్మాయిలమంతా ఏమాత్రం సంకోచం, భయం లేకుండా వాళ్ళతో కలెబట్టం వంటి దృశ్యాలు ఇప్పటికీ నాకళ్ళముందు ఇప్పుడే జరిగినట్లు కనబడ్తున్నాయి. హన్మకొండ వరకు అప్పటికింకా ఆడ పోలీసులు దిగుమతి కాలేదు. చట్టాలను ఉల్లంఘించామంటూ అరెస్టు చేసే పోలీసు అధికారులకు ముఖ్యంగా మగ పోలీసులకు ఆడపిల్లల్ని అరెస్టు చేసే అధికారమెక్కడిదంటూ ఆ సాయంకాలమే జరిగిన బహిరంగ సభలో ఆక్రోశాన్ని వెళ్ళబుచ్చాను నేను. ఉపయోగించిన పదజాలం పరుషమే. ఆ ఆక్రోశానికీ పదజాలానికీ జనమే బిత్తరపోయారు. P.D Act కింద అరెస్టు చేయడం ఖాయమనుకున్నాను. ఓ 15 రోజులు ఉద్యమంలోకి రానివ్వకుండానే కాదు. ఊళ్ళో కూడా ఉండనివ్వలేదు. శ్రేయోభిలాషులు కదా! మరి.

నాయకులు ప్రజా ప్రతినిధులుగా రాష్ట్రం సాధిస్తామని ప్రగల్భాలు పలికారు. పార్లమెంట్ ఎన్నికలు ప్రకటించారు. తెలంగాణలో రాష్ట్రసాధన ధ్యేయంతో తెలంగాణ ప్రజా సమితి (T.P.S) ఆవిర్భవించింది. 14 పార్లమెంట్ సీట్లకు T.P.S నిల్చుంది. ఈ పద్నాలుగింట 11 సీట్లను సాధించుకుంది. ఈ ఎన్నికల్లో విద్యార్థులు, యువతనే కార్యకర్తలు. అవసరమెచ్చినపుడు అన్నం మెతుకులు తప్ప కానీ ఖర్చులేని కార్యకర్తలు.

నేను కూడా ఇంటింటా, వేదికలపైనా ప్రచారానికి రాత్రనక పగలనక తిరిగేదాన్ని. చాలా రాత్రి అయినా కూడా ఎంతో ధైర్యంతో తిరిగేదాన్ని. తలచుకుంటే ఇప్పుడు నాకే ఆశ్చర్యం కల్గుతుంది. ఇక్కడ గమనించాల్సిన విషయమేమిటంటే ఆడపిల్లలు ఉద్యమంలో పాల్గొనడాన్ని ప్రోత్సహించినవాళ్ళు చాలామందే ఉన్నారు – వాళ్ళ కుటుంబాల సభ్యులను తప్ప. అయితే ఆటపట్టించడం, ఇబ్బందిపెట్టడం వంటి సంఘటనలు జరుగలేదు. ఉద్యమంలో పాల్గొనేవాళ్ళను ప్రేమగా గౌరవంగా చూసేవారు. గెల్చిన ఎం.పి లు మాత్రం వాళ్ళ గెలుపుకు మూలస్తంభాలైన విద్యార్థులను కరివేపాకులను చేశారు. కనీసం ముఖం కూడా చూడలేదు. అయితే వరంగల్ ఎం.పి అతి త్వరలోనే కాంగ్రెసుతో మిలాఖతై ఆ తర్వాత తొందరలోనే కీర్తిశేషుల్లో కల్సిపోయాడు.

మేము ఉద్యమం వల్ల ఒక విద్యా సంవత్సరాన్ని నష్టపోయాము. జై ఆంధ్రా ఉద్యమం- చెన్నారెడ్డికి గవర్నర్ పదవి- ఉద్యమానికి రాజకీయనాయకులు నీళ్ళొదలడం జగమెరిగిన సత్యాలే కదా!.

డిగ్రీ, పి.జీలు పూర్తి చేసిన నేను వికారాబాద్ లో డిగ్రీకాలేజిలో లెక్చరర్ పోస్ట్ రావడంతో వరంగల్‌తో అనుబంధం క్రమక్రమంగా తగ్గుతూ వచ్చింది. కానీ అవకాశం వచ్చిన ప్రతి సందర్భంలోనూ తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని చర్చించడం, విద్యార్థులకు తెలియజెప్పడం, తెలంగాణను చిన్న చూపు చూస్తున్న ఆంధ్రులతో వాగ్వివాదానికి దిగడం నాకు దిన చర్యలో భాగమైంది. మాది కాంపోజిట్ కాలేజ్ కావడం వల్ల నేను ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ కూ వెళ్ళేదాన్ని. ఆ రోజుల్లో హైదరాబాద్‌లోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాల విద్యార్థుల మూల్యాంకనం జరిగేది. అన్ని మూలల నుంచి వచ్చిన ఆంధ్రులు హైదరాబాద్‌లో దిగబడి హైద్రాబాద్ సౌకర్యాలను హాయిగా ఎంజాయ్ చేస్తూనే ఇక్కడి భాషను, యాసను సంస్కృతిని (ముఖ్యంగా పరీక్ష పేపర్లలోని భాషను) అవమానపరిచినప్పుడల్లా నేను అపరకాళినయ్యేదాన్ని. వాళ్ళు నోరు మూసుకునే వరకు వాదించేదాన్ని.

తరగతి గదుల్లో సరేసరి.

1997 లో వామపక్షభావం కల్గిన కొన్ని సంఘాలు కలిసి ప్రజాస్వామ్య తెలంగాణ లక్ష్యంగా 'జనసభ' అనే వేదికను ఏర్పాటు చేశాయి. ఆ జనసభల్లో నేను రాష్ట్ర సభ్యురాలిగా ఎన్నికైనప్పటికీ ఉద్యోగబాధ్యత, ఇంటిబాధ్యతల కారణంగా పెద్దగా నేను తగినరీతిలో అందులో పాలుపంచుకోలేదనే చెప్పాలి. బెల్లిలలిత హత్యతో సభకు ముక్తాయింపు జరిగింది.

ఆ తర్వాతికాలంలోనూ తెలంగాణ మహిళా వేదికలో కన్వీనర్‌గా ఎన్నికయ్యాను. బహిరంగసభల్లో పాల్గొనడం వరకే నా విధులను సరిపెట్టుకున్నానని చెప్పొచ్చు కానీ సభా వేదికలు చేరుకోవడం తిరిగి సభానంతరం ఇల్లు చేరుకోవడమూ సమస్యగానే ఉండేది. ఒకరోజు బాలనగర్‌లో మీటింగ్ అంటూ పిలుపు వచ్చింది. వికారాబాద్ నుండి ఎక్కిన బస్సు దిగిన బస్సు ... అడ్రసు వెతుక్కుంటూ సభా వేదిక చేరుకున్నాను. ఆ వేదికపై ఆంధ్రుల ఆధిపత్యం అహంకారం, Over actions, తెలంగాణ భాషను తేలిక చేయ్యడం వంటి అంశాల ప్రాతిపదిగ్గా ఆంధ్రాపబ్లిక్‌ను దుయ్యబట్టడం వంటి అంశాలు నన్ను చాలా మందితో పరిచయమే కాదు సన్నిహితం చేశాయి. తెలంగాణ యాస భాషలో మాట్లాడటం నన్ను తెలంగాణ అభిమానులకు దగ్గర చేసింది.

2006 లో తెలంగాణ ఉత్సవకమిటితో పరిచయం జరిగింది. ఆ కమిటీ మూలస్తంభం రేవతిగారితో నందిని సిధారెడ్డి గారు పరిచయం చేశారు మొదలు. ఆ ఉత్సవ కమిటీతో ఏకమై వాళ్ళు నిర్వహించిన వ్యాసరచనల పోటీకి విద్యార్థులను ప్రోత్సహించాను. వ్యాస రచనల పోటీల లక్ష్యం తెలంగాణ చరిత్రను, మూలాలను తెలుసుకోవడం. ఉత్సవ కమిటీ తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే క్యాలెండర్లను ఆవిష్కరించింది. రంగారెడ్డి జిల్లా సభ్యురాలిగా నాకు కేటాయించిన కాలెండర్స్‌ను ప్రజల వద్దకు చేర్చాను. కాలెండర్ తీసుకున్నవాళ్ళు కొందరు తత్సంబంధమైన మూల్యం చెల్లించకున్నా విధిగా నాకిచ్చిన క్యాలెండర్ల మూల్యాన్ని చెల్లించడం మాత్రం నావంతయింది.

2001 లో కె.సి.ఆర్ తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష దిశగా కంకణం కట్టుకున్నప్పటికీ ఆయన ఆమరణ నిరాహారదీక్ష –అరెస్టుతో ఉద్యమం ఊపందుకున్న విషయం అందరికీ తెలిసినదే. ఈ కాలానికి నా వయసు 58 దాటింది. నేనుండేది వికారాబాద్. అయినా తెలంగాణ ఉద్యమం, రాష్ట్రం పట్ల ఉన్న శ్రద్ధ నన్ను రోజులవారీ హైద్రాబాద్‌కే కాదు తెలంగాణలోని పలు ప్రాంతాలకు ప్రయాణం చేయించింది. పనులన్నీ పూర్తి చేసుకొని 75 కి.మీ దూరంలో ఉన్న హైద్రాబాద్ ఆ తర్వాత ఎక్కడ మీటింగున్నా పరుగో పరుగు. ఉద్యమయానంలో బస్సు, రైలు, ఆటో, కాలినడకా అన్నీ అనుభవైకవేద్యాలే. కొన్ని సార్లు సమస్తం స్వంత ఖర్చులే. కె.సి.ఆర్ గారి నిరాహారదీక్ష భగ్నమై అరెస్టయిన సందర్భంలోనే 29–11–2009 న అమరవీరుల స్తూపం వద్దకు చేరుకున్నాను. వస్తానన్న మిత్రురాలు రాలేదు. అక్కడే ఉన్న కోదండరామ్ 'పండగరోజు పాలపిట్టలా' అంటూ ఆహ్వానించారు. విద్యార్థులు మరికొందరు కూడా జరుగబోయే ప్రభుత్వ ఎత్తుగడలు కుట్రలకు ఆందోళన చెందుతూ అక్కడే ఉండి తచ్చాడుతున్నారు. ఆ సాయంకాలం వరకు అక్కడే ఉండి నేనే మిత్రురాలిని వెతుక్కుంటూ వాళ్ళింటికి పోయాను. మరో రెండు రోజులకు 31–11–2009 న టి.ఆర్.ఎస్. ఉమాదేవి పిలుపునందుకొని కె.సి.ఆర్ పై జరిపిన కుట్రను వ్యతిరేకిస్తూ అమరవీరుల స్తూపంవద్ద ఒకరోజు నిరాహార దీక్షకు కూర్చున్నాము. కూర్చున్నది, పథకం వేసుకున్నది మహిళలే కానీ దీక్ష విరమించే సమయానికి అది మగవాళ్ళకు సంబంధించిన వేదికగా రూపాంతరం చెందింది.

1–12–2009 ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులపై పోలీసుల దాడి – దౌర్జన్యం కొనసాగింది. ఎంతోమంది విద్యార్థులు గాయాలపాలయ్యారు. ఆ సందర్భంలో విభిన్న మనస్తత్వం గల మహిళలందరూ ఒక గూటికి చేరుకున్నారు. అందరం ఎన్.ఎస్.ఎస్

మీడియా లో ఒక రూంలో సమావేశమై ఉద్యమానికి విద్యార్థులకు అండగా ఉండే నిర్ణయం తీసుకున్నాం. సభ్యులుగా పేర్లు నమోదు చేసుకుంటున్న సందర్భంగా 24 గంటలు పనిచేయగలవాళ్ళు ముందుకు రావాలనే పిలుపు విన్నప్పుడు నా పేరు ఇవ్వడానికి వెనుకంజ వేసాను. ఎందుకంటే నేను రావలసింది వికారాబాద్ నుండి. వంటా వగైరాలు ముగించుకొని రావాలి. చేతకాని విషయం చెప్పొద్దు కదా ! జాబితా లో పేరిచ్చినా 24 గంటలు పనిచేసే వాళ్ళలో నా పేరు నమోదు కాలేదు. కానీ కమ్యూనికేషన్ కొనసాగింపు సరిగా జరుగలేదు. ఆ క్రమంలో నేను ఆ బాధ్యతను నెత్తికెత్తుకోవడానికి సిద్ధమవటంతో చివరి కన్వీనర్‌గా లిస్టు లోకి ఎక్కాను. హైదరాబాద్‌లో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలంగాణ ఉద్యమానికి కేంద్రబిందువైంది కదా ! ప్రభుత్వం పోలీసు బలగాలను దించింది. బస్సులను యూనివర్శిటి నుండి పోకుండా వేరే దారుల్లో మళ్ళించింది. అయినా ఆర్ట్సకాలేజ్ మాత్రం జనసంద్రమైంది. ఒక విద్యార్థులే కాదు లాయర్లు, డాక్టర్లు, రాజకీయ నాయకులు, వంటింటికే పరిమితమైపోయిన అమ్మమ్మలు, ఉద్యోగులు, నిరుద్యోగులు, పాత్రికేయులు అంతా అక్కడేకదా ! కంచెలు, గోడలు దాటుకుంటూ వికారాబాద్ నుండి నేను అక్కడికి చేరుకునేదాన్ని. ఒకరోజు డిసెంబర్ మొదటివారం తేదీ గుర్తు లేదు. అభిప్రాయాలు చెప్పే అవకాశం వచ్చింది. 1969 ఉద్యమ నాయకురాలిగా పిలుపు. జగన్‌మోహన్ రెడ్డిని, తెలంగాణ రాష్ట్రం వస్తే భూములరేట్లు తగ్గుతాయన్న వాదనను నేను విమర్శించిన తీరుకు సభ అంతా చప్పట్లే చప్పట్లు. అది మొదలు నేను తెలంగాణ రాష్ట్రంలో చాలాచోట్లనే తిరిగానని చెప్పాలి. వక్తగా చాలా పిలుపులే అందుకున్నాను. ఇంటి వంట పనులను ఈదుకుంటూ అన్నిచోట్ల కలియతిరిగాను.

ఈ ప్రసంగాల క్రమంలోనే వనం ఝాన్సీ గారిని కూడా కలిశాను. ఒకరోజు జలవిహార్‌లో జరిగిన సదస్సుకు ఆమె ఆహ్వానించారు. రాజకీయంలో రాజీలేని పోరు చేసిన ఆమె చాలా సంస్కారవంతురాలు, వివేకవంతురాలు. వినయవిధేయతలు ఆమె ఆభరణాలు. ఆమె అకాలమరణం మమ్మల్నెంతో బాధించింది.

31-01-2010 న ఆర్టీసీ కళావేదిక 'మహిళా గర్జన' పేరిట ఒక సభ జరిగింది. ఆ సభకు నేను వికారాబాద్ నుండి నాలుగు వ్యాన్‌లు, ఒక కారులో విద్యార్థినులను తీసుకొని వచ్చాను. వచ్చిన ఆడపిల్లలంతా ఉద్యమధ్యేయంతో అడుగు వేసినవారే తప్ప అనవసర పోకడలకు ధోరణులకు పోకపోవడం ఎంతో తృప్తినిచ్చింది. ఈ మహిళల గర్జనలో ఇతోధికంగా నేను తోడ్పడ్డప్పటికీ నాకు వేదికమీద స్థానం లేకుండా పోయింది.

అసెంబ్లీ ముట్టడి జరిగిన రోజునూ నేను మరిచిపోలేను. వికారాబాదు నుండి వచ్చి నాంపల్లిలో దిగిన నేను ఆబిడ్స్ వైపుగా కాలినడక. అటుపై ఆటో లో హిమయత్‌నగర్ . అక్కడ పోలీసులు అడ్డంకి. కాలినడకతో సుందరయ్య పార్కు. అక్కడినుండి ఉస్మానియా విశ్వవిద్యాలయం గేటు. మేము అక్కడికి చేరుకున్నామో లేదో విద్యార్థుల అసెంబ్లీ ముట్టడి పరుగుపందెం ప్రారంభం. అంతా యువత. నేను 59 ఏళ్ళదాన్ని నేను నాలుగడుగులు వేసేలోపే వాళ్ళు మాయం. నాతో వచ్చిన మరో ఇద్దరు స్త్రీలు ఆటోలో పరుగు. విధిలేక బర్కత్‌పుర వరకు వెళ్ళి వెనుదిరిగాను. ఆలస్యంగా వచ్చిన మిత్రురాంద్రను కలుసుకున్నాను. ఆపై మళ్ళీ వికారాబాద్ ప్రయాణం.

మా సమావేశాలు చాలావరకు అమరవీరుల స్తూపం వద్దో లేదా సుందరయ్య పార్క్ వద్దనో. ఒక్కోసారి పబ్లిక్‌గార్డెన్‌లోనూ కూర్చునేవాళ్ళం.

ఇందిరాపార్క్ వద్ద అంటే ధర్నాచౌక్‌లో జరిగిన జె.ఎ.సి సమావేశాల్లో ప్రసంగించే అవకాశాన్ని వినియోగించుకొన్నాను. అవసరం అటువంటిది. వలసపాలకుల, రాజకీయ నాయకుల కుట్రలను కుతంత్రాలను దుయ్యబట్టి నలుగురితో మన అభిప్రాయాలు పంచుకొని కార్యోన్ముఖులు కావలసిన సమయం కదా !

ఉద్యమం జరుగుతున్నంత కాలం హైదరాబాద్‌లోని మహిళావేదిక మిత్రురాంద్రతో మమేకమౌతూ, ఇతర ప్రాంతాలకు వక్తగా పోతున్నప్పటికీ నాకు తిండిపెట్టిన వికారాబాదును విస్మరించలేదు. స్థానిక ఉద్యమంలోనూ నా భాగస్వామ్యానికి కొదువేంలేదు.

పోలీసుల నిర్బంధాన్ని, అడ్డంకులను లెక్క చేయకుండా మిలియన్ మార్చ్ మానవహారంలో పాల్గొనడం మరచిపోలేను. అరవయ్యోపడిలో ఉన్నా రక్తం ఉరకలేసింది. తెలంగాణ కావలసిందే. వచ్చి తీరాల్సిందే అన్న ఆకాంక్ష ఆక్రమించింది. మా స్లోగన్స్ మరింత జనాన్ని పోగు చేసింది. రాష్ట్ర ఆకాంక్షను చాటి చెప్పింది. ఒక రకంగా నన్ను చూసి వయసులో ఉన్న పడచువాళ్ళు మరింత స్పందించారు. అక్కడే ఉపాధ్యాయ నాయకురాలు మల్లీశ్వరి పరిచయం. వాళ్ళ మహిళా ఉపాధ్యాయ ఫెడరేషన్ అంకురార్పణంలో ఇతోధికంగా నేనూ పాలుపంచుకున్నాననే చెప్పాలి.

ఈ ఉద్యమం మాకు నిజామాబాద్‌లో విజయా ఎడ్యుకేషన్ సొసైటి అధ్యక్షురాలు అమృతలత గారిని పరిచయం చేసింది. నేను 'మనలోమనం' మీటింగ్ విశాఖపట్నంలో ఉన్నప్పుడే 'రాజీవ' గారు ఫోన్ చేసి తెలంగాణ కవయిత్రుల కవితా సంకలనం వెలువడుతున్నది, మీరు ముందుమాట రాయాలని చెప్పారు. కానీ ఆ తర్వాత ప్రణాళిక మారినట్లుంది. నన్ను కవితలు రాయమన్నారు. ఆ కవితా సంకలనానికి నేను "తెగించి కొట్లాడుడే" అనే కవితే కాకుండా "అభివృద్ధి మాయాజాలంలో తెలంగాణ" అనే కవితను 'అల' పేరిట (మా చెల్లెలు కూతురు) వ్రాశాను. ఆ సంకలనం "గాయాలే గేయాలై" అనే పేరుతో వెలువడింది. ఆ తర్వాత అమృతలత గారు "కథలే వెతలై" అనే కథయిత్రుల సంకలనాన్ని వెలువరించారు. అమృతలత గారు ఒక రకంగా మలిదశ ఉద్యమకాల ఆడ సురవరం ప్రతాపరెడ్డి అయ్యారు. తెలంగాణ లోని ఇంత మందిని వెలికిదీయడం మామూలు విషయం కాదు. అమృతలత గారు మంచి కార్యనిర్వాహకురాలు. దీక్షతో నిష్ఠతో పని చేయడంలో ఆమెకు ఆమె సాటి. కాని ఈ సంకలనాల్లో తెలంగాణేతరులను చేర్చుకున్నారు. అందులో తప్పేముంది? అని అందరు ప్రశ్నించే అవకాశముంది. తెలంగాణ కవితలు కథలు రాసిన వాళ్ళందరూ తెలంగాణ వాదులు కాదు.

1956 కు పూర్వమే ఇక్కడికి వచ్చి స్థిరపడ్డ ఆంధ్రమూలాలను గురించి మాట్లాడవలసి ఉంది. వెల్లోడీ పాలనలో బ్రిటిషు సర్కారు పుణ్యమా అని అక్షరాస్యత సాధించిన ఆంధ్రులు ఇక్కడికి వలసవచ్చిన విషయం జగమెరిగిన సత్యమే కదా ! ఇక్కడి నిరక్షరాస్యత వెనుకబాటుతనం, చొరవలేక పోవడం వంటి విషయాల ఆధారంగా అనేక ఉద్యోగాలు పొందటమే కాదు సమస్తావకాశాలు అందిపుచ్చుకున్న విషయం తెలిసినదే కదా ! అక్షరాస్యులుగా అదే స్థాయిలో ఉన్న తెలంగాణ వాసులకు మొండి చేయ్యేకదా. ఇక అవార్డుల సంగతి చెప్పక్కర్లేదు. తెలంగాణ రాష్ట్రావిర్భావం జరిగినది మొదలుగా ఇన్నాళ్ళుగా అవకాశం పొందలేని తెలంగాణ మూలాలను కొంతలో కొంత గుర్తిస్తున్న ఈ ధోరణి ఇన్నేళ్ళుగా లబ్దిపొందుతున్న వాళ్ళకు కంటగింపయింది. అసహనంతో ఊగిపోతున్నారు. ఇరవై నెలలే వాళ్ళకింత బాధగా కష్టంగా కంటగింపుగా ఆక్రోశంగా ఉంటే అరవై ఏళ్ళుగా అంటరానివాళ్ళుగా అందనంత దూరంలో అవమానాలను భరిస్తూ వచ్చిన తెలంగాణ వాళ్ళకుఎంత గాయంగా బాధగా ఉండి ఉంటుందో సుహృద్భావంతో ఆలోచించవచ్చుకదా !

నాన్న పోయినంక నెరవేరిన ఆకాంక్ష



వి.ప్రభాదేవి

అది 1969 వ సంవత్సరం తెలంగాణ ఉద్యమానికి తెరలేచిన సంవత్సరం. తెలంగాణ సాయుధపోరాటం నా జీవితంలో నేను మరచిపోలేని చరిత్ర.

అప్పుడు నేను హెచ్.ఎస్.సి. చదువుతున్నాను. నాకు దాదాపు పదిహేను సంవత్సరాలుంటాయి. నాకు గుర్తున్నంత వరకు 1968 డిసెంబర్‌లోనే ఈ ఉద్యమం మొదలైంది. ఇక ఏప్రిల్‌లో జరగవలసిన మా హెచ్.ఎస్.సి. పరీక్షలు జూన్‌కి వాయిదా పడ్డాయి. మేలో ఉద్యమం తీవ్రరూపం దాల్చింది. జూన్‌లో ఇంగ్లీషు రెండు పేపర్లు రాసిన తర్వాత మిగతా పరీక్షలన్నీ నిరవధికంగా వాయిదా పడ్డాయి.

ఫలితంగా మేమంతా ఒక విద్యా సంవత్సరాన్ని నష్టపోయాం. అప్పటి విద్యార్థులంతా వాళ్ళ జీవితంలో విలువైన ఒక సంవత్సరాన్ని కోల్పోయారు. దాదాపు ఎనిమిది, తొమ్మిది నెలలు స్కూళ్ళు, కాలేజీలు నిరవధికంగా మూతపడ్డాయి.

ఏ ఉద్యమానికైనా విద్యార్థులే సూత్రధారులు, పాత్రధారులు. ఉద్యమంలో ఉస్మానియా యూనివర్శిటి విద్యార్థులంతా చదువులు వదులుకొని రోడ్డున పడ్డ రోజులవి. అంతేగాకుండా వారి విలువైన ప్రాణాలను అర్పించి వాళ్ళ అమ్మా నాన్నలకు కడుపుకోతను మిగిల్చారు.

ఈ రోజుల్లో ఉన్నట్టు రకరకాల వార్తాపత్రికలు గానీ టెలివిజన్ ఛానల్స్‌గానీ లేనటువంటి రోజులవి. ఒకవేళ ఈ ప్రసార సాధనాలు అప్పుడు ఉన్నట్టయితే తెలంగాణ ఉద్యమం అలా నీరుగారకుండా ఇంకా ఊపందుకుని అప్పుడే తెలంగాణాను సాధించుకునేవాళ్ళం. అమాయకులైన విద్యార్థులు ఎంతోమంది ప్రాణాలను కోల్పోయారు. మా పెద్దవాళ్ళంతా రేడియోలకి అతుక్కుపోయేవారు.

ఇప్పటిలా ఆడపిల్లలు బయట ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనే రోజులు కావవి. అందులో నాకు అప్పటికే పెళ్ళయిపోయింది. ఇక ఉద్యమంలో పాల్గొనాలనే నా కోరిక నా మనసులో సంధికొట్టుకు పోయింది.

అంత తీవ్రతరమైన ఆ ఉద్యమం కొద్దిమంది స్వార్థ రాజకీయ నాయకుల మూలంగా చప్పగా చల్లారిపోయింది. ఇప్పుడు తెలంగాణ కోసం పట్టు పట్టినట్టు నాయకులు అప్పుడే గట్టిగా వుంటే మనం తెలంగాణ 1969 లోనే సాధించుకుని ఉండేవాళ్ళం.

మా నాన్నగారు ఆర్ & బి డిపార్ట్‌మెంట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేసేవారు. ఆయన తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు.

రిలే నిరహారదీక్షలో పాల్గొన్నారు. ఏరోజు అయినా నన్ను అరెస్ట్ చేస్తే మీరు ధైర్యంగా ఉండాలి. విచారపడొద్దు అని చెప్పేవారు. నిజంగానే మే 2 న ఆయన హైదరాబాద్ వెళ్ళడానికి బస్ ఎక్కుతుండగా పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. మేమెవరం నాన్నగారిని అరెస్ట్ చేసినందుకు విచారించలేదు సరికదా చాలా గర్వంగా ఫీలయ్యాము. ఇది అయన సర్వీస్‌బుక్‌లో కూడా ఎంట్రీ చేశారు.

ఆయనకు తెలంగాణ రాష్ట్రాన్ని చూడాలనే ఆకాంక్ష ఉండేది. కానీ మా దురదృష్టవశాత్తు ఆయన 2010 ఫిబ్రవరి లో మరణించారు. మరణించేవరకు కూడా ఆయన తెలంగాణ తప్పక వస్తుందమ్మా మరి అప్పటి వరకూ నేను జీవించి ఉంటానోలేదో అని ఎప్పుడూ అనేవారు. నాన్నగారు చనిపోయిన తర్వాత నాలుగు సంవత్సరాలకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. ఇప్పుడాయన ఉంటే ఎంతో సంతోషించే వారు కదా ! అని నాకు ఎప్పుడూ అన్పిస్తుంది. ఇది మానాన్న గారు కలలు గన్న బంగారు తెలంగాణ రాష్ట్రం !

1969 ఉద్యమంలో ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ పాలుపంచుకునే అవకాశం నాకు రాలేదనీ నేనెప్పుడూ బాధపడేదాన్ని.

కానీ నేను ఈ మలిదశ ఉద్యమంలో కొన్నిసార్లు రిలే నిరహారదీక్షలో పాల్గొన్నవారికి ఉత్తేజాన్నీ ఉల్లాసాన్ని కలిగించడానికి నా మాటలతో, పాటలతో నా సహాయాన్ని అందించాను.

రెండు పర్యాయాలు వేదికలపై నా మిత్ర బృందంతో కలిసి తెలంగాణ పాటలకు అనుగుణంగా గద్దర్ వేషధారిణిగా నృత్యం చేసి ప్రేక్షకులకు తెలంగాణ ఉత్తేజాన్ని కలిగించాను.

ఇక డా॥అమృతలత గారి సంపాదకీయంలో వెలువడ్డ రెండు పుస్తకాలు 'గాయాలే...గేయాలై!', 'వెతలే..కథలై!' ఒక కవిత, ఒక కథ నా చేత రాయించి పరోక్షంగా ఉద్యమానికి నేను తోడ్పడడానికి అవకాశం కలిగించిన ఘనత డా॥అమృతలత గారిది.

ఉద్యమ సమయంలో కొన్ని నెలల పాటు రోజూ స్కూల్ ప్రార్థన సమయంలో విద్యార్థులతో తెలంగాణ పాటలు పాడించి, వారిలో తెలంగాణ వాదాన్ని పెంపొందించడానికి నా వంతు కృషి చేసాననీ నేను సగర్వంగా చెప్పుకుంటున్నాను.

***

ఎనుకటి కథలను వెలికి తీసినం



డా. ముదిగంటి సుజాతారెడ్డి

తెలంగాణ రాష్ట్రసాధన తొలి ఉద్యమం కన్నా మలి ఉద్యమం ఉద్ధృతంగా సాగింది. తొలి ఉద్యమాన్ని విద్యార్థులు, కొందరు రాజకీయ నాయకులు మాత్రమే నడిపారు. మలి ఉద్యమం ప్రజా ఉద్యమంగా సాగింది. కవులు, రచయితలు, మేధావులు ఈ ఉద్యమానికి సమిధలు వేశారు. అనేక రంగాల్లోని ఉద్యోగులు ఈ ఉద్యమానికి మద్దతుగా నిలిచి పాల్గొన్నారు. మన నీళ్ళు మన కరెంటు, మన ఉద్యోగాలు మనకు కావాలన్నది ఉద్యమ నినాదంగా ప్రతిధ్వనించింది. కార్యాలయాలు, స్కూళ్ళు, కాలేజీలు, విశ్వవిద్యాలయాలు ఆఖరికి రహదారులు ఉద్యమ కేంద్రాలుగా మారాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, సామాన్య ప్రజలు, పురుషులు, స్త్రీలు రాస్తారాకో!, రైలురోకో, వంటా–వార్పు, నిరాహారదీక్షలు, బంద్‌లు నిర్వహించారు. ఢిల్లీ నుంచి తెలంగాణ గల్లీల వరకు మా తెలంగాణ మాకు కావాలనే నినాదాలు వినిపించాయి. 2001 ఏప్రిల్‌లో కేసిఆర్ తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీని ఆరంభించారు. పార్టీ సభల్లో కేసిఆర్ మాట్లాడే తెలంగాణ తెలుగు యాస నుడికారాలు ఉపన్యాసాల బలం ప్రజలను బాగా ఆకట్టుకున్నాయి. తెలంగాణ ప్రజల భాష భాషే కాదన్న అవమానానికి గురయిన ప్రజల ఆత్మాభిమానం, ఆత్మగౌరవం ఆ ఉపన్యాసాలతో ఇనుమడించాయి. తెలంగాణ ఆత్మవిశ్వాసంతో గొంతు విప్పింది. తెలంగాణ అస్మిత, అస్తిత్వాలను నిలబెట్టటానికి అందరూ నడుం కట్టారు. వాళ్ళల్లో కవులు, రచయితలు, గాయకులు, కళాకారులు వంటి మేధావి వర్గం ప్రధాన భూమికను నిర్వహించారు. భావపరంగా తెలంగాణను, తెలంగాణ గౌరవాన్ని మేల్కొల్పటంలో వాళ్ళు మలి ఉద్యమంలో ప్రముఖ పాత్రను పోషించారు. అదే తొలి ఉద్యమంలో ఇటువంటి మేధావి వర్గం తన పాత్రను పోషించకపోవటం ఒక పెద్ద లోపంగా చెప్పుకోవచ్చును. మలిఉద్యమంలో మేధావి వర్గం తెలంగాణ ఆత్మను మేల్కొల్పి తెలంగాణ ఉద్యమం ఉద్ధృతంగా సాగటానికి తోడ్పడింది. తద్వారా తెలంగాణ రాష్ట్రసాధన రాజకీయ ఉద్యమంగానే కాక ప్రజా ఉద్యమంగా సాగి విజయాన్ని సాధించటానికి దోహదం చేసింది.

కవులు, రచయితలు, గాయకులు మొదటగా చేసింది తెలంగాణ భాషయాసలను విస్తృతంగా ప్రయోగించటం. అధిక ప్రమాణంలో కవిత్వం, పాటలు, కథలు తెలంగాణ భాషలో తెలంగాణ వాతావరణ చిత్రణతో రచించారు. తెలంగాణ ప్రజల సమస్యలను, జీవితాలను, ప్రత్యేకమైన తెలంగాణ సంస్కృతిని చిత్రించటం, తెలంగాణ వివిధ పోరాటాలను వర్ణించటం, గత చరిత్రను సాహిత్యాన్ని తవ్వితీసి బయట పెట్టడంతో ప్రజల్లో గర్వాభిమానాలు పుట్టుక రావటం జరిగింది. రాజకీయ పార్టీల కన్నా ముందుగానే కవులు, రచయితలుఈ పనులు చేశారు. ప్రపంచీకరణ నేపథ్యంలో తెలంగాణ ప్రాంతీయ భాషా సంస్కృతుల ఔన్నత్యాన్నికి గుర్తింపును తెచ్చిపెట్టారు. పోరాటం కన్నా మొదలు భావాత్మకంగా కవులు, రచయితలు, గాయకులు ఉద్యమానికి పునాదులను వేశారు. ప్రజలను ఉద్యమోన్ముఖులను చేశారు.

ఈ భావాత్మకంగా సాగిన ఉద్యమానికి దోహదం చేయటంలో రచయిత్రిగా, పరిశోధకురాలుగా నా పాత్రను కొంత నేను కూడా నిర్వహించాను. "తెలంగాణ తెలుగు కథ 1970ల్లోనే ఆవిర్భవించింది అంతకుముందు తెలంగాణలో ఆధునిక వచన ప్రక్రియ "కథ" లేదన్న" అభిప్రాయం సాహితీలోకంలో వుండేది. కథా సంకలనాలు కూర్చినవాళ్ళు తెలంగాణ కథ 1970ల నాటిదే తీసుకునేవాళ్ళు. ఆ విధంగా 1970 లకు పూర్వమున్న

తెలంగాణ కథా చరిత్రను అంధకారం ఆవరించివుండేది. అటువంటి సమయంలో నేను తెలంగాణ కథ పుట్టుపూర్వోత్తరాలను తవ్వితీయాలని పూనుకున్నాను. వేమన గ్రంథాలయం, గుణవర్ధక గ్రంథాలయం, శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం, ప్రభుత్వ ఆర్కైవ్స్, ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్స్ లైబ్రరీ, సిటీ సెంట్రల్ లైబ్రరీ వంటి ఎన్నో గ్రంథాలయాలకుపోయి ఆంధ్రాభ్యుదయం,సుజాత, అభ్యుదయం వంటి ఎన్నో పత్రికలను దొరికిన వాటిని తిరుగవేశాను. 1940,50 ల్లో ప్రచురింపబడిన తెలంగాణ రచయితల కథల పుస్తకాల కోసం వేటాడాను. ఆ విధంగా జరిపిన అన్వేషణలో నాకు 1912 నుంచి తెలంగాణ రచయితలు రచించిన కథలు దొరికాయి. 1930,40 ల్లో తెలంగాణ స్వాతంత్ర్యసమరయోధులు, రచయితలు రచించిన కథలు ఎన్నో దొరికినయి. బంగారు గని దొరికినంత ఆనందమైంది నాకు. వాటిల్లో నుంచి 1956 విశాలాంధ్ర ఆవిర్భావం వరకు రచించిన కథలను కొన్నింటిని ప్రసిద్ధమైన రచయితలు రచించిన కథలను ఎన్నుకొని 2002 లో "తెలంగాణ తొలితరం కథలు" పేరుతో సంకలనంగా ప్రచురించాను. ఆ పుస్తక ప్రచురణతో భళ్ళున తెల్లవారినట్లయింది. తెలంగాణలో కోస్తా ప్రాంతంతో సమానంగా

బ్రిటిషాంధ్రులతో తీసిపోకుండా తెలంగాణ రచయితలు మంచి కథలు రాశారన్న సత్యం బయటపడింది. ఆ రచయితలు ఎటువంటి ప్రభావాల ప్రలోభాలకు పోకుండా తమదైన శిల్పం శైలిలో తెలంగాణ ప్రజా జీవితాన్ని, ఉద్యమాలను సాయుధ పోరాటాన్ని చిత్రిస్తూ కథలు రచించారు. చాలామంది చక్కని తెలంగాణ భాష నుడికారాలను నిస్సంకోచంగా ప్రయోగిస్తూ రచనలు చేశారు. అదే 1956 తర్వాత తెలంగాణ రచయితలు కోస్తా ప్రామాణిక భాషవాదుల తికమకలో పడిపోయి తమ సృజనాత్మకతను కోల్పోయి కొంతకాలం వరకు దాదాపుగా విరసం రచయితలు అల్లం రాజయ్య బి.ఎస్.రాములు వంటివాళ్ళు తెలంగాణ భాషలో ఆత్మవిశ్వాసంతో ప్రయోగిస్తూ రచించేంత వరకు కథా రచనలో చేయలేకపోయారు. ఆ విధంగా ఒక పెద్ద చారిత్రక ఘట్టాన్ని తెలంగాణ సాహిత్య చరిత్రలోని నిజాలను బయట పెట్టింది ఈ "తెలంగాణ తొలితరం కథలు" పుస్తకం. తెలంగాణ మలి ఉద్యమానికి ముందుగా తెలంగాణ అస్తిత్వ గౌరవాన్ని చాటి చారిత్రక పాత్రను పోషించింది.

2002 సంవత్సరంలోనే జూలూరు గౌరీశంకర్ "పొక్కిలి", సుంకిరెడ్డి నారాయణరెడ్డి "మత్తడి" కవితల సంకలనాలు వచ్చాయి. ఈ రెండు పుస్తకాల ఆవిష్కరణ సభల్లో నేను స్టేజి మీదనుండి పాల్గొని ఆ పుస్తకాలను ఆవిష్కరించిన గౌరవాన్ని పొందాను. ఈ రెండు పుస్తకాల్లోనూ తెలంగాణ అస్తిత్వాన్ని ప్రాంతీయ గౌరవాన్ని బ్రిటిషాంధ్రుల సార్వభౌమత్వాన్నుంచి విముక్తిని కోరుకునే కవితలను వ్రాసారు. ఆ విషయాన్ని నేను ఆ సభలో చెప్పాను. ఇప్పుడు వచ్చే కవితల్లో తెలంగాణ ప్రాంతీయాభిమానం అస్తిత్వ గౌరవాన్ని ప్రకటించటం సమానంగా కన్పిస్తుంది. దీన్నొక వాదంగా నిలుపవచ్చునని సూచించాను. ఇన్ని రోజులు వెక్కిరింతలకు, వివక్షకు గురయిన తమ తెలంగాణ భాషలో మాత్రమే కవులు కవితలు రచించారు. తెలంగాణ వేర్పాటు వాదానికి పెద్ద కారణం ఈ భాష మీద జరిగిన దాడి అని చెప్పాలె. ఆ దాడిని ఎదుర్కుంటూ తమ అస్మిత ప్రాంతీయ అస్తిత్వ గౌరవాన్ని చాటుకుంటూ కవులు తెలంగాణ భాషనే తీసుకొని కవితలు రచించారు. అంతకు ముందే యెన్నెం ఉపేందర్, పప్పుల రాజిరెడ్డి, అన్నవరం దేవేందర్ వంటి ఎందరో కవులు తెలంగాణ భాషలో, కొత్త కొత్త భావ ప్రకటనలు, భావ చిత్రాలతో తెలంగాణ గోసను వ్యక్తీకరిస్తూ తెలంగాణ పల్లెలను, ఈ పల్లెల్లో నడిపిన బాల్యాన్ని వర్ణిస్తూ భూమి దోపిడులను, నీళ్ళను మరలించుకోవటం మొదలైన అన్యాయాలను ఎదిరిస్తూ కవితలు, కవితా సంపుటాలు ప్రచురించారు. వాటన్నిటిని సమాక్షిస్తూ వివేచిస్తూ నేను 2002 లో వ్యాసం వ్రాసాను. అది మార్చి 2002 నాటి "ప్రజాతంత్ర" పత్రికలో

అచ్చయింది. దీన్నే తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వవాద కవిత్వంగా పెంచి వివరిస్తూ "తెలుగులో దేశీయ కవితా ప్రస్థానం" పేర్వారం జగన్నాథం సంపాదకత్వంలో వచ్చిన వ్యాస సంకలనంలో చేర్చాను. ఆ తర్వాత తెలంగాణ "ప్రాంతీయ అస్తిత్వవాదం" ఒక వాదంగా తెలుగు సాహిత్య చరిత్రలో సుస్థిరస్థానం లభించే విధంగా నా వ్యాసాలతో పాటు జూలూరు గౌరీశంకర్, నందిని సిధారెడ్డి, గుడిపాటి, కాసుల ప్రతాపరెడ్డి వ్రాసిన వ్యాసాలను చేర్చి "ముద్దెర" పుస్తకంగా నా సంపాదకత్వంలో ప్రచురించాను. తెలుగు సాహిత్యంలో ఒక కొత్త భావధోరణి చారిత్రక సందర్భాన్ని ప్రతిబింబించే కవితా ప్రస్థానం వచ్చింది. దాన్ని ఒక "వాదం"గా నిలిపాను. ఒక వాదానికి బలం రావాలంటే విమర్శ వివేచన వ్యాసాలు వుండాలి. "ప్రాంతీయ అస్తిత్వవాదాన్ని" సుస్థిరం చేస్తూ "ముద్దెర" విమర్శవ్యాసాల పుస్తకాన్ని అచ్చు వేశాను. ఈ అస్తిత్వవాద సాహిత్యం కవిత్వం, పాట, దీర్ఘకవిత, కథ, వ్యాసాలు, నవల రూపాల్లో వచ్చింది. ఆ వివిధ ప్రక్రియలనుఈ పుస్తకంలో విశ్లేషించటం జరిగింది. దాంతో తెలంగాణ సాహిత్యానికి కోటి రతనాల మాలను అలంకరించినట్లయింది. తెలంగాణ సాహిత్య గౌరవం ఇనుమడించింది. ఆత్మవిశ్వాసం అంబరాన్ని అందుకుంది.

నా కథలు, నవలల్లో తెలంగాణ భాషను ప్రయోగించాను. పాత్రలు, పేర్లు తెలంగాణ తనంతో వున్నాయి. సంఘటన స్థలాలు తెలంగాణలోనివే. తెలంగాణ సాయుధపోరాటాన్ని చిత్రించే నవల వ్రాయాలని నాకు కోరికగా వుండేది. ఆ పోరాటాన్ని ఇతివృత్తంగా తీసుకొని ఒక కొత్త ఆలోచనాత్మక వ్యాఖ్యానంతో నవలను ముగించాను. ఆ నవల పేరు "మలుపు తిరిగిన రథచక్రాలు" దానిలోని ఇతివృత్తం తెలంగాణ చరిత్రలోని ఒక ప్రధాన ఘట్టం. ఇది 1994 లో ప్రచురించాను. స్త్రీలు తమ ఆత్మకథను వ్రాయటం చాల అరుదైన విషయం. నేను "ముసురు" పేరుతో నా ఆత్మకథ వ్రాసి ప్రచురించాను. దీనిలో నిజాం కాలంనాటి పరిస్థితులు ఆంధ్ర ప్రాంతాలకు పోయిన నైజాం ప్రాంతం వారి కష్టాలు ఎదుర్కున్న ఆగ్రహం వివక్షలు చిత్రించాను. తెలంగాణ సామాజిక రాజకీయ చారిత్రకమైన సత్యాలు వివరించాను. ఇది కేవలం వ్యక్తి జీవిత చరిత్ర మాత్రమే కాదు. తెలంగాణ ప్రజా జీవితం దీనిలో ప్రతిబింబించింది. తెలంగాణ భాషమీద అభిమానం కన్నగడ్డ మీద గౌరవంతో రచయితలు ఎంతోమంది తెలంగాణ భాష, యాస లో తెలంగాణ ప్రజా జీవితాలను, సంస్కృతి, పండుగలను, జాతరలను చిత్రిస్తూ కవితలు, కథలు వ్రాయటం 1990 నుంచే జరిగింది. 1995 ల నుంచి ఉద్ధృతంగా సాగింది. తెలంగాణ చరిత్రను తవ్వి తీయటం కూడా మొదలైంది. 2002 లో తెరాస పార్టీ ఏర్పడటం కేసీఆర్ నాయకత్వం

–ఆయన తెలంగాణ ప్రజల మనసులను హృదయాలను కదిలించే తేనెలొలికే తెలంగాణ భాష, యాసలో ఉపన్యాసాలియ్యటం ఆరంభమైంది. దానికన్నా ముందు నుంచే రచయితలు, కవులు తమ తెలంగాణ మీది అభిమానాన్ని అస్తిత్వ గౌరవాన్ని పాఠకుల్లో, ప్రజల్లో రేకెత్తించే విధంగా రచనలు చేయటం మొదలు పెట్టారు. 1969 లో కన్నా భిన్నంగా రాజకీయోద్యమం కన్నా మొదలే భావాత్మకమైన ఉద్యమానికి రచయితలు, కవులు పూనుకున్నారు. రాజకీయోద్యమానికి తమ రచనలతో మేధావి వర్గం రచయితలు, కవులు, కళాకారులు రంగం సిద్ధం చేశారు. ఆ విధంగా సాహిత్యం సమాజాన్ని రాజకీయాలను మారుస్తుంది, నడిపిస్తుంది. మార్పులో పెద్దపాత్రను నిర్వహిస్తుందని తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వవాద సాహిత్యం నిరూపించింది. ప్రత్యక్షంగా కార్యరూపంలో పాల్గొనకున్నా అటువంటి ప్రాంతీయ అస్తిత్వవాద సాహిత్య సాగరంలో ఒక బిందువునై నేను కూడా రచయిత్రిగా సమాజంలో భావాత్మకమైన ఉద్యమం తేవటానికి ప్రయత్నం చేసాననుకుంటున్నాను.

***

ప్రజాస్వామిక తెలంగాణ సాధించుకుందాం



మంజులా కుమారి పులిజాల

తెలంగాణ ఉద్యమానికి ఊపిరి, పునాది అయిన తెలంగాణ సాయుధ పోరాటం ప్రపంచాన్ని తట్టి లేపింది. ఆనాడు భూమి కొరకు, భుక్తికొరకు, విముక్తి కొరకు తెలంగాణ రైతాంగ పోరాటం పురుడు పోసుకుంది మా నల్లగొండ జిల్లాలోనే. ఎంతో మంది వీరులను నాయకత్వాన్ని అందించిన నల్లగొండ ఎర్రగొండగా పేరు గాంచింది.

విప్లవాల పురిటిగడ్డ వాసియైన నేను స్వతహాగా హక్కుల కార్యకర్తను. నాకు 5 సంవత్సరాల వయస్సులోనే ఎమర్జెన్సీ నిర్బంధం ప్రభావం అనుభవంలోకి వచ్చింది. మా నాన్నగారు 16 నెలలు జైలు జీవితాన్ని చవిచూసారు. మా నాన్నగారు పులిజాల రాఘవరంగారావు గారు ఆంధ్ర మహాసభలలో కార్యకర్తగా పాల్గొన్నారు. గ్రంథాలయోద్యమంలో, తెలంగాణ సాయుధ పోరాటంలో దేవులపల్లి వెంకటేశ్వర రావు, భీంరెడ్డి నరసింహ రెడ్డి, ధర్మభిక్షం, ఆరుట్ల రాంచంద్రారెడ్డి మొదలైన వారితో కలసి పని చేశారు. న్యాయవాదిగా ఉద్యమకారుల పై పెట్టిన కేసులు, పడిన ఉరిశిక్షల రద్దుకై ఉద్యమించారు. న్యాయసేవలు అందించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఉద్యమకారులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించారు.

సాయుధ పోరాట విరమణ తరువాత కొంతకాలం కార్యకర్తగా ఉండిన తదుపరి శ్రీకాకుళ ఉద్యమ ప్రభావంతో మారిన రాజకీయ పరిస్థితులతో ప్రత్తిపాటి వెంకటేశ్వర్లు తో కలిసి పౌరహక్కుల సంఘ స్థాపనకు కృషి చేసారు ఎ.పి తొలి పౌరహక్కుల సంఘం అధ్యక్షులుగా శ్రీశ్రీ, ఉపాధ్యక్షులుగా రాఘవ రంగారావు, కార్యదర్శి గా ప్రత్తిపాటి వెంకటేశ్వర్లు గా సంఘ నిర్మాణం జరిగింది. అప్పటి నుండి 2002 లో చనిపోయే వరకు జిల్లా పౌరహక్కుల సంఘం అధ్యక్షులుగా చివరి 2 సంవత్సరాలు రాలు గౌరవాధ్యక్షులుగా హక్కుల సాధనకు కృషి చేసారు. అందువలన నేను స్వతహగా హక్కుల కార్యకర్తగా , ఉద్యమకారిణిగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నాను.

1998 లో తెలంగాణ జనసభ కార్యకర్తలను, ప్రజాకళా సమితి కళాకారులను హంతక ముఠాలు పాశవికంగా హత్యలు చేసాయి. ఈ పరిణామాలలో తెలంగాణలో నివురుగప్పిన నిప్పులా ఉన్న తెలంగాణ ప్రజల ఆకాంక్షలు ఈ పాలకుల అణచివేత చర్యతో ఉప్పొంగిన లావాలా ఎగిసిపడ్డాయి. నల్లగొండ జిల్లాలో పేరుకు నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ కానీ జిల్లా మొత్తం నీటి సమస్య. భూగర్భజలాలు అడుగంటి ఫ్లోరైడ్ మహమ్మారి కోరలు సాచింది. దీనికితోడు చెరువుల్ని ఎండబెట్టి కృష్ణాజలాల్ని హైదరాబాద్ కి తరలించారు. అంతకు ముందే ఎడమకాలువ పేరుతో జిల్లా రెండు మండలాలు మినహా కరువు కరాళ నృత్యం చేసింది. మల్లాపూర్ మొదలైన గ్రామాల్లో ప్రభుత్వం యురేనియం త్రవ్వకాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రేడియేషన్ భయంతో ప్రజలు భయకంపితులయ్యారు. రాచకొండ గుట్టలలో ఫాల్స్ ఫైరింగ్‌రేంజ్ ఏర్పాట్లు మొదలయ్యాయి. ఈ సమస్యలపై ప్రజలను సమాయత్త పరిచి నిరసన ప్రతిఘటన పోరాటాలు చేపట్టాము.

పులిచింతల ప్రాజెక్టు 2002 లో ప్రారంభమయింది సుమారు 270 గ్రామాలు ముంపుకు గురి అయి గిరిజన గ్రామాల వారు నిర్వాసితులయ్యే పరిస్థితి గిరిజన తెగలకే అస్తిత్వ సమస్య యెదురయ్యింది.

నీటి సమస్యలో రైతులు భయంకర క్షామ పరిస్థితిలో మగ్గిపోయారు. వలసలు, ఆత్మహత్యలే శరణ్యమయ్యాయి.

ఈ పరిస్థితులలో ప్రజలకు తెలంగాణ హక్కులసాధనే ఏకైక పరిష్కార మార్గంగా తోచింది. నీళ్ళు, భూమి, వనరుల రక్షణ, గిరిజన కొండజాతి ప్రజల రక్షణ ఏకైక ధ్యేయంగా తెలంగాణ ఉద్యమాన్ని హక్కుల సాధన దిశగా ప్రజాస్వామ్య తెలంగాణ సాధించాలి అనే లక్ష్యంతో ముందుకు సాగాము.

యావన్మంది తెలంగాణ ప్రజలను ఉద్యమోన్ముఖులను చేయాలి. సామాజిక, రాజకీయ చైతన్యాన్ని రగిలించాలి. భావజాల వ్యాప్తికై సాంస్కృతికోద్యమాన్ని నిర్మించాలి. కవులను, కళాకారులను, జర్నలిస్టులను, మేధావులను కదిలించాలి. అందరూ సాంస్కృతిక సైనికుల్లా పని చేయాలి. ఇదే ధ్యేయం. అందుకు గాను కవిత్వం, వ్యాసాలు మాత్రమే కాకుండా కరపత్రాలు, ఉపన్యాసాలు లక్ష్యాన్ని బోధించే భావవ్యక్తీకరణ ఉండాలి. తెలంగాణ సంస్కృతిని, సాహిత్యాన్ని, భాషను ప్రపంచం నలుదిక్కుల చాటి చెప్పాలి అనే ఉద్దేశ్యంతో గ్రామ గ్రామాన సభలు, సమావేశాలు, ధర్నాలు – ఇలా కార్యక్రమం తీసుకున్నాము. 2003 నుండి తెలంగాణ విద్యావంతుల

వేదిక నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షురాలిగా ఉన్నాను. తెలంగాణ రచయితల వేదిక ద్వారా పలు రకాల కార్యక్రమాలు నిర్వహించాము. 'మత్తడి' మొదలైన పుస్తకావిష్కరణల్లో సమీక్షలు చేశాను. నీలగిరి సాహితి. గుంపు, గోసంగి మొదలైన సాహిత్య సంస్థల ద్వారా వచ్చిన పుస్తకాల ఆవిష్కరణ సభలలో పాల్గొన్నాను.

2004 నుండి తెలంగాణ ఐక్య కార్యాచరణ కమిటీ కార్యక్రమాలలో తెలంగాణ సభలు నిర్వహించాము. తెలంగాణలో సాంస్కృతిక సంఘాలు, తెలంగాణ జర్నలిస్టుల ఫోరం, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు మొదలైన వాటిలో ధూం ధాం లలో నక్రేకల్, చండూరు, మిర్యాలగూడ. తిప్పర్తి, నల్లగొండ సభలలో ఉపన్యసించాను.

పుల్లెంల, చండూరులలో ఫ్లోరైడ్స్ వ్యతిరేక ఉద్యమ నిర్మాణం చేసాను. జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలలో తెలంగాణ మీటింగులు నిర్వహించాము. 2007 లో జిల్లాకు యూనివర్శిటీ ఏర్పడింది. యూనివర్శిటీకి పాల్కురికి సోమనాథుని పేరుగాని, వట్టికోట అళ్వారుస్వామి పేరు గాని పెట్టాలని సభలు నిర్వహించాము. అందుకు కృషి చేస్తామని స్థానిక ఎమ్మెల్యే హామీ ఇచ్చినా అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.ఆర్ తెలంగాణ కవుల పేరు పెట్టనివ్వకుండా మహాత్మాగాంధీ యూనివర్శిటీగా గా నిర్ణయించారు.ఆ

తెలంగాణ సాధనే లక్ష్యమంటూ హెచ్ఎంటీవి 'దశ దిశ' లో, టి.వి 9 కార్యక్రమంలో చాటి చెప్పాము.

తెలంగాణ మట్టి మనుషుల పాదయాత్రలో పానగల్ నుండి నల్లగొండ వరకు నడిచాము. మిర్యాలగూడలో తెలంగాణ మట్టి మహిళలు–రచయిత్రుల సభ రెండు రోజులు నిర్వహించాము.

2009 చిదంబరం ప్రకటన తర్వాత తెలంగాణ రాజకీయ వస్తువుగా మారింది. అన్ని రాజకీయ పార్టీలు వ్యూహాత్మకంగా క్రీడలు మొదలు పెట్టాయి. కేంద్రం శ్రీకృష్ణ కమిటీ వేసింది. శ్రీ కృష్ణ కమిటీ కాలయాపన కొరకు వేసారు. దీనిలో రాజకీయ దురుద్దేశ్యాలు ఉన్నాయి. తక్షణమే తెలంగాణ ప్రకటించాలని డిమాండ్ తో "శ్రీకృష్ణ కమిటీ గో బ్యాక్" పేరుతో కమిటీ ప్రకటన వెలువడిన 3 వ రోజే తిప్పర్తిలో నిరసన సభ నిర్వహించాము.

నేను, నెల్లుట్ల వేణుగోపాల్ ఉపన్యాసకులం. ఆత్మహత్యలు పోరాటరూపం కాదు అని, 'ఆత్మహత్యలు వద్దు, పోరాడి సాధించాలి' అని పిలుపునిచ్చాం. పానగల్లులో ఎం.జి యూనివర్శిటీ విద్యార్థుల సభలలో విరసం సభ్యులుగా నేను వరవరరావు

పాల్గొన్నాము. ఆలేరు, భువనగిరి, నల్లగొండ మొదలైన తెలంగాణ సభలలో పాల్గొని తెలంగాణ ఆవశ్యకత, ఆకాంక్షను చాటి చెప్పాము.

హైదరాబాద్ లో మిలియన్ మార్చ్, సాగరహారం లలో పాల్గొన్నాను. సాహిత్య కార్యక్రమాలలో పాల్గొన్నాము. వందలాది కరపత్రాలు రూపొందించి లక్షల కరపత్రాలు పంచాము. తెలంగాణ కవిత్వం రాసాము.

రెండున్నర జిల్లాల రెండు సంపన్న వర్గాల ఆధిపత్య భాష తెలంగాణ పై ఎలా రుద్దబడుతున్నాయో గ్రామ గ్రామాన వివరించాము. భిన్న వర్గాల, తెగల, జాతుల సమ్మేళనమైన తెలంగాణలో ఉన్న గిరిజన, లంబాడా, గోండు, చెంచు, కోయ మొదలైన ప్రజల సంస్కృతిని, భాషలను, అస్తిత్వాలను నిల్పుకోవలసిన ఆవశ్యకతను ప్రజలకు తెలిపి అన్ని వర్గాల ప్రజలను ఉద్యమోన్ముఖులను చేశాము.

తెలంగాణ ఉద్యమ గీతాలను రాసి నేర్పించి టీం తయారు చేసి అన్ని సభలలో పాడించి గాయకులను తయారు చేసాను. వార్తా పత్రికలలో తెలంగాణ సమస్యల మీద వ్యాసాలు రాసాను. జిల్లా నుండి వెలుబడిన ప్రత్యేక సంచికలో కవిత్వం రాసాను.

ప్రజలను సమీకరించి ఉద్యమ నిర్మాణం చేయడంలోను కవులు, కళాకారులను ఉత్సాహపరిచి తెలంగాణ గురించి నినదించినందుకు సుదీర్ఘ పోరాటం తర్వాతనైనా అనివార్య పరిస్థితులలో అయినా అసంపూర్ణ భౌగోళిక తెలంగాణ వచ్చింది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అయినా భూ ఆక్రమణలు, వనరుల తరలింపు, అడవుల నరికివేత, గనుల త్రవ్వకాలు ఆగలేదు సరికదా పెరిగాయి. వేల వేల ఎకరాలు భూమి కార్పోరేట్ కంపెనీలకు ధారదత్తం చేయబడింది. నయాజమీందారీ భూస్వామ్య వ్యవస్థ మళ్ళీ విశ్వరూపం చూపిస్తుంది. పేద, బడుగు వర్గాలకు, ఉత్పత్తిలో భాగస్వాములకు భూమిగాని ఉత్పత్తి ఫలాలు గాని అందడం లేదు. భూ సంస్కరణలు సక్రమ నీటి కేటాయింపులు జరుగలేదు. అడవులను నరికివేస్తూ అడవిబిడ్డలను తరిమివేస్తున్నారు.

ప్రజల అభీష్టానికి, ఆకాంక్షలకు విరుద్ధంగా పోలవరం 7 ముంపు మండలాలను ఎ.పి లో కలిపేస్తూ ఆగమేఘాల మీద బి.జె.పి ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చి కార్పొరేట్ కారిడార్‌కు ప్రయోజనం చేకూర్చింది.

ఈ ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తూ టాంక్‌బండ్ పై అంబేద్కర్ విగ్రహం వద్ద విరసం ధర్నాకు పిలుపు ఇచ్చింది. మమ్మలను, ఇతర ప్రజా సంఘాల నాయకులందరినీ అరెస్టు చేసి ఒకరోజు నిర్బంధంలో ఉంచారు. గత ప్రభుత్వంలో కూడా కేసులు నిర్బంధాలు ఎదుర్కొన్నాం.

ఇప్పటికి ఇంకా ప్రత్యేక ప్రజాస్వామిక తెలంగాణ పోరాడి సాధించుకోవాల్సిన అవసరం ఉంది. బడుగు వర్గాలకు ప్రజాస్వామిక ఫలాలను అందించాల్సి ఉంది. ఇంత సుదీర్ఘకాలం తెలంగాణ ఉద్యమం ఒక చరిత్ర సృష్టించింది. దాన్ని సజీవంగా నిలబెట్టడంలో భావజాల వ్యాప్తి చేయడంలో స్పష్టంగా ప్రజల ఆకాంక్షలను వ్యక్తీకరించడం, వివరించడం, రచనలు, కవిత్వాల ద్వారా ప్రజలను ఉత్తేజపరచడంతోనే సాధ్యమయింది.

అన్ని రకాలుగా ఉద్యమ నిర్మాణం చేయడం వల్లనే ఈ మాత్రం తెలంగాణ అసంపూర్తిగా అయినా వచ్చింది. కార్పొరేట్ తెలంగాణ ఏర్పడుతుంది. ఈ పరిస్థితులలో రచయితలు, కళాకారులు, ఉద్యమకారులు ప్రజా సమస్యలపై పోరాడుతూ సాంస్కృతిక ఉద్యమాన్ని పరిపుష్టం చేస్తూ ప్రజల పక్షాన నిలిచి పీడిత ప్రజల గొంతుకను వినిపించినపుడు మేధావులుగా, రచయితలుగా ప్రజలకు మార్గనిర్దేశం చేయాలని నా అభిప్రాయం.

ఉద్యమాభినందనలు.

* * *

తెలంగాణ కొరకు కొట్లాడినందుకు గర్విస్తున్న



మేరి మాదిగ

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో నేను ఒక దళిత మహిళగా క్షేత్రస్థాయిలో పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొంటూనే నా అభిప్రాయాలను కవితల రూపంలో, పాటల రూపంలో, నినాదాల రూపంలో అప్పటికప్పుడు నాకు నేనుగా, నోటి మాటలతో పదాలను అనుకుంటూ కొన్ని సార్లు స్పీచ్‌ల రూపంలో మాట్లాడేదాన్ని, మాట్లాడే అవకాశం లేని దగ్గర కవిత రాసి చదివి సభలో వినిపించడం నాకు తెలంగాణ ఉద్యమం నేర్పించింది. అంతకు ముందు పాటల రూపంలో పాడేదాన్ని నోటి మాటలతో కొన్ని పేపర్ మీద రాసుకునే అలవాటు ఉండకపోయేది.

గతంలో నేను అనేక సామాజిక ఉద్యమాలలో పని చేసిన అనుభవమున్నా, అప్పటికప్పుడు నోటి మాటలతో సమస్యను బట్టి పాటల్ని అల్లుకొని పాడి వొదిలేసే దాన్ని కాని తెలంగాణ ఉద్యమం నాకు రాయడము నేర్పించింది. ఆ అలవాటు ఎలా వచ్చింది అంటే, నేను 2007-2009 అక్టోబర్ వరకు అన్వేషి విమెన్స్ రీసర్చ్ సెంటర్ హైదరాబాద్ వారి సహకారంతో, ఆది జాంబవ పురాణం లోని కళలు, సంప్రదాయాలు వాటి గొప్పతనం మీద, తెలంగాణ జిల్లాల్లో అధ్యయనం చేసినాను.

అన్వేషిలో ప్రతి ఒక్కరు రిసెర్చ్‌లో ఎంతో అనుభవజ్ఞులు ఉన్నారు. వీరు అనేక రకాల స్త్రీల పోరాటాల నేపథ్యం మీద అనుభవం కల్గిన వారు ఉన్నారు. నాకు మెంటర్‌గాచ శ్రీవత్స్, గోగు శ్యామల వీరిద్దరు సాహిత్య రంగంలో పరిచయం ఉన్నవారే. గోగు శ్యామల రాసే విధానం చూసి చాల నేర్చుకున్నాను. శ్రీ వత్సనేమో రిసెర్చ్ మెథడ్స్ చెప్పేవారు. అన్వేషి లైబ్రరీలో చారిత్రాత్మక పుస్తకాలు ఉన్నాయి. చాలామంది దళిత బహుజన రచయితలు, రచయిత్రులు, స్త్రీవాద రచనలను ఈ రిసెర్చ్‌లో భాగంగా, వీరందరు రాసిన పుస్తకాలను చదవడం, కుల నిర్మూలన వంటి పుస్తకాలను తిరిగి చదవడం, చర్చించడం, గ్రామీణ జీవిత చరిత్ర, కంచె ఐలయ్య గారి రచనలు, ఎండ్లూరి ఎల్లన్న గారి రచనలు, గోగు శ్యామల, జూపాక

సుభద్ర రాసిన వ్యాసాలు, కదిలే పుష్ప కథలు, కవితలు చదవడం 'అన్వేషి' లో, షాజాహానా, రమా మెల్కోటే, సజయ లలిత, జయక్క వీల్లు రాసిన సాహిత్యాన్ని చదివి అర్థం చేసుకొని నేను రాసే విధానం 'అన్వేషి' రిసెర్చ్ సెంటర్ ద్వారా నేర్చుకున్నాను.

అన్వేషి రిసెర్చ్‌లో ఉండగానే 'భూమిక' స్త్రీవాద పత్రికలో, దళిత స్త్రీ అంటరాని తనం మీద, పురాణాల్లో స్త్రీ వివక్ష మీద, దళిత స్త్రీల ఎదుగుదల కు అడ్డంకి దళిత పురుషులే కారణం అనే అంశం మీద, స్త్రీ రాజకీయాల వివక్ష మీద అనేక వ్యాసాలు రాసినాను. 'సూర్య' దినపత్రిక ఎడిట్ పేజిలో దళిత బహుజన మహనీయుల జయంతుల, వర్ధంతుల సందర్భంగా వారి మీద రాసిన ఆర్టికల్స్ స్పెషల్ పేజీల్లో రావడం శ్రీ చత్రపతి, సాహు మహరాజ్, అయ్యంకాళి, డా.బి.ఆర్.అంబేద్కర్, డా.బాబూ జగ్జవన్ రామ్, పెరియార్ రామస్వామి ఇలా మహనీయుల మీద ఆర్టికల్స్ రాసే స్థాయికి 'అన్వేషి' తీసుకొచ్చింది. సఫాయి కర్మచారీల హక్కుల మీద పాట భూమికలో అచ్చు అయింది. బహుజన కెరటాల్లో 'దండోరా' మాస పత్రికలో ఇంకా రాస్తున్న క్రమంలోనే తెలంగాణ ఉద్యమము ఉవ్వెత్తున ఎగిసిపడుతుంటే నాకు నేనుగా ఉద్యమంలో పోరు జెండానైనాను., నాతో పాటు అనేక మంది స్త్రీలను, యువతను, కుల సంఘాలను, దళిత బహుజన సంస్థలను ఉద్యమంలో పాల్గొనేలా నా వంతు కృషినందించినాను.

2009 లో అన్వేషిలో నా ప్రాజెక్టు వర్క్ పూర్తి అయింది. బియస్ఎఫ్, ఓయు విద్యార్థి సంఘం సహకారంతో ఆర్ట్స్ కళాశాల, ఇప్లూ విద్యార్థుల సమక్షంలో దళిత బహుజన సంఘాలను, మేధావులను, తెలంగాణ సినీ పరిశ్రమ వారిని పిలిచి అన్వేషికి అనుబంధ సంస్థల సహాయ సహకారాలతో "తెలంగాణ దక్కలి ఆది జాంభవ పురాణం" దక్కలి కళాకారులచే ప్రదర్శింపజేయడం జరిగింది. కర్ణికంటి గోపాల్. కర్ణెకంటి శోభ ఆధ్వర్యంలో ఈ కనుమరుగవుతున్న దక్కలి కళను తాళపత్ర గ్రంథాల ఆధారంగా పటాలేస్తూ చెప్పడం సభికులను ఆశ్చర్యపర్చేలా చెప్పినారు. నా రెండున్నర యేండ్ల అధ్యాయనానికి చాలా గౌరవం దక్కింది. అది పుస్తక రూపంలో అన్వేషి సహకారంతో ప్రచురణ చేయాల్సిన అవసరమున్నది.

షార్ట్‌టర్మ్ ఫెలోగా అన్వేషి రిసెర్చ్ సెంటర్‌లో పని చేసిన అనుభవాలను నేను మర్చిపోలేను. కానీ అలాంటి వసతులు కల్గిన సంస్థలు మరెక్కడా తెలంగాణలో లేకపోవడం వలన నేను స్వంతంగా డిటిపి చేయించుకునే స్థితి కరవై రచనలు ఆ

నాటి నుండి నా నోట్ పుస్తకాల వరకే పరిమితమైనాయి. అన్వేషిలో తెలుగు డిటిపి చైతన్య, శ్రీలక్ష్మి సపోర్టు చేసేవారు. బయట అంత ఓపికగా నా భాషను అర్థం చేసుకొని టైప్ చేసేవారు లేక , ఒకవేళ నెట్‌సెంటర్ వాళ్ళు టైప్ చేసినా మేము ఎడిట్ చేసింది ఒక్కసారి సరిచేస్తారు. తర్వాత మళ్లీ ఎడిట్ చేయ్యరు. ఈ ప్రాబ్లమ్స్ వల్ల నేను ఇతర పత్రికలకు నా వ్యాసాలు, కథలు, కవితలు, పాటలు పంపలేకపోయినాను.

2007-08 లో టిడిఫ్, అమెరికా వారు ప్రతి రెండవ శనివారం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన అవశ్యకత మీద, సమావేశాలు నిర్వహించే వారు. ఆ సమావేశానికి సూరేపల్లి సుజాతతో నేను కూడా హాజరైనాను. అక్కడ ప్రొ.కటికనేని విమల, ప్రొ.రేవతి పరిచయమైనారు. వారి ఇద్దరిలో కె.విమల సౌమ్యంగా, ప్రేమగా నాతో మాట్లాడేది. ఆమె పద్ధతి నచ్చి వారితో స్నేహం ఏర్పడ్డది. అది ఉద్యమ స్నేహమే అయినా, స్వంత ఆత్మీయురాలిగా అనిపించే ఆదరణ నాకు ఆమెలో దొరికింది. ఏ విషయమైనా ఓపెన్‌గా చర్చించుకునేవాళ్లం. తాను కూడా ఒక ఆలోచన చేసింది. 2010 లో మనం కూడా ఇలానే కల్సుకొని తెలంగాణ కోసం పోరాడుదాం అంటూ నాతో చెప్తు ఉండేది. 2009లో TWJAC గా ముందు అందరం ఏకమై తెలంగాణ పోరులో ఎవ్వరికి తోచిన విధంగా వాళ్లము పోరాటంలో భాగమై ముందుకు సాగినం.

విద్యార్థుల దీక్షలతో అట్టుడుకుతున్న ఓయుకి మేమంతా ప్రతిరోజు వెల్లుతూ దీక్షల్ని బలపరుస్తూ, మా కవితల్ని చదివి, విద్యార్థులను ఉత్తేజపర్చేది. ఓయు లేడీస్ హాస్టల్ విద్యారినులను ఉద్యమంలో ముందుండేలా ప్రోత్సహిస్తుండేవారము. రత్నమాల, కె.విమల, సంధ్య, విమలక్క, నేను, గోగుశ్యామల, జూపాక సుభద్ర, సులోచన, ప్రొ॥సుజాత, ఇంకా అనేక మంది దీక్షా శిబిరాలకు చేరుతూ వారి పోరాటానికి అడుగడుగునా అండగా నిలబడుతూ, విద్యార్థుల అరెస్టులను అడ్డుకునేలా, విద్యార్థినులను చైతన్యపర్చే పనిలో మేమంతా పని చేసేవారము. మరొకవైపు కేసిఆర్ గారి అమరణ నిరాహారదీక్షతో తెలంగాణలో ఆత్మహత్యలు పెరిగిపోతుంటే చూస్తూ ఊరుకోక మాతో పాటు బస్తీలలో నివసిస్తూ టీవి లు చూస్తూ ఉద్యమాన్ని గమనిస్తున్న గృహిణులలో తెలంగాణ స్ఫూర్తిని నింపుతూ మా వంతుగా ఉద్యమంలో నిమగ్నమైనాము.

నాకు నేనుగా రోజు ఓయుని సందర్శిస్తూనే రాపోలు రాధిక, గట్టమల్లి పద్మను కలుపుకొని మొదటగా తెలంగాణ మహాజన మహిళా సమాఖ్యను 2009 లో ప్రారంభించాను.

తెలంగాణ అమరవీరుల కుటుంబాలలో 1000 మందితో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పెద్ద హాలులో అమరుల సదస్సు, టిఎమ్ఎమ్ఎస్ బ్యానర్ పై సదస్సు నిర్వహించడం జరిగింది. 22-02-2010 ఉదయం 11 గం.ల నుండి సా॥5 గం॥ ల వరకు సభ జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా ప్రొ. కటికనేని విమల, రత్నమాల, ఎ.పి.సి.ఎల్.సి గోగుశ్యామల, జూపాక సుభద్ర తదితరులను పిలిచి శ్రీకాంతాచారి తల్లి దండ్రులను, వేణుగోపాల్ రెడ్డి, సాయికుమార్ కిష్టయ్య కుటుంబాలను గౌరవించుకోవడం జరిగింది. ఈ సదస్సుకు కరపత్రం నేనే రాసినాను. పాటలు పాడినాను. ఆనాటి పట్టికలు అమరవీరుల తల్లిదండ్రుల ఘోషను పేపర్లో రాయడం, టీవిల్లో చూపించడం ద్వారా టిఆర్ఎస్ పార్టీ, నమస్తే తెలంగాణ పేపర్ వారు అమరుల కుటుంబాల సంక్షేమాన్ని కొంత వరకు పట్టించుకున్నారు అంటే అది TMMS సంఘం చేసిన మొదటి కృషి ఫలితమే అని చెప్పవచ్చు.

14-02-2010 నాడు ఉస్మానియా యూనివర్శిటి ఆవరణలో విద్యార్థుల, జర్నలిస్టుల పై పోలీసులు విచక్షణ కోల్పోయి లాఠీచార్జీ చేయడంతో పాటు రబ్బరు బుల్లెట్స్ ఉపయోగించి కాల్పులు జరిపినప్పుడు 30 మంది విద్యార్థిని విద్యార్థులు గాయపడ్డారు. లాఠీ చార్జీ కారణంగా స్వప్న రెండు కాళ్ళకు తీవ్ర గాయాలయ్యాయి. అశోక్ జగన్ చేతికి, కాలికి గాయాలైనాయి. విద్యార్థినులను జుట్టుపట్టి లాగి, అసభ్యపదజాలంతో ధూషించారు. ఉద్యమ నాయకురాలైన రత్నమాల, హస్పిటల్‌కి వెళ్ళి గాయాలైన వారి పరిస్థితి చూసి, అప్పటికప్పుడు హోమంత్రి సబితా ఇంద్రారెడ్డి ని హోమంత్రిని కలిసి,సహచర ఉద్యమకారిణులను తోడుకొనిపోయి నేను ఒక మెమోరండం TMMS లెటర్ ప్యాడ్‌మీద అప్పటికప్పుడు రాసి పత్రికల వారికి అందజేశాం. లాఠీఛార్జి పోలీసుల మీద తక్షణ చర్యలు తీసుకోవాలి. ఉస్మానియా యూనివర్శిటిని ఖాళీ చేసి పోలీసులు వెళ్ళిపోవాలి అని రచయిత్రులం ధర్నా చేశాము.

ఈ విధంగా నా తెలంగాణ కోసం సాగిన ఉద్యమంలో నా వంతు కృషి చేసినందుకు గర్వంగా ఉంది.

* * *

వేయి పూల వేకువ



నెల్లుట్ల రమాదేవి

వేయి పూల వేకువ వందలాది యువకుల ప్రాణత్యాగం. వేలాది గొంతుల దిక్కులు పిక్కటిల్లే నినాదం. లక్షలాది చేతులు ఎత్తిన పిడికిళ్ళ ప్రతిజ్ఞ. కోట్లాది పాదాల ఉద్యమ కవాతు. ఆగ్రహావేశాలు నిండిన కళ్ళు కొన్ని. ఆకాంక్షల స్వప్నాలు నింపుకున్న కళ్ళు కొన్ని. కన్నీళ్ళను కవిత్వీకరించిన కవి హృదయాలు కొన్ని. నిజాలను నిగ్గు తేల్చిన మేధోవర్గాలు కొన్ని. అందరి అంతిమ లక్ష్యం ప్రత్యేక తెలంగాణ ! చిన్నా, పెద్దా, ఆడా, మగా, ధనిక, పేద, వర్ణ, వర్గ భేదాల్లేకుండా ప్రతివారూ మనసు పెట్టి, ప్రాణమిచ్చి పోరాడిన ప్రజా ఉద్యమం, సమస్త ప్రపంచాన్నీ ఆకర్షించిన ప్రత్యేక రాష్ట్రసాధన తెలంగాణా !

అయితే...ఆ త్యాగాలు మావి కూడా. ఆ గొంతులు మావి కూడా. ఆ ఎత్తిన చేతులు, నడిచిన పాదాలు, కలలు కన్న కళ్ళు, కవితలల్లిన కలాలు, పాటలు పాడిన గళాలు మావి కూడా. అని ఇవాళ స్త్రీలు చెప్పుకోవాల్సిన సందర్భం ఏర్పడడం శోచనీయం. పోరాటానికి అవసరమైన మహిళల పాత్ర అధికారానికి ఎందుకు పనికి రాకుండా పోయిందో అర్థంకాని ప్రశ్న. !

ప్రత్యేక రాష్ట్ర పోరాట ఉద్యమంలో పాట, మాటల పాత్ర ఎంతో ప్రాముఖ్యమైనది. ఒకవైపు మేధావి వర్గాలు, సామాజికవేత్తలు ప్రత్యేక రాష్ట్రం యొక్క అవసరాన్ని సహేతుకంగా విప్పి చెబుతుంటే, మరోప్రక్క పాట పక్షిగా మారి ప్రతి వేదికపైనా ఎగిరింది. ఊరూ, వాడా, పల్లె పట్నాల ప్రజలను చైతన్యవంతులను చేయడంలో పాట జెండాయై ముందుకు నడిచింది. అందులో మహిళల పాత్ర ఎంతో శక్తివంతమైనదీ, క్రియాశీలకమైనది కూడా ! రచయిత్రులూ, కవయిత్రులూ ఉద్యమ సాహిత్యంలో విడదీయలేని ప్రముఖ భాగమయ్యారనేది ఎవరూ కాదనలేని సత్యం.

ఇవాళ 'తెలంగాణ ఉద్యమంలో రచయిత్రుల పాత్ర'లో భాగంగా నా వంతు తోడ్పాటు గురించి వ్రాయమని తెలంగాణ సారస్వత పరిషత్తు వారు అడిగినపుడు మళ్ళీ ఒక్కసారి ఆ నేపథ్యం, ఆ రోజులన్నీ కళ్ళముందు కదలాడాయి.

తొలిదశ తెలంగాణా ఉద్యమం జరిగినప్పుడు నాకు ఆరేళ్ళు వుంటాయేమో ! స్కూలు కెళ్తునప్పుడు 'ఆంధ్రా గో బ్యాక్' అనే పెద్ద పెద్ద అక్షరాలు గోడల మీద కనబడేవి గానీ, అవి ఎవరు రాస్తున్నారో ఎందుకు రాస్తున్నారో తెలియజెప్పే వారు లేరు. తెలుసుకునే వయస్సు నాకు లేదు.

కానీ, అప్పుడు చూసిన ఒక సంఘటన నా మనస్సులో బలంగా ముద్రించుకు పోయింది. మా ఇంటి నుండి బడికి వెళ్ళే దారిలో సదాశివరావు గారనే తెలుగు ఉపాధ్యాయుడు ఇల్లు కిరాయికి తీసుకుని వుండేవారు. ఆయన హైస్కూల్ వాళ్ళకు సదాచారము, తెలుగు పద్యాలు వంటివి మాతో పాడించేవారు. గ్రంథాలయ వారోత్సవాలు వంటి సందర్భాలలో మాకు పోటీలు పెట్టించి బహుమతులు ఇప్పించేవారు.

ఒకరోజు మేము బడి నుంచి ఇంటికి వస్తూంటే వాళ్ళింట్లో వస్తువులన్నీ రోడ్డు మీద కుప్పగా పోసి తగులబెట్టడం కన్పించింది. సదాశివరావుగారి భార్య, పిల్లలూ ఏడుస్తూ కన్పించారు. ఆయన బిక్కమొహం వేసుకుని ఓ పక్కగా నిలబడ్డారు.

ఇంటికొచ్చాక మా అమ్మను అడిగాను "ఎందుకమ్మా ! అట్లా వాళ్ళ సామాన్లు కాలబెట్టారూ! "అని.

"వాళ్ళు ఆంధ్రావాండ్లు కదా ! ఇక్కడి నుంచి వెళ్ళగొట్టేందుకు అట్లా చేసి వుండొచ్చు. అయినా ఏదైనా వుంటే మాట్లాడుకుని పరిష్కరించుకోవాలె, విధానాల మీద కొట్లాడాలె గానీ, మనుషుల మీద ద్వేషం ఉండకూడదు." అన్నది మా అమ్మ ఏదో ఆలోచిస్తూ. నాకు అప్పుడు ఏమీ అర్థం కాలేదు గానీ, ఆ దృశ్యం, అమ్మ మాటలు బాగా గుర్తుండిపోయాయి.

ప్రాంతీయ వివక్షత గురించి నేను హైదరాబాద్‌లోని రెడ్డి విమెన్స్ కాలేజీలో ఇంటర్మీడియెట్ చదువుతున్నపుడే అర్థం అయింది. మెట్రో కల్చర్ కనుక అన్ని రాష్ట్రాల వాళ్ళూ వుండేవారు. అయినప్పటికీ ఆంధ్రావాళ్ళు ఎక్కువగా వుండేవారు. 1975 వరకు కూడా తెలంగాణాలో చాలా మటుకు ఆడపిల్లలకి టెన్త్ అవగానే పెళ్ళిళ్ళు చేయడం, లేదా కొద్దిమంది చదివించినా, తమకు దగ్గరి జిల్లాకేంద్రంలోని కాలేజీలో చేర్చడం జరిగేది. అలా వరంగల్‌కు చెందిన నాకు తెలిసిన వాళ్ళుగానీ, స్నేహితులు

గానీ లేకుండానే బిక్కుబిక్కు మంటూ హైదరాబాద్ కాలేజీలో అడుగుపెట్టాను. ఒక్క గంభీరావుపేట నుండి వచ్చిన 'మాధవి' అన్న అమ్మాయి తప్ప మా క్లాసులో తెలంగాణా వాళ్ళెవరూ కనబడలేదు నాకు. అసలే బెరుకుతనంతో ఏమీ మాట్లాడని నాకు ఎప్పుడయినా ఒక మాట మాట్లాడితే వెనుక వెక్కిరింతలు, నవ్వులూ విన్పించేవి. మాధవి పరిస్థితి కూడా అంతే. మెల్ల మెల్లగా మేము విధిలేని పరిస్థితుల్లో ఆంధ్రా యాసలో మాట్లాడ్డం మేనేజ్ చేసాం.

'వచ్చిండు', 'అన్నడు', 'తిన్నం'– ఇలాంటి మాటలకు బదులుగా వచ్చాడు, అన్నాడు, తిన్నాము అని మాట్లాడ్డానికి ఎంతో కష్టపడాల్సి వచ్చింది.

నేను డిగ్రీ చదువుతున్న రోజుల్లో కార్టూన్లూ, చిన్న చిన్న కథలూ రాస్తూండే దాన్ని. కథలు రాస్తున్నప్పుడు పుస్తక భాష అనివార్యంగా వచ్చేది. గ్రామీణ ప్రజల సంభాషణలు మాత్రం తప్పకుండా తెలంగాణ మాండలికంలో రాసేదాన్ని. 'తెలంగాణా మాండలికం చదవడం చాలా కష్టం' అంటూండేవాళ్ళు చాలామంది. పత్రికల్లో తెలంగాణా మాండలికం ఉన్న కథలు ఎందుకు వేయరో అస్సలు అర్థం అయ్యేది కాదు.

ఆ తరువాత నేను బ్యాంకు ఉద్యోగంలో చేరాక కూడా అంతే! నా సహోద్యోగుల్లో 90% ఆంధ్రా వాళ్ళే. మొత్తం వరంగల్ జోన్‌లో యాభై దాకా వున్న బ్రాంచిలన్నింటిలో కలిపితే తెలంగాణాకు చెందిన ఉద్యోగులు తక్కువ. అందునా మహిళా ఉద్యోగులం నలుగురయిదుగురికి మించిలేదు. అలాగే నేను పనిచేసే ఖాజీపేట్ బ్యాంక్ శాఖలో ఖాతాదారులు ఎక్కువగా రైల్వే ఉద్యోగులు వుండేవారు. కళాసీలు, పోర్టర్లు లాంటి చిన్న ఉద్యోగాల్లో తప్ప మిగతా అన్ని ఉద్యోగాల్లోనూ తెలంగాణేతరులే ఉండేవాళ్ళు.

అంతేకాదు, సద్దుల బతుకమ్మ పండుగకు ఎప్పుడూ సెలవు ఉండేది కాదు. తప్పని సరిగా లీవు పెట్టుకోవాల్సి వచ్చేది. ఇంత పెద్ద పండుగకు స్వంత రాష్ట్రంలో కూడా గుర్తింపు లేదా అన్పించేది.

ఈ పరిస్థితులకు కారణాలు సమగ్రంగా నాకు ఎరుకపర్చింది నా జీవన సహచరుడు దేవ్. తను వరంగల్‌లోనే పుట్టి పెరిగి చదువుకున్నాడు. సి.కెయం. కాలేజీలో వరవరరావు, కోదండరాం గార్లు, కాకతీయ యూనివర్సిటీలో హరగోపాల్, మురళీ మనోహర్ వంటి ప్రొఫెసర్ల వద్ద చదువుకున్నవాడు. జయశంకర్ సార్ శిష్యరికం చేసినవాడు. ప్రొ॥సీతారాం రావు, బియ్యాల జనార్థన్ గార్ల సహచరుడు.

జర్నలిస్ట్‌గా పొత్తూరి వెంకటేశ్వర్‌రావు, దీక్షితులు, అజంతా, భాస్కర్, రామచంద్రమూర్తి గార్లతో పాటు పనిచేసినవాడు. యం.ఏ. లో గోల్డ్‌మెడల్ సాధించినా, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఉద్యోగం కోసం వ్రాసిన పరీక్షలో టాపర్‌గా నిలిచినా ఉద్యోగం దొరకక కొన్నాళ్ళు సబ్ ఎడిటర్‌గా పనిచేసి తరువాత దొరికిన చిన్న గవర్నమెంట్ జాబ్‌లో చేరినవాడు. తెలంగాణాకు నదులు, నిధులు, ఉద్యోగాల విషయాల్లో ఎలా అన్యాయం జరుగుతుందో గణాంకాలతో సహా చెప్పేవాడు. అంతర్జాతీయ రాజకీయాలు, ఇరాన్, ఇరాక్ ప్రాంత యుద్ధాలు, చమురు చుట్టూ అల్లుకున్న ఆర్థిక విషయాలు వివరించేవాడు.

రైతుల, నేత కార్మికుల ఆత్మహత్యలు, నిరుద్యోగం వల్ల పట్నాలకు, గల్ఫ్‌దేశాలకు వలసలు, బీడీ కార్మికుల వెతలు, యువతలో నిస్పృహ.... ఇవన్నీ నాకు అవగతమయ్యాయంటే దేవ్ వల్లనే. అంతేకాదు, వలస పాలన వలన తెలంగాణా ఎంత నష్టపోతున్నదో తెలిసింది. అప్పటిదాకా కుటుంబ, సామాజిక బంధాలు, సమస్యలు, మానవత్వం వంటి అంశాలపై కథలూ, కవిత్వం రాస్తూ వచ్చిన నేను... రాజకీయ, ఆర్థిక అంశాలతో బాటు తెలంగాణాపై రాయడం మొదలు పెట్టాను.

అయితే ఆకస్మాత్తుగా దేవ్ మరణించడంతో నాలో శూన్యం ఏర్పడింది. అప్పటి దాకా అతని కళ్ళతో లోకాన్ని చూసిన నేను తీవ్ర విషాదంలో వుండి దైనందిన విషయాలని కూడా పట్టించుకోని సందర్భంలో సాహిత్యం జోలికి కూడా పోలేదు. ఆ తరువాత మూడు నెలలకే వైఎస్సార్ మరణం, మరో మూడు నెలలకు కేసీఆర్ అరెస్టు, నిరాహార దీక్ష- ఇలాంటి పరిణామాలతో మలిదశ తెలంగాణా ఉద్యమం తీవ్రతరమయింది.

ఉద్యమం కోసం వ్రాయడం మాత్రం అమృతలత గారి నిరంతర ప్రోత్సాహం వల్లనే మళ్ళీ మొదలయింది. అంతకు ముందు ఒకటి రెండు సార్లు రాజీవ గారు తెలంగాణా చారిత్రక, సాంస్కృతిక నేపథ్యంలో కవిత రాయమని అడిగినా రాయలేకపోయాను. కానీ అమృతలత గారు పదే పదే నా వెంటబడి అడగడమే కాక వ్యక్తిగత దు:ఖాన్ని కాక సామాజిక దు:ఖాన్ని అనుభవించి వ్రాయమని కోరినపుడు 'గాయాలే గేయాలై' సంకలనం కోసం 'తెలంగాణాలో ఏముంది?' అన్న ప్రశ్నకు జవాబుగా సాంస్కృతిక, చారిత్రక ఘనతను గురించి కవిత రాసాను.

ఆ తరువాత ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థుల ఉద్యమం, దాన్ని అణచడానికి జరిగిన దమనకాండ నేపథ్యంలో 'చెల్లని చెక్కు' అనే కథను కూడా

డా॥ అమృతలత గారి ప్రధాన సంపాదకత్వంలో వెలువడిన 'వెతలే కథలై' కథా సంకలనం కోసం రాసాను.

ఆ క్రమంలో నిరాశా నిస్పృహలకు లోనై ఆత్మహత్యలు చేసుకుంటున్న యువతను ప్రాణత్యాగాలకు పాల్పడవద్దని కోరుతూ, తెలంగాణా తప్పక వస్తుందనే ధైర్యాన్నీ, ఆశనీ కల్గించేలా అనిశెట్టి రజిత, పొట్లపల్లి శ్రీనివాసరావు గార్ల సంపాదకత్వంలో వచ్చిన 'ఊపిరి' కవితా సంకలనం కోసం 'వాళ్ళు' అనే కవిత రాసాను.

'కుతకుతలాడుతున్న అగ్నిపర్వతాలు
బ్రద్దలవకుండా ఎన్నాళ్ళుంటాయి ?
పోటెత్తుతున్న సముద్రపు అలలు
విరుచుకు పడకుండా ఎక్కడాగుతాయి ?
రగులుతున్న నిప్పు కణికలు
చేసే పని కాల్చడమో కాల్చుకోవడమో కదా !
అందుకే...
వాళ్ళు శ్రీకాంతాచారులయ్యారు.
వేణుగోపాలరెడ్డిలయ్యారు
అందుకే- వాళ్ళు ఒక్కొక్కరూ
ఒక్కో నిప్పుల జెండాలయ్యారు.
ఉద్యమ మాత మెడలో దండలయ్యారు'
అని చెబుతూ....
'ఇకపై ఒక్క లేతమొగ్గా
చిదిమి వేయబడవీల్లేదు
ఒక్క కంటిరెప్పపైనైనా
స్వప్నం కరిగిపోను వీల్లేదు

ఏ ఇంటి దీపమూ ఆరకూడదు

ఏ కంటి శోకధార సాగకూడదు

ఏ తల్లికీ గుండెకోత కలగకూడదు' అని రాశాను.

అప్పట్లో వరంగల్‌లో ఏ వేదికపైనైనా తెలంగానమే. చివరికి ప్రతి ఉగాదికీ వేయిస్తంభాల గుడిలో జరిగే కవి సమ్మేళనంలో కూడా అందరం తెలంగాణా అంశంపైనే కవితలు చదివే వాళ్ళం.

ఆంధ్రా, తెలంగాణాలను కవల సోదరులుగా వర్ణిస్తూ 'విభక్త కవలలు' అనే శీర్షికతో నేను వ్రాసిన

'బక్కచిక్కిన దేహం నాది

ఒళ్ళు బలిసిన రూపం వాడిది

కడుపు మండిన ఆవేశం నాది

కుక్షి నిండిన ఆయాసం వాడిది'

అనే కవిత చాలా మందిని ఉత్తేజపరిచింది. అప్పట్లో వచ్చిన చాలా సంకలనాల కోసం కవిత్వం రాసాను.

ఇక ప్రత్యక్ష కార్యాచరణ మాటకోస్తే మా స్వంతవూరు స్టేషన్ ఘన్‌పూర్ హైస్కూల్ ఓల్డ్ స్టూడెంట్స్ జాక్ పక్షాన ధర్నాల్లోనూ, ర్యాలీల్లోనూ పాల్గొన్నాను. ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలకూ వెళ్ళి హైస్కూల్ విద్యార్థులకు తెలంగాణా ఏర్పడవలసిన అవశ్యకతను వివరించే అవగాహనా తరగతులు, బృంద గీతాలు, నృత్యాలతో కూడిన కార్యక్రమాలు నిర్వహించాం.

కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అయిన మా బ్యాంకులో ధర్నాలు, సమ్మెలు చేసే అవకాశం లేనందువల్ల, దేవదాస్ అనే మా సహోద్యోగి సహకారంతో మరికొందరు తెలంగాణా సానుభూతి పరులను ఒప్పించి అనేకసార్లు మేమందరం తలాకొంత డబ్బు వేసుకుని స్టూడెంట్ జాక్‌లకు అందజేయడం జరిగింది.

మొదట్లో చాలామంది 'తెలంగాణా వస్తుందా-చస్తుందా ?' అని హేళనగా, వెటకారంగా మాట్లాడేవాళ్ళు. కానీ, ప్రతివాళ్ళకూ, వీలయిన ప్రతీసారీ వివరంగా

తెలంగాణా ప్రత్యేక రాష్ట్రంగా ఎందుకు ఏర్పడాలో చెప్తూండేవాళ్ళం. రాను రానూ మనం చేసేది న్యాయమైన పోరాటమేనని అర్థమై, చాలామంది సపోర్ట్ చేయడం మొదలు పెట్టారు.

తెలంగాణ ఉద్యమంలో వాళ్ళూ, వీళ్ళని కాకుండా ప్రతి ఒక్కరూ తమవంతు పాత్ర పోషించారు. కవులు, రచయితలు, కలం సైన్యంగా ముందుకు కదిలారు. అయినా ఈ పోరాటంలో పాట నిర్వహించిన పాత్ర ఎంతో గొప్పది. వాగ్గేయకారులెందరో పాటలు వ్రాసి పల్లెల్లో, పట్నాల్లో వివిధ వేదికలపైన ఉద్రూతలూగించే పాటలు పాడి ప్రజల్లో స్ఫూర్తిని కలిగించారు. అందరి ఏకోన్ముఖ కృషి వల్లనే తెలంగాణా ఏర్పడింది.

అయితే.... ఇంతటితో సృజనకారుల పని ఆగిపోకూడదు. పోరాడి సాధించుకున్న తెలంగాణా రాష్ట్ర ఫలాలు అందరికీ అందేదాకా, సమాజంలో రుగ్మతలు సమూలంగా తొలిగేదాకా అవకతవకలపై, అన్యాయాలపై కలం ఎక్కు పెడుతూనే ఉండాలి. అందులో నేనూ భాగమవుతూనే వుంటాను.

* * *

సంకలనాల్లో కదను తొక్కిన కవితను నేను



డా. రామలక్ష్మి కొమ్రరాజు

తెలంగాణ సాధనకు సాగిన సాహిత్యోద్యమంలో వరంగల్‌కు చెందిన ఇతర రచయితలతో పాటు నేను కూడా పాల్గొన్నాను. నేను సైతం అంటూ వేదికలపై నా గళాన్ని వినిపించాను. ఒక అధ్యాపకురాలుగా, జె.ఎ.సి. సభ్యురాలిగా సాహిత్య, సాంస్కృతిక సంఘాలతో కలిసి ఉద్యమరాగాన్ని ఆలపించాను. అందులో భాగంగా అందుబాటులో ఉన్న నా రచనలు కొన్నింటిని మీ ముందుంచుతాను.

తెలంగాణ రచయితల వేదిక పక్షాన జూకంటి జగన్నాథం, శ్రీధర్‌రావు దేశ్‌పాండేల సంపాదకత్వంలో అక్టోబర్ 2008–జూన్ 2009 న వెలువడిన 'తెలంగాణ సోయి' త్రైమాసిక సాహిత్య పత్రికలో "అరుణ కిరణం" అనే కవిత ప్రచురింపబడింది. అది వరంగల్‌లో ఒక కవి సమ్మేళనంలో వినిపించడం జరిగింది. ఆ కవిత – బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని నిరసిస్తూ/రణభేరి మోగించిన పోరాటాల పురిటిగడ్డ నా తెలంగాణ/భూమికోసం, భుక్తికోసం/తిరుగుబాటు బావుటానెగురవేసి/ ఆధిపత్య అణిచివేత ధోరణి/ కలసికట్టుగా వ్యతిరేకించిన/ ప్రజా ఉద్యమాలకు ఊపిరి నా తెలంగాణ/భావజాలం, భాషాస్వామ్యంపై/ధిక్కార శంఖారావాన్ని పూరించి హక్కుల సాధనకై ప్రతినబూని/ విప్లవ జ్యోతులను రగిలించిన/ రుద్రవీణ నా తెలంగాణ. కాకతీయ శిల్పకళా సంపద/ కమనీయ కావ్యపరంపర/ డప్పుదరువుల, జనపదాల/ సహజీవన శ్రమ శక్తికి సంకేతమే/ నా తెలంగాణ/ సమత మమత మానవతకు మారుపేరైన/ కోటిరతనాల వీణ నా తెలంగాణ/ అచ్చ తెలుగు యాసభాషకు ఆనవాలు నా తెలంగాణ/ అలుపెరుగని త్యాగాలతో/ అంతులేని గాయాలతో/ నిత్య చైతన్య స్ఫూర్తితో/ భవిష్యత్తువైపు సాగుతున్న/ అరుణ కిరణం నా తెలంగాణ.

2009 సంవత్సరంలో వరంగల్ రచయితల సంఘం తరపున నల్లెల రాజయ్య ప్రధాన సంపాదకత్వంలో వెలువరించబడిన తెలంగాణ జంగ్, ఉద్యమ కవిత – 2009 లో ప్రచురించబడిన మరొక కవిత "బతుకు పోరాటం" అందులో కొన్ని

భాగాలు – వీర తెలంగాణ మాదంటూ/ వేరు తెలంగాణ కావాలంటూ/ కులాలను, గళాలనూ ఏకం చేసి/ ఒక్కటిగా ప్రతిన బూని/ రగులుతున్న జనవాణి/ చోటుచేసుకున్న భావావేశం/ రూపుదిద్దుకున్న బతుకు పోరాటం/ ఆధిపత్య భావజాలం/ ఇంకానా ఇకపై సాగదంటూ/ మా వనరులు మాకుంటే/ మా బాధలు తీరునంటు/ పెల్లుబికిన నిరసన/నాలుగుకోట్ల ప్రజల/ గుండె చప్పుడీరణం/ బానిసత్వ మెందుకంటు/ అణచివేత ఆపమంటూ/ కుట్రలు కుతంత్రాలకు/ కాలమింక చెల్లదంటు/ ఎరుపెక్కిన కన్నులతో/ కదిలిన నా తెలంగాణ/ తెలంగాణ వాదమే/ మన జీవనవేదంగా/ జై తెలంగాణ నినాదమే/ మ్రోగించే నాదంగా/ ప్రత్యేక రాష్ట్ర సాధన అశయంతో/ శాసనసభల్లో బిల్లుకై శాంతియుత సమరం సాగిద్దాం. ఇది కూడా ఒక కవిసమ్మేళనంలో వినిపించిందే.

2010 సంవత్సరం లో డా॥వి.వీరాచారి సంపాదకత్వంలో తెలంగాణ ఉరుములు -మెరుపులు- ప్రజా ఉద్యమ కవితలు పేరుతో ప్రచురించబడిన సంకలనంలోని ఒక (నా) కవిత – "అగ్నిధార తెలంగాణ" – ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుపై/ పాలకుల శుష్క వాగ్దానాలు/ శుద్ధిలేని ప్రణాళికలు/అమలుకాని విధానాలు/ అక్కరకురాని నివేదికలు/ ఇంకానా ఇకపై చెల్లవంటూ/ ప్రశ్నించే ధిక్కార స్వరం తెలంగాణ/ పల్లె పట్టణం ఏకమై/ఊరూవాడా ఏకమై/ పెద్దాచిన్నా సంఘటితమై/ పదవులూ, హోదాలు పక్కనపెట్టి /ఉద్యమమే ఊపిరిగా/కొనసాగుతున్న జనజాతర తెలంగాణ/భావోద్వేగాలతో రగులుతున్న తెలంగాణ బాటను/ పక్కదారి పట్టించే ప్రయత్నాలెన్ని జరిగినా/ మా తెలంగాణ మాక్కావాలంటూ/ పట్టిన పట్టు వీడని నాలుగు కోట్ల ప్రజల/ న్యాయం కోసం సమరం సాగిస్తున్న అగ్నిధార తెలంగాణ.

వరంగల్లు రచయితల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆత్మహత్యలొద్దంటూ బతికి గెలుద్దాం – తెలంగాణ సాధిద్దాం అనే లక్ష్యంతో పొట్లపల్లి శ్రీనివాసరావు, అనిశెట్టి రజితల సంపాదకత్వంలో "ఊపిరి" అనే కవితా సంకలనం వెలువడింది. దానిలో నేను రాసిన కవిత–"మనుగడ" "తెలంగాణ బిడ్డలారా / ఆవేశపూరిత నిర్ణయాలొద్దు/ అశాంతి, అసహనం/ ఆత్మహత్యలు కాదు/ ఆత్మవిశ్వాసం కావాలి/ మన నాలుగున్నర కోట్ల ప్రజల/ ఆశ, శ్వాస, దీక్ష, అకాంక్ష/ తెలంగాణ కావాలని / తెలంగాణ రావాలని/ ఆరొందల మంది ఆత్మ బలిదానాల సాక్షిగా/ ఉద్యమానికి ఊపిరిగా మారి/ కొట్లాడి సాధించాలి/తెలంగాణ గోసను/ కష్టనష్టాల కన్నీళ్ళను కలబోసుకోవాలి/ ఆత్మ గౌరవ పోరాట నినాదంతో/ అవరోధాలను అధిగమిస్తూ/ సంయమన మార్గంలో/

అందరమొక్కటై సాగాలి/ స్వరాష్ట్రాన్ని కండ్లారా చూడాలి/ ఆ ఆనందానుభూతులను/ కలిసి పంచుకోవాలి/ పదికాలాల పాటు పదే పదే నెమరేసుకోవాలి/ మానవ సంబంధాలతో మనుగడ సాగించాలి."

ఉద్యమం ఉద్ధృతమై చివరి దశలో ఉన్నసమయంలో రుద్రమ ప్రచురణలు, వరంగల్ నుండి అనిశెట్టి రజిత ప్రధాన సంపాదకత్వంలో "జిగర్" తెలంగాణ విశిష్ట కవితా సంకలనం 2013 లో వెలువడింది. దానిలోని నా కవితా శీర్షిక "ధీరవనిత నాగమ్మ" – సకల విద్యా పారంగతురాలై/ ప్రజల మనిషిగా పేరు పొందిన/ తొలి మహామంత్రిణి/ మన వీరనారి నాగమ్మ/ పురుషాధిపత్య భావజాలాన్ని/ ధిక్కరించి గణతికెక్కిన ధీర వనిత/ ప్రజాస్వామ్యవాదంతో / ప్రజల గుండెల్లో కొలువై/ నిత్యపూజలందుకుంటున్న/ మన అరవెల్లి ఆడబిడ్డ/ ప్రతికూలత లెన్నున్నా/శాంతికోసం పరితపిస్తూ/ మానవతామూర్తిగా/పరిపాలన సాగించిన/ తెలంగాణ రైతుబిడ్డ/ ఆమె ధీశక్తి ప్రజల అస్తిత్వం/నాయకత్వమంటే నాగమ్మ/ మన పౌరుషం నాగమ్మ.

ఉద్యమకాలంలో సకలజనుల సమ్మె ప్రధాన కేంద్ర బిందువుగా ఏర్పడింది. ఆ సందర్భంలో దీక్షా శిబిరాలలో పాల్గొంటూ బతుకమ్మ పాట బాణిలో రాసిన ఒకపాట – "స్వరాష్ట్ర సాధన ఉయ్యాలో/మా ఆశ మా శ్వాస ఉయ్యాలో/ రాష్ట్రమొచ్చేదాకా ఉయ్యాలో/ రణం సాగిద్దాము ఉయ్యాలో/ మా నీళ్ళు మా నిధులు ఉయ్యాలో/ మాకే కావాలి ఉయ్యాలో/ మా భాష మా యాస ఉయ్యాలో/ మాకెంతో ఇష్టము ఉయ్యాలో/సకలజనుల సమ్మె ఉయ్యాలో/ఉప్పెనై లేచింది ఉయ్యాలో/ ఉప్పెనై లేచింది ఉయ్యాలో/ ఉద్ధృతమే అయ్యింది ఉయ్యాలో/ అన్ని ప్రజా సంఘాలు ఉయ్యాలో/ కలిసి సాగుతున్నరు ఉయ్యాలో/మహిళలంతా కూడి ఉయ్యాలో/ బతుకమ్మలాడిరీ ఉయ్యాలో/ బతుకమ్మ ఆడిరీ ఉయ్యాలో/ బోనాలు ఎత్తిరీ ఉయ్యాలో/మాకొద్దు మాకొద్దు ఉయ్యాలో/ పరాయి పాలనా ఉయ్యాలో/ మేముప్పమేమొప్పం ఉయ్యాలో/ ఆంధ్ర వలసపాలన ఉయ్యాలో/ వంట వార్పుల తోటి ఉయ్యాలో/ నిరసనలు తెలిపిరీ ఉయ్యాలో/రైలు పట్టాలపై ఉయ్యాలో/ ధర్నాలె చేసిరీ ఉయ్యాలో/ పగలనక రాత్రనక ఉయ్యాలో/ రణం బాట పట్టిరుయ్యాలో/ ఆత్మహత్యలొద్దు ఉయ్యాలో/ కొట్లాడి గెలద్దాము ఉయ్యాలో" సందర్భాన్ని బట్టి దీన్ని పెంచుకుంటూ పోవడం జరిగింది. అయితే ఇది ప్రచురింపబడలేదు.

ఒక అధ్యాపకురాలుగా, ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక, రుద్రమ ప్రచురణలలో సభ్యురాలిగా వివిధ సభలు సమావేశాలలో పాల్గొని విద్యార్థులను

ఉద్దేశించి మాట్లాడడం కవితలు వినిపించడం జరిగింది. కళాశాల విద్యార్థినులచే రోడ్లపై తెలంగాణ ముగ్గులను వేయించడం మరచిపోలేని సంఘటన. 'విద్యార్థినులారా/ రేపటి తరం నాయకులారా/ రండి, చేయి చేయి కలిపి/ స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో/ భాగస్వామ్యులు కండి/ ఆత్మగౌరవ పోరాటం మనది/ అందరమొకటై సాగుదాం రండి' అంటూ వారిని ఉద్యమంలో పాల్గొనే విధంగా ప్రేరేపించడం జరిగింది.

ఉద్యమ సందర్భంలోనే విద్యార్థినులను ప్రేరేపించడానికై "వీరనారి రుద్రమ్మ" అనే కవితను రాసి వినిపించడం జరిగింది. అందులో కొంత భాగం "గణపతి దేవుణి కుమార్తెగా/ ఓరుగల్లును - పాలించి/ కాకతీయుల కీర్తి ప్రతిష్ఠలను జగద్విఖ్యాతి గావించిన ఆడబిడ్డ/రుద్రదేవ మహారాజుగా/తొలి మహిళా పాలకురాలై/ ఆంధ్ర దేశాన్ని ఏలిన వీరనారి/అస్త్ర శస్త్ర విద్యలలో ఆరితేరి/తన శౌర్య పరాక్రమాలతో సమస్యలెన్నింటినో అధికమించిన సమరశీలి/ పోరాటాల పురిటిగడ్డపై జన్మించి/శత్రు సేనలను చీల్చి చెండాడిన భద్రకాళి/తరతమ భేదం లేక/కర్తవ్య దీక్షతో కదనాన నిలిచిన కార్యశీలి/కాకతీయుల పౌరుష రుద్రమ్మ/ మన ఆదర్శం రుద్రమ/మన ఆత్మగౌరవం రుద్రమ్మ." ఇది కూడా ప్రచురింపబడనిదే.

వీటితో పాటు బతుకమ్మ కవి సమ్మేళనాల్లో తెలంగాణ ఆకాంక్షను తెలిపే కవితలను రాసి వినిపించడం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ప్రకటించిన సందర్భంలో కాకతీయ విశ్వవిద్యాలయం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వారోత్సవాలను నిర్వహించింది. అందులో భాగంగా కవిసమ్మేళనంలో "సకల జనుల చైతన్యం" శీర్షికన కవితను వినిపించాను. అందులో కొంత భాగం- 'శౌర్య పరాక్రమాలకు ప్రతీకనై/ తరగని అభిమాన సంపదకు సంకేతమై/ కాంతులీనే కన్నులతో/ చిరుదరహాసంతో/ తను వంతా విజయోత్సాహపు పులకరింతలో/ కొత్త పొద్దునై మీ ముందు నిలిచిన నేను మీ అమ్మను/ నాలుగున్నర కోట్ల ప్రజల ఆశలు/ ఆశయాలకు ప్రతిరూపాన్ని/ అరవైఏళ్ళ చీకట్లను చీల్చుకొని దూసుకొచ్చిన స్వేచ్ఛా గీతాన్ని/ ఓరుగల్లు శిలాతోరణంలో చార్మినార్‌ను పొదిగిన/ ఆకుపచ్చని ఆకాంక్షల జయకేతనాన్ని' - అంటూ తెలంగాణ తల్లి స్వగతాన్ని చెబుతూ తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రజల పాత్రను కూడా ఈ కవితలో చెప్పే ప్రయత్నం జరిగింది. ఇది కాకతీయ విశ్వవిద్యాలయం ప్రత్యేక సంచికలో 2-9 జూన్, 2014 లో ప్రచురించబడింది.

అదే విధంగా రుద్రమ ప్రచురణల ద్వారా ఆగస్టు 2014 లో అనిశెట్టి రజిత సంపాదకత్వంలో వెలువడిన "పోలవరం- ప్రాణాంతక ప్రయోగం" (ముంపు

గ్రామాల గోడులో "విభజించి పాలించే". అనే శీర్షికన రాసిన కవిత– 'మేం అడవి బిడ్డలం, ఆదివాసులం/ ప్రకృతి తల్లి అక్కున సేదతీరే శ్రమ జీవులం/ మా బతుకుల్లో భాగమైన సహజ వనరులన్నీ మాప్రాణం/అభివృద్ధి పేరుతో ప్రాజెక్టు నిర్మాణం అప్రజాస్వామికం/ మా భూమిని ముంచేసి/ మా భుక్తిని కొల్లగొట్టి/ మూడొందల గ్రామాలను జలసమాధి చేసే/ ప్రాజెక్టు నిర్మాణం మాకొద్దు' అంటూ నిరసించే, పాలకులను నిలదీసే నేపథ్యంతో సాగిన కవిత ఇది. ఈ విధంగా తెలంగాణ ఉద్యమకాలంలో వివిధ సందర్భాలలో ఒక రచయిత్రిగా కలాన్నీ, గళాన్నీ వినిపించి తరించాను.

***

రాష్ట్రం వచ్చిందని విశ్రమించకండి



యం. రత్నమాల

తెలంగాణ రాష్ట్రసాధన మలిదశ ఉద్యమం మొదట అయిదారు సంవత్సరాలు ఆట, పాట, సాహిత్య ప్రక్రియల్లో తెలంగాణ సమస్యల గురించి విస్తృత ప్రచారం తర్వాత ఊపందుకొని రాష్ట్రసాధన కోసం రాజకీయ ఉద్యమంగా రూపొంది యావత్ తెలంగాణ కల్లోల తరంగమై ఉద్యమించిన ఫలితంగా తెలంగాణ రాష్ట్రం సాకారమయింది. ఆట,పాట,సాహిత్య ప్రక్రియల్లో స్త్రీల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమైంది. తెలంగాణ ఆటై పాటై రాష్ట్రమంతా తిరిగి తెలంగాణ కోసం పర్యటించి అది ఏ సమస్య అయినా తెలంగాణ పాటను వినిపించడమే కాదు అప్పటికప్పుడు సందర్భోచితంగా స్థానిక సమస్యలపై స్పందించి ఆశువుగా తానే స్వరంగా సాహిత్యీకరించి పాడిన బెల్లిలలితను స్మరించుకోకుండా తెలంగాణ రాష్ట్రసాధన ఉద్యమంలో రచయిత్రుల పాత్ర గురించి చెప్పడం అసమగ్రం, అసంపూర్ణం అవుతుంది. ఏ జిల్లా సభలో ఆ జిల్లా తక్షణ సమస్యలు వ్యక్తీకరించి ఆశువుగా బెల్లిలలిత పాడిన పాటలను ఆవేదికలపై వక్తగా పాల్గొన్న నేను స్వయంగా విన్నాను.

మిలియన్ మార్చ్ సందర్భంగా ట్యాంక్‌బండ్ పై ప్రదర్శనలో పాల్గొని అరెస్టయి జైల్లో నెల రోజులు ఉన్న 14 సంవత్సరాల గాయకురాలు కీర్తి అద్భుతంగా ఆడిపాడటమే కాదు స్వయంగా ఎన్నో పాటలు రాసింది.

తెలంగాణ రచయితల సంఘాలు, తెలంగాణ సాంస్కృతిక వేదికలు ఏర్పడి విస్తృతంగా తెలంగాణ సాహిత్యం ప్రచురించాయి. అయితే ఆ వేదికల్లో మహిళలకు అవకాశాలు అంతంత మాత్రమే. అసలు అవకాశమే లేదని కూడా చెప్పవచ్చు. ఎందుకంటే పితృస్వామ్యం సార్వజనీనం, సార్వత్రికం. కనుక సాహిత్యంలో కూడా తెలంగాణ ఉద్యమంలో రైలు రోకోలు, రాస్తారోకోలు, మిలీనియం మార్చ్, సాగరహారం, సమ్మెలు, నిరాహారదీక్షలు జెఎసిలు అన్నింటిలో స్త్రీలు పెద్దఎత్తున పాల్గొన్నప్పటికి నిర్ణయాత్మక కమిటీల్లో గాని, వేదికల మీదగాని స్త్రీలకు అవకాశాలు ఇవ్వలేదు.

అందువల్ల మహిళా జె.ఎ.సి ఏర్పడి స్త్రీలు తమంత తాము నిర్ణయాత్మక పాత్ర వహించాల్సి వచ్చింది. తెలంగాణ రచనల సంకలనాలలో అవకాశం దొరక్కపోవడం వల్ల రచయిత్రులు విడిగా తెలంగాణ సాహిత్య సదస్సులు నిర్వహించారు.

ఆంధ్ర ప్రాంతంలో సమైక్య ఆందోళన ఉద్ధృతమవుతున్న సందర్భంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు మద్దతుగా, తెలంగాణ సమస్యలపై రాసిన కవితలు, కథల సంకలనాలను నిజామాబాద్ నుంచి అమృతలత సంపాదకత్వంలో ప్రచురించి, ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణ రచయిత్రులతో సదస్సు నిర్వహించారు. అంతకుముందు ఆంధ్రజ్యోతిలో రంగనాయకమ్మ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మద్దతుగా వరుసగా వ్యాసాలు రాశారు. ఈ వ్యాసాలపై సమైక్యవాదుల విమర్శలకు వివరణ గా మరికొన్ని వ్యాసాలు రాశారు. ఈ వ్యాసాల ప్రభావం ఆంధ్ర ప్రాంతంలో ఆమెకు విస్తృతంగా ఉన్న అభిమాన పాఠకులను ఎంతో ప్రభావితం చేశాయి. భూమిక సంపాదకురాలు సత్యవతి గారు ఉద్యమ ఆరంభ సంవత్సరం లోనే భూమిక తెలంగాణ ప్రత్యేక సంచిక ప్రచురించారు.

విడిగా రచయిత్రులు డాక్టర్ రేవతి, డాక్టర్ రమామేల్కొటే మొదలైన వారు జల వనరుల పంపిణి మొదలైన సమస్యలపై విస్తృతంగా రచనలు చేశారు. పుస్తకాలు ప్రచురించారు. కె.విమల తెలంగాణ రచయిత్రులతో వ్యాసాలు రాయించి సంకలనం 'ముక్త' ప్రచురణ తెచ్చారు. శ్రీ కృష్ణ కమీషన్ కు అనేక మంది రచయిత్రులు నివేదిక అందజేశారు. ఉత్తరాంధ్ర రచయిత్రి జయప్రభ, మల్లీశ్వరి మొదలైన వారు తెలంగాణకు మద్దతుగా స్పందించారు.వసంతకన్నభీరన్, కల్పనా కన్నభీరన్ తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకత వివరిస్తూ జాతీయ స్థాయి పాఠకులను ప్రభావితం చేస్తూ ఇంగ్లీషు పత్రికల్లో రచనలు చేశారు. నా వరకు నేను ఉద్యమంలో వివిధ జిల్లాల్లో మండల, గ్రామస్థాయి వేదికల్లో వక్తగానే కాకుండా సింగరేణి సమ్మెకు మద్దతుగా, వివిధ జెఎసిల కార్యక్రమాలకు మద్ధతుగా పాల్గొనడంతో పాటు సాగరహారం, మిలీనియం మార్చ్, రైలురోకోలు, రాస్తారోకోలు, చలో అసెంబ్లీ కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు రెండు ముఖ్యమైన పుస్తకాలు 2008 లో ఒకటి, 2013 లో ఒకటి రెండు పుస్తకాలు తెచ్చాను. అవి 1) తెలంగాణ రాష్ట్రం : మహిళ – ఆదివాసీ– దళిత – బహుజన– మైనారిటి అస్తిత్వాలు 2) తెలంగాణ రాష్ట్రం : ప్రజలు, ప్రజా సంఘాలు, పార్టీల ఐక్య సంఘటన.

మహిళా జెఎసి కన్వీనర్‌గా, తెలంగాణ ప్రజాఫ్రంట్ ఉపాధ్యక్షురాలిగా బాధ్యతల్లో ఉన్నాను. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నాం సరే. తెచ్చుకున్న రాష్ట్రాన్ని ప్రజాస్వామికంగా తీర్చిదిద్దుకోవాల్సిన బాధ్యతను కూడా రచయిత్రులు విస్మరించకూడదు. కానీ సాధించుకున్న రాష్ట్రంలో తమ తమ హక్కుల గురించి ఉద్యోగులు, కుల, మత, అస్తిత్వశ్రేణులు ఉద్యమిస్తున్నారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో తన పాత్ర వహిస్తున్నారు. కానీ రాష్ట్రం వచ్చిన తర్వాత మహిళల్లో కదలిక లేదు. ఈ విషయంలో రచయిత్రులు స్పందించి ప్రజాస్వామిక తెలంగాణ ఏర్పాటు స్త్రీల హక్కుల విషయంలో స్పందించి రచనలు చేయాల్సిన అవసరం ఉంది.

***

ఉద్యమంలో ప్రబోధ గీతాన్నైన



చాడా లలితాదేవి

ఉద్యమాలు రాజకీయమని, ప్రజా ఉద్యమాలనీ రెండు రకాలుగా చెప్పొచ్చు. ఈరెండింటికి సమాజమే భూమిక ఐనప్పటికీ, నిర్వహణ తీరులోను, పర్యవసాన ఫలితాల్లోను తేడా ఉంటుంది.

మొదటిదైన రాజకీయోద్యమాలకు నైతిక సిద్ధాంతాలకన్నా, రాద్ధాంతాలే పునాదులుగా వుంటాయి. ప్రజా ఉద్యమాలట్లుండవు. వ్యక్తిగత ప్రయోజనాలకన్నా సమాజాభివృద్ధి ప్రధానాంశమై వుంటుంది. అవి "ఆలోచన, ఆచరణ" అనే అంశాల నుండి, చేరాల్సిన గమ్యం నుండి దూరంగా వెళ్ళవు. వీటికి ఆవేశం తోడు కాగా త్రివేణి సంగమంలా మారి సాగిపోతూ ప్రజల భాగస్వామ్యానికి విడదీయరాని బంధంగా నిలుస్తుంది. ఇక తెలంగాణ ఉద్యమానికి వస్తే!...

రాజకీయంతో పాటు ప్రజా ఉద్యమాలు సుమారు అర్ధశతాబ్దికి పైగా ఉనికి కోసమైతేనేమి, ఉద్యమాల ఊపిరులు నిలబెట్టుకోవడం కోసం ఐతేనేమి, వ్యక్తిగత అస్తిత్వాన్ని నిలుపుకోవడం కోసమైతేనేమి కడలి తరంగాల్లా పడిలేచింది కానీ ఫలితం అంతగా లేదనే చెప్పొచ్చు.

నిజం చెప్పాలంటే!..

ఆంధ్రప్రదేశ్-అవతరణ తెలంగాణ ఉనికిని పాతర వేయడానికి చేసిన నాంది ప్రయత్నమని అన్పించక మానదు.

తొలి దశగా ప్రత్యేక రాష్ట్రం కోసం 1969 ఉద్యమం అది హక్కులకోసం కాక, వ్యక్తులను ద్వేషించి, హింసించే దిశగా సాగింది. ఉదాహరణగా అప్పటోన్లే పని చేస్తున్న పాఠశాలలో 'జై తెలంగాణ' అని అననందుకు అక్కడి స్థానికేతర ప్రధానోపాధ్యాయుని జుట్టు కత్తిరించడాన్ని పేర్కొనవచ్చు. ఈ సంఘటన సమర్థనీయం కానప్పటికీ ఎత్తి చూపించేవారు కరువయ్యారానాడు.

మరొక ముఖ్యాంశమేమంటే:

ఆనాటి ఉద్యమంలో పోలీసులే...మహిళలు, పిల్లలు–అని చూడకుండా 360 పైగా మందిని కాల్చి చంపిన క్రూరకృత్యాలెన్నో , "ఆంధ్రోళ్ళు వెళ్ళిపోవాలి"– అని మాత్రమే తెలుసు సామాన్య పౌరులకు – కానీ! ఎందుకు? వారి ఉనికి వల్ల మనకు, భావితరాలకేలాంటి నష్టం –అన్న అవగాహనను ఆనాటి సమాజానికి తెలియజేసి, వారికి సరియైన దిశా నిర్దేశం చేయలేకపోయింది అనాటి నాయకత్వం.

ఏమైతేనేం!

నాయకుల స్వార్థ ప్రయోజనాలైతేనేం! ఉద్యమ ఆశయాలను ప్రజల మనస్సులకు హత్తుకునేలా వివరించడంలో వైఫల్యం చెందడంవల్ల నైతేనేం! అందరినీ ఉద్యమంలో భాగస్వాములుగా చేయలేని అసమర్థత నైతేనేం! మనవాళ్ళే పదవులకోసం, స్వార్థ ప్రయోజనాల కోసం మనకు వెన్నుపోటు పొడిచి ఉద్యమాన్ని నీరు కార్చడమైతేనేం! ఈనాటిలా ప్రసార–మాధ్యమాలు, పత్రికలు ఎప్పటికప్పుడు ప్రజలకు విషయాలను చేరవేసే సదుపాయాలంతగా లేకపోవడంవల్లనైతేనేం!....

ఇలా ఎన్నో కారణాల వల్ల ఏం జరుగుతుందో తెలియని అయోమయ పరిస్థితులేర్పడ్డాయి. ముఖ్యంగా తెలంగాణ పేరుతో జనం యొక్క ఆకాంక్షలను కొంచెం కొంచెం ఓట్లుగా, సీట్లుగా మార్చుకోవాలని చూసే దుష్టస్వార్థ రాజకీయ నాయకుల కుతంత్రాల వల్ల ఉద్యమాల మనుగడ పరిమిత కాలానికే నడిపించి నట్టేట ముంచారు.

ఉద్యమం పూర్తిగా ఆగిపోలేదు కానీ, తాత్కాలికంగా నైరాశ్యమావరించి నిస్తబ్ధత కప్పుకుపోయింది.

తరువాతి క్రమంలో....

1985 లో జి.వో 610 అమలుకోసం ఉద్యమం తలెత్తినా సరియైన తీరులో అమలుకు నోచుకోలేదు. తెలంగాణ రాష్ట్రంకోసం చేసే పోరాటంలో ఈ జి.వో ఓ అంతర్భాగమైనప్పటికీ, ఆనాటి ప్రభుత్వం చేసిన కుయుక్తుల వల్ల అది కాస్తా నిస్తేజమయ్యింది.

అలా వరుసగా

నాన్ ముల్కీ ఉద్యమం, ఆంధ్రాగోబ్యాక్ అనే పేర్లతో ఉద్యమ ఉనికిని చాటాలని చేసే ప్రయత్నాలెన్నో జరిగాయి. అవి సముద్రకెరటాల్లా ఎగిరిపడ్డాయేగానీ నిలదొక్కుకుని ముందుకు సాగలేకపోయాయి.

కారణం మనవాళ్లే.

ప్రాంతేతరులకు మనపల్లెటూళ్ళ నుండి ముల్కీ ధ్రువపత్రాల నిప్పించింది ఆనాటి మనకరణం, పటేళ్ళు కావడం మన దురదృష్టం. వారిచ్చే చిన్నచిన్న ప్రలోభాలకు లొంగిపోయి వాళ్ళను నెత్తికెత్తుకొని మోసిన మాతృద్రోహులు ఆనాటి మన నాయకులు.

ఇలాంటి దారుణాలు చిన్నస్థాయి నుండి అంచెలంచెలుగా అమాత్యుల స్థాయివరకు అంటూ వ్యాధిలా సోకింది కనుకనే, ఆనాటి ఉద్యమాలన్నీ పురిటిలోనే కొట్టుకుపోయాయి. లక్ష్యానికి చేరుకోలేకపోయాయి.

ఇక మలిదశ ఉద్యమానికొస్తే!...

కె.సి.ఆర్ నాయకత్వంలో మలిదశ తెలంగాణ ఉద్యమం కొత్త మలుపు తిరిగింది. పూర్వంలా కాక మనల్ని మనం హింసించుకొన్నామేగానీ, ఎదుటి వారిపై దాడి జరుగలేదు. ఆత్మబలి దానాలకైతే లెక్కేలేదు. ఈ చర్యలు కూడా సమర్థనీయం కానప్పటికీ అప్పటి అవేశపూరిత వాతావరణమలాంటిది.

ఈ కొత్త మలుపుకు కారణం అమరుల త్యాగాలన్నది నిర్వివాదాంశం. వందలాది విద్యార్థులు తెలంగాణ కోసం చేసిన ఆత్మ బలిదానాలు ప్రపంచ చరిత్రలో జరిగిన ఏ ఉద్యమంలోనూ కనిపించవు.

కొన్నిసార్లు ఉద్యమం ముందుకు సాగకుండా ఆగిపోతుందేమో అన్న సందిగ్ధావస్థలో ప్రతిసారి విద్యార్థుల ప్రాణ త్యాగాలు వాటికి కొత్త ఊపిరులను పోశాయి. నిరుపమానమైన వారి త్యాగాల జెండా ఈనాడు ప్రత్యేక రాష్ట్రంలో రెపరెపలాడుతుంది.

మలిదశ ఉద్యమంలో తిరుగులేని నాయకత్వంలో బలం పుంజుకున్న ఉద్యమంలో పాల్గొనడానికి ప్రతి పల్లె స్వచ్ఛందంగా ముందుకు కదిలింది. వ్యక్తిగత భావవైరుధ్యాలను పక్కనపెట్టి కవులు, రచయితలు, గాయకులు, కళాకారులు ఒకరేమిటి – వారు వీరనకుండా సబ్బండ వర్గాలవారు కలిసి నడిచారు. శ్రామికులు, కర్షకులు, కార్మికులు, అన్ని వృత్తులవారు కదం తొక్కి నిలిచారు. ఈ విలక్షణమైన చైతన్యమే ఎన్నో సంఘాల రూపంలో ఆవిర్భవించింది.

ఆత్మ గౌరవం కోసం కలిసి నడిచిన ఈ సంఘటిత పోరాటంలో కలాలకు, గళాలకు పదునుపెట్టారు రచయితలు. మరుగున పడిపోయిన సంస్కృతి సంప్రదాయాలు పునరుజ్జీవనం చెందాయి. ఫలితంగా ఈ ఉద్యమాలెందరికో పిల్లలు మొదలుకొని వృద్ధుల వరకు అవగాహన కల్పించాయి.

ఇలాంటి పరిస్థితుల్లోనే

ఆకాశంలో, అవకాశంలో మేము కూడా సగం అంటూ మేల్కొన్న మహిళాశక్తి ఉద్యమంలో పాల్గొన్న తీరు “నభూతో... న భవిష్యత్తు” అనే చెప్పాలి.

ఇల్లు కదలని ఇల్లాండ్రందరూ రోడ్డున పడ్డారు. వృత్తులను మరిచారు. వంటావార్పు, బోనాలు, బతుకమ్మలు, ఊరేగింపులు, నిరసన దీక్షలు – ఒకటేమిటీ అన్నింటా ముందుండి ఉద్యమాన్ని నడిపించారు. “అబలలము కాదు సబలలమని” చాటారు. ఆత్మబలిదానాల్లోను వెనుంకజ వేయలేదు. అలా అశువులు బాసిన బిడ్డలుగా ఆదిలాబాదు ధరావత్‌శ్వేత, వరంగల్ సవేరా, పాలమూరు సువర్ణ లాంటి వారెందరో!

ఢిల్లీలో జరిగిన విశాలాంధ్ర సభనడ్డుకొన్న యువ అడ్వకేటు “దివ్య” – తన వాగ్ధాటితో ఆనాటి సభ పెద్దలకు ముచ్చెమటలు పట్టించింది.

ఇక రచయిత్రులుగా మహిళలు పోషించిన పాత్ర తక్కువేమి కాదు. రచనలు చేశారు. పాటలతో హోరెత్తించారు. బోనాలతో సెగలను రగిలించారు. బతుకమ్మలనాటి బ్రతుకు విలువలను తెలిపారు. నినాదాలతో అధిష్ఠానానికి గుండెదడను పుట్టించారు. దీక్షలు చేసి తమ దక్షతను చాటారు. లాఠీలకు వెరువక మేటిగా నిలిచారు. పుస్తక ప్రచురణ కర్తలుగా బాధ్యతను భుజాలకెత్తుకున్నారు. వివిధ రూపాలలో తమ విశ్వరూపాన్ని ప్రదర్శించి, చూపరులకు విస్మయాన్ని కల్గించారు.

నివురు గప్పిన నిప్పులా వున్న మనసులోని ఆక్షాంక్షను ఒక్కసారిగా ఉవ్వెత్తున మండే అగ్నిపర్వతంలా ప్రజ్వరిల్లజేశారు. ప్రత్యర్థుల గుండెల్లో వణుకును పుట్టించారు. దశదిశల ఉద్యమ శంఖారావాన్ని వినిపించారు. గడప దాటని మహిళామణులెందరో మణులై తమతమ రచనలతో తెలంగాణ తల్లి మెడలో హారాలై నిలిచారు.

సుమారు 1600 మందికి పైగా అమరుల ఆత్మబలిదానాలతో తెలుగునేలంతా రక్తపుటేరులతో తడిసి పోయింది. చివరికి

భరతమాత 29 వ ముద్దుబిడ్డగా తెలంగాణ రాష్ట్రం సాకారమైంది.

జై తెలంగాణ

ఈ సుదీర్ఘ ఉద్యమంలో ఒక కవయిత్రిగా నా పాత్రపై ఓ విహంగ వీక్షణం.

1969 ఉద్యమం నాటికి నా ఉపాధ్యాయిని జీవితానికి రెండేళ్ళు గా నియామకం చేసిన ప్రభుత్వం నా సర్వీసును పరిగణనలోకి తీసుకోలేదు. అంటే నా ఉద్యోగానికి భద్రతలేని కాలమది.

చదువుకొనే రోజుల్లో ఆంధ్ర టీచర్ల పిల్లలతో పోల్చుకున్నప్పుడు నేను ఎన్నో విషయాలలో, ఎన్నోసార్లు వివక్షకు గురి అయ్యాను. ఆ సంఘటనలు క్రమ క్రమంగా ఆనాటి నా పసి మనసులో వీళ్ళమూలంగా నాకేదో అన్యాయం జరుగుతున్నదన్న ఆలోచనలకు అంకురార్పణ జరిగిందేమో ? తెలియదు కానీ నా మనస్సుపై గాఢముద్ర వేశాయి అని చెప్పక తప్పదు.

ఆకారణంగానే కాబోలు 1969 లో ప్రారంభమైన ఉద్యమంలో హుషారుగా పాల్గొన్నాను. ఉద్యోగ భద్రత లేదని తెలిసి కూడా – ఊరేగింపులో బ్యానర్లు పట్టుకొని ముందు నిలవడం నినాదాలతో హోరెత్తించడం, సమావేశాల్లో ముందు వరుసలో కూర్చొని, హుషారును కల్గించడానికి కరతాళధ్వనులు చేయడం, కర పత్రాలను పంచడం లాంటి పనులను ఉత్సాహంగా చేసేదాన్ని.

ఒకసారి ఊరేగింపును మా పాఠశాల నుండి ప్రారంభించారు. సుమారు ఓ వంద మంది టీచర్లతో ప్రారంభమైంది. ముందు వరుసలో నిల్చున్నాను. అలా మొదలై స్థానిక ఆర్డీవో కార్యాలయానికి చేరేసరికి పాల్గొన్నవారు ఒక్కొక్కరు నెమ్మదిగా జారుకున్నారు. పోలీసులు రంగప్రవేశం చేస్తున్నారని తెలిసిందట. వెనక్కి చూసే అలవాటు లేని నాకా విషయం తెలియలేదు.

మిగిలిన వాళ్ళను పోలీసులు జీపెక్కించుకొని పోలీసుస్టేషన్ కు తీసుకెళ్ళారు. ఓ గంటసేపు ఆవరణలో చెట్టు క్రింద కూర్చొబెట్టి తరువాత స్వంత పూచీకత్తుపై సంతకం చేయించుకొని వదిలారు.

ఆ మరునాడు స్కూల్లో–

"ఇలాంటి వీరనారి కృత్యాలను చేస్తే, జరుగబోయే డిఎస్సి లో సెలక్టు అవుతావా? పోలీసు స్టేషన్ వెళ్ళిరావడమంటే ఓ పెద్ద రిమార్కు" అటూ బయట, ఇటు ఇంట్లో ఒకటే పోరు. ఇకముందు జాగ్రత్త– అంటూ హెచ్చరికలు మౌనంగా విన్నాను. మనసులో మాత్రం సంతోషంగా వుంది. కానీ అదృష్టం ఏమంటే ఆ సంఘటనలేవి నా నియామకానికి ప్రతిబంధకం కాలేదు.

అలా నా ఉద్యోగ ప్రస్థానం మూడు దశాబ్దాల పాటు కొనసాగుతూనే ఉంది. కల మాత్రం సాకారమయ్యే సూచనలు కనుచూపు మేరలో కన్పించుట లేదు. నిజం చెప్పాలంటే

ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించకుండానే పదవీ విరమణ చెస్తానేమోనని ఒకింత బెంగగా ఉండేది.

కె.సి.ఆర్ నాయకత్వంలో ఊపందుకున్న మలిదశ ఉద్యమంలో పదోన్నతిపై జె.ఎల్ గా వెళ్ళిన నేను సభలు, ఊరేగింపులు, రిలే నిరాహారదీక్షలు, దీక్షా శిబిరాలకు వెళ్ళి సంఘీభావ ప్రకటనలు లాంటి కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నాను.

ఊరేగింపులో విద్యార్థులు కేవలం నినాదాలు చేస్తూ వెళ్ళడం గమనించి వారికొక ప్రబోధ గీతాన్ని వ్రాసి కరపత్రాలుగా పంచాను.

ఒక చరణం :- తెలంగాణ పిలుస్తుంది కదలిరా సోదరా

మాతృపద సేవలో ధన్యత నొందాలిరా

జన్మభూమి, కన్నతల్లి స్వర్గానికి కన్న మిన్నరా

ఏ సిరులైనా సాటిరావు వీని ముందర – జై తెలంగాణ – అంటూ వారు పాడుతుంటే కల్గిన ఆనందం మాటలకందనిది.

సందర్భోచితంగా కవితలు, గేయాలు వ్రాసి కరపత్రాల రూపంలో ఊరేగింపుల్లో, సభల్లో, దీక్షా శిబిరాల్లో, బస్సులో ప్రయాణం చేస్తున్నప్పుడు ర్యాలీలలో, శిబిరాలలో పంచిపెట్టాను.

అలా పంచిన వాటిలో కొన్ని ఓయు క్యాంపస్ వరకు వెళ్ళాయి. ఫోన్ చేసిన విద్యార్థులు ఫలానా గేయానికి బాణిని వినిపించండని అడగడం మరచిపోలేని జ్ఞాపకం.

అలా వ్రాసిన వాటిలో మచ్చుకు కొన్ని

* తల్లి కడుపున చిచ్చు పెట్టి – ఉన్న చదువును పక్కనెట్టి
జెండకర్రను చేతబట్టి – బ్రతుకునే పణంగ పెట్టి
గగనాన చుక్కలైన చక్కనయ్యలు – ఏ సిరాతో వ్రాయాలి మీ చరిత్రలు?

* తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సందర్భంగా
అమ్మ కన్పించింది – ఇన్నాళ్ళెక్కడున్నావమ్మా

ఇంతకాలం అమ్మవుండీ - లేని అనాథల్లా బ్రతికాము

నయవంచకుల నయగారాలకు నజరానాలయ్యాము

బ్రతుకుల్ని - బండలు చేస్తున్నా - తొండిని గమనించక - జెండాలు మోశాం

గుండెలు మండిపోతున్నా - దండలు వేసి - మరీ దండాలు పెట్టాం.

ఆశల తాయిలాలకు మోసపోయి గోసతో గోడుగోడున ఏడుస్తున్నాం.

అమ్మ నీవొచ్చావు దిగులు తీరింది.

మేమిపుడు అమ్మలేని వాళ్ళం కాదు - బ్రతుకుల్ని అమ్ముకునే వాళ్ళం కాదు.

* ఉద్యమంలో స్త్రీల పాత్రను వివరిస్తూ **'సమరాంగనలు'** అంటూ -

గాజుల గలగలలో ప్రమాద ఘంటికలు విన్పిస్తాం.

కమ్మగా వండి పెట్టడమే కాదు - చరిత్రహీనులు గా మారితే దండిస్తాం అంటూ

* యాదయ్య ఆత్మార్పణను గూర్చి -

చావులో కూడా సందేశమిచ్చిన యాదయ్యా

మాయాదిలో నీపేరు మొదటిదయ్యా

అసలు నీవనాథవు కాదు

నిన్ను పోగొట్టుకున్న తెలంగాణే నిజమైన అనాథ.

ఇలా వచ్చిన ఏ అవకాశాన్ని వదులుకోలేదు.

తెలంగాణ వచ్చింది. 'బిల్లు' పాసైందన్న వార్తను టీవిలో చూస్తూ సంతోషం పట్టలేక పేపరు తెచ్చుకోవటానికి లేవబుద్ధి పుట్టక పక్కనున్న న్యూస్ పేపరు పై

ఈ జయ గీతాన్ని వ్రాశాను. కరపత్రాలుగా వేసి విజయోత్సవ సభల్లో పాడుకోవడానికి స్కూళ్లకు పంపించాను.

* జయ జయ జయ జననీ తెలంగాణా

సాకారమైన మా సిరులమాగాణా

ఎదలోన కురిసింది ముత్యాల వానా

కన్నీరు పన్నీరుగా పరిమళించిదీ దినాన

* బంగారు తెలంగాణ కోసం పథకాలు చేపట్టి మిషన్ కాకతీయను ప్రవేశపెట్టినప్పుడు –

జలాశయాలెపుడు జన జీవరక్షలు – ఈ సోయికి కావాలి మొక్కవోని దీక్షలు

అది కల్గిన వారే పాలనాదక్షులు.

వారి కేసిఆర్తితోఎదురు చూచుజనులతో

నిండిన మాపల్లె గుండె పొంగిపొరలుతున్నది.

గుండెగదుల దరువులకు చిందులు వేస్తున్నది – మావూరి చెరువు – మా వూరికన్న తల్లి.

ఉద్యమంలో ఓ కవయిత్రిగా నా సేవలను గుర్తించి, వార్షిక విజయోత్సవాలలో స్థానిక ఆర్డీవో గారిచే పురస్కారాన్నందుకున్నాను.

ఇలా నాలుగున్నర దశాబ్దాలపాటు సాగిన ఉద్యమంలో ఉడుతవోలే సేవలందించిన అలనాటి జ్ఞాపకాలను అనుభవాలను సభాముఖంగా మీ అందరితో పంచుకునే అవకాశం వచ్చినందుకు ఈ బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నిర్వహణ బృందం వారికి మనఃపూర్వక కృతజ్ఞతలను తెలియజేస్తున్నాను.

జై తెలంగాణ

ఉద్యమంలో అనేక రూపాల్లో నేను



తుర్లపాటి లక్ష్మి

తెలంగాణ ఉద్యమంలో రచయిత్రిగా, ఉద్యోగినిగా, ఉపాధ్యాయ సంఘ నాయకురాలిగా అనేక ఉద్యమ రూపాల్లో నేను చురుకుగా పాల్గొన్నాను.

ఈ సామాజిక నేపథ్యంలో నేను వ్రాసిన కథ 'మస్కట్ పోతే' అన్న కథ తెలంగాణ రచయితల వేదిక నిర్వహణలో ప్రచురించిన 'సోయి' పత్రికలో ప్రచురింపబడింది. తెలంగాణ లోని కొన్ని ప్రాంతాల్లో, కొన్ని జిల్లాలలో చాలా మంది మగవాళ్ళు సంపాదనకై యవ్వనంలో వున్న స్త్రీని పెళ్ళి చేసుకున్న తర్వాత ఆమెతో కొన్ని రోజులు గడిపి సంపాదన నిమిత్తం వేరే దేశాలకు వెళ్ళిపోతే ఆమెను శారీరక, మానసిక, సామాజిక పరిస్థితులు ఎలాంటి స్థితికి తీసుకుని వస్తాయన్నది కథ నేపథ్యం.

అంతకుముందు 'భూమిక' పత్రికలో ప్రచురించిన కథ 'ఖాకీ పులి' కూడా తెలంగాణ పల్లె ల నేపథ్యంలో వ్రాసినదే. నక్సలైట్లు ఉద్యమంలోకి వెళ్ళిన మగవారిని అరెస్టు చేయాలన్న నేపథ్యంలో వారి వయస్సులో వున్న భార్యలను ఖాకీలు ఏ విధంగా మాటలతో, వికృత చేష్టలతో ఎంతనీచంగా బాధపెడతారో తెలపటానికి వ్రాసిన కథ.

ఇక 'వెతలే కథలై' రచయిత్రుల సంకలనానికి వ్రాసిన కథ, 'పునాదుల్లోంచి'. తెలంగాణ భాషా ప్రాధాన్యతని వివరిస్తూ మనకు అలవాటు చేసిన ఆంధ్రా భాషని ఉపయోగించటంతో తెలంగాణ వాడైన అతన్ని ఆంధ్రోడని డిసైడ్ చేసిన బర్రెల కాపరి తెలివిని అభినందిస్తూ అన్ని వృత్తుల వాళ్ళూ, పది జిల్లాల వాళ్ళూ అందరూ ఒక్కటై పోరాడాలన్న నేపథ్యం.

తెలంగాణ బతుకు చిత్రం నేపథ్యంలో ఎన్నో ఎన్నెన్నో కవితలను నేను వ్రాసాను. 'ఒకటే మాట తెలంగాణ' అన్న ఇందూరు కవుల కవితా సంకలనంలో

వ్రాసిన కవిత 'బువ్వకుండ'. ఆత్మహత్యలు చేసుకుని ప్రాణాలు పోగొట్టుకోవడం కాదు. పోరాటాలలో ముందుండి మన సత్తా చాటాలని వ్రాసింది. 'మాదే హైద్రాబాద్' అన్నది మన రాజధాని భాగ్యనగరం ఇప్పటికి ఎప్పటికీ మాదే అని వ్రాసింది. అలాగే 'గాయి' అన్న కవుల సంకలనానికి వ్రాసిన కర్తవ్యం. 'గాయాలే..గేయాలై' అన్న తెలంగాణ కవయిత్రుల సంకలనానికి వ్రాసిన కవిత 'నేను నగేయాల్ల'అన్నది. మన కుర్చీలల్ల మనమే కూసోవాలని. నిజామాబాద్ జిల్లా కవుల ప్రత్యేక సంచిక లో వ్రాసిన కవిత. 'ఇంకా పూత మాటలేనా?' అన్న కవిత ప్రత్యేక తెలంగాణకోసం కాళోజీలం కావాల్సిందేనని వ్రాసింది. స్నేహ ప్రచురణలు ప్రచురించిన బుక్‌లెట్స్‌లో వ్రాసింది 'ఇసం లేనోళ్ళం' అన్న కవిత. ఇది రాస్తూ 'మేం ఇగురం వున్నోళ్ళం' అని చెప్పింది.'సోయి' పత్రికలో వ్రాసిన 'సినుకు సినుకు వాన' అన్న కవిత 'ఆదిలాబాద్' అడవుల గూర్చి వ్రాసింది ఇవి కొన్ని మచ్చుకు మాత్రమే.

ఉద్యమ కార్యకర్తగా 'సకల జనుల సమ్మె' లో ముందు భాగాన నిలవటం, నాయకులతో పాటు రాజకీయ పిలుపులో కూడా కొవ్వోత్తుల ప్రదర్శన, వంటా వార్పులో వండటం, వడ్డించటం, మానవహారాలు ఏర్పాటు చేయటం, సెమినార్లు, చర్చాగోష్ఠులలో పాల్గొనటం, ఉపాధ్యాయినిగా పాఠశాలలో విద్యార్థులచే ర్యాలీ, గ్రామ ప్రజలతో ర్యాలీ, జిల్లా, గ్రామాలలో నిరసన ర్యాలీలు, నిరాహార దీక్షలలో పాల్గొనటం, అనేక శిబిరాలను సందర్శించటం, కార్యకర్తలతో పాటలు, సందేశాలు వినటం, ఇవ్వటం, రోడ్లపై కబడ్డీ, ఖోఖో లు ఆడటం, తెలంగాణ రచయితల వేదిక, టిజెఎసి లు కలిసి సకలజనుల సమ్మె సందర్భంగా సెప్టెంబర్ 17 2011 న ఇందూరు కవుల కవితాగానంలో కవిత గానం చేయటం, హైదరాబాద్‌లో నిర్వహించిన 'జాగో జాగోరె' కార్యక్రమంలో కవితాగానం, నిజామాబాద్ జిల్లా దుర్కి స్వయంభూ సోమలింగేశ్వర ఆలయంలో జరిగిన తెలంగాణ కవితోత్సవంలో కవితా గానం, ఖిల్లా రామాలయంలోని దాశరథి ప్రాంగణంలో కవితాగానం - ఇలా కవితలు వ్రాయడం, చదవటం, ఉద్యమంలో పాల్గొనటం రేపు ఇచ్చే కార్యాచరణకు ఎదురు చూడటం ఇదే నా ఉద్యమ దినచర్య.

ఉద్ధృతంగా ఉప్పెనలా ముందుకురికిన, పునాదులనే కదిలించిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో నేను మరో ముఖ్య భూమికను పోషించాను. అదీ పుస్తక సంపాదక బాధ్యత.

ప్రముఖ రచయిత్రి అమృతలత గారి ఆధ్వర్యంలో, సంపాదకత్వంలో ప్రచురించిన రచయిత్రుల కథా సంకలనం 'వెతలే..కథలై' అన్న ప్రముఖ సంకలనానికి అనిశెట్టి రజిత, కిరణ్‌బాల గార్లతో సంపాదకత్వం బాధ్యతలు నిర్వహించటం.

'ఒకటే మాట తెలంగాణ' అంటూ నినదించిన ఇందూరు కవుల కవితా సంకలనానికి నా జీవన సహచరుడు శ్రీ ఎనిశెట్టి శంకర్‌తో కలిసి నిర్వహణ, సంపాదక బాధ్యతలను నిర్వహించటం.

ప్రతి ఒక్కరికి ఉద్యమం ఒక వూపునిచ్చింది. ఎంతో శక్తినిచ్చింది. 'నాది' అన్న స్వార్థాన్ని వీడి 'మనది, మనం' అన్న సమైక్య భావాన్నిచ్చింది. చదువు, ఉద్యోగాలు, వృత్తులు, సంపాదన, లాభాలు, నష్టాలు అన్న ఏ ఆలోచన లేదు. 'తెలంగాణ రాష్ట్ర సాధన' మాత్రమే జీవన్మరణ సమస్య. 'నీ' 'నా' అన్న భేదం లేకుండా ప్రజలందరూ దగ్గరయ్యారు. ఒకరి పట్ల ఒకరికి ఆత్మీయత పెరిగింది. ఎక్కడ వారక్కడ ఒకే నినాదంతో, ఒకే పిలుపుతో ఉద్యమించారు. ఏ లాఠీదెబ్బలు, ఏ బారికేడ్లు, ఏ బాష్పవాయు గోళాలు, ఏ ఇనుప ముళ్ళ కంచెలు, ఏ ఇనుప గుళ్ళు, ఏ తూటాదెబ్బలు ఏ ఒక్కరిని ఆపలేకపోయాయి. ఉద్యమ వార్తలకై టి.వీ లముందే ఎన్నో రాత్రుళ్ళు గడిపేసాం.

చివరికి అనేక రకాల ఒత్తిళ్ళ మధ్య 'మన తెలంగాణ' మనసొంతమయింది. మనమే పాలకులం. మనమే పాలితులం. మన రాష్ట్ర సాధికారతని రక్షించుకోవలసిన బాధ్యత మనందరి మీద వుంది. దానికీ మన కలాలను కదిలించాల్సిందే.

ఈ నేపథ్యంలో ఇంతమంది రచయిత్రుల స్వానుభవాలతో కూడిన ఈ కార్యక్రమాన్ని నిర్వహించి నన్ను ఆహ్వానించిన తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షులు డా.సి.నారాయణరెడ్డి గార్కి, ప్రధాన కార్యదర్శి డా.జె.చెన్నయ్య గార్కి, ప్రముఖ రచయిత్రి, ఉపాధ్యక్షులు డా.ముదిగంటి సుజాతారెడ్డి గార్కి, ప్రముఖ రచయిత్రి మధ్యాహ్న సదస్సు అధ్యక్షులు డా.అమృతలత గార్కి నా సహ రచయిత్రులందరికి నా కృతజ్ఞతలు. సెలవు.

***

సింధువులో నేనొక బిందువును



భండారు విజయ

తెలంగాణ చరిత్ర, సంస్కృతి, సాహిత్యం, కళలు, విప్లవం కలబోసుకున్న ప్రత్యేక భౌగోళిక, సామాజిక ప్రాంతం. 1946 లో మొదలైన వీర తెలంగాణ సాయుధ పోరాటం సామాజిక, రాజకీయాలను కలుపుకొని తెలుగు సాహిత్య, సాంస్కృతిక రంగాలలో ప్రత్యేక చరిత్రను సృష్టించింది. భూమికోసం, భుక్తికోసం, బానిసత్వపు విముక్తి కోసం పుట్టిన ఆ విప్లవ పోరాటంలో ఎందరో వీరులు నేలరాలి అమరులైనారు. ఆ వీరుల నెత్తుటి ధారల్లోంచి ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లి తెలంగాణ ప్రాంతం అంతా వెదజల్లబడినవి. ఫలితంగా తర్వాత 1969 నాటికి తిరిగి ప్రత్యేక తెలంగాణ పోరాటం మళ్లీ ఊపందుకుంది. అప్పుడు కూడా వందలాది మంది వీరులు అమరులైనారు. ఆత్మబలిదానం చేసుకొని వీరమరణాన్ని పొందారు.

ఈ తర్వాత వచ్చిన మలిదశ పోరాటంలో తెలంగాణ ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు బుద్ధిజీవులు, కవులు, కళాకారులు, రచయితలు, రచయిత్రులు, వృత్తి పనివారలు ఒక్కరేంటి తెలంగాణ పది జిల్లాల్లో నివసించే ప్రజానీకం అంతా రోడ్లమీదకు వచ్చి తమ పోరాటప్రతిభను చూపారు. దాదాపు 600 వరకు విద్యార్థి వీరులు అమరులైనారు. వీరుల అమరత్వానికి చిహ్నంగా డిసెంబర్ 9, 2009 న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ప్రక్రియ మొదలైందని చెప్పటంతో తెలంగాణ ప్రాంత వాసులందరూ పండుగ చేసుకున్నారు. డిల్లీలో మాట ఇచ్చి హైదరాబాద్ కు తిరిగి వచ్చిన ఆంధ్రా రాజకీయనాయకుల కుట్రల ఫలితంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ప్రకటనను తాత్కాలికంగా అడ్డుకున్నారు. అయినప్పటికిని అంతిమ విజయంగా అఖిలపక్ష నిర్ణయంతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల చిరకాల వాంఛ నెరవేరి అందరినీ ఆనందంలో ముంచెత్తింది.

నా తల్లిదండ్రులు వరంగల్లు వాస్తవ్యులు కావటం వలన నా బాల్యం అంతా అక్కడే గడిచింది. నా విద్య, ఉద్యోగం కూడా అక్కడే ఉండటం వలన నేను కూడా

అక్కడే స్థిరపడ్డాను. ఆ తర్వాత వివాహరీత్యా పాటు ప్రభుత్వ ఉద్యోగిని కావటం వలన నా మకాం హైదరాబాదు నాకు బదిలీ కాబడింది. 1969 నాటి పోరాటం నాకు అంతగా గుర్తులేనప్పటికిని మలిదశ ఉద్యమంలో నేను హైదరాబాదు లోనే ఉండటంతో తెలంగాణ ఉద్యమంలో పరోక్షంగానే కాక ప్రత్యక్షంగా కూడా పాల్గొనగలిగాను.

తెలంగాణ జె.ఎ.సి పిలుపునందుకొని సకలజనుల సమ్మె, మిలీనియమ్ మార్చ్, చలో అసెంబ్లీ మొదలైన అనేక కార్యక్రమాల్లో పాల్గొనటం జరిగింది. అన్నింటికన్నా ఎక్కువ 42 రోజులు ఎటువంటి జీతభత్యాలు లేకుండా నేను నా తోటి ఉద్యోగులు అందరం కలిసి ప్రతిరోజు ఏదో ఒక చోట ధర్నా నిర్వహించటంలో, రిలే నిరాహార దీక్షా శిబిరాలను నడపటంలో ముందున్నాను. అదే విధంగా తెలంగాణ పోరాట లక్ష్యాన్ని అనేక వేదికల మీద మన భాష సంస్కృతుల మీద జరుగుతున్న, జరిగిన దాడులను వివరిస్తూ ఉపన్యసించటం జరిగింది. అందరిని కూడగట్టి ఊరేగింపులు, ధర్నాలు మా ఉద్యోగులతో నిర్వహించటం జరిగింది.

వృత్తి రీత్యా ఉద్యోగిగా నా బాధ్యతలు నిర్వహిస్తూ ప్రవృత్తి రీత్యా రచయిత్రిని కావటం వలన ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక తరపున నా గొంతును వినిపించటం జరిగింది. పోరాటంలో అమరులైన విద్యార్థుల త్యాగాన్ని కొనియాడుతూ అనేక కవితలు, వ్యాసాలూ రాయటం జరిగింది. తెలంగాణ సాంస్కృతిక అంశాలపైన, తెలంగాణ విశిష్ట వ్యక్తుల, ఉద్యమకారుల పైన 'రుద్రమ ప్రచురణ' ల ద్వారా దాదాపు పలు వేదికలపై తెలంగాణ ఆవశ్యకతను వివరిస్తూ ఉద్యమంలో పాల్గొన్నాను. ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక తరపున ఒక రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ హైదరాబాద్ లోని లామకాన్ లో నిర్వహించటం జరిగింది. ఈ సమావేశానికి ప్రముఖ రచయిత్రులు (ఆంధ్ర, తెలంగాణ ప్రాంత) హాజరై తెలంగాణ ఉద్యమానికి సంఘీభావంగా తమ మద్ధతును తెలపటమే కాక ఉద్యమం నడుస్తున్న తీరును హర్షించారు. అదే విధంగా అనేక మంది రచయిత్రులు అనేక నిరసన కార్యక్రమాలలో నాతోపాటు పాల్గొనటం జరిగింది. ఈ ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నానని చెప్పటానికి నేను గర్వపడుతున్నాను. తెలంగాణ పది జిల్లాలు బానిస సంకెళ్ళను తెంచుకొని సర్వస్వతంత్ర రాష్ట్రంగా అవతరించినందుకు అందులో ఉడతాభక్తిగా నావంతు కృషిని నేను చేయటానికి నాకు అవకాశాన్ని ఇచ్చిన నా తల్లిదండ్రులకు కృతజ్ఞతలు చెప్పకపోవటం కృతఘ్నుతే అవుతుంది.

చిననాటి నుంచి ఉద్యమ సాన్నిహిత్యం



డా. వాణి దేవులపల్లి

ప్రపంచ అస్తిత్వ పోరాటాల్లో తెలంగాణ రాష్ట్ర పోరాటం ప్రత్యేకమయినదీ, అమూల్యమయినది. రెండు దఫాలుగా 60 ఏళ్ళకు పైగా శాంతియుతంగా సాగిన ఈ ఉద్యమం ప్రపంచంలో అస్తిత్వం కోసం సాగిన మరే ఉద్యమంతోనూ పోల్చదగినది కాదు. అందుకే ఈ ఉద్యమం చరిత్రలో అజరామరమైనది.

ఇకపోతే, మలిదశ ఉద్యమ క్రమంలో కథయిత్రిగా నా వంతు పాత్రను తెలిపే ముందు నా బాల్యదశలోనే మొదటి దశ ఉద్యమం నాకెలా ప్రత్యక్షంగా పరిచయమైందీ తెలపడం ఇక్కడ సందర్భోచితం.

మా వూరు వంగపహాడ్. నా కప్పుడు ఐదేళ్ళు కూడా లేవు. మా చిన్నాన్న దేవులపల్లి వెంకటేశ్వరరావు గారు మార్కెటింగ్ శాఖలో పనిచేసేవారు. వారి సహోద్యోగి, మా బంధువు నెలుట్ల జగన్మోహన్‌రావు గారు. వీరు తొలిదశ తెలంగాణ ఉద్యమంలో అత్యంత కీలకమైన నాయకుడుగా వున్నారు. 'తెలంగాణ ప్రజా సమితి' కార్యదర్శిగా కొనసాగుతూ, ఉద్యమానికి మేధాపరమైన సేవలందిస్తూ వుండేవారని మా నాన్న గారి ద్వారా తరువాత తెలిసింది. వారు మా చిన్నాన్నతో పాటు మా యింటికి తరచూ వచ్చేవారు. అలా వచ్చినప్పుడు పిల్లలమైన మమ్మల్నందరినీ ఇంటిముందు స్తంభాల వద్ద కూర్చోబెట్టి తెలంగాణ ఉద్యమ పాటలు పాడించి, 'జై తెలంగాణ' అంటూ నినాదాలు చేయించేవారు. వారి వద్దనుండి నేనెన్నో పాటలు నేర్చుకున్నాను. మా తాత దేవులపల్లి వెంకటపాపారావు గారు ప్రత్యక్ష రాజకీయాల్లో లేనప్పటికీ, పరోక్షంగా రాజకీయనాయకులకు, వారి కార్యక్రమాలకు అండగా వుండడం మూలాన మా ఇల్లెప్పుడూ రాజకీయ వాతావరణంతో చాలా సందడిగా వుండేది. ఆ విధంగా, ఓ సారి హయగ్రీవాచారి గారు మా ఇంట్లోనే సభ పెట్టినప్పుడు నేను నేర్చుకున్న తెలంగాణ ఉద్యమ పాట పాడినప్పుడు చారిగారు కక్కలేక, మింగలేక సతమతమయ్యారనీ ఆ పాట ఆ సందర్భంలో ముఖ్యంగా కాంగ్రెస్ వర్గీయుల

సభలో పాడి వుండాల్సింది కాదని పక్కా కాంగ్రెస్ వాది అయిన మా తాత గారు నన్ను చెడామడా తిట్టారు. చక్కటి పాటను ఆవేశంతో వూగుతూ పాడితే అభినందిస్తారనుకున్నానేమో, నేను తాతగారు తిట్టేసరికి భోరుమని ఏడ్చేశాను. మా నాన్నగారు తెలంగాణ ఉద్యమ అనుకూలురు కాబట్టి నేను బాగా పాడానని మెచ్చుకున్నారు. ఆ విధంగా దృఢమైన కాంగ్రెస్ బీజాలున్న మా యింట్లోనే జగన్మోహన్ రావు గారు నేర్పించిన ఉద్యమ పాట పాడటం ద్వారా తెలంగాణ వ్యతిరేకతపై నా నిరసన మొదలయింది.

నిజం చెప్పాలంటే, మలిదశ ఉద్యమ సమయంలో నేనో ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్నాను. అప్పటికే తెలంగాణ వుద్యమం పట్ల మా నాన్న గారి (దేవులపల్లి గోపాల్‌కిషన్ రావు) ద్వారా కొంత అవగాహన వున్నప్పటికీ పూర్తి అవగాహన మాత్రం లేదు. నాకు చాలా ఇబ్బందిగా అన్పించేది. ఒక అధ్యాపకురాలినయిన నాకే ఈ విషయం పట్ల అవగాహన లోపిస్తే పిల్లలకేం చెప్పాలి ? ఇదీ నన్ను వేధించిన ప్రశ్న. ఆ సమయంలోనే ఓ కార్యక్రమంలో జయశంకర్ సార్‌తో కలిసి మాట్లాడ్డం జరిగింది. సార్‌తో ఇదే విషయం చెప్పాను. "మీరొక సెమినార్ చేస్తే నాలాంటి చాలామందికి విషయ పరిజ్ఞానాన్నిచ్చిన వారవుతారు" అని సార్‌తో అన్నాను. త్వరలో సికేయం కళాశాలలో ఓ సెమినార్ వుందని చెబుతూ సార్ నన్ను రమ్మని చెప్పడం జరిగింది. సికెయం అంటే నేను చదివిన, కొంతకాలం పార్ట్-టైం గా పని చేసిన కాలేజీ. కాలేజీ నుండి గూడా ఆహ్వానమందడంతో సెలవు పెట్టి సెమినార్‌కు వెళ్ళాను. జయశంకర్ సార్ చెప్పే ఒక్కో విషయం విని ఆశ్చర్యపోయాను. కొన్నేళ్ళుగా, నీళ్ళు, నిధులూ, నియామకాల అంశాల్లో తెలంగాణ ప్రాంతానికి ఎంత అన్యాయం జరుగుతోందో గణాంకాలతో సహా ఉపన్యసించిన సారు ప్రతి మాటను నోట్ చేసుకున్నాను. ఎందుకు ప్రత్యేక రాష్ట్రం కావాలో కొంత అవగతమయింది. అప్పటినుండి ఎక్కడ వుద్యమం గూర్చి సెమినార్‌లు అయినా తప్పకుండా అక్కడ వుండే ప్రయత్నం చేశాను.

ఇకపోతే, ఇటు నేను పనిచేసే కాలేజీలో, పనిపట్ల, వృత్తిపట్ల వున్న నా నిబద్ధత ఓ మంచి టీచర్‌గానే కాక, విద్యార్థుల్లోనూ నాకంటూ ఓ స్థానాన్నిచ్చింది. ఆ విద్యార్థుల్లో 90% గ్రామీణ నేపథ్యంతో అట్టడుగు వర్గాల నుండి వచ్చినవారు! ఇక ఫీజు రీఇంబర్స్‌మెంటు పుణ్యమా అని, ఇంటర్మీడియట్ పాసయిన ప్రతి ఒక్కరు ఇంజనీరింగ్‌లో చేరడం చాలామంది విద్యార్థుల జీవితానికి ఓ ఇబ్బందిగా మారింది. పిల్లలకిష్టం లేకున్నా, తల్లితండ్రులు బలవంతంగా చేర్పించడం వల్ల, వారికిష్టం లేని

చదువులో కొనసాగలేక, ఏదో విధంగా చదువు పూర్తి చేసినా చదువుకు తగ్గ వుద్యోగమూ రాక విద్యార్థులు పడే యాతన ప్రత్యక్షంగా చూశాను. వచ్చిన విద్యార్థుల్లో ఆంగ్ల పరిజ్ఞానం పక్కన పెడితే కనీసం మాతృభాషలోనయినా తప్పుల్లేకుండా వ్రాయలేకపోవడం, మాట్లాడలేకపోవడం నన్ను కలచివేసిన విషయం. ఎక్కడుందీ లోపం ? తరచి చూస్తే, వాళ్ళంతా సర్కారు బడుల్లో చదివి వచ్చినవారే! అంటే ఎవరిని తప్పు పట్టాలి ? సరియైన విద్యనందించలేని సర్కారు బడులనా? వేలకు వేలు ఫీజులు కట్టి ప్రైవేటు బడుల్లో చదవలేని వారి కుటుంబ ఆర్థికస్థితిగతులనా? ఇక్కడ చోటుచేసుకున్న అంశం కేవలం విద్య ప్రైవేటీకరణ చెందడమే కాదు. వాణిజ్యమైంది. పసికూనలను ముందుతరాల బాధ్యతాయుతమైన పౌరులను తయారు చెయాల్సిన సర్కారుబడులు నామమాత్ర, నాణ్యతలేని విద్య నందిస్తున్నాయా? కానీ, మా చిన్నప్పుడు మేం చదివిన ఇవే సర్కారుబడులు సరస్వతీ నిలయాలు. ఎంతో నిబద్ధతతో, నాణ్యమైన విద్యనందించారు ఉపాధ్యాయులు. ఎందుకీ తేడా ? క్రమ క్రమంగా నాకర్థం కాసాగింది. సామాజిక విధ్వంసం చాపకింది నీరులా ఎలా ప్రవహిస్తూ, విస్తరిస్తూ వస్తుందో అర్థమైంది. అదిగో ఆ ఆలోచనలలోంచి వ్రాసిన కథనే 'గురువయ్య సారు కానిగీ బడి' తెలంగాణ అచ్చతెనుగులో, నుడికారంతో అందంగా మలచిన ఆ కథ నేను చాలా కాలం క్రితమే రాసినా, ప్రచురింపబడింది మాత్రం ఈ మధ్యే ! 2015 మే 5 వ తేదీ 'నమస్తే తెలంగాణ' బతుకమ్మ ఆదివారం సంచికలో వచ్చిన ఆ కథకు స్పందన చూసి ఆనందంతో తబ్బిబ్బయ్యాను. దాదాపు ఒక 300 ఫోన్‌కాల్స్ దేశ, విదేశాల నుండి పుంఖాను పుంఖాలుగా ఎస్సెమ్మెస్ లు, లేఖలు, ప్రశంసలతో ముంచెత్తుతూ. ఇదీ ప్రచురించబడిన నా మొదటి కథ. ఉద్యమ నేపథ్యంలో నేను రాసిన కవితలకు చక్కటి స్పందన లభించింది. ఇక అటు కాలేజీలోనూ నేను బోధించే క్లాస్‌రూంలు, ఇంగ్లీషు లాంగ్వేజ్ ల్యాబ్‌లను విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ అందించే క్రమంలో తెలంగాణ ఉద్యమంపై గ్రూప్ డిస్కషన్లు, డిబెట్‌లు ఏర్పరిచి, వారికి ఉద్యమ పరిజ్ఞానం అందించే దిశగా "వై డూ వి నీడ్ సపరేట్ తెలంగాణ" అంటూ పెట్టిన గ్రూప్ డిస్కషన్ చాలా ప్రాచుర్యం పొందింది. నాకున్న పరిజ్ఞానాన్ని వారికందించి ఆ విధంగా ఉద్యమం గూర్చి వారిలో అవేర్‌నెస్ కల్గించడం అధ్యాపకురాలిగా నాకు సంతృప్తినిచ్చిన అంశం. పిల్లల్ని (విద్యార్థుల్ని) ఉద్యమం గూర్చి వ్యాసాలు, కవిత్వం రాయమని ప్రోత్సహించి నేను రాసింది వారితో పంచుకునే దాన్ని. అప్పుడక్కడి ప్రిన్సిపల్ తెలంగాణ ఉద్యమం పట్ల సదభిప్రాయం లేని వ్యక్తి. బాహాటంగా ఉద్యమాన్ని సమర్థించి, హ్యుమిలియేట్ చేయబడిన వాళ్ళలో నేను

మొదటిదాన్ని. అనేక సందర్భాల్లో విద్యార్థులు 'జై తెలంగాణ' నినాద మివ్వమనగా, ఇవ్వడానికి నిరాకరించిన ఆ ప్రిన్సిపల్ లో ఆ తరువాత క్రమంగా, మనసులో ఎలా వున్నా, పైకి మాత్రం కొంత సానుకూలత ప్రదర్శితమైంది. నా పట్ల మాత్రం హ్యూమిలియేషన్ కొనసాగుతూనే వుండింది. ఆ తాటాకు చప్పుళ్ళకు నేను బెదరలేదు సరికదా మా కాలేజీ ఎలక్ట్రీషియన్ రవి వచ్చి, మరుసటి రోజు వున్న ర్యాలిలో అందెశ్రీ "జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం" పాడాలంటూ కోరి, ప్రతులు తెచ్చిచ్చినప్పుడు నాతో పాటు మమత మేడమ్ కూడా ప్రాక్టీస్ చేసింది. తెల్లారి శాయంపేట చౌరస్తాలో నినాదాల వెల్లువతో 'రాస్తారోకో' చేశాము. నేను ముందు నడిచి నినదించగానే, అప్పటివరకు వెనకగా వున్న అమ్మాయిలంతా వచ్చి నన్ననుసరించారు. కాస్సేపటికి పోలీసులొచ్చి 'రాస్తారోకో' భగ్నం చేసి, అందరినీ చెల్లా చెదురు చేశారు. నేను ఆటోలో ఇంటికొస్తుంటే, ఓ వ్యక్తి బైక్ పై నన్ను ఫాలో కావడం ఆలస్యంగా గమనించాను. నా వైపే తీవ్రంగా చూస్తూ, ట్రాఫిక్‌లో ఆగుతూ ఆగుతూ రావడం నన్ను ఓ క్షణం భయానికి గురిచేసింది. అతని వాలకం చూస్తుంటే ఏ గుండానో లేదా పోలీసుశాఖకు సంబంధించిన వ్యక్తో అన్పించింది. అయితే తప్పకుండా ఉద్యమ వ్యతిరేకి అని మాత్రం స్పష్టమయింది. ఆటోను ఇంటికి కాకుండా చౌరస్తా వేపు వెళ్ళమని, చాలా సేపటికి ఇల్లు చేరుకున్నాను. ఈ విషయం ఇంట్లో చెప్పలేదు. చెబితే మా వారు ఉద్యోగం మానెయ్యమంటారని, కానీ, ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న మా బాబుతో చెప్పినప్పుడు "జాగ్రత్త అమ్మా ! పోని కొన్ని రోజులు సెలవు పెటుకో" అన్నాడు. అప్పుడే పీహెచ్.డీ చేస్తుండడం వల్ల సెలవులన్నీ అయిపోయాయి ఎల్ఓపీ పెట్టుకుందామన్నా అప్పుడున్న పరిస్థితుల్లో ప్రిన్సిపల్ ఒప్పుకొనే అవకాశమూ లేదు. తెల్లవారి కాలేజీ నుండి ఇంటికి కొంతమంది కొలీగ్స్‌తో షేరింగ్ ఆటోలో బయల్దేరాను. అదాలత్ రాగానే నేను దిగాను వాళ్ళు ఖాజీపేట వెళ్తారు కాబట్టి. రెండడుగులేశానో లేదో వేగంగా బైక్ వచ్చి నా పక్కనాగింది. చలికాలం ! అయిదున్నర. అరింటికే చీకట్లు ముసురుకున్నాయి. మంకీ క్యాప్ పెట్టుకోవడం వల్ల ఆ వ్యక్తిని సరిగా చూడలేకపోయాను. నేను పట్టించుకోకుండా ముందుకెళ్ళబోయాను. నిజానికి నేను నిలువెల్లా కంపిస్తున్నాను. కానీ, పైకి చాలా ధైర్యంగా వుండగలిగాను. 'ఆగండి' బైక్ సైడ్ కాపుతూ అరిచినట్టే అన్నాడు దాదాపు. "ఎవరు మీరని" ధైర్యం కూడగట్టుకుని అడిగాను. చుట్టూ చూస్తున్నాను దగ్గర్లో జనం వున్నారా అని. "నేనవరయిందీ మీ కనవసరం. మీరు మాత్రం ఓ లెక్చరర్ అయి వుండీ పిల్లలను చెడగొడ్తున్నారు. తెలంగాణ వస్తుందనుకుంటున్నారా? వంద

మంది కేసీఆర్లు తలకింది తపస్సు చేసినా రాదు. పోరగాండ్ల చదువులను చెడగొట్టి, మీరు తమాషాలు చేస్తున్నారు. ఇంకోసారి ర్యాలీలల్ల, రాస్తారోకోలల్ల కన్పిస్తే పిల్లలను రెచ్చగొడితే ఖబడ్దార్ ! అటు ఇటూ చూసుకుంటూ తాను చెప్పదల్చుకుంది చాలా తీవ్ర స్వరంతో చెప్పాడా వ్యక్తి. నాకు ఏం జరుగుతుందో ఒక్క క్షణం అర్థంకాలేదు. నేను షాక్ నించి తేరుకోకముందే వెళ్ళిపోయాడా వ్యక్తి, ఎలాగోలా ఆటో ఎక్కి ఇల్లు చేరాను. ఇదొక భయానక అనుభవం నాకు. కానీ, ఆ తర్వాత కూడా ఎదురైన ప్రతి సందర్భాన్నీ తెలంగాణ ఉద్యమ బాణీ విన్పించడానికీ వుపయోగించుకోవడం మాత్రం మానుకోలేదు నేను. యూనివర్శిటిలో ఆంగ్ల విభాగం నిర్వహించే ప్రతి సదస్సులో నా వంతు కృషిగా 'తెలంగాణ ఉద్యమ' పంథాను అన్వయిస్తూ ముందుకు సాగాను. ముఖ్యంగా నా మీది నమ్మకంతో, అభిమానంతో నా పై గురుతర బాధ్యతనుంచిన నా గురువు ప్రొ.జి.దామోదర్, రీసెర్చ్ గురువు ప్రొ.మాడభూషి రాజగోపాలాచార్యలకు నా కృతజ్ఞతలు తెలుపుకోవాలి. ఇంకా నన్ను ప్రోత్సహించి అభినందించిన వారిలో మిగితా మిత్రులు ప్రొ.పురుషోత్తం, ప్రొ.రాజేశ్వర్, ఆచార్య దామోదర్ రావు, ప్రొ.లత, బబిత, దీపాజ్యోతి వున్నారు.

ఆ విధంగా డిసెంబరు 16, 2010 లో ప్రొ.జి.దామోదర్ కన్వీనర్గా డిపార్ట్మెంట్ నిర్వహించిన "డైవర్సిటీ ఇన్ న్యూ లిటరేచర్స్" అనే అంతర్జాతీయ సదస్సులో, వక్తలుగా వున్న ప్రొ.సునయనా సింగ్, ప్రొ.ఇంద్రసేనారెడ్డి ల సదస్సు పత్రాలను సమీక్షిస్తూ , తెలంగాణ అస్తిత్వ పోరాటాన్ని ఆఫ్రికా అస్తిత్వ పోరాటాలతో అన్వయించి ఆ విధంగా తెలంగాణ వాదాన్ని దేశ, విదేశ ప్రతినిధులున్న సభలో బలంగా విన్పించి అందరిచేతా అభినందనలందుకోవడం ఓ మరపురాని ఘట్టం. అయితే నా కిచ్చిన సమయం కన్నా ఎక్కువ తీసికొని నేనాపని చేసినా, అక్కడున్న గురువులు నన్ను ప్రోత్సహించి వెన్నుతట్టారు. నిజానికి రీసెర్స్ స్కాలర్గా నా పాత్ర సంక్షిప్త నివేదిక రాసి, చదవడమే ! కానీ, నేను దాన్ని సమీక్షలా మలిచి, మరో 'పత్రసమర్పణ' లా చేసానని ప్రశంసలందుకున్నాను మిత్రుల ద్వారా. ప్రొ.మాడభూషి గోపాలాచార్య ఆధ్వర్యంలో నిర్వహించిన మరో అంతర్జాతీయ సదస్సు 2012 లో "మల్టీ కల్చరలిజమ్, ఆరిజిన్ అండ్ డెవలప్మెంట్". ఈ సదస్సులోనూ, మిగతా అధ్యాపకులతో కలిసి, ఓ రీసెర్చ్ స్కాలర్గా తెలంగాణ అస్తిత్వవాదాన్ని జోడించి మన్ననలందుకున్నాను. ఒక రీసెర్చ్ స్కాలర్గా, అధ్యాపకురాలిగా నా పాత్రను పోషిస్తూనే కవితలు, కథలు, వ్యాసాలు వ్రాయడం ద్వారా ఓ రచయిత్రిగా జనంలోకి వెళ్ళగలిగాను. ఎక్కడ కవి సమ్మేళనాలయినా పాల్గొనేదాన్ని. ఆ విధంగా తెలంగాణ

రాష్ట్ర ఏర్పాటుకు సాగతీతగా, ఓ దుష్ట పన్నాగం లో భాగంగా, 'శ్రీకృష్ణ కమిటీ' ని కేంద్రం ఏర్పాటు చేసినప్పుడు, నిరాశా నిస్పృహలకు లోనయి, ఆత్మ బలిదానాలు చేసుకుంటున్న యువతను చూసి ఆవేదనతో, ఆక్రోశంతో రాసిన కవిత 'మైండ్‌గేమ్'.

బతుకమ్మ పండుగ ఇవాళ రాష్ట్ర పండుగ అయింది. కానీ, ఉద్యమంలో వువ్వెత్తున ఎగిసిన కడలి తరంగమై వూరూ, వాడా, చిన్నా, పెద్దా, పేద, ధనిక, ఆడ, మగా తేడా లేకుండా ఒక్కతాటిపై నిలిపి తెలంగాణ సంఘటిత పోరాట పటిమను చాటిందీ బతుకమ్మ పండుగ. అందుకే ఓ కవి సమ్మేళనంలో ఇలా నినదించాను. కాలేజీలోనే ఖాళీ క్లాస్‌రూంలో కూర్చుని అరగంటలో ఈ కవిత రాసాను. ఈ కవితను రాష్ట్ర ఏర్పాటు తర్వాత 'వంద కవుల తెలంగానం' లో వినిపిస్తే వారు 'యూట్యూబ్' లో పొందుపర్చారు.

ఉద్యమంలో ప్రధానంగా నీళ్ళూ, నిధులూ, నియామకాలు అంశాల్లో జరిగిన అన్యాయాన్ని ఎలుగెత్తి చాటారు మేధావులు. ఇది ఒక ఉద్యమ సందేశంగా, సంకేతంగా, నినాదంగా ప్రజల్లోకి వెళ్ళింది. ఆ విధంగా చెరువులు మాయమవడం గూర్చి ఈ కవిత రాశాను.

ఒకప్పటి గ్రామీణ తెలంగాణకు అద్దం పట్టే 'మా వూరి చెరువు' కవిత మా వూళ్ళోని చెరువు కళ్ళముందు సాక్షాత్కరిస్తే రాశాను.

ఎన్నో ఏళ్ళుగా కళ్ళలో వత్తులేసుకుని ఎదురు చూసిన ఆ శుభదినం ఎట్టకేలకు రానే వచ్చింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ప్రకటన వెలువడింది. తెలంగాణ ఆవిర్భావ ఆ ఆనందాతిరేకాన్ని ప్రతిఫలించింది.

'ఇళ్ళన్నీ ఉప్పెనలై
ఎగిసిపడు జనసందోహం తీర్పుగా
గులాబీవనాలే నమస్తే తెలంగాణంటూ
పట్టాభిషిక్తమైన కోటి రతనాల వీణ
నా నవోన్నత తెలంగాణ!, అనే కవితలో

ఛిన్నా భిన్నమైన రాష్ట్రాన్ని సుదరాయించడం అంత తేలికైన పని కాదు. అయితే సమయం తీసుకున్నా గానీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో వుంచుకొని తదనుగుణంగా పని చేయాల్సిన అవసరముంది.

విద్యారంగంలో విజ్ఞానం, ప్రతిభ, నైపుణ్యాలు లోపిస్తే విద్యను బోధించే ఉపాధ్యాయులు, అధ్యాపకులే జ్ఞానరహితులైతే ముందు తరాలు చాలా నష్టపోతాయి.

అత్యున్నత విద్యనభ్యసించి, ప్రభుత్వ కొలువులు ఎండమావులై, పనిచేసే ప్రైవేటు కాలేజీలు, సంస్థలు మూతపడితే నిరుద్యోగిత కమ్ముకోగా, నిరాశగా అభద్రతా భావంతో వున్న సరస్వతీ పుత్రులు, పుత్రికల జ్ఞాన సంపదను ప్రభుత్వం సరియైన విధంగా వుపయోగించుకోవాలి. ఈ ఆధునిక సమాజంలో విద్యావంతులైన స్త్రీలకు ఆర్థిక ఆలంబన అనేది ఆయువుపట్టు. అలాంటి సమాజాకాశంలో సగభాగమైన స్త్రీలకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో 50% రిజర్వేషన్లు అమలు చేసి సమాజ ఉత్పాదకతలో వారి సేవలను ఉపయోగించుకోవాలి.

ఇక మన రాష్ట్రం బంగారు తెలంగాణ గా మారాలంటే ఒక మామూలు మహిళగా నేను 'నా కలల తెలంగాణ' అనే కవితలో కొన్ని అంశాలు ప్రతిపాదించాను. తప్పకుండా అలాంటి అభివృద్ధిని సాధిస్తుంది అన్న నమ్మకంతో ప్రజలంతా ఎదురుచూస్తున్నారు. ఎందుకంటే తెలంగాణ ప్రజలు ఆశావాదులు.

అయితే ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఉడతా భక్తిగా నెరపిన నా యీ పాత్ర నాకు సంతృప్తి నిచ్చినప్పటికీ, రాష్ట్రంకోసం అశువులు బాసిన అమరవీరుల త్యాగం ముందు ఇది చంద్రునికో నూలు పోగులాంటిదే అన్పిస్తుంది.

* * *

పరిశోధన గ్రంథాలు రాసిన



డా.సుజాత అడువాల

నేను కూర్చిన అపురూపమైన పుస్తకం బతుకమ్మ పాటలు. తెలంగాణ ప్రాంత అస్తిత్వాన్ని తెలియజేసే పండుగ బతుకమ్మ పండుగ. మన దేశంలోని అన్ని రాష్ట్రాలను పరిశీలించినప్పుడు కొన్ని చోట్ల మాత్రమే కొన్ని ప్రత్యేక పండుగలు, సంప్రదాయాలు కానవస్తుంటాయి. అవి ఆ ప్రాంత ప్రత్యేకతలను చాటి చెప్పేవిగా ఉంటాయి. అట్లే తెలంగాణ ప్రాంత ఉనికిని తెలియజేస్తూ మాది అని గర్వంగా చెప్పుకునే తెలంగాణ ఆడబిడ్డల ప్రత్యేక సంప్రదాయం బతుకమ్మ పండుగ. దీనిని బొడ్డెమ్మ పండుగ, బతుకమ్మ పండుగగా జరుపుకుంటారు.

నాకు చిన్నప్పటి నుండి పాటలంటే ఇష్టం. అందులో జానపద గేయాలు. బతుకమ్మ పాటలంటే మరీ ఇష్టం. అయితే బతుకమ్మ పండుగ ప్రతియేటా చేసుకుంటున్నాం. కానీ, పెద్దవాళ్ళు పాడిన మంచి మంచి పాటలైతే రాను రాను మరుగైపోతున్నవి. మరి ఆ లోటును ఎట్లా తీర్చాలి. ఏం చేయాలి అని అనిపించింది. మా నానమ్మ, అమ్మమ్మ, మేనత్తలు, చిన్న నానమ్మలు, మా ముత్తవ్వ పాడిన పాటలు ఎంతో అద్భుతంగా అనిపించేవి. ఆ పాటలన్నీ వాళ్ళతో పాటే అంతరించగూడదు. ముందు తరాలకు అందించాలి. వాటిని బ్రతికించాలి. ఆ పాటలను పుస్తకరూపంలో తేవాలని వాటికి సాహిత్యంలో ఒక శాశ్వత స్థానం కల్పించాలనే ఆలోచన నాకు ఎన్నో ఏండ్లుగా ఉన్నది. కానీ దానికి కార్యరూపం కలగడానికి ఇప్పుడు బలమొచ్చింది. నేను చిన్నప్పటినుంచీ సేకరించిన పాటలు. మాకు తెలిసిన వాళ్ళు వాళ్ళ బంధువుల ద్వారా సేకరించిన పాటలన్నింటినీ కలిపి ఒక సంకలనంగా వేయిస్తున్నాను.

ఈ పాటలు తెలంగాణలోని ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క విధంగా ఉంటాయి. కొన్ని మార్పులకు లోనవుతూ, కొంత కొత్తదనాన్ని సంతరించుకుంటూ నిత్యనూతనంగా కనిపిస్తాయి. దాదాపుగా ఇవే పాటలు అనేక ప్రాంతాల్లో బతుకమ్మ పండుగకు పాడుకుంటూ ఉంటారు.

ఈ పాటలకు ప్రత్యేకించి రచయిత, కవి, కవయిత్రి ఉండరు. అజ్ఞాత కర్తృత్వంగా ఉంటాయి. ఎవరు ఎప్పుడు ఎక్కడ పాడారో స్పష్టంగా చెప్పలేం కానీ అవి అందరికీ ఆరాధనీయమైన పాటలు. తెలంగాణ ప్రాంతంలో పుట్టిన ఆడబిడ్డల అందరి సొత్తు ఈ పాటలు.

తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న శుభసందర్భంలో బతుకమ్మ పండుగకు ఈ పుస్తకం వెలువడడం ఇక్కడి సంస్కృతి సంప్రదాయాలను బతికించుకునే ప్రయత్నంగా భావిస్తున్నాను.

పాటలకు ముందు బొడ్డెమ్మ, బతుకమ్మలు అంటే ?

బతుకమ్మ పుట్టుపూర్వోత్తరాలు ఏమిటి?

బతుకమ్మను గురించిన పౌరాణిక గాథలున్నాయా?

బతుకమ్మ శ్రీ చక్రానికి ప్రతిరూపమా?

బతుకమ్మ పండుగలో శాస్త్రీయత?

ఎంగిలిపూల బతుకమ్మ - సద్దుల బతుకమ్మ అంటే?

వీటి వివరణలు తెలిపే ప్రయత్నం చేశాను.

బతుకమ్మ పండుగ ప్రాశస్త్యాన్ని తెలియజేసే అనేక పాటలు ఇందులో చేర్చాను.

ఈ పాటలు తెలంగాణ ప్రాంత ప్రజల మనోభావాలను, అమాయకతను, నిర్భీతిని, శ్రమైక జీవనంలోని ఆనందాన్ని తెలియజేస్తాయి. తెలంగాణ ప్రజల వీరత్వానికి, త్యాగాలకు ప్రతిరూపం ఈ ఆటపాటల పండుగ. ఈ పండుగ సారాంశం ఒక్కటే. అందరి బతుకులు బాగుండాలి. అందరూ బ్రతకాలి. అందరూ ఆనందంగా జీవించాలి అనే ఆదర్శం ఈ పండుగ లక్ష్యం.

అందర్నీ చల్లగా బతుకమని కోరుతూ, ప్రకృతిలోని నీటిని శుభ్రపరుస్తూ సమస్త జీవులకూ బతుకునిచ్చే గొప్ప గుణం కల్గిన బతుకమ్మ దీవెనలతో బతుకుదాం. మన సంప్రదాయాల్ని మనం బ్రతికించుకుందాం. తరతరాలకు మన ఆచారాలను చాటి చెప్పుదాం.

నీనోము నికిత్తునే గౌరమ్మ
నానోము ఫలమివ్వవే గౌరమ్మ

పసుపు కుంకుమతోటి గౌరమ్మ

చల్లంగ మము జూడవే గౌరమ్మ.........

ఈ విధంగా తెలంగాణ ఉద్యమ కాలంలో తెలంగాణ ఉద్యమ నేపథ్యంగా వచ్చిన తెలంగాణ పోరాట నవలల్లో స్త్రీ, డా.పి.యశోదారెడ్డి కథలు సమగ్ర–పరిశీలన, బతుకమ్మ పాటలు అనే మూడు గ్రంథాలను వెలువరించడం నా అదృష్టంగా భావిస్తున్నాను.

ఈ క్రమంలో రచయిత్రిగా, కవయిత్రిగా నా వంతు కర్తవ్యాన్ని కొంత నెరవేర్చాననీ అనుకుంటున్నాను. ఈ మూడు గ్రంథాలలో రెండు పరిశోధనా గ్రంథాలే. మూడవది నాకు ఇష్టమైన బతుకమ్మ పూల –స్త్రీల పండుగను గురించి తెలిపే పాటలు, ఇతివృత్తం, పండుగ జరుపుకునే పద్ధతిని తెలిపే పుస్తకం. ఈ పుస్తకం మన సంస్కృతిని బతికించే దర్పణం.

ఇవే కాకుండా తెలంగాణ ఉద్యమంలో భాగంగా స్వచ్ఛందంగా సకలజనుల సమ్మె, రోడ్లపై వంటా వార్పు నిర్వహించాము. విద్యార్థుల ఆత్మహత్యలకు నిరసనగా కవితలూ, వ్యాసాలూ రాశాము. అనేక సందర్భాలలో జరిగే ప్రతి కవి సమ్మేళనాలలో తెలంగాణ పొద్దు పొడుపు కావాలి, రావాలి అనే ఆకాంక్ష తెలియజేస్తూ ఎన్నో కవితలు రాశాము. తెలంగాణ వస్తేనే కొత్త ఉగాది. యుగాది అనుకున్నం. నూతన ఆంగ్ల సంవత్సరమైనా, సంక్రాంతి అయినా ఏ పండుగైనా తెలంగాణ స్వతంత్ర్యంగా ప్రకటించిన రోజే అని భావించాం. ఆ ప్రయత్నంలో శాతవాహన విశ్వవిద్యాలయ విద్యార్థులతో, పాఠశాల, కళాశాల స్థాయి విద్యార్థులందరితో కలిసి ధర్నాలు, బంద్‌లు చేశాము. ఆట, పాటలతో ధూం–ధాం నిర్వహించాము.

“తెలంగాణ ప్రాంతంలోని అలభ్యశాసనాలు సాహిత్యం” అనే అంశంపై శాతవాహన విశ్వవిద్యాలయంలో జాతీయస్థాయిలో సెమినార్ నిర్వహించాము.

తెలంగాణ ప్రాంతంలోని మరుగున పడి ఉన్న శాసనాలను, అజ్ఞాతంగా ఉన్న గొప్ప కవులు, రచయితలను బ్రతికించే విధంగా ఇదొక ప్రయత్నం.

తెలంగాణలో పుట్టిన ఒక కథకుడు పెద్దింటి అశోక్ కుమార్. కానీ అతని ప్రతిభ జాతీయ స్థాయి నందుకున్నది. అశోకన్నతో తెలంగాణ భాష, యాసల కథావర్క్‌షాప్‌లను పెట్టించాము. ఈ కార్యక్రమం విద్యార్థులకు ఎంతో స్ఫూర్తినిచ్చింది. విద్యార్థులు ఆత్యహత్యలు చేసుకోరాదని 'జెర ఇను బిడ్డా' అనే కవిత రాసాను.

ముఖ్యంగా కరీంనగర్ జిల్లాలో రుద్రంగి, కోరుట్ల, జగిత్యాల, మెట్‌పల్లి ప్రాంతాలలో దుబాయ్, మస్కట్ వలసల బ్రతుకులు ఎక్కువ. ఆ ప్రాంతాలలో పర్యటించి, వలస బ్రతుకు చిత్రాలపై వ్యాసాలు రాసినాము. శాతవాహన విశ్వవిద్యాలయం విద్యార్థులను సాహితీ విజ్ఞాన యాత్రకు తీస్కపోయినం.

పాల్కురి సోమన స్వంతగడ్డ - పాలకుర్తి (ర్కి), బమ్మెర, ఐలోని, బొమ్మలమ్మగుట్ట, నగునూరు, కోటిలింగాల మొదలైన ప్రాంతాల్లో ఉన్న మన సంస్కృతిని, సంపదను, చారిత్రక ఘనతను విద్యార్థులకు వివరించాము.

తెలంగాణ ఉద్యమంలో భాగంగా రచయిత్రిగా నా వంతు కర్తవ్యాన్ని నేను నిర్వహించాను. నిర్వహిస్తూనే ఉంటాను. బంగారు తెలంగాణ భవిత కోసం మా కృషి ఎప్పటికి కొనసాగుతూనే ఉంటుంది. స్త్రీలు తలచుకుంటే అసాధ్యమైన పనిని సుసాధ్యం చేసి చూపించగలరు. ఆ బాటలో రచయిత్రులంతా ఉండాలి. ఉంటాము.

* * *

విద్యార్థులను ఉద్యమ బాట పట్టించిన



డా.బండారు సుజాత

సుమారు అరవై సంవత్సరాలనుండి తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమాలలో పురుషులతో పాటు స్త్రీలు కూడా పాల్గొన్నారు. మన భాష, యాసలను పక్కన పెట్టి ఇతర భాషలను నేర్చుకోవలసి వచ్చింది. పాలకవర్గ నిర్ణయాలకు అనుగుణంగా తెలంగాణ మారుతూనే ఉంది. ఉర్దూను నేర్చుకోవడమే కాదు రామాయణ, భారతాలను కూడా ఉర్దూలోనే చదువుకోవలసి వచ్చింది. అనేక కష్ట, నష్టాలకు ఓర్చుకుంటూనే ఎప్పటికప్పుడు తమకు స్వాతంత్ర్యం కావాలని కోరుతూనే వున్నారు. కాని అది నెరవేరటం లేదు. ఆ అసంతృప్తి ఆనాటి పెద్దలలో రాజుకుంటూనే వుంది.

స్వాతంత్ర్యానంతరం రజాకార్ల దుశ్చర్యలకు బలైంది తెలంగాణ. మలిదశ ఉద్యమం 1969 లో మొదలైంది. ఈ ఉద్యమంలో అనేక మంది విద్యార్థులు, ప్రజలు ప్రాణాలను అర్పించారు. అయినా ఒప్పందాలతొ వెనుకకుపోయింది.

తెలంగాణ ప్రజాసమితి నాయకులు తెలంగాణ ఏర్పాటుకు కృషి చేస్తామని గెలిచి కాంగ్రెసులో చేరారు. మన నాయకులు మంత్రి పదవులకాశించి 'తెలంగాణ' ను వదిలిపెట్టడం జరిగింది. ఎప్పటికప్పుడు ముందుకొస్తూ ఉద్యమం వెనక్కి తగ్గుతూనే వుంది. ఇది ప్రతి ఒక్కరికి బాధ కలిగించే విషయం. మన గురించి మనం తెలుసుకున్నప్పుడు మన నాయకుల చేతుల్లో తెలంగాణ ఉద్యమం ఎలా తెలవారిపోతుందో అర్థమయినా, స్వార్థం మనిషిని ఎంత వరకైనా తీసుకువెల్తుంది అనిపిస్తుంది. అలాంటి సమయంలో తెలంగాణ రాష్ట్రసమితి పేరుతో కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు ఉద్యమం ప్రారంభించారు.

అప్పుడు నేను సంగెం మండలం లో పని చేస్తున్నాను. మా పాఠశాల ఆవరణకు దగ్గరలోనే చంద్రశేఖర్ రావు గారి బహిరంగ సభ. అప్పటికే అనేక సభలలో మాట్లాడిన విషయాలను వింటున్నాం కనుక కొంత ఆశ తెలంగాణ వాదులలో చిగురించింది. ఆ సభకు వెళ్ళే వాళ్ళను చూసినప్పుడు, మాట్లాడినప్పుడు

ఈసారైనా తెలంగాణ వస్తే బాగుండు అనుకునేదాన్ని. మన భాష, యాసలలో మాట్లాడుతూ ప్రజల్లో ఉత్సాహం కల్పించే విధానం చూస్తే ఏ విధంగానైనా తెలంగాణ తేవడానికి వెనుకాడరు అనిపించింది.

పార్టీలను నమ్మి ఎన్నికల్లో పెట్టుకున్న పొత్తులతో జరిగిన పరిణామాలతో బాధపడేవాళ్లం. చంద్రశేఖర్ రావు గారి నిరాహార దీక్షతో ఉద్యమం ఊపందుకుంది. ఇటువంటి నాయకుడికి ఏమైనా అయితే ఇక మన గతి ఇంతే అన్న ఆలోచన కలిగేది. ఉద్యమం విద్యార్థులు, ప్రజల చేతుల్లోకి వెళ్ళిన తరువాత ఏ విధంగా నైనా తెలంగాణ వస్తుంది అన్న ఆలోచన బలపడింది.

ఒక ఉపాధ్యాయురాలుగా ప్రతిరోజు ఉద్యమ నేపథ్యాన్ని విద్యార్థులకు వివరించడం. పత్రికలను చదివించడం చేసేదాన్ని. ఉద్యమకారులు, ప్రజలు జరిపే నిరాహార దీక్షలకు, వంటావార్పులు చేసేవాళ్ళ దగ్గరకు వెళ్ళి సంఘీభావం తెలిపేవాళ్ళం. ఉద్యమ నేతలు పాఠశాలకు వచ్చి బందు పాటించమన్నప్పుడు తప్పకుండ వారి మాటలు వినేవాళ్ళం. విద్యార్థులను ర్యాలీగా తీసుకువెళ్ళి వాళ్ళు చెప్పే మాటలు వినిపించేవాళ్ళం. విద్యార్థులను పంపించి పాఠశాలలో ఉపాధ్యాయులమంతా ఉండేవాళ్ళం ఆనాటి విషయాలను చర్చించేవాల్లం.

ఉద్యమం ఊపందుకున్న ఈ సమయంలో నేను వరంగల్ జిల్లాలోని పెద్ద పెండ్యాల హైస్కూల్లో పని చేస్తున్నాను. అక్కడి ఉద్యమ నాయకులు P. గంగాధర్ రెడ్డి, ఏలియ, ఆరోగ్యం మొదలైన వారు తరచు పాఠశాలకు వస్తూ పిల్లలకు తెలంగాణ గురించి చెప్పమని చెప్పేవారు. మా చిన్నప్పటి నుండి తెలంగాణ ఉద్యమాన్ని చూస్తు పెరిగినం ఇక తెలంగాణ వచ్చినా రాకున్న ఇక మనది తెలంగాణ రాష్ట్రమేనంటూ పెద్దపెండ్యాల, తెలంగాణ రాష్ట్రం అని బస్టాండు గోడలపై రాయించారు. అంతే కాకుండా పాఠ్య పుస్తకాలలో వున్న "మా తెలుగు తల్లి" గేయాన్ని చింపి వేయడానికి తరగతి గదిలోనికి వచ్చినప్పుడు మీరు పెద్దవారు మిమ్మల్ని ఏమి అనలేము కాని, పిల్లల పుస్తకాలు పాడవుతాయి ఇంకా పరీక్షలు చాలా రోజులున్నాయంటూ, పిల్లలే ఆ పేపరు చింపివేస్తారు అన్నప్పుడు మీరు మాకు అడ్డురావద్దని, ఎవరి పాటలో మనం పాడుకోవద్దని, తెలంగాణ వచ్చినంకనే మన చదువులంటూ అందరి పుస్తకాలలో మా తెలుగుతల్లి పేపరు చింపివేశారు. అంతేకాదు మీకు తెలంగాణ రావాలని లేదా? అనడంతో ఉపాధ్యాయులమంతా ఏమీ మాట్లాడలేకపోయాము.

ఇటువంటి సంఘటనలు ఏదో ఒకటి జరుగుతూ వుండేవి. తెలంగాణ రావడం అందరికీ ఇష్టమే కాని ప్రభుత్వ ఉద్యోగులుగా మాకు కొన్ని పరిధులు ఉన్నాయంటు తెలిపేవాల్లం. విద్యార్థులకు ఉద్యమ పాటలేకాక, ఉద్యమాన్ని గురించి

తెలుపుతూ 'జయజయహే' తెలంగాణ గేయాన్ని నేర్పించి ప్రార్థనలో పాడించేవాళ్లం. ఈ గేయాన్ని పిల్లలు ఉత్సాహంగా నేర్చుకొని పాడటం మాకు చాల ఆనందమైంది.

ములుగు నియోజిక వర్గం రాయిని గూడెంలో అప్పటి ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన సభకు విద్యార్థులను, యువకులను రాకుండా పోలీసు బలగాలను మోహరించగా సామాన్య స్త్రీలలా వెళ్ళి 'జై తెలంగాణ' అంటు నినాదాలిచ్చి ముఖ్యమంత్రికి ముచ్చెమటలు పట్టించిన విద్యార్థులు కృష్ణలత, కవిత, జ్యోతి, సావిత్రిల సాహసం ఒక అబ్బురం. వారు అలా చేయటం మాకు చాలా సంతోషమైంది. అలాంటి తెగువ అందరికి ఉండదు కాని వారిని అందరు మెచ్చుకుంటుంటే విద్యార్థులు ఏదో ఒకటి చేయాలనుకుంటారు కనుక వారిని గూర్చి విడమర్చి చెప్పి అటువంటి సాహసాలు చేయవద్దని చేప్పేవాళ్లం.

ధనిక, పేద తేడా లేకుండా అన్ని వృత్తులవారు, అన్నివర్గాల వారు క్రొవ్వత్తులతో తమ ఆకాంక్షను తెలియచేయడం ఒక మరుపురాని ఘట్టం. బతుకమ్మ, బోనాలు, వంటావార్పుల సందడితో ఉత్సాహంగా పాల్గొనేవాళ్లం.

సకలజనుల సమ్మెలో పాల్గొన్నాము. ఉపాధ్యాయుల పిలుపు మేరకు ర్యాలీలో పాల్గొంటూ అమరవీరుల మైదానం వరకు వెళ్ళి సంఘీభావం తెలిపేవాళ్ళం. ఎక్కువ విద్యార్థులతోనే వుంటూ వారికి అవగాహన, స్ఫూర్తిని కలిగించేవాళ్లం. సకలజనుల సమ్మె రోజు రోజుకు పెరుగుతున్నప్పుడు ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోననుకునేవాళ్లం. ప్రజలు, నాయకులు తెలంగాణ కోసం పోరాడే విధానాన్ని చూస్తూ బాధపడేవాళ్లం.

అమరులవుతున్న వారిని చూసి కలత చెందడమే కాదు అటువంటి పనులు చేయవద్దని తెలిపేవాళ్ళం. పిల్లలు దూరమైతే తల్లి పడే వేదనను కవితలు, పాటలుగా రాసి పిల్లలతో పాడించేవాళ్లం. తెలంగాణ పాటలన్నీ ఒక స్ఫూర్తి గేయాలు అవి చిన్నవాళ్ళ నుండి పెద్దవాళ్ళ వరకు ఆకట్టుకునేవి, ఉత్తేజపరిచేవి.

ఉద్యమస్ఫూర్తితో రగిలే వరంగల్ లో పుట్టడం నా అదృష్టం. ఇక్కడ పుట్టిన ఏ ఒక్కరు కూడా వెనకడుగు వేయకుండ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. అటువంటి చరిత్రను కళ్ళారా చూసి పాల్గొనడం నాకెంతో గర్వకారణం. పాఠ్యపుస్తకాలలో వున్న ఉద్యమ చరిత్రను విద్యార్థులకు అర్థమయ్యేలా వివరిస్తూ విలువైన విద్యను అందిస్తూ ఒక చక్కని సమాజం ఏర్పడేందుకు కావలసిన 'విలువలు' గల విద్యను అందిస్తూ విద్యార్థులను ఉన్నతులుగా, మంచి వ్యక్తులుగా సమాజానికి అందించాలన్నదే తెలంగాణ బిడ్డగా నా ఆకాంక్ష.

* * *

ఓరుగల్లు కవితలను ఏకం చేసిన



డా. కందాల శోభారాణి

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రసాధన కోసం నాకు తోచిన విధంగా కృషి చేశాను. సకలజనుల సమ్మెలో పాల్గొన్నాను. దీక్షా శిబిరాలను ప్రారంభించాను. కొవ్వొత్తుల ర్యాలీలు, వంటావార్పు, నల్లరిబ్బన్లు మూతికి కట్టుకొని మౌన ప్రదర్శనలు, మానవహారాలు మొదలగు ఎన్నో నిరసన కార్యక్రమాలలో పాల్గొన్నాను. కవులు, కళాకారులు, ప్రజాసంఘాల మిత్రులు ఇంకా ఎందరమో రోజూ బృందంగా ఏర్పడి తెలంగాణ పాటలు పాడటం, తెలంగాణ అంశం మీద కవితలు చదవటం మొదలైన కార్యక్రమాల ద్వారా ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను వ్యక్తపర్చాము. ఇవే కాకుండా సాహిత్యపరమైన కృషి కూడా జరిగింది.

వరంగల్ లో ఉన్న అన్ని సాహిత్య సంస్థలు ఏకమై వరంగల్లు రచయితల ఐక్యవేదిక ఏర్పాటు చేశాము. దీనికి నేను కొ కన్వీనర్‌గా తెలంగాణ రాష్ట్రసాధన కోసం జరిగే కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ కవితలు, వ్యాసాలు వ్రాశాను.

తెలంగాణకి సంబంధించిన అంశాల్లో నేను వ్రాసిన కవితలు – 21, వ్యాసాలు – 02. ప్రస్తుతం కవితలు లభించినవి పదిహేను మాత్రమే. వ్యాసాలు రెండు లభించాయి.

తెలంగాణ కోసం వ్రాసిన మొదటి వ్యాసం "తెలంగాణ సంస్కృతి – అసమానతలు". ఇది ఆంధ్రప్రభ పత్రిక (2007 ఫిబ్రవరి) లో ప్రచురించబడింది. రెండవ వ్యాసం "బతుకమ్మ పండుగ – చారిత్రక నేపథ్యం". ఇది తెలంగాణ జంగ్ పత్రిక 2010 లో ముద్రించబడింది.

అర్థశాస్త్ర విభాగం కాకతీయ విశ్వవిద్యాలయం వరంగల్ 2006 మే నెలలో "స్టేట్ లెవెల్ సెమినార్ ఆన్ రీజినల్ డిస్పారిటీస్ ఇన్ ఆంధ్రప్రదేశ్" అనే అంశం మీద జాతీయ సదస్సు నిర్వహించింది. ఈ సదస్సులో "తెలంగాణ సంస్కృతి – అసమానతలు" అనే అంశం పై పత్ర సమర్పణ చేశాను. ఇందులో తెలంగాణ

ప్రాంత సంస్కృతి భిన్నమైనటువంటిది. అది సమాజ వ్యావసాయిక సంస్కృతిని కలిగి ఉంది. ఈ ప్రాంతంలో అమానవీయమైన వెట్టిచాకిరి ఉంది. ఆరుగాలం కష్టించి పని చేసినా సాధారణ రైతు కష్టాలు, కడగండ్లు తీరనివి. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ప్రాంతంలో జానపద గీతం పుట్టింది. 'ఏటికేతం బెట్టి ఎయిపుట్లు పండించి ఎన్నడూ మెతుకెరుగరన్నా నేను గంజిలో మెతుకెరుగరన్నా' అంటూ తెలంగాణ రైతు దీనంగా పాడుకున్నాడు.

తెలంగాణ ప్రజలు ఇక్కడి పాలకులైన నిజాం సర్కారుకు, రజాకార్లకు, స్థానిక జమీందార్లకు, బడా భూస్వాములకు ఇతర పెత్తందార్లకు వ్యతిరేకంగా, ఇంకోవైపు బ్రిటిష్ పాలకులతో ముప్పేటలా పోరాటం జరుపవలసి వచ్చింది. ఈ కారణంగా తెలంగాణ ప్రాంతంలో అణచివేతను ప్రతిఘటించే పోరాట సంస్కృతి అలవడింది.

తెలంగాణ ప్రాంతం విశిష్ట సంస్కృతిని చాటిచెప్పే వాటిల్లో పండుగలు, ఆచార్య వ్యవహారాలు, భాష మొదలైనవి ముఖ్యమైనవి. పండుగలలో బోనాల పండుగ, రాఖీపండుగ, బతుకమ్మ, దసరా, హోళి, పీర్ల పండుగలు మొదలైనవి ఒక ప్రత్యేకతను సంతరించుకున్నటువంటివి.

ఈ ప్రాంతం స్త్రీలే మొట్టమొదట సామ్రాజ్యనేతలుగా ఉన్నారన్నది రుద్రమ్మ, సమ్మక్క, సారలక్కల చరిత్రను చదివిన వారందరికీ తెలిసిందే. ఈ విధంగా తరతరాలుగా తెలంగాణా ప్రాంతం భిన్నమత, ప్రాంత భాష సంస్కృతులకు కూడలియై సామాజిక, సాంస్కృతిక పోరాటాల ప్రయోగశాలగా ఒక విశిష్టతను సంతరించుకొని ప్రాదేశిక సంస్కృతి వైభవానికి పట్టుకొమ్మగా నిలిచింది.

మరొక వ్యాసం "బతుకమ్మ పండుగ – చారిత్రక నేపథ్యం" అనే అంశం మీద వ్రాశాను. బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రాంతంలో చాలా ప్రాధాన్యత కలిగిన పండుగ. ఈ పండుగ సృష్టికర్తలు కాకతీయ రాజవంశీయులని ప్రతీతి. రాజులు, సామంతులు, భూస్వాములు, వారి కుటుంబీకుల స్త్రీల సంతోషానికై ప్రత్యేక ఏర్పాట్లతో, ఆర్భాటాలతో ఈ పండుగలు నిర్వహించేవారు.

నిజాం సంస్థానానికి రాజధానిగా ఉన్న హైదరాబాద్‌లో ఈ పండుగ చాలా గొప్పగా రాజలాంఛనాలతో జరిగేది. గ్రామీణ ప్రాంతాల నుండి కొందరు భూస్వాములు పని గట్టుకొని ఈ పండుగ చూడటానికి హైదరాబాద్ వచ్చేవారు. హైదరాబాద్‌లోని ముస్లిం స్త్రీలు నవాబుల కుటుంబాలతో సహా బతుకమ్మలను

చూడటానికి హుస్సేన్‌సాగర్, గండిపేట చెరువుల దగ్గరికి మేనాలతో, కచ్చడాలతో వచ్చేవారని చెప్పుకునేవారు.

ఈ పండుగకు తిరుగుబాటు చరిత్రకూడా ఉంది. పూర్వం రాజ కుటుంబీకులు, దేశ్‌ముఖ్‌లు, రెడ్లు, భూస్వాములు, కరణాల కుటుంబాలు పెద్దదొర గడీల ముందు బతుకమ్మలు పెట్టి ఆడేవారు. అయ్యవార్లు సాతానివాళ్ళు, వైశ్యులు మొదలైన కుటుంబాల స్త్రీలు దొరల ఇండ్లలో బతుకమ్మను పేర్చటం, ఫలహారాలు చేయటం, సద్దుల వంటలు వంతుల వారిగా చేయవలసి వచ్చేది. ఆయా కుటుంబాలకు చెందిన స్త్రీలకు బాధగా ఉండేది. ఫలితంగా బతుకమ్మ పండుగను తాము కూడా స్వతంత్రంగా ఆనందంగా చేసుకోవాలన్న ఆకాంక్ష వారిలో ప్రబలింది. ఈ వెట్టి నుండి విముక్తికై ఆనాటి స్త్రీల ప్రయత్నం భూస్వామ్య సంస్కృతి పట్ల నిరసనకు ఇక్కడే బీజం పడిందని చెప్పవచ్చు.

బతుకమ్మ పండుగ సాంస్కృతిక ఉద్యమంగా రూపొందింది. ఫలితంగా తెలంగాణ ప్రాంతంలో గ్రామరాజ్యాలు, గ్రామ కమిటీలు, రైతాంగ పోరాట విముక్తి గ్రామాల ఏర్పాటు ఇలా అనేకాంశాలు చోటు చేసుకున్నాయి. గడీల బతుకమ్మ సామాన్యుల చేతిలోకి వచ్చింది. ఇలాంటి అనేకాంశాలను ప్రస్తావించాను.

ఇక కవితల విషయానికొస్తె మొదటి కవిత "కోట్ల కత్తుల్ని పదును బెడ్తున్న నెత్తుటిసాన" అనే శీర్షికతో ఆంధ్రజ్యోతి 2006 మార్చిలో ప్రచురించబడింది. తెలంగాణకు పారాల్సిన నీటిని ఆంధ్రా పాలకులు అటువైపు మళ్ళించుకొని మెర్క్యురీ వెలుగుల్లో, కంపెనీల కాంతుల్లో హాయిగా జీవిస్తున్నారు. తెలంగాణ ప్రజలు మాత్రం చాలీచాలని కరెంట్‌తో మోటర్లు కాలిపోయి అరకొర పంటలతో బుగ్గిపాలవున్నారు. ఎర్రిబాగుల వేశాలు మానుకొని తిరగబడి తెలంగాణ సాధించుకోవాలని ఈ కవితలో వివరించడం అయింది.

నిర్జల తెలంగాణలో భూమి పగుళ్ళతో నీళ్ళకోసం నిశ్శబ్దంగా రోదిస్తుంది. తెలంగాణ రాష్ట్రసాధన కల ఫలించాలని చినుకే బంగారమైన నేలలో మెతుకు వైభోగం కావాలని కోరుకున్నాను. తెలంగాణ ప్రజలు బరువెక్కిన బతుకులతో తడబడని అడుగుల సవ్వడితో కవాతు చేస్తున్నారు. కోట్ల హృదయస్పందనలు ఒక్కటిగా కదులుతూ తెలంగాణ సాధిస్తామంటూ తెలంగాణ ప్రజలు ముందుకొచ్చారని "ఫలించని కలల ఒడిలో తెలంగాణ బీడుమడి" అనే శీర్షికతో వ్రాసిన కవితలో తెల్పాను.

ఉగాది సందర్భంగా 2012 లో వేయిస్తంభాల గుడిలో కవి సమ్మేళనం జరిగింది. అప్పుడు నేను చదివిన కవితలో వసంతం కోసం కోకిల రిహార్సల్ చేస్తుందని, కొమ్మలు చిగురించనే లేదు కోకిల ఎలా కూస్తుంది, కోకిల కూయాలంటే తెలంగాణ రాష్ట్రం రావాలని అన్నాను. తెలంగాణ కోసం ప్రజలు తపించే వార్తలకు విలువ ఎక్కువ ఇవ్వటం లేదు. కాని తారల క్రికెట్ షోలకు మాత్రం విలువ ఇస్తున్నారని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి ఎప్పుడూ చెప్పే మాటలు చెప్పి మభ్యపెట్టొద్దని అసలు మాట చెప్పాలని "గొంతు మార్చుకొని వస్తే నీకు సాదర స్వాగతం" అని ఈ కవితలో ప్రస్తావించాను.

2013 లో కూడా ఉగాది సందర్భంగా కవిసమ్మేళనంలో పాల్గొన్నప్పుడు వ్రాసిన కవిత శీర్షిక "పచ్చని బ్రతుకై కొనసాగినపుడే". కనిపించకుండా కుట్రలు చేయడం పెట్టుబడిదారీకి తెల్సిన విద్య. ఎంతో వ్యూహంతో మార్కెట్‌ను విస్తరింపచేస్తాడు. సకల సంపదలను కొల్లగొట్టడం రియల్ ఎస్టేట్ వ్యాపారంతో ప్రజల్ని దోచుకోవటం గురించి తెల్పాను. తెలంగాణలో ఊళ్ళకు ఊళ్ళు ఎడారిగా మారుతున్నాయి. బతుకు తండ్లాటలో ఉరిపోసుకుని చనిపోయిన మంది అనేకంగా కనిపిస్తారు. ఏ మాత్రం దోపిడి మారలేదు. ఇతరేతర వేషాలతో కొనసాగుతూనే ఉంది. మన భవిష్యత్తు బాగుపడాలంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావాలి. పొడుస్తున్న పొద్దు కావాలి అన్నాను.

"తెగువ చూపి నడుద్దాం తెలంగాణ సాధిద్దాం" కవితను వరంగల్లు రచయితల ఐక్యవేదిక వరంగల్లు వారి "తెలంగాణ ఉరుములు – మెరుపులు ప్రజా ఉద్యమ కవిత" అనే పుస్తకం 2010 లో ప్రచురింపబడింది.

'తెలంగాణ ఉద్యమం బతుకు పోరాటం

ఐలమ్మ రంగవల్లి స్నేహలతల

సమ్మక్క సారలక్క ధిక్కార సంస్కృతిని పుణికి పుచ్చుకొని

కదం తొక్కిన తెలంగాణ

మహిళల పోరుకు స్థానమెక్కడ ?' అంటూ తెలంగాణ పోరులో మహిళలకుండే స్థానం గురించి ప్రశ్నించటం జరిగింది.

హామీలు, వాయిదాలతో సద్దుమణిగి ఉండొద్దు. రాజకీయ పార్టీలు చూపే ద్వంద్వవైఖరి ప్రకటనలకు మోసపోవద్దని రాష్ట్ర సాధనలోనే ఆత్మ గౌరవం ఉందని తెగువ చూపి పోరాడి – తెలంగాణ సాధిద్దాం అంటూ నినదించాను.

"వారసత్వ యుద్ధభేరి మోగిద్దాం" అనే కవిత "ఊపిరి తల్లిపాల రుణం" అనే కవితా సంకలనం 2011 లో ప్రచురింపబడింది.

'కాకతీయులకు కప్పం నిరాకరించిన

పగిడిద్ద రాజు

సమ్మక్క – సారలమ్మల ధిక్కారం

నిజాం ను ఎదిరించిన కొమురం భీం

---------'

అన్నదమ్ములకు సంబంధించిన భూమి తగాదాల్లో దేశ్‌ముఖ్ జోక్యాన్ని కాదని చెప్పిన బందగీ ధైర్యం, తాను పండించిన పంటలను తానే దక్కించుకోవాలని దొరలకు ఎదురు తిరిగిన సాహసమూర్తి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య మొదలైన పోరాట యోధులను స్మరిస్తూ ఆత్మహత్యలు వద్దని మనకున్న పోరాట చైతన్యంతో పునరంకితమవుతూ నిలబడి కలబడి పోరాటంతోనే తెలంగాణ రాష్ట్రం సాధిద్దాం అంటూ వ్రాశాను.

"మా గుండె చప్పుడు" కవిత "మే 28 యుద్ధగానం" కవితా సంకలనం (మానుకోట కవిత్వం) మే 2011 లో బందగీ ప్రచురణలు వరంగల్లు వారు తీసుకొచ్చారు. తెలంగాణ రాష్ట్రానికి అడ్డుపడుతూ సమైక్యవాదాన్ని వినిపిస్తున్న వై.ఎస్.ఆర్. జగన్ మానుకోట కి వచ్చినపుడు ప్రజలు వ్యతిరేకించారు. అప్పుడు ఆరుగురు తీవ్రమైన గాయాలపాలయ్యారు. జగన్ తన అంగబలంతో, గుండాలతో తెలంగాణ ప్రజల్ని గాయాలపాలు చేసినందుకు, తెలంగాణ రాష్ట్రాన్ని అడ్డుకుంటున్నందుకు నిరసనగా ఈ కవితా సంకలనం తీసుకొచ్చాము.

జగన్ ను ఉద్దేశిస్తూ "మా గుండె చప్పుడు" కవిత వ్రాశాను.

'సమైక్యవాద ముసుగులో

నీ పెట్టుబడి కోసం

నీ ఆధిపత్యం కోసం

అయ్యే వాగ్దానం

మరువక ముందే

నా తెలంగాణ పై

అడుగెలా పెట్టావు ?' అంటూ మానుకోట ప్రాంతానికి భూస్వాములను తరిమికొట్టిన చరిత్ర ఉందని, నాటి నుండి నేటి వరకు స్నేహలత వారసత్వం కొనసాగుతుందన్నాను. సీమాంధ్ర పెట్టుబడి దారులను పొలిమేర వరకు తరిమి కొట్టింది నాటి సాయుధ పోరాట వారసత్వమే అంటూ ఏయే సందర్భాల్లో తెలంగాణ రాష్ట్ర సాధనకు ఎవరెవరు ఎలా అడ్డుకున్నది, దాన్ని వ్యతిరేకిస్తూ 1969 ఉద్యమం నుండి పోరాటం చేస్తూ ప్రాణాలర్పించిన వాళ్ళను బెల్లిలలిత, నల్లావసంత్, సుదర్శన్, కనకాచారి మొదలగువారు ఉద్యమానికి ప్రాణం పోసిన తీరును ఈ కవితలో ప్రస్తావించాను. ఇదే కవితలో "ఉద్యమమంటే కోటి సూర్యుళ్ళ కిరణాల కాంతి/ చూడటానికి కళ్ళు చాలవు/ దాన్ని ఆపడం మీ భ్రాంతి" అంటూ ముగించాను.

ఆంధ్రా నాయకుల విగ్రహాల కూల్చివేతప్పుడు అసెంబ్లీలో చేసిన చర్చకు నిరసనగా "హస్తైదుల" (విగ్రహ విధ్వంస కవిత్వం) గోదావరి సాహితీ మిత్రులు బందగీ ప్రచురణలు వరంగల్ వారు జులై 2011 లో ఈ కవితా సంకలనం తీసుకొచ్చారు. నేను వ్రాసిన కవిత "కోల్పోవడంగా మిగిలాం".

'ట్యాంక్‌బండ్
విగ్రహాల కూల్చివేత
అనవసరమైన
అసందర్భమైన
అక్కరకు రాని

అప్రస్తుత చర్చ' గా పేర్కొన్నాను. ఆంధ్రా పాలకులు మరణించినా ఆధిపత్య భావజాలం ముసుగులో భవనాలు, విగ్రహాలు, పార్కులు నిర్మిస్తారు. రెండు సంవత్సరాల కాలంలో కళ్ళముందు 600 మంది విద్యార్థులు ప్రాణాలు వదిలారు. ఈ విషయం మీద ఆరు నిమిషాలు చర్చించని ఈ అసెంబ్లీ విగ్రహాలు కూలిపోతే ఎందుకు గగ్గోలు పెడుతుందని అడిగాను. అరవై సంవత్సరాలలో తెలంగాణకు మిగిల్చింది సెజ్‌లు, ఓపెన్‌కాస్ట్‌లు, బీడు భూములు, ఆత్మహత్యలు, ఎన్‌కౌంటర్లు. వీటి వల్ల తెలంగాణ ప్రజలు జీవితాలను కోల్పోయారు. కోల్పోవడంగానే మిగిలిపోయారు.

"సూర్యుడు ఉదయిస్తాడు" (నవంబర్ ఒకటి వ్యతిరేక కవిత్వం) గోదావరి సాహితీమిత్రులు బందగీ ప్రచురణలు వరంగల్ వారు నవంబర్ 2011 లో

ప్రచురించారు. "కుట్ర పూరిత క్రియ" శీర్షికతో కవిత వ్రాశాను. ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినాన్ని నిరసిస్తూ వ్రాసిన కవిత.

నవంబర్ ఒకటి తెలంగాణ సాహిత్య సాంస్కృతికానికి మసిపూసిందని, చరిత్రంటే ఆంధ్ర చరిత్రగానే కొనసాగుతూ వస్తుంది. ఒకే భాషా ప్రజలను భిన్న రాష్ట్రాలుగా ఏర్పాటు చేసినా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు భాష ప్రాతిపదికగానే పాటించారు. ఐతే భాష ఒక్కటే ప్రజలను సమైక్యంగా ఉంచలేదని అన్నాను. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ అనేది ఒక ప్రాంతాన్ని దోపిడీ చేయడానికి దారి సుగమం చేసుకున్నది. అందుకే

"ఆంధ్రప్రదేశ్

అవతరణే

ఒక విద్రోహపు చర్య

కుట్ర పూరిత క్రియ" అంటూ ముగించాను.

దోఖాంధ్రప్రదేశ్ విద్రోహ కవితా సంకలనం వరంగల్ రచయితల ఐక్యవేదిక నవంబర్ 2012 లో ప్రచురించారు.

"ముమ్మాటికీ విద్రోహమే" కవితా శీర్షికతో వ్రాశాను.

తెలంగాణ, ఆంధ్ర కలిపి ఆంధ్రప్రదేశ్ గా ఏర్పడింది. ఆంధ్ర కుత్సిత రాజకీయాలకు పట్టాభిషేకం అయింది. తెలంగాణకు మాత్రం బానిస సంకెళ్ళు పడ్డాయి. ఆంధ్ర అనే పదం ఉనికి కోల్పోకుండా ఉంది. తెలంగాణ మాత్రం ఆనవాళ్ళు లేకుండా అయింది. నాటి నుండి నేటి వరకు తెలంగాణ ప్రజల హక్కులు కాలరాయబడ్తూ వచ్చాయి. అందుకే "నవంబర్ ఒకటి ముమ్మాటికి విద్రోహమే" అన్నాను.

"జిగర్" తెలంగాణ విశిష్ట కవితా సంకలనం. రుద్రమ ప్రచురణలు వరంగల్ వారు జనవరి 2013 లో ప్రచురించారు.

"ఎన్నముద్ద నా బాస" శీర్షికతో కవిత వ్రాశాను.

సినిమాలలో హీరోలకు సీమాంధ్ర భాష వాడటం, తెలంగాణ యాస భాషను సినిమాలలో జోకర్లకు, విలన్‌లకు ఉపయోగించి ఎగతాళి చేస్తున్నారు. తెలంగాణ వాళ్ళు మాట్లాడేది భాషేకాదని కించపరిచే దానికి నిరసనగా వ్రాసిన కవిత. నేల

చీలికలు పడింది. ఖండాలుగా విడిపోయాం. చూడ్డానికి మాత్రం మనుషులం ఒకలాగా ఉన్నాం. కాని మన జీవనం, భాష వ్యక్తీకరణలు వేరుగా ఉన్నాయి. దోపిడీ పేరుతో తెలంగాణ ప్రజల భాష, భావం, బతుకు మీద పెత్తనం చేస్తున్నారు.

'భాషావాద కవ్వంతోనే
చిలుకరించి చూస్తే చూడండి
తెలంగాణ బాస తల్లి
మెత్తని ఎన్న ముద్దోలె
ఎట్లాపైకి లేచి సవాల్ చేస్తదో
తల ఎత్తి నీ కళ్ళలోకి చూస్తే
నీ తల నేలకే కదా వాలేది' - అంటూ తెలంగాణ భాష మాధుర్యం చవి చూస్తే మీరు తలవంచక తప్పదని చెప్పాను.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వారోత్సవాలు 2-9 జూన్ 2014 లో జరిగాయి. వారోత్సవాలు పురస్కరించుకొని కాకతీయ విశ్వవిద్యాలయం వారు కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులందరి కవితలను సంకలనంగా ప్రత్యేక సంచిక తెచ్చారు.

నా కవితా శీర్షిక "చరిత్ర సిగన మోదుగుపూలు". ఎందరో అమరవీరుల త్యాగాల ఫలం రాష్ట్ర నిర్మాణం అయింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల నష్టపోయే ఆదివాసీలు, నకిలీమందుల వల్ల రైతుల ఆత్మహత్యలు, విద్య, వైద్యం సామాన్యులందరికి అందాలని, అమరుల తల్లుల కడుపు కోతల కన్నీళ్ళు తుడవాలని చెప్పాను. తెలంగాణ రాష్ట్రసాధన కోసం విశ్వవిద్యాలయాలు యుద్ధభూములుగా మారి నెత్తురు చిందించిన తీరు ఆ పోరాటపు ఆచరణాత్మక సాధన తొలి విజయ కేతనం అని పేర్కొన్నాను. తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే సరిపెట్టుకోకుండా పోలవరం, రైతులు, సామ్రాజ్యవాదం, ఆదివాసీల స్వయంపాలన, విద్య, వైద్యం మొదలగు అంశాల గురించి ఈ కవితలో పేర్కొన్నాను.

ఈ విధంగా తెలంగాణ మలిదశ ఉద్యమంలో సామాజికంగా, సాహిత్యపరంగా నా వంతు బాధ్యతగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు అనేక కార్యక్రమాలలో విస్తృతంగా పాల్గొన్నాను. కొంత సాహిత్య కృషి కూడా చేశాను.

బలిదానాలొద్దని ప్రబోధించిన



శాంతిప్రబోధ వల్లూరిపల్లి

అది తెలంగాణ ఉద్యమం ఉద్ధృతంగా సాగుతున్న సమయం. నేను నిజామాబాద్ జిల్లాలో ఉన్న కాలం. సామాజిక సేవా కార్యక్రమాల్లో తీరిక లేకుండా ఉండే సందర్భం. ఉద్యమ వార్తలు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండేదాన్ని. కానీ ప్రత్యక్షంగా పాల్గొనే అవకాశం లేని పరిస్థితి. ఈ క్రమంలో నేను నా వంతుగా ఉద్యమానికి ఏమి చేయగలను అనే ప్రశ్నలు నాలో మెదులుతూ ఉండేవి. నా వృత్తిలో భాగంగా అనేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరిగేది. పిల్లలతో పని చేస్తున్న క్రమంలో బాలసేవా సంఘాల్లో ఉన్న బాలలకి ఉద్యమ అవశ్యకత గురించి తరచూ మాట్లాడడం, చర్చించడం జరిగేది. అదే సమయంలో తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరులవుతున్న యువతను చూసి కలత చెందేదాన్ని. ఉద్యమం కోసం చేసుకుంటున్న ఆత్మహత్యలని ప్రసార ప్రచార సాధనాలు గ్లోరిఫై చేయడం మరింత బాధించేది. మా బాల సేవాసంఘాల పిల్లలకి ఆవేశంతో అనాలోచితంగా ప్రాణాలు అర్పించకూడదని చెప్పడం జరిగేది. ఏదైనా పోరాడి సాధించుకోవాలి, అందుకు కొంత సమయం పట్టవచ్చు కానీ నిస్పృహకి, నిర్వేదానికి, నైరాశ్యానికి గురికాకుండా చేయడమే నా లక్ష్యం. ఆ విధంగానే నా కృషి కొనసాగించాను.

ఇక తెలంగాణ ఉద్యమ కాలంలో నేను రాసిన రచనల్లో ఉద్యమ నేపథ్యంలో రాసిన వాటిలో నాకు ప్రముఖంగా కన్పించేది నా బ్లాగ్ లో రాసుకున్న కథ "అమరులు కాదు అస్తమిస్తున్న సూర్యులు". తెలంగాణ అంతా ఉద్యమ సెగలతో అట్టుడికిపోతోంది. బలహీన మనస్కులైన కొందరు క్షణికావేశంతో జీవితం అంతం చేసుకుంటున్న వైనం కథగా మలిచాను. ఉద్యమ కాలంలో ఉద్యమం కోసం ఆత్మ బలిదానం చేసిన యువత నేపథ్యంలో రాసిన కథ.

ఈ కథకి ముందు ప్రత్యేక తెలంగాణ అవసరంపై వ్యాసాలు, ఒకట్రెండు కవితలు రాసినప్పటికీ ఉద్యమ కాలంలో విద్యార్థుల ఆత్మబలిదానం నన్ను చాలా

కలచివేసింది. ఒక విద్యార్థి ఆత్మ బలిదానం తర్వాత వెంటవెంటనే అదే విధమైన సంఘటనలు.., ఆ యువత తల్లిదండ్రుల గుండెకోత నన్నెంతో ఆవేదనకు గురిచేశాయి. యువతని ఆత్మ బలిదానం వైపు ప్రేరేపించేలా టివీ ఛానెళ్ళు చేసిన ప్రసారాలు చూసిన తర్వాత ఆగలేక రాసిన కథ ఇది. ఒక వైపు ఉద్యమ అవసరాన్ని నొక్కి చెబుతూనే ఆత్మబలిదానాలు వద్దని చెప్పిన కథ "అమరులు కాదు అస్తమిస్తున్న సూర్యులు". ఈ కథలో కొన్ని సంభాషణలు మీతో పంచుకుంటున్నా:

'తెలంగాణం గావాలె, మన రాజ్యం మన్మేలాలే.. కానీ దాని కోసం బతుకులు బలివెట్టుడా.. ఏదన్న బతికి సాధించుకోవాలే. సచ్చి మట్టిల కల్సినంక ఇంక ఏమ్జేస్తరు. కడదాంక కొట్లాడాలే 'అన్నాడు కాశీరాం.'

'అదేందే మామ అట్లనవడ్తివి ? ఆడు మాములుగ సస్తే ఎవడన్న వస్తర ? గిప్పుడు జూడు అని సావు అల్లకల్లోలం లేపే. ముఖ్యమంత్రి కాడికెల్లి ఆపార్టోడు ఈ పార్టోడు అని లేకుంట పెద్ద పెద్దోళ్ళంతా వచ్చి దండలేయవట్టిరి. ఆని బతుక్కు అంతకన్న ఏం గావాలె. జన్మ ధన్యమైంది. కొంచెం ఉద్రేకంగా శంకర్ 'ఓరి పిస్సోడా.. మీరంత గిట్ల దిమాక్ లేకుంట జేస్తున్నారు. మీ సావును ఆల్లు రాజకీయం జేస్తున్నరు. సావన్న జస్తం గని అని మీటింగుల మస్తు జెప్తరు. గా పెద్దోళ్ళు ఒక్కడంటే ఒక్కడన్న జచ్చిండా..? ఆల్ల కొడుకులు బిడ్డలు, అల్లుండ్లు, కోడండ్లు, అన్నలు, తమ్ముండ్లు ఎవ్వడన్నా సచ్చిన్రా .. లేక పాయె..' తిన్న చేయి కడిగి పళ్ళెం ముందుకు తోసి శంకర్ కళ్ళలోకి సూటిగా చూస్తూ. ఆ చూపుల ధాటిని ఎదుర్కోలేక కళ్ళు దించుకున్నాడు శంకర్.

'గా జమానల మీ నాయిన బీ తెలంగానం కోసరం మస్తు తిరిగిండు. గప్పట్ల పోలీసు కాల్పుల్ల సచ్చిన్రు గని గిట్ల పానాలు తీస్కోలె' మంచం మీదున్న ముసలమ్మ కంచు గొంతుకతో 'ఏమవుడేన్ది ? ఊకె చూపెట్టిందే చూపెట్టుకుంట రెచ్చగొట్టె మాటలు చెప్పుకుంట ఉడుకు మీదున్న పోరగాల్ల దిమాక్ ఖరాబ్ జేస్తున్నరు. ఒక సావయ్యిదంటే ఒక్క దానేన్క ఒక్కటి ఓ వారం పదిదినాలు పీనుగులు ఎల్లుడేనాయే..' బాధగా మామ 'నిజమే, ఆ దృశ్యాలు యువతని ప్రేరేపిస్తున్నాయి. అనాలోచిత చర్యలకు పాల్పడేలా వత్తిడి చేస్తున్నాయి. బలహీన మనస్కులు ఓ బలహీన క్షణంలో ప్రాణాలు తీసుకుంటున్నారు. 'సాలోచనగా సత్యం' అది ఏ పార్టి గాని ఈనికి గావాల్సింది తెలంగాణ గాదు గద్దె. నాయకులు ఎవ్వలైనా గాని ఆల్ల రాజకీయం ఒక్కటే. ఆల్లు ఒక్క దిక్కే జూస్తరు. గద్దె మీన ఎక్కెతందుకు ఎంతైన

జేస్తరు. లొల్లులు పెడ్తరు. తమాషా జూస్తరు. ఎత్తులేస్తరు జిత్తులేస్తరు. కప్ప దుంకుడు ఆడ్తరు. ఏదన్న జేస్తరు. మీ అసోంటోల్లకు చెర్ల వలేసినట్లు ఏస్తరు. మాయజేస్తరు. మెత్తని కత్తోలె ప్రాణాలు మింగుతరు. మనోల్లకు అది ఎర్కలేక ఆల్లతోని బోతరు. చిట్టచివరికి ఏమైతది.. ? ఆల్లు గద్దె మీన. ఈళ్ల బతుకులు మట్టిల కలసిపోయి.. కడుపుకోత మిగిలిపోయి.. ఇన్నేండ్లయిన పోరగాల్లకు ఇది ఎట్ల సమజ్ గాకొస్తదో..' తల గోక్కుంటూ మామ.

'నక్కజిత్తులుంస్తయ్..ఎత్తులు ఎస్తయ్..వల పన్నుతయ్, ఉచ్చు వేస్తయ్.. మనం అన్ని ఎరుక జేసుకుంటపోవాలె.. సచ్చుడు బందు గావాలె. తెలంగాన గడ్డ పోరాటాల అడ్డ. వీరుల గన్న నేల. విజయమో వీర స్వర్గమో అని పోరాడాలే. పోరాడుకుంట పోరాటంల పానం బోతే అమరుడంటరు. కాని గిప్పుడు జరుగుతున్నదేంది. తెలిసి తెలియక ఉద్రేకంతోటో, ఆవేశంతోటో పాణం దీస్కుంటే దానికి ఆత్మ బలిదానం అని, అమరుడయ్యిండని పెద్ద పెద్ద మాటలు అనవట్టిరి. గా శ్రీకాంతాచారి చావు కాడి కెల్లి వందల పానాలు గాల్లో గల్సే. ఈల్లంత యుద్ధం జేయలే. పిరికోల్లలెక్క పానం దిస్కున్నారు. గిసోంటి పిరికి పోరగాళ్ళను అమరుడనుకుంట ఆల్లను అటు దిక్కు తోల్తున్నరు.' ఆ మాటల్లో ఆవేదన కాశిరాం మొహంలోనూ ప్రతిఫలిస్తూ.

ఆత్మబలిదానాలతోటి తెలంగాణ రాదని ఇప్పటికే తేలిపాయె. కన్న తల్లి దండ్రులకు, తెలంగాణ తల్లికి కడుపు కోత మిగల్చకుర్రి అని చెప్పాలె. పోరాడి తెలంగాణను సాధించుకుందామని అనాలే. తెలంగాణం తెలంగాణ కోసం పోరాడదామని చెప్పిన కథ.

* * *

బండారు అచ్చమాంబగా నటించిన



శారదా హన్మాండ్లు

పుట్టుక, తాత, నానమ్మ, అమ్మమ్మ లను బంధాలు, బంధుత్వాల నిచ్చింది కరీంనగర్ జిల్లా యెల్లారెడ్డిపేట. అయితే నాకంటూ ఒక ఉనికిని, జీవితాన్ని ఇచ్చింది నిజామాబాద్ జిల్లా. నాన్న దొడ్లె వెంకటయ్య, విజయలక్ష్మి. నిలువెల్లా క్రమశిక్షణ కలిగిన ఉపాధ్యాయుడు నాన్న. మహాభారతం, భాగవతం, రామాయణం మొదలుకొని వేయిపడగలు మొదలగు అనేకానేక సాహిత్య గ్రంథాల జ్ఞానం కలిగిన అమ్మ పెంపకంలో సమాజం పట్ల భక్తి, బాధ్యత కలిగిన మనిషిగా తీర్చిదిద్దారు.

ఇంటర్ తో వివాహమైన నన్ను నా భర్త బోడ హనుమాండ్లు నేనో ఉపాధ్యాయిని కావడానికీ, నేనింకా చదువుతూనే ఉండడానికి ప్రేరణ కల్గిస్తూనే ఉన్నారు. కొడుకు నరేన్ కంప్యూటర్ సాధనంగా కళాత్మక వెబ్స్ ను సృష్టిస్తే, కూతురు వైష్ణవి కుంచె సాధనంగా కళాత్మక చిత్రాలు గీస్తుంది. ఇద్దరూ యమ్.బి.ఎ.

సామాజిక బాధ్యతే నా చేత కలం పట్టించింది. నా కవితా సంకలనం 'మనోదర్పణం' నేను రాసిన కవితలు, వ్యాసాలు పలు పత్రికలలో అచ్చయినవి. నా పరిశోధన అంశం. 'సాంస్కృతిక పునరుజ్జీవనం-పరిశీలన'. కథలు కూడా పత్రికలలో అచ్చయినవి. సమీక్షలు కూడా రాశారు. చిన్న చిన్న నాటికలు రాసి, నటించిన కాలేజ్ అనుభవంతో "భువన విజయం" నాటకంలో శ్రీకృష్ణదేవరాయల పాత్రను వేసి మగవాళ్ళు ఈ పాత్ర వేశారనుకునేలా చేశాను. నన్ను ప్రపంచానికి పరిచయం చేసింది నా బ్లాగ్ "aksharaprasoonam@blogspot.com"

తెలంగాణ ఉద్యమ భాగస్వామ్యం జీవితంలో మరచిపోలేని ముఖ్య ఘట్టం. ఆవేశం పెల్లుబికినప్పుడల్లా కవిత రూపంలో మలచడం, కవి సమ్మేళనాలలో పాల్గొనడం. సంకలనాలకు, పత్రికలకు పంపడం జరిగింది. బతుకమ్మ ఆదివారం సంచిక కవర్ పేజీపై అచ్చయిన 'ఎర్రగాజులు' కవిత కు విశేష స్పందన వచ్చింది. ఉద్యమ సమయంలో తెలంగాణ కవుల ప్రాశస్త్యాన్ని చాటాలన్న ఉద్దేశంతో 'పోతన విజయం'

రూపకం రాశాను. ఇందూరు కవుల చే పాత్రలను ధరింపజేసి నటింపజేశాను.'బండారు అచ్చమాంబ' గా నేను నటించాను. వేల మంది మధ్య ఈ రూపకం ప్రదర్శించడం, జై తెలంగాణ' నినాదాలతో ఆడిటోరియం మార్మోగడం జీవితంలో మరచిపోని ఘటన. నా కలమే కాదు స్వయంగా నేను కూడా ఉద్యమంలో పాల్గొన్నాను. సకల జనుల సమ్మె కాలంలో రోడ్లపైనే గడిచింది కాలమంతా. సమ్మెలు, ధర్నాలు, నల్లరిబ్బన్‌తో నిరసనలు, రాస్తారోకోలు పాల్గొనని సంఘటన లేదు. ఏ సంఘానికి కట్టుబడకుండా ఎక్కడ సమూహం కనబడితే అక్కడ వారిలో కలిసిపోవడమే. ఇటు ఉపాధ్యాయినిగా, కవయిత్రిగా, వ్యాఖ్యాతగా జిల్లా వ్యాప్తంగా అందరికి సుపరిచితురాలిని కావడం వలన నాకంటు సంఘమే అవసరం లేదు. అన్నీ నావే అంటూ అటు నాయకులతో, ఇటు ప్రజలతో కలిసి ఉద్యమంలో పాల్గొన్నాను. కానీ ఏనాడు ఒక ఫొటో కానీ, పేపర్‌కటింగ్ గానీ తీసుకోలేదు. కారణం వీటి పట్ల నిర్లిప్తత. 'ఉద్యమం ముఖ్యం ప్రదర్శన కాదు' అనేది నా నినాదం. ఉద్యమం గురించి ఎంత మాట్లాడినా తక్కువే. ఇదంతా నేను పుట్టిన గడ్డ విముక్తి పోరాటం కాబట్టి చేసింది చెప్పుకోకపోవడమే మంచిదని నా విశ్వాసం.

***

దీర్ఘ కవితనై పరవళ్ళు తొక్కిన



డా. సంధ్యావిప్లవ్

డా. సంధ్యావిప్లవ్ అని పిలువబడే నేను వృత్తిరీత్యా వైద్యురాలిని. పోరుగడ్డ ఓరుగల్లు పురిటి బిడ్డను నేను. పీడిత ప్రజల తరతరాల చరిత్రంతా జ్వలించే లావాలా నా దేహమంతా అనునిత్యం ప్రవహిస్తూంటుంది.

తెలంగాణ మలిదశ ప్రజా ఉద్యమంలో సాహిత్య సముద్ర గర్భం నుండి నేనొక కొత్త అలలా పుట్టుకొచ్చాను. వలస పాలకుల అన్యాయపు పాలనలో నీళ్ళు, నిధులు నియామకాలకై మొదలయిన ప్రజా ఉద్యమం, రాజకీయ శక్తులు కలసిరాగా, మహాజనోద్యమంగా రూపాంతరం చెంది రాజ్యాంగబద్ధంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించింది.

ఫ్రెంచ్ విప్లవం కన్నా ఘనమయిన తెలంగాణ ఉద్యమాన్ని గ్రంథస్థం చేయాలని నిర్ణయించుకున్నాను. దానికి తెరవెనుక గల కారణం నా జీవిత భాగస్వామి విప్లవ్. ఒకనాడు నాతో అన్నాడు నీలాంటి వాళ్ళు ఇలాంటి క్లిష్టపరిస్థితిలో మౌనంగా వుండకూడదు. నువు రాయాలి. తెలంగాణ తల్లుల కడుపుకోత గురించి రాయాలి. వలస పాలనని ఎండగడుతూ రాయాలి, తెలంగాణ ప్రజా ఉద్యమం గురించి రాయాలని నాకు హితబోధ చేశాడు.

నా తండ్రి లివింగ్‌స్టన్ దళితుడు నా తల్లి కె.బి.అరుణ ఆదివాసి. ఇలానా తెలంగాణ మూలవాసుల స్ఫూర్తితో ఎన్నెన్నో కవితలు, పాటలు పుట్టుకొచ్చాయి.

అంతేగాక రెండవ ప్రపంచ యుద్ధం చివరి అంకం నుండి అనగా 1945 నుండి మొదలుపెట్టి 2014 లో పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు ఆమోదం పొందేంత వరకు జరిగిన ముఖ్య ఘట్టాలను సుదీర్ఘంగా అధ్యయనం చేసాను. తరువాత, తెలంగాణ అరవై ఏండ్ల చరిత్రని గ్రంథస్థం చేసాను.

ఇలా ఉద్భవించిన తెలంగాణ రాష్ట్రానికి తెలంగాణ మూలవాసుల భాషకి నేను సమర్పించిన సుదీర్ఘ కవితాక్షర మాల "నా తెలంగాణ నేల గ్రహణం వీడిన వేళ" పుస్తకం.

అతి సరళమయిన భాషలో చెప్పాను. ఈ పుస్తకానికి ముందుమాట ఇచ్చిన ప్రముఖులలో ఒకరు నా రచనని ప్రశంసిస్తూ నాది ద్విపదశైలి అని అన్నారు. పుస్తకాన్ని గద్దర్ సాహిత్యం తో పోల్చారు. అందుకు నేను చాలా గర్వపడ్డాను. నా ద్విపద శైలి ఇక్కడ కొంత రాస్తున్నాను.

"ఇక్కడ బీడువారిన నేలలుండే గుంటలయ్యిన కన్నులుంటే
బొక్కదేలిన డొక్కలుండే తీరనాకలి దప్పులుండే
దమ్మిడాదాయమ్మి ఇయ్యని దొరల తాన వెట్టిచాకిరుండే
అణాపైసకి ఆసరవ్వని నిజాం రాజుల కిస్తు కిలికిమండే
ఇక రాక రాక కోతలొస్తే దొంగలెక్కలు జెప్పి దొరలు
కోతనంతా దోస్కబోతుండే
నోటికాడి కూడు గూడా నిజాం రాజు తొత్తులు
కిస్తుపేరున దన్కబోతుండే
ఇగ స్వాతంత్రపు సంబరాలు మకేడియి ఇక్కడా
దేశమంతా సంబరాలు యీడ మాత్రం
నరమేధాలు......" అంటూ సాగిపోయిన నా సుదీర్ఘ కవిత సాహితీవేత్తలందరి మెప్పుపొందింది.

యువత కోసం ఇలా రాసాను.

"మిలియన్ మార్చ్ జేసిన దోస్తుల పేర్లు
జనాభా లెక్కలల్ల మాయమైపోతున్నయి.
మా పుర్రెలు పగిలాయి మోకాళ్ళు విరిగాయి
లాఠీ కర్రలతో మా వీపులు మారుమోగాయి.
మాకే తెలువనన్ని సార్లు మా పేర్లు ఠానాలకెక్కినయి...."

నాకు చాలా నచ్చిన కవిత

గుర్తుకొస్తే దుఃఖమొస్తది కవి. ఆ కవితలోని ముసలవ్వ తెలంగాణ నేల తల్లి. 2010 నుండి తెలంగాణ పల్లెల్లో సంభవించిన ఆత్మహత్యలకి తల్లడిల్లి పోయిన యీ నేల

తల్లి కదుపుకోతని ఒక ముసలవ్వ పట్నం బోయిన తన మనుమదు తిరిగి రాకపాయెనని ఎదురు చూస్తున్న ఘట్టం.

"పోయిన దసరా పండక్కి

పాలపిట్ట అలిగింది

కరెంటు తీగమీది కొచ్చి

పాలపిట్ట యీ సారి

పొద్దూకిన ఎగిరిపోలే

నువ్వు రాలేదనేందో

చీకటయిన ఎగిరిపోలే

ఒక్కసారి ఒచ్చిపోరా పట్నం బోయిన మనుమడా

ఒక్కసారి ఒచ్చిపోరా నిను కడుపారా ముద్దాడుత."

నమస్తే తెలంగాణ దినపత్రికలో నా కవిత అచ్చయింది.

ఎండలొచ్చే వానలొచ్చే

సలికి వణికే కాలమొచ్చే

ఎన్ని కాలాలొచ్చి పోయిన

పార్లమెంటుల బిల్లు రాలే

తెలంగాణ పోరు గెలిచేనా

మన అరవై ఏండ్ల గోడు గెలిచేనా....."

అంటూ సాగే యీ కవిత నాకు చాలా పేరు తెచ్చింది. పామరుడికి అర్థం కాని సాహిత్యం వ్యర్థం అనే వాస్తవాన్ని మర్చిపోకుండా అతి సరళమయిన భాషలో తెలంగాణ ముఖ్య ఘట్టాలని గ్రంథస్థం చేశాను.

ఇలా ధర్నాచౌక్ వద్ద, గన్‌పార్కు వద్ద Engeneers Assisiationsలో విద్యుత్ ఉద్యోగుల సంఘంలో, ఓయులో, మా ఇఎస్ఐ సంస్థలో, గాంధీ ఆస్పత్రిలో జరిగిన పలు కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నాను.

అన్ని కార్యక్రమాల కన్నా నాకు చాలా సంతృప్తినిచ్చిన పాట 2013 సెప్టెంబర్ 30 న జరిగిన "సకల జనుల సమ్మె" లో పాల్గొనడం. నిజాం కళాశాల మైదానంలో జరిగిన ఆ మహాసభలో నాధిక్కార స్వరాన్ని వినిపించే అవకాశమొచ్చింది. మల్లేపల్లి లక్ష్మయ్య గారు తెలంగాణ మహిళల ఐక్యవేదిక సమావేశంలో మూడు నిమిషాల వ్యవధి ఇచ్చారు. నేను రెండు నిమిషాలలో నాధిక్కార స్వరాన్ని వినిపించాను. ఒక పాతిక వేల ప్రత్యక్ష ప్రేక్షకుల ముందు టీవి ముందు కూర్చున్న కోట్లాది తెలంగాణ వాదుల నరనరాలని ఉద్రూతలూగించిన పాట అది ఢోలక్‌బాజా తోడియిన నా స్వరానికి నా పదాలకి యువత యీలలతో, చప్పట్లతో తీన్మార్ స్టెప్పులతో ఉద్రూతలూగుతూ నాతో స్వరం కలిపారు. మిట్ట మధ్యాహ్నం మండు టెండలో నాలుగుకోట్ల ప్రజల ఆకాంక్షని ఆవిష్కరించిన ఆ పాట ఆ రెండు నిమిషాలు గుర్తు చేసుకుంటే నా గుండె గర్వంతో నిండిపోతుంది ఇప్పటికీ....

అయితే తెలంగాణ మూలవాసులు కోరుకునేది కేవలం వలస పాలకుల నుండి విముక్తి పొంది స్వయం పాలనలో స్వరాష్ట్రంలో కేవలం భౌగోళిక తెలంగాణ సాధన కాకుండా సామాజిక తెలంగాణ ని స్థాపించాలన్న ఆకాంక్షే తప్ప తప్ప సీమాంధ్ర ప్రజలపై సోదరభావానికి దూరమవ్వలేదు ఎన్నడూ మేము. 2013 ఆగస్టు నెలలో ధర్నాచౌక్ దగ్గర సాగునీటి శాఖ చేపట్టిన నిరాహారదీక్ష కి సంఘీభావం తెలుపుతూ నేను ఒక పాట పాడాను.

అది రాఖీ పౌర్ణమి రోజు. తెలంగాణ ఆడబిడ్డల గొంతుకయి ఒక సహోదరిగా యావత్ సీమాంధ్ర ప్రాంత వాసులకి పాట రూపంలో ఇచ్చిన విన్నపం.

"సీమాంధ్ర తమ్ముడా

రాయలసీమ తమ్ముడా

కథ కంచికి జేరేటపుడు

కాళ్ళకడ్డు బడకురా

కాళ్ళ కడ్డు బడకురా

అంటూ ఉద్వేగంగా నేను పాడుతుంటే నా పాటకి గొంతు కలిపిన వారెందరో.

సుదీర్ఘంగా సాగిన శ్రీకృష్ణ కమిటీ నివేదికని నిరసిస్తూ పలు కార్యక్రమాలలో పాల్గొన్నాను.

ఒక కవితతో మొదలయిన నా ఉద్యమ గమనం నన్ను ఒక ఆలోచనా పరురాలిని చేసింది. నాకు చాలా జ్ఞానాన్ని ఇచ్చింది.

నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష నెరవేరింది. కేంద్రం తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించింది. ఇక రాష్ట్రం విడిపోయే రోజొచ్చిన నాడు అంటే 2014 జూన్ నాడు ఒక కవిత రాసి తెలంగాణ మూలవాసుల మనసులోని మాటని బయటపెట్టాను.

మీరెప్పుడొచ్చిన స్వాగతిస్తం
మీరు హోళికొస్తే గులాలే బూస్తం
దసరకొస్తే దావతిస్తం
మేము మునుపు జరిగిన మతలబులు
మనుసులేం బెట్టుకోము
మీకు భరతమాతే శుభం బలికింది
పోయిర సీమాంధ్ర తమ్ముడా
పోయిరా......... అంటూ సీమాంధ్రులకు వీడుకోలు పలికిన.

ఆంధ్ర సారస్వత పరిషత్ 2013 లో స్కైబాబా గారి సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమం

"హైదరాబాద్ మాదిరా
తెలంగాణ ఆత్మరా"

అనే నినాదంతో జరిగిన కవి సమ్మేళనంలో నా కవితా పఠనం అక్కడున్న సాహితీ ప్రియులందరి చేత కంటతడి పెట్టింది. ఉర్దూ కవులని కలుసుకునే గొప్ప అవకాశం దొరికింది.

ఒక మహిళగా ఇద్దరు పిల్లలకి తల్లిగా వైద్యురాలినయిన నేను చాలా చిన్న పాత్రే పోషించాను తెలంగాణ ఉద్యమంలో. కానీ తెలంగాణ చరిత్రని తెలుగులోనే కాక ఆంగ్లంలో కూడా గ్రంథస్థం చేశాను.

తెలంగాణ 60 ఏండ్ల చరిత్రని ప్రపంచానికి చాటి చెప్పాలనే ఆకాంక్ష బలంగా నాటుకుపోయింది నాలో.

ఆఖరున నేను చేప్పేది. ఎవరు అధికారంలో ఉన్నా అహింసాపరులయిన, అమాయకులయిన తెలంగాణ పేద ప్రజలకి న్యాయం జరగాలి.

కొట్లాడి సాధించిన తెలంగాణ అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతూ దేశానికే ఆదర్శ ప్రాయమయిన రాష్ట్రంగా మారాలని కోరుకుంటున్నాను.

మేరా హైదరాబాద్ తుఝే సలాం



షాజహాన

తెలంగాణ నేను వేరు కాదు.. నన్నెవరూ ఈ భూమినుంచి వేరు చేయలేరు... నా శరీరాన్ని కోసి చూస్తే తెలంగాణనే కనిపిస్తుంది... ఈ భూమి రుచే వేరు... ఆ భూమిరుచిలో వికసించిన తురకబంతి పూలం మేం! ఈ భూమికి ఎప్పటికీ వేరు కాదు మేము! ఈ నీళ్ళల్లో , ఈ భూమిలో కలగలసి పోయిన వాళ్ళం! తెలంగాణ తెహజీబ్‌లో భాగం మేం! మా ఆత్మ తెలంగాణ. మా దేహం తెలంగాణ!

ఈ ఆలోచనలతో రాసిన కవిత "నువ్విప్పుడు నా భూమివి!". ఈ కవితలో తెలంగాణ గురించి రాసిన కొన్ని చరణాలు... "నా భూమి మీది ప్రేమలా/నీమీది ప్రేమను మర్చిపోలేక పోతున్నాను/ నా నేలమీది/ మట్టి గంధాన్ని రాసుకున్న క్షణాన్నే/ ఉద్యమం ఊపిరి పోసుకుంటుంది/ నా దేహం నిండా/ ప్రవహిస్తున్నది రక్తం కాదు/ నా ప్రాంతపు ఊపిరులే". "వేల ప్రేమికుల యూనివర్సిటీల నిండా/ లాఠీల కింద విరిగింది/దేహమా... ఈ నేల కాదు..? ప్రవహిస్తున్నది రక్తమా... ఇన్నాళ్ళు లోపల్లోపల తెర్లుతున్న/ నా ప్రాంతపు నీళ్ళుకాదూ../వీళ్ళంతా నా ప్రాంతపు చంఘీజ్‌ఖాన్‌లు, స్పార్టకస్‌లు, చేగువేరాలే"

నేను తెలంగాణ మీద రాసిన మొట్టమొదటి కవిత "మూగజీవాలు" 1999 వార్తలో అచ్చయింది. అందులోని కొన్ని వాక్యాలు... "బతుకు గోరింటలా పండటానికి/ ఇదేం సస్యశ్యామల ధరిత్రి కాదు/ ఇక్కడ మనుష్యులు బాధలే ముళ్ళయి/ మొండిగా జీవిస్తున్న ముళ్ళగోరింటలు/ఇక్కడ గుండెలపై నదులు ప్రవహిస్తున్నా/ గొంతుల్లోకి విస్తరించిన ఎడారులు/ బలుల్ని సైతం తాకి రిక్తంగా/పైకొచ్చే తడారిన చూపుల చేదాళ్ళు/బతుకు నిత్య వసంతం కావడానికి/ ఇదేం పచ్చలు పొదిగిన మైదానం కాదు/ ఇక్కడ మనుషులే నీళ్ళింకిన దేహతిన్నెలు".

హైదరాబాద్‌లో ఉంటూ తింటూ పంటూ హైదరాబాద్‌నే తిడుతున్న వైనం నన్ను కలచివేసింది. తెలంగాణ గుండె హైదరాబాద్. అప్పుడే కాదు ఇప్పటికీ హైదరాబాద్ అందరిదంటున్నారు... ఆ బాధ తట్టుకోలేక రాసిన కవిత "మేరా

హైదరాబాద్" అందులోని కొన్ని వాక్యాలు... ఈ షహర్ ఒక షాయర్/ఇక్కడి జిందగీయే ఒక షాయరీ/రాత్రిని పాన్‌బిడా చేసి/తెల్లవార్లు ఎర్రని ముషాయిరాల్ని పండిస్తుంది/ నక్షత్రాల దుపట్టా కప్పుకున్న ఈ షహర్/దుల్హన్‌లా ముస్తాబవుతుంది/ మొజాం జాహి బజారు పూలజడై/పేర్చిన పండ్లన్నీ నాగరమై/ ప్రతి రోజూ గుబాళిస్తుందీ నగరం/ ఇరానీ చాయ్ కమ్మదనపు రుచి/ ఇరుమతాల దోస్తానాను గుర్తు చేస్తుంది/ హైదరాబాదీ బిర్యానీ ఘుమఘుమల ధూమాలు/భూమి చుట్టూ సాంబ్రాణీ పొగలై అలుముకుంటాయి/రాత్రి కూడా పగలై విచ్చుకునే రాత్రీ పగలూ తేడాలేని కష్టజీవి ఈ నగరం/కడుపు చేతుల పట్టుకొస్తే కన్నీరు పెట్టిన నగరం/మీకింత చోటిచ్చింది/ ఆకలి తీర్చి అమ్మయింది/ గిరిగీసుకొని లేదు పొమ్మని మీ మొఖాన/ తలుపెయ్యలేదు చూడూ../అలాంటి అమ్మను కులట అని తిడతారా?/మీ లాంటి లక్షల కృతఘ్నుల్ని/ ఒడిలో మోస్తున్న నా హైదరాబాద్/ అల్లావుద్దీన్ చేతిలో/ ఎన్నటికీ ఆరని అద్భుతదీపం/ మేరా హైదరాబాద్!/తుఝే సౌ బార్ సలాం"

1998 లో ఏర్పడిన తెలంగాణ సాంస్కృతిక వేదిక తరపున కవిసమ్మేళనాల్లో పాల్గొన్నాను. ఇంకా ఇదే వేదికగా నల్గొండలో జరిగిన సభలో స్పీకర్‌గా వెళ్ళాను. అమరవీరుల స్తూపం దగ్గరొకరోజు నిరాహార దీక్ష చేశాను. తర్వాత ఏర్పడిన తెలంగాణ సాహిత్య సంస్థ సింగిడీలో సభ్యురాలుగా ఉంటూ పలు కార్యక్రమాలలో పాల్గొన్నాను. సింగిడీ ఏర్పాటు చేసిన తెలంగాణ రచయిత్రుల సభకు నేను అధ్యక్షత వహించాను. ముల్కి తెలంగాణ దస్తకత్‌కి సంపాదకమండలిలో ఉన్నాను. నా మొదటి కథ 'సిల్‌సిలా' మొత్తం తెలంగాణ భాషలో రాశాను. ఇది ఆదివారం ఆంధ్రజ్యోతిలో అచ్చయింది. తెలంగాణ ఉద్యమంలో భాగంగా వచ్చిన మత్తడి, పొక్కిలి కవితా సంకలనాల్లో నా కవితలు ఉన్నాయి. 2009 నవంబర్ 1 న స్కైబాబా ఇతర మిత్రులు ఏర్పాటు చేసిన "జాగో జగావో" 12 గంటల కవిసమ్మేళనంలో కవిత చదవడంతో పాటు తర్వాత జాగో జగావో పేరున వెలువడిన కవితా సంకలనానికి సంపాదకవర్గ సభ్యురాలిగా ఉన్నాను. కరీంనగర్ జిల్లా శనిగరంలో తెలంగాణ కథా వర్క్‌షాప్‌లో పాల్గొన్నాను. జోడేఘాట్‌లో తెలంగాణ కథా వర్క్‌షాప్‌లో పాల్గొన్నాను. మిలీనియం మార్చ్‌లో పాల్గొన్నాను. ఉద్యమ బతుకమ్మ పండగ టాంక్‌బండ్‌లో పాల్గొన్నాను. ఇంకా ఎన్నో మీటింగ్‌లలో పాల్గొన్నాను.

***

తెలంగాణ సారస్వత పరిషత్తు కొన్ని ప్రచురణలు

1.	కదనంలోనూ, కథనంలోనూ మేమే...	రూ. 150/-
2.	డా॥ దేవులపల్లి రామానుజరావు	రూ. 100/-
3.	డా॥ దేవులపల్లి రామానుజరావు గ్రంథావళి	రూ. 300/-
4.	తెలంగాణ వైతాళికులు డా॥ దేవులపల్లి రామానుజరావు శతజయంతి ప్రత్యేక సంచిక	రూ. 200/-
5.	శేషాద్రి రమణ కవుల పరిశోధన వ్యాసమంజరి	రూ. 200/-
6.	తెలుగు పత్రికలు, ప్రసార మాధ్యమాల భాషా స్వరూపం	రూ. 100/-
7.	తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర	రూ. 150/-
8.	తెలంగాణ గిరిజన భాషా సాహిత్యాలు(వ్యాస సంకలనం)	రూ. 200/-
9.	బంజారాల వివాహ ఆచార పద్ధతులు	రూ. 60/-
10.	యాభై సంవత్సరాల జ్ఞాపకాలు డా.దే.రామానుజరావు	రూ. 100/-
11.	మా వూరు మాట్లాడింది	రూ. 40/-
12.	పరిణతవాణి (ఏడవ సంపుటి)	రూ. 125/-
13.	తెలంగాణ చరిత్ర	రూ. 220/-
14.	సురవరం ప్రతాపరెడ్డి వ్యాసాలు	రూ. 240/-
15.	తెలుగు జానపద సాహిత్యము - స్త్రీల గేయములలో సంప్రదాయము	రూ. 250/-
16.	ఆంధ్ర మహాభారతోపన్యాసములు	రూ. 100/-
17.	తెలుగు వాగ్గేయకారులు - అన్నమయ్య విలక్షణ వ్యక్తిత్వం	రూ. 70/-
18.	తెనుగు సాహితి	రూ. 36/-
19.	స్త్రీల రామాయణపు పాటలు	రూ. 36/-
20.	సమీక్షణం	రూ. 36/-
21.	పరిణతవాణి - 1,2,3,4,5,6 సంపుటాలు (రూ.36,45,60,65,60,150)	రూ. 370/-
22.	ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు	రూ. 70/-
23.	ఇరివెంటి వ్యాసాలు	రూ. 30/-
24.	శాలివాహన గాథా సప్తశతీసారము	రూ. 15/-
25.	రాయప్రోలు రచనలు - తత్వవివేచన	రూ. 60/-
26.	తెలుగు సాహిత్యోద్ధారకులు	రూ. 40/-
27.	మల్లికా గుచ్ఛము	రూ. 8/-
28.	మన జాతినిర్మాతలు	రూ. 4/-
29.	సుమతి, వేమన, కృష్ణ శతకాలు	రూ. 24/-
30.	ఆంధ్ర సారస్వత పరిషత్తు స్వర్ణోత్సవ సంచిక	రూ. 50/-
31.	ఆంధ్ర సారస్వత పరిషత్తు వజ్రోత్సవ సంచిక	రూ. 250/-
32.	తెలంగాణలో జాతీయోద్యమాలు	రూ. 10/-
33.	సంస్కృత పాఠవల్లరి	రూ. 4/-
34.	నా సాహిత్యోపన్యాసములు	రూ. 5/-
35.	గౌతమబుద్ధుడు - జవహర్‌లాల్ నెహ్రూ	రూ. 3-60
36.	విమర్శకవతంసులు	రూ. 45/-
37.	మన దేశం - తెలుగుసీమ	రూ. 7/-
38.	మన నదులు - కృష్ణా గోదావరులు	రూ. 3/-
39.	మధురభక్తి - ముగ్ధభక్తి	రూ. 80/-
40.	ప్రాచీన కవిత	రూ. 10/-
41.	ప్రసంగ వ్యాసాలు	రూ. 5/-
42	భారతీయ వాస్తు శిల్ప విజ్ఞానం	రూ. 2/-
43.	నా రేడియో ప్రసంగాలు	రూ. 5/-
44.	సాహిత్యానువాదం : సమాలోచనం	రూ. 60/-
45.	శివరాత్రి మాహాత్మ్యము	రూ. 75/-
46.	ఆంధ్ర వాఙ్మయ చరిత్ర	రూ. 85/-
47.	సాహిత్య సోపానములు	రూ. 75/-
48.	మన హాస్యము	రూ. 100/-
49.	తెలుగు భాషా సాహిత్య వైశిష్ట్యం	రూ. 100/-
50.	వ్యాస గుళుచ్ఛం (1, 2 భాగాలు)	రూ. 130/-
51.	తెలంగాణలో తెలుగు సాహిత్య వికాసం	రూ. 150/-